సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 82

గురువారం 7-12-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'




ఓటమితో మొదలు..

తొలి టీ20లో ఇంగ్లండ్‌పై 38 పరుగులతో ఓడిన భారత మహిళల జట్టు - 12లో



బుల్ రన్ కొనసాగెన్

మూడో రోజూ కొత్త రికార్డులు నమోదు.. 70 వేల దిశగా సెన్సెక్స్ - 13లో



కశ్మీర్ అసెంబ్లీలో పీఓకేకు 24 సీట్లు!

జమ్మూ కశ్మీర్ అసెంబ్లీలో పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు 24 సీట్లు రిజర్వు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

వివరాలు 6లో ▸



జనాభాను పెంచండమ్మా

కఠిన ఆంక్షలతో ప్రజలను కన్నీరుపెట్టించే ఉత్తరకొరియా అధినేత కిమ్ కంటతడి పెట్టారు. జనాభాను పెంచాలని కోరారు.

వివరాలు 6లో ▸



పవర్‌ఫుల్ నిర్మల..

ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ స్థానం సంపాదించారు.

వివరాలు 6లో ▸



రాహుల్‌కు పరిణతి లేదు

రాహుల్‌లో రాజకీయ పరిణతి లేదని ప్రణబ్ ముఖర్జీ అభిప్రాయపడినట్లు ఆయన కూతురు శర్మిష్ఠ పుస్తకంలో వెల్లడించారు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

అబద్ధాల బాబు.. నిజం చెప్పరుగా!

- తుపాను సాయంపైనా చంద్రబాబు అవే అసత్యాలు
- భోజనం కూడా పెట్టడం లేదని అడ్డగోలు వాదన
- టీడీపీ హయాంలోకంటే మిన్నగా సహాయక చర్యలు
- ఆర్థిక సాయం, పంట నష్ట పరిహారం వంటివన్నీ గతంకంటే ఎక్కువే
- ఏ సీజన్‌లో పంట దెబ్బతింటే ఆ సీజన్ చివరలో పరిహారం
- చంద్రబాబు హయాంలో ఇచ్చింది అరకొరే..

10లో

బాపట్ల జిల్లా రావికంపాడులో రైతులతో కలసి వర్షపు నీటిని పొలం నుంచి బయటకు మళ్లిస్తున్న ఆర్‌బీకే సిబ్బంది.. తిరుపతి జిల్లా కోట మండలం రొయ్యలగుంతల వద్ద చిక్కుకున్న వారిని తీసుకువస్తున్న రెస్క్యూ టీం





సాయం.. శరవేగం..

సీఎం ఆదేశాలతో సహాయక చర్యలు ముమ్మరం.. 8 జిల్లాల్లో 320 పునరావాస కేంద్రాలు

20,572 మందికి భోజన, వసతి సదుపాయాలు

- ఇళ్లకు వెళ్లేటప్పుడు రూ.వెయ్యి నుంచి రూ.2,500 సాయం
- తిరుపతి జిల్లాలో 18 మందిని రక్షించిన రెస్క్యూ బృందం
- సహాయక చర్యల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు
- దాదాపుగా అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ
- వర్షం తెరిపి ఇవ్వడంతో పంటలను కాపాడటంపై దృష్టి
- ఉపాధి కూలీల ద్వారా వేగంగా నీరు బయటకు వెళ్లే పనులు
- మరో వైపు కొనసాగుతున్న ధాన్యం సేకరణ
- ప్రభుత్వ చర్యలతో ఊపిరి పీల్చుకున్న జనం

ఏలూరు జిల్లా ప్రగడవరంలో ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించడంలో సహకరిస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలు



సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: తుపాను ప్రభావానికి గురైన జిల్లాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అధికార యంత్రాంగం వేగంగా సహాయక చర్యలు చేపట్టింది. తుపాను ప్రారంభం కాక ముందు నుంచే కట్టుదిట్టంగా ముందస్తు ఏర్పాట్లు చేయడం వల్ల ప్రాణ నష్టాన్ని నివారించగలిగారు. ఎనిమిది జిల్లాల్లో 320 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి.. 20,572 మందిని తరలించారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 124 శిబిరాల్లో 6,077 మందికి ఆశ్రయం కల్పించారు. తిరుపతి జిల్లాలో 36 కేంద్రాల్లో 3,386 మందికి, పశ్చిమగోదావరి జిల్లాలో

మిగతా 2వ పేజీలో ▶

అల్పపీడనంగా మారిన

తుపాను

కోస్తా జిల్లాల్లో కొనసాగిన వర్షాలు

అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరిలో వానలు

137 మండలాల్లో సుమారు వెయ్యి గ్రామాలపై ప్రభావం

3లో

పంట నష్టం అంచనాకు

ప్రత్యేక బృందాలు

పొలాల్లో నీరు దిగిన వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన

నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో పంట నష్ట పరిహారం జమ

దాదాపు 80 వేల ఎకరాల్లో ముంపునకు గురైన పంటలు

లక్ష ఎకరాల్లో నేలకొరిగిన పంట

3లో

బెంబేలెత్తించిన

టోర్నడో

మిచాంగ్ తుపాను వేళ గోదావరి జిల్లాల్లో విరుచుకుపడిన సుడిగాలులు

ట్రాక్టర్లు, వరి కోత మెషిన్, ఇతర వాహనాలను ఎత్తిపడేసిన సుడిగాలి

అమెరికాలో వస్తుంటాయని వినడమే తప్ప ఎప్పుడూ చూడలేదన్న ప్రజలు


3లో

ఎస్‌ఐ మెయిన్స్ ఫలితాల వెల్లడి



ఎస్‌ఐ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన మెయిన్స్ రాత పరీక్షల ఫలితాలను రాష్ట్ర పోలీసు నియామక మండలి బుధవారం ప్రకటించింది. తుది 'కీ', ఫలితాలు, జవాబు పత్రాల స్కాన్ కాపీలను తమ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఎస్‌ఐ పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను త్వరలో వెల్లడించనుంది.

5లో



ఇంటర్ పరీక్ష ఫీజు

గడువు పెంపు

సాక్షి, అమరావతి: ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును బోర్డు మరో 6 రోజులు పొడిగించింది. ఆలస్య రుసుం లేకుండా చెల్లింపు గడువు ఈ నెల 5తో ముగిసింది. తుపాను వల్ల వరుసగా 3 రోజులు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించిన నేపథ్యంలో ఫీజు గడువును ఈ నెల 11 వరకు పొడిగిస్తూ ఇంటర్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులిచ్చారు. రూ.1,000 ఆలస్య రుసుంతో 29వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు.

తెలంగాణ సీఎంగా నేడు

రేవంత్ ప్రమాణం

ముహూర్తం మధ్యాహ్నం 1.04 గంటలకు..

- ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించనున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్
- వేడుక కోసం ఎల్బీ స్టేడియంలో భారీగా ఏర్పాట్లు
- పాల్గొననున్న కాంగ్రెస్ పెద్దలు ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక
- మంత్రులుగా దాదాపు 12 మంది ప్రమాణం చేసే అవకాశం
- భట్టి విక్రమార్కకు రెవెన్యూ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆర్థికం?

10లో



బుధవారం ఢిల్లీలో సోనియాగాంధీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేవంత్ రెడ్డి



భట్టి విక్రమార్క



ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

అధైర్య పడొద్దు

అండగా ఉంటాం

పంట నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుంది

- పంటల రక్షణ, తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో తోడుగా ఉంటాం
- కలెక్టర్లు, అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- తుపాను బాధితుల పట్ల ఉదారంగా వ్యవహరించండి.. పరిహారం అందించడంలో సానుభూతితో ఉండండి
- ఆయా ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తీసుకురావడంపై దృష్టి పెట్టాలి
- డబ్బులు ఎక్కువగా ఖర్చయినా సరే బాధితులందరికీ సాయం అందాలి
- రేషన్, పరిహారం పంపిణీలో ఎలాంటి లోపం ఉండకూడదు.. పొలాల్లోని వరద నీటిని పూర్తిగా తొలగించాలి
- అన్ని రకాల మానవ వనరులను ఉపయోగించుకోవాలి
- 80% సబ్సిడీపై విత్తనాల సరఫరాకూ అన్ని రకాలుగా సిద్ధం కావాలి

2లో



- పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలి.. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి
- రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో రవాణా పునరుద్ధరణకు చర్యలు తీసుకోండి
- చెట్టుకూలి చనిపోయిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.30 లక్షల సాయం

"రైతులకు కచ్చితమైన భరోసా ఇవ్వండి. ప్రభుత్వం ప్రతి రైతుకు అండగా నిలబడుతుంది. వారు అధైర్య పడాల్సిన పనిలేదు. పంటల రక్షణ, పంటలకు పరిహారం అందించడం, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం దగ్గర నుంచి అన్ని రకాలుగా రైతుకు ప్రతి అడుగులో ప్రభుత్వం తోడుగా ఉంటుంది. 80 శాతం సబ్సిడీపై విత్తనాల సరఫరాకు అన్ని రకాలుగా సిద్ధం కావాలి. బాధితులకు పరిహారం అందించడంలో సానుభూతితో ఉదారంగా వ్యవహరించాలి. బాధితుల స్థానంలో మనం ఉంటే ఎలాంటి సహాయాన్ని ఆశిస్తామో.. ఆ తరహా సాయం వారికి అందాలి. ఇది చాలా ముఖ్యమైన అంశం. రూ.10 ఎక్కువ ఖర్చు అయినా పరవాలేదు.. బాధితులకు మంచి సహాయం అందాలి. ప్రతి ఒక్కరి నోటా.. ఇంత కష్టంలో కూడా మా కలెక్టర్ బాగా చేశాడన్న మాట వినిపించాలి.

\- ముఖ్యమంత్రి వైఎస్ జగన్


బాబు సర్కారు కూల్చిన 8 ఆలయాల పునర్నిర్మాణం.. నేడు ప్రారంభం 13లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE

Vencobb CHICKEN

సూచించిన నేటి గుడ్డు & చికెన్ అనంతపురం జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹ 72	ఫారం దగ్గర లైవ్ బర్డ్	69	డ్రెస్డ్ స్కిన్‌తో	132
	రిటైల్ లైవ్ బర్డ్	91	స్కిన్‌లెస్	150



డా. బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



అంబేడ్కర్ మార్గాన్ని అనుసరిస్తున్న సీఎం జగన్

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ నేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీలు నందిగం సురేశ్, గురుమూర్తి తదితరులు మాట్లాడుతూ.. 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించిన మార్గాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి దేశంలో ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే' అని పేర్కొన్నారు.

10లో

'ఇంగ్లిష్'లో మనమే టాప్!

ఇంగ్లిష్ మీడియం పరీక్షలో సత్తాచాటిన ఏపీ విద్యార్థులు

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే-2023లో వెల్లడి

- సర్వే కోసం 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్ష
- ఎగ్జామ్‌కు దేశవ్యాప్తంగా ఎంపికైన 1.12 కోట్ల మంది
- ఆంధ్రప్రదేశ్ నుంచి 6,42,496 మంది విద్యార్థుల ఎంపిక
- పరీక్ష రాసిన విద్యార్థుల జాతీయ సగటు 37.03 శాతం
- ఆంధ్రప్రదేశ్ నుంచి 84.11 శాతం హాజరు
- ఏపీ కంటే వెనుకబడ్డ ఇతర దక్షిణాది రాష్ట్రాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్ జగన్ సర్కార్ తీసుకువచ్చిన సంస్కరణలతో మన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటుతున్నారు. గతంలో ఏదైనా పరీక్షను ఆంగ్ల మాధ్యమంలో రాయడానికి వెనకంజ వేసే మన రాష్ట్ర విద్యార్థులు ఇప్పుడు ఆ భయం పోగొట్టుకుని ముందంజలో దూసుకెళుతున్నారు. ఇటీవల ఇంగ్లిష్ మీడియం విద్యా బోధన విషయంలో దేశ వ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్)-2023లో మన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిభ చూపించారు. ఈ సర్వేలో దక్షిణాది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ టాప్ ప్లేస్ సాధించడం గమనార్హం. అంతేగాక జాతీయ సగటు కంటే 'డబుల్' రెట్లకు పైగా మన విద్యార్థులు ఈ సర్వేలో పాల్గొన్నారు. దేశంలోని రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం అమలు తీరుపై కేంద్ర ప్రభుత్వం

మిగతా 14వ పేజీలో ▶



3 నెలల్లో.. 4 క్లస్టర్లు

మార్చిలోగా 4 ఎంఎస్ఎంఈ క్లస్టర్లు ప్రారంభించేలా ప్రణాళిక

బంగారు నగలు, ఫర్నిచర్, పప్పుదినుసులు, రెడీమేడ్ దుస్తుల తయారీ క్లస్టర్లు

జగ్గయ్యపేట, రాజమహేంద్రవరం, మాచవరం, నెల్లూరుల్లో చురుగ్గా సాగుతున్న పనులు

రూ.46.03 కోట్లతో వీటిని అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం.. వీటితో 25 వేల మందికి ఉపాధి అవకాశాలు

ఇప్పటికే ప్రారంభమైన కాకినాడ ప్రింటింగ్ క్లస్టర్

5లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఆరా తీసి పింఛన్ ఇస్తున్నారు



వృద్ధాప్యంతో బాధ పడుతున్న నేను పింఛను కోసం టీడీపీ ప్రభుత్వంలో ఎన్నోసార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగాను. నాకు 68 ఏళ్లు. అయినా కనికరం చూపలేదు. నా బాధ వినేవారే లేకుండా పోయారు. అర్హత ఉన్నా కూడా వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయలేదు. జన్మభూమి కమిటీ నాయకులను కలిస్తే 'నువ్వు వైఎస్సార్‌సీపీకి ఓటు వేశావు కాబట్టి నీకు పింఛన్ ఇవ్వం' అని తెగేసి చెప్పారు. అధికారులను కలిస్తే నాయకుల వద్దకు పంపించేవారు. మూడేళ్ల పాటు కాళ్లరిగేలా తిరిగాను. ఎవరూ పింఛను ఇప్పించలేదు. చేతగాకపోయినా, కూలీ పనులకు వెళ్లక తప్పలేదు. నేను ప్రకాశం జిల్లాలోని హనుమంతునిపాడు మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉంటాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఒక రోజు వలంటీరు మా ఇంటికి వచ్చి వివరాలు తీసుకున్నాడు. పింఛన్‌కు దరఖాస్తు చేయించి మంజూరు చేయించారు. ఇప్పుడు ప్రతి నెలా ఒకటవ తేదీన మా ఇంటికి వచ్చి రూ.2,750 నా చేతిలో పెడుతున్నారు. ఒకవేళ నేను ఆ సమయానికి లేకపోతే చుట్టుపక్కల వారితో కబురు పెట్టి.. నన్ను రప్పించి పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. నాబోటోళ్లకు ఇది వరంగా మారింది.

– ఆర్నూరి లక్ష్మయ్య, హనుమంతునిపాడు
(కె.ప్రసాద్, విలేకరి, హనుమంతునిపాడు)

చుట్టాలొస్తున్నారంటే ఇక భయపడం



మా ఇంటికి చుట్టాలు రాకూడదనుకొనేవాళ్లం. బంధువులు వస్తే ఇల్లు సరిపోయేది కాదు. ఒక్కరు అదనంగా వచ్చినా నానా ఇబ్బందులు పడేవాళ్లం. ఇరుకు ఇంటిలో నలుగురం ఇబ్బంది పడుతూ ఉండేవాళ్లం. మాది పేద కుటుంబం. నా భర్త లారీ మెకానిక్. ఇద్దరు పిల్లలు ఉన్నారు. నరసరావుపేట ఏనుగుల బజార్‌లో రూ.3 వేలు అద్దె చెల్లించి ఓ చిన్న ఇంట్లో జీవనం కొనసాగించేవాళ్లం. మా ఆయన సంపాదన కుటుంబ అవసరాలకే సరిపోయేది. సొంత ఇల్లు ఈ జన్మకు కట్టుకోలేమని బాధ పడేవాళ్లం. ఈ తరుణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాకు వినుకొండ రోడ్డులోని జగనన్న కాలనీలో స్థలం కేటాయించారు. అక్కడ అధికారులే ఇల్లు కూడా కట్టించి ఇచ్చారు. కాలనీ ఏర్పాటయ్యాక మొట్టమొదటిగా మేమే వెళ్లాం. ఇప్పుడు అద్దె కట్టాల్సిన పనిలేదు. అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఇప్పుడు మా ఇంటికి మరో నలుగురు బంధువులు అదనంగా వచ్చినా ఇబ్బంది లేదు. ప్రశాంతమైన వాతావరణంలో సంతోషంగా ఉంటున్నాం. సొంత ఇంటిలో ఉంటే ఆ ఆనందమే వేరు. ఈ ఇంటికి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తోంది. మిగిలిన అద్దె డబ్బులు పొదుపు చేసి ఇంటిపై మరో గది నిర్మాణం చేపట్టాం. ఈ ప్రభుత్వం మాకు ఇంత ఆనందాన్ని ఇస్తుందని ఊహించ లేదు.

– షేక్ కరీమూన్,
జగనన్న కాలనీ, నరసరావుపేట
(సీహెచ్.వి.రమణారెడ్డి, విలేకరి, నరసరావుపేట)

పిడుగులా ఆపదొస్తే సర్కారు ఆదుకుంది



నా భార్య కూలి పని చేస్తూ రూ.200 సంపాదిస్తే, నేను ఆటో నడుపుకొంటూ రోజుకు రూ.500 తెస్తుంటాను. ఇద్దరు కొడుకులకు పెళ్లిళ్లు చేశాం. వారిద్దరూ వేర్వేరు చోట్ల ఉంటున్నారు. ఈ క్రమంలో గత ఏడాది ఒక రోజు ఆటో నడుపుతుండగా గుండె నొప్పి వచ్చింది. ఉన్నపళంగా ఇంటికి పోయి, నా భార్యకు చెప్పాను. ఖర్చుల కోసం పక్కింటి వారి నుంచి రూ.5 వేలు అప్పుగా తీసుకుని, గడివేములలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి డాక్టర్‌ను కలిశాం. పరీక్షించి, కర్నూలుకు వెళ్లి చూపించుకోమన్నారు. కర్నూలులోని ఓమ్ని ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌ను కలిశాం. కొన్ని పరీక్షలు రాశారు. తర్వాత అక్కడి డాక్టర్లు నాకు మిషన్ల మీద పడుకోబెట్టి వివిధ రకాల పరీక్షలు చేశారు. కొద్దిసేపటి తర్వాత డాక్టర్లు నా భార్యను పిలిచి, నీ భర్తకు గుండె సమస్య ఎక్కువగా ఉందని, వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పారు. లేకుంటే చాలా ఇబ్బంది పడాల్సి ఉంటుందని తెలిపారు. దీంతో ఆమెకు గుండె పగిలినంత పనైంది. ఖర్చు ఎంత అవుతుందని డాక్టరును అడిగింది. రూ.3 లక్షల దాకా అవుతుందని చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే ఖర్చు కాకుండా ఆపరేషన్ చేస్తామన్నారు. వెంటనే మా వద్ద ఉన్న ఆరోగ్యశ్రీ కార్డు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు చూపించాం. అనుమతి కోసం పైకి పంపించామని చెప్పారు. మూడు రోజుల్లోనే అక్కడే బైపాస్ సర్జరీ చేశారు. 15 రోజులపాటు అక్కడే ఉంచుకున్నారు. ఇద్దరికీ భోజనం కూడా పెట్టారు. ఆపరేషన్ తర్వాత కొద్ది రోజులు పనిచేయలేనని ప్రభుత్వం ఆరోగ్య ఆసరా కింద రూ.5 వేలు నా అకౌంట్లో వేసింది. ఇంటికి వచ్చిన తర్వాత ఏడాది వరకు ఆస్పత్రి సిబ్బంది ఫోన్ ద్వారా వాకాబు చేసేవారు. ఇప్పుడు నా ఆరోగ్యం బాగుంది. మేమంతా సంతోషంగా ఉన్నాం.

– బి.సామేలు, బుజునూరు,
గడివేముల మండలం, నంద్యాల జిల్లా.
(డి.సోపిసాహేబ్, విలేకరి, గడివేముల)

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- పంట నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుంది
- పంటల రక్షణ, తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో తోడుగా ఉంటాం
- కలెక్టర్లు, అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్



ఉన్నతాధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. తుపాను బాధితుల పట్ల ఉదారంగా ఉండాలని, పరిహారం అందించే విషయంలో సానుభూతితో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్లు, అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను తీసకురావడంపై అధికార యంత్రాంగం దృష్టిపెట్టాలని చెప్పారు. బాధితులకు రేషన్ పరిహారం పంపిణీలో ఎలాంటి లోపం ఉండకూడదని స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా తుపాను సహాయ, పునరుద్ధరణ చర్యలు, రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లపై వారికి మార్గ నిర్దేశం చేశారు. 'వర్షాలకు తెరిపి వచ్చింది. ప్రస్తుతం తుపాను బలహీనపడి అల్పపీడనంగా మారింది. తుపాను వల్ల వర్షాలు విస్తృతంగా పడ్డాయి. కలెక్టర్లు, సీనియర్ ఐఏఎస్ అధికారులు స్పెషల్ ఆఫీసర్లుగా క్షేత్ర స్థాయిలో బాగా పని చేశారు. అధికారులంతా మీ ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను తీసుకురావడంపై దృష్టి పెట్టాలి. చిన్న చిన్న విషయాలు కూడా మిస్ కాకుండా చూసుకోవాలి' అని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

సాయంలో లోటు రాకూడదు

- వర్షాల వల్ల ఇళ్లు దెబ్బ తిన్న వారికి రూ.10 వేలు ఇచ్చే విషయంలో, వర్షాల కారణంగా ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాల వారిని క్యాంపులకు తీసుకొచ్చి వారిని చూసుకునే విషయంలో, క్యాంపుల నుంచి తిరిగి ఇళ్లకు వెళ్తున్న సందర్భంలో వారికి ఇవ్వాల్సిన ఆర్థిక సాయం తప్పకుండా ఇవ్వాలి. రేషన్ పరిహారం పంపిణీలో కూడా ఎలాంటి లోపం ఉండకూడదు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. పంట పొలాల్లో ఉన్న వరద నీటిని పూర్తిగా తొలగించడంపై దృష్టి పెట్టాలి. అన్ని రకాల మానవ వనరులను ఉపయోగించుకోవాలి. ఇది అత్యంత ప్రాధాన్య అంశం. పంటల సంరక్షణకు ప్రతి ఆర్బీకే పరిధిలో ఇప్పటికే ఎస్‌ఓపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) జారీ చేశారు. శాతం సబ్సిడీపై విత్తనాల సరఫరాకు కార్యాచరణ రూపొందించాలి.
- దురదృష్టవశాత్తు విధి నిర్వహణలో ఉండగా చెట్టుకూలి ఓ కానిస్టేబుల్ చనిపోయాడు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది. ఆ కుటుంబానికి రూ.30 లక్షలు సాయం అందిస్తాం. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగుల స్థైర్యం నిలబడేలా ప్రభుత్వం తోడుగా నిలుస్తుంది. గ్రామాల్లో ఉన్న వలంటీర్ దగ్గర నుంచి సచివాలయ సిబ్బంది మొదలుకుని, ప్రభుత్వంలో పై స్థాయిలో ఉన్న ఉద్యోగి వరకు ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలిగినా.. ప్రభుత్వం అన్ని రకాలుగా తోడుగా ఉంటుంది. వారిలో ఆత్మస్థైర్యాన్ని నిలబెట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.
- ఈ సమీక్షలో సీఎం క్యాంపు కార్యాలయం నుంచి హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ కే వీ రాజేంద్రనాథ్ రెడ్డి, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ స్పెషల్ సీఎస్ జి సాయి ప్రసాద్, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, ఇంధన శాఖ స్పెషల్ సీఎస్ కె విజయానంద్, వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్ ఎం టీ కృష్ణబాబు, హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా, పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్ అరుణ్ కుమార్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఏ.సూర్యకుమారి, ఏపీ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ జి వీరపాండియన్, గృహ నిర్మాణ శాఖ స్పెషల్ సెక్రటరీ బి మహమ్మద్ దీవాన్, విపత్తు నిర్వహణ శాఖ డైరెక్టర్ డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

- యుద్ధ ప్రాతిపదికన అత్యధిక ప్రాధాన్యతతో విద్యుత్‌ను పునరుద్ధరించాలి. రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో రవాణా పునరుద్ధరణకు వెంటనే చర్యలు తీసుకోవాలి. దీనిని కూడా ప్రాధాన్యత కార్యక్రమంగా తీసుకోండి. వర్షాలు తగ్గు ముఖం పట్టిన ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై కూడా దృష్టి పెట్టండి. అధికారులంతా బాగా పని చేస్తున్నారు. మేమందరం మీకు తోడుగా ఉన్నాం. ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉన్నాం. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోండి.

సాయం.. శరవేగం..



పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నిత్యవసరాలు పంపిణీ చేస్తున్న తహశీల్దార్ సురేష్



తూర్పు గోదావరి జిల్లా ప్రక్కిలంకలో విద్యుత్‌లైన్‌ల పునరుద్ధరణ పనులు

▶ మొదటి పేజీ తరువాయి

పన్నెండు కేంద్రాల్లో 5,113, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 37 కేంద్రాల్లో 910, బాపట్ల జిల్లాలో 74 కేంద్రాల్లో 3,888, గుంటూరులో 14 శిబిరాల్లో 1,111, కోనసీమ జిల్లాలో 36 శిబిరాల్లో 910, పశ్చిమ గోదావరిలో 32 శిబిరాల్లో 5,113, తూర్పు గోదావరిలో 3 కేంద్రాల్లో 87 మందికి పునరావాసం కల్పించారు. బాధితులందరికీ భోజనం, మంచి నీటి సౌకర్యం కల్పించారు. వారికి అక్కడే నిత్యావసరాలు అందిస్తున్నారు. బాధిత కుటుంబాలు ఇళ్లకు వెళ్లే ముందు ఆర్థిక సాయంగా రూ.1000 నుంచి రూ.2500 అందిస్తున్నారు. తుఫాను ప్రభావిత గ్రామాల్లో 6 ఎస్డీఆర్ఎఫ్, 6 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. కృష్ణా జిల్లా అవనిగడ్డ, మచిలీపట్నం, ప్రకాశం జిల్లా ఒంగోలు, నెల్లూరు, ఉలవపాడు, బాపట్ల, నాయుడుపేటలో ఈ బృందాలు సేవలు అందిస్తున్నాయి. అధికార యంత్రాంగం దెబ్బతిన్న రోడ్లను వెంటనే పునరుద్ధరించడంతో రాకపోకలు యధాతథంగా కొనసాగుతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులతో పాటు ఆర్బీకే సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. మరోవైపు రైతుల నుండి ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ప్రభుత్వం తీసుకున్న సత్వర చర్యలతో రైతులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఆపదలో ఉన్న రైతులను గుర్తించడమే కాకుండా, వారి వద్ద నుంచి ధాన్యం కొనుగోలు వెంటనే కొనుగోలు చేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషించారు. సీఎం ఆదేశాలతో తేమ శాతంతో సంబంధం లేకుండా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి.

యుద్ధ ప్రాతిపదికన కదిలిన యంత్రాంగం

- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రాత్రింబవళ్లు 3 వేల మందికి పైగా విద్యుత్ అధికారులు, సిబ్బంది నిరంతరాయంగా పనిచేస్తూ సరఫరాను పునరుద్ధరించారు. బాపట్ల జిల్లాలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు బాధితులకు సహాయం అందించే పనుల్లో నిమగ్నమయ్యారు. 353 విద్యుత్ స్తంభాలను శాఖ అధికారులు తిరిగి పునరుద్ధరించారు. కూలిపోయిన 282 చెట్లను రోడ్లపై నుంచి తొలగించారు. 261 గ్రామాలలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. 74 రిలీఫ్ క్యాంపులు ఏర్పాటు చేసి, 3,888 మందికి పునరావాసం కల్పించారు. బుధవారం ఉదయం నుంచే ఉపాధి హామీ కూలీలతో వరి పంట పొలాల్లోని నీటిని బయటకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. 93 చోట్ల హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశారు. పశువులకూ వైద్య సేవలు అందిస్తున్నారు. పునరావాస కేంద్రాలకు వచ్చిన ఒక్కో కుటుంబానికి రూ.2,500 పంపిణీ చేశారు. 25 కేజీల బియ్యం, ఇతర సరుకులు పంపిణీ చేశారు. దెబ్బతిన్న ఇళ్లకు రూ.10 వేలు పరిహారం పంపిణీ చేస్తున్నారు. మంత్రి మేరుగు, ఎంపీ మోపిదేవి, ఎమ్మెల్యే కోన రఘుపతి తదితరులు బాధితులకు ధైర్యం చెప్పారు.
- తిరుపతి జిల్లాలో నిర్వాసితుల కోసం 80 పునరావాస కేంద్రాలు, 80 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 25 వేల కుటుంబాలకు ప్రభుత్వ సాయం పంపిణీ చేస్తున్నారు. రూ.వెయ్యి నుంచి రూ.2,500 నగదుతో పాటు 5 రకాల వస్తువులు పంపిణీ చేస్తున్నారు. దైవాల దిబ్బ సమీపంలో రొయ్యలగుంతల వద్ద కాపలాదారులుగా పని చేస్తున్న 18 మంది వరద ఉధృతిలో చిక్కుకుపోయారు. గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ ఘటనాస్థలికి చేరుకుని ఎన్డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది సాయంతో 18 మందిని ఒడ్డుకు చేర్చారు. నగరి నియోజకవర్గంలో మంత్రి రోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా తన సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.
- కాకినాడ జిల్లాలో సుడిగాలికి దెబ్బతిన్న పిఠాపురం మండలం పి.దొంతమూరు, కొత్తపల్లి మండలం కొండెవరంలలో 100 కుటుంబాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించి భోజన వసతి సదుపాయాలు కల్పించారు. కోనసీమ జిల్లాలో సహాయ, పునరావాస చర్యలు వేగమందుకున్నాయి. అమలాపురం మున్సిపాలిటీతో పాటు పలు గ్రామాల్లో రోడ్డుకు అడ్డుగా పడిన చెట్లను తొలగిస్తున్నారు. వరి చేలల్లో ముంపు నీరు దిగేందుకు ఉపాధి హామీ పథకం కూలీలు డ్రెయిన్లలో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. కూనవరం డ్రెయిన్ మొగ వద్ద ముంపునీరు దిగేందుకు వీలుగా చర్యలు చేపట్టారు. తద్వారా సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టు పరిధిలోని ముంపు నీరు వేగంగా సముద్రంలోకి దిగనుంది. అయినవిల్లి మండలం మాగాంలో దెబ్బతిన్న వరిచేలను కలెక్టర్ పరిశీలించారు. అమలాపురంలో 28,29,14,11 వార్డులలో ముంపు బాధితులకు వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు భోజనాలు అందించారు.



తిరుపతి జిల్లా కాళమనాయుడుపేటలోని వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ఎన్. గుణశేఖర్



అల్లూరి సీతారామరాజు జిల్లా కాటుకపల్లి వద్ద నేలకొరిగిన చెట్టును ప్రొక్లెయిన్ సాయంతో తొలగిస్తున్న పోలీసులు

రైతులను ఆదుకుంటాం

వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రుల విస్తృత పర్యటన



కృష్ణా జిల్లా పామర్రు వద్ద తడిసి ఉన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



ప్రకాశం జిల్లా గొల్లపల్లి వద్ద దెబ్బతిన్న పంటలు, రైతుల వివరాలు తెలుసుకుంటున్న మంత్రి సురేష్



కాకినాడ జిల్లా ఏ.కొత్తపల్లిలో మునిగిన వరిపంటను పరిశీలిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

వెంకటాచలం/పామర్రు/నరసాపురం రూరల్/తొండంగి/త్రిపురాంతకం: 'ఎవరూ అధైర్య పడొద్దు... ఈ కష్టకాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుంది. రైతులకు అన్ని విధాలా సాయం చేస్తుంది...' అని పలువురు రాష్ట్ర మంత్రులు చెప్పారు. మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, దాడిశెట్టి రాజా, ఆదిమూలపు సురేశ్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. పంటలు నష్టపోయిన రైతులతోపాటు పునరావాస శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నవారితో మాట్లాడి ధైర్యం చెప్పారు.

6.70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ: కారుమూరి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కృష్ణా జిల్లా పామర్రులో విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి వెంబడి ఉన్న పంట పొలాలను, రైతులు ఆరబోసుకున్న ధాన్యం రాశులను పరిశీలించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 6.70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించామని మంత్రి చెప్పారు. ఇందుకు సంబంధించి రూ.1,300కోట్లకు గాను, బుధవారం వరకు రైతుల ఖాతాల్లో రూ.1,089 కోట్లు జమ చేశామని, మిగిలిన మొత్తం కూడా ఒకటి, రెండు రోజుల్లో చెల్లిస్తామని వివరించారు. కౌలు కార్డులు లేని కౌలురైతుల ధాన్యాన్ని కూడా స్థానిక సొసైటీల ద్వారా కొనుగోలు చేసి నగదు చెల్లిస్తామని స్పష్టంచేశారు. కృష్ణాజిల్లా రైతులు తమ ధాన్యాన్ని పల్నాడు, బాపట్ల, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో డ్రయర్స్ ఉన్న మిల్లులకు అమ్ముకునే విధంగా అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. రైతులను ఇబ్బంది పెడితే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. పొలంలో చల్లిన మినుము విత్తనాలు పాడైపోయిన వారికి మళ్లీ సబ్సిడీపై విత్తనాలు అందించేలా చూస్తామన్నారు. మరోవైపు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు మండలాల్లోని ముంపు గ్రామాల్లో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుతో కలిసి మంత్రి కారుమూరి నాగేశ్వరావు పర్యటించారు.

క్షేత్రస్థాయిలో సర్వే: దాడిశెట్టి


కాకినాడ జిల్లా ఏ.కొత్తపల్లిలో దెబ్బతిన్న పంట పొలాలను రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పరిశీలించారు. బాధిత రైతులు, అధికారులతో మాట్లాడి పంట నష్టంపై ఆరా తీశారు. మంత్రి రాజా మాట్లాడుతూ పూర్తిస్థాయిలో నష్టం వివరాలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో సర్వే చేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు.

పంట నష్టం అంచనాలు అందినవెంటనే సాయం: ఆదిమూలపు

ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం గొల్లపల్లి వద్ద దెబ్బతిన్న వరి పొలాలను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ పరిశీలించారు. తహశీల్దార్ వి.కిరణ్, వ్యవసాయ శాఖ అధికారులను అడిగి పంటనష్టం గురించి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో పంట నష్టం అంచనాలు అందిన వెంటనే ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని మంత్రి తెలిపారు. సీఎం వైఎస్ రైతు పక్షపాతి అని ప్రతి ఒక్క రైతుకూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.

80 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ : కాకాణి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలో వరద ప్రభావిత ప్రాంతాలైన తిక్కవరప్పాడు, ఇస్కపాళెం, పుంజులూరుపాడు, గుడ్లూరువారిపాళెం, తిరుమలమ్మపాళెం గ్రామాల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పర్యటించారు. తిరుమలమ్మపాళెం, ఇతర వరద ప్రభావిత గ్రామాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మంత్రి కాకాణి మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యల వల్ల జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదన్నారు. కొంతమేరకు వరినాట్లు, నారుమళ్లు దెబ్బతిన్నాయని చెప్పారు. నారుమళ్లు దెబ్బతిన్న రైతులకు ఆర్బీకేల ద్వారా 80శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేస్తామని తెలిపారు. దెబ్బతిన్న పంట నష్టం అంచనా వేసి పరిహారాన్ని అందిస్తామని వివరించారు.



నెల్లూరు జిల్లా గుడ్లూరువారిపాళెం గ్రామానికి వరద నీటిలో ట్రాక్టర్‌పై వెళుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ఏర్పాట్లు బాగున్నాయి



ముత్యాలరావు




చెరుకూరి రత్నం

రాత్రి కురిసిన వర్షానికి ఇళ్ల చుట్టూ నీరు చేరింది. ఏం చేయాలో తెలియలేదు. ఇంకా నీరు ఎక్కువగా వస్తే ఎలా ఉండాలో తెలియక అయోమయంలో పడ్డాం. వెంటనే సకాలంలో అధికారులు వచ్చి చర్యలు తీసుకున్నారు. శిబిరానికి తీసుకొచ్చారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం, టీ కూడా అందజేశారు. అధికారులు మా బాగోగులు అడిగి తెలుసుకుంటున్నారు. ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు బాగున్నాయి.

– రాచూరి ముత్యాలరావు, చెరుకూరి రత్నం, తాళ్లపూడి, తూర్పు గోదావరి జిల్లా

పరీక్షలు చేసి మందులిచ్చారు



నేను, మా ముసలావిడ ఇద్దరమే ప్రకాశపురంలోని గుడిసెలో నివసిస్తున్నాం. తుపాను రాగానే జోరువానలో మమ్మల్ని ఇద్దర్నీ మా వలంటీర్ వచ్చి వ్యానులో తీసుకెళ్లి పునరావాస కేంద్రంలో అన్నం పెట్టించారు. వయసు మీద పడటంతో ఈ వలంటీరే దిక్కయింది. శిబిరంలో డాక్టర్లు మందులిచ్చారు.

– మురాల ప్రభుదాసు, ప్రకాశపురం,
నరసాపురం మండలం,
పశ్చిమగోదావరి జిల్లా

సురక్షితంగా బయట పడ్డాను



నా ఇల్లు బాగోలేదు. తుపాన్ వేళ ఎలా చేయాలని దిగులు పడుతున్న సమయంలో గ్రామంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. నన్ను అక్కడికి తీసుకెళ్లారు. మూడు రోజుల పాటు భోజనాలు, టిఫిన్లు పెట్టారు. నిద్రపోవడానికి వసతి కూడా కల్పించారు. విపత్తులు వచ్చినప్పుడు ఈ విధంగా ఎన్నడూ చేయలేదు. అధికారులకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– శింగోతు నాంచార్లు, కె.పల్లెపాలెం,
కొత్తపట్నం మండలం, ప్రకాశం జిల్లా

వలంటీర్ వల్లే బతికి బట్టకట్టాను



నేను చాలా తుపాన్లు చూశాను. శిబిరానికి వెళ్లేందుకు నిరాకరిస్తే మా వలంటీర్ అమ్మాయి వచ్చి మామ్మా.. నేను తీసుకెళ్తాను అంటూ పట్టుబట్టింది. సిబ్బందితో వచ్చి వ్యానులో తీసుకెళ్లారు. రెండు రోజులు వేములదీవి ఈస్ట్ గ్రామంలోని తుపాను షెల్టర్‌లో ఉన్నాను. నేను శిబిరానికి వెళ్లిన తర్వాత నా గుడిసె కూలిపోయింది. వలంటీర్ మాట విని ఉండకపోతే నా ప్రాణాలు పోయేవి. వలంటీర్ వల్లే బతికి బట్టకట్టాను.

– మైలాబత్తుల కమలమ్మ, వేములదీవి ఈస్ట్,
నరసాపురం మండలం, పశ్చిమగోదావరి జిల్లా

సకాలంలో ఆదుకున్నారు



వర్షం నీటితో ఇల్లు మొత్తం నీరు చేరింది. అధికారులు, పంచాయతీ సిబ్బంది సకాలంలో వచ్చి మమ్మల్ని ఉన్నత పాఠశాల వద్దకు చేర్చారు. అన్ని ఏర్పాట్లు దగ్గరుండి చూసుకుంటున్నారు. భోజనం, అల్పాహారం, తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

– గోపిరెడ్డి రమ్య, వేగేశ్వరపురం,
తూర్పు గోదావరి జిల్లా

క్లుప్తంగా...

తుపాను మృతులకు ప్రధాని మోదీ సంతాపం

విపత్తులో విశేష సేవలందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసలు

సాక్షి, న్యూఢిల్లీ: 'మిచాంగ్' తుపాను ప్రభావంతో మృతి చెందిన వారికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. తుపాను ప్రభావిత రాష్ట్రాల్లో పెనుగాలుల బీభత్సం, వర్ష సంబంధిత ఘటనల్లో పలువురు మృతి చెందడంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏపీ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో జరుగుతున్న సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొంటున్న అధికారుల సేవలను ప్రధాని కొనియాడారు. పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు వీరంతా సేవలందిస్తారని బుధవారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

విమానాల పునరుద్ధరణ

గన్నవరం/గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): మిచాంగ్ తుపాను ప్రభావం కారణంగా 2 రోజులుగా రద్దయిన పలు విమాన సర్వీస్‌లను బుధవారం పునరుద్ధరించారు. ఉదయం ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన హైదరాబాద్, విశాఖ, చెన్నై సర్వీస్‌లు రద్దయినప్పటికీ వాతావరణం అనుకూలించడంతో మిగిలిన అన్ని సర్వీస్‌లు యథావిధిగా సాగాయి. కాగా, తుపాను కారణంగా వాతావరణం అనుకూలించక పోవడంతో బుధవారం 4 ఇండిగో విమాన సర్వీసులు రద్దు చేసినట్లు విశాఖ ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. విశాఖ–చెన్నై 2 సర్వీసులు, విశాఖ–తిరుపతి, విశాఖ–కర్నూల్ విమానం రద్దయింది.

సోమశిలలోకి 33,156 క్యూసెక్కులు

సాక్షి, అమరావతి: మిచాంగ్ తుపాను ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా మూడ్రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పెన్నా, గోదావరి ఉప నదులు, వాగులు, వంకలు వరదెత్తుతున్నాయి. దీంఓ సోమశిల, కండలేరు వంటి భారీ ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహం చేరుతోంది. బుధవారం పెన్నా నుంచి సోమశిల ప్రాజెక్ట్‌లోకి 33,156 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 34 టీఎంసీలకు చేరుకుంది. కండలేరులోకి 4,300 క్యూసెక్కులు చేరుతుండడంతో నీటి నిల్వ 13 టీఎంసీలకు చేరుకుంది. ఏలూరు జిల్లాలో విస్తారంగా కురిసిన వర్షాలకు ఎర్రకాల్వ పరుగులిడుతోంది. ఈ ప్రాజెక్టులోకి 15,372 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 4.3 టీఎంసీలకు చేరుకుంది. ఎర్రకాల్వ ప్రాజెక్ట్ గరిష్ఠ నీటి నిల్వ 4.43 టీఎంసీలు. ఇప్పటికే నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఎర్రకాల్వ ప్రాజెక్టు గేట్లు ఎత్తి వరదను దిగువకు వదిలేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. సోమశిల దిగువన కైవల్య నది పెన్నా మీదుగా సంగం బ్యారేజ్‌లోకి 12,540 క్యూసెక్కులు చేరుతుండగా అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. నెల్లూరు బ్యారేజ్‌లోకి 17,060 క్యూసెక్కులు చేరుతుండగా అంతే స్థాయిలో గేట్లు ఎత్తి సముద్రంలోకి వదిలేస్తున్నారు. తిరుపతి జిల్లాలో విస్తారంగా కురుస్తోన్న వర్షాలకు అరణియా, మల్లిమడుగు, కాళంగి తదితర చిన్న తరహా ప్రాజెక్టులు నిండాయి. ప్రకాశం జిల్లాలో గుండ్లకమ్మ నుంచి గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌లోకి 7,905 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 2.26 టీఎంసీలకు చేరుకుంది. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ నిండాలంటే ఇంకా 1.6 టీఎంసీలు అవసరం. కాకినాడ రిజర్వాయర్ పంపా ప్రాజెక్ట్ నిండిపోగా.. ఏలేరు ప్రాజెక్ట్‌లోకి 2,347 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 12.54 టీఎంసీలకు చేరుకుంది.

లువ్వాగెడ్డలో ముగ్గురు గల్లంతు

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘటన

అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా): నీటి ప్రవాహంలో ముగ్గురు గల్లంతు అయిన ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని భీంపోల్ పంచాయతీ కేంద్రానికి సమీపంలోని లువ్వాగెడ్డ వద్ద బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... సీతపాడు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ గెమ్మెల లక్ష్మి(52), మిరియాల కమల (40), అదే గ్రామానికి చెందిన గెమ్మెల కుమార్(25) ఆటోలో కాశీపట్నం వారపు సంతకు వెళ్లారు. నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుని, తిరిగి సీతపాడు గ్రామానికి అదే ఆటోలో బయలుదేరారు. మార్గం మధ్యలో లువ్వాగెడ్డ పొంగి ప్రవహిస్తుండటంతో గెమ్మెల లక్ష్మి, మిరియాల కమల కాజ్‌వే పైనుంచి గెడ్డను దాటేందుకు ప్రయత్నించారు. ప్రవాహ ఉధృతికి వారిద్దరూ కొట్టుకుపోతుండగా అక్కడే ఉన్న ఆటో డ్రైవర్ కుమార్ వారిని రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వారిద్దరితో పాటు కుమార్ కూడా గల్లంతయ్యాడు.

కేకే లైన్‌లో విద్యుత్ ప్రమాదం



తైడ సమీపంలోని టన్నెల్ వద్ద గూడ్స్ వెళ్తుండగా చెట్టుకొమ్మలు విరిగిపడటంతో ఎగసిన మంటలు

అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా): అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని కొత్తవలస–కిరండూల్ కేకేలైన్ తైడ రైల్వేస్టేషన్ సమీపంలోని టన్నెల్ వద్ద బుధవారం చెట్టు కొమ్మలు విరిగి పడడంతో మంటలు వ్యాపించాయి. వెంటనే రైల్వే సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని చెట్టు కొమ్మలను తొలగించి మంటలను అదుపుచేశారు. కేకేలైన్‌లో యథావిధిగా రైల్లరాకపోకలు సాగుతున్నాయి. కాగా, అరకు–విశాఖ ప్రధాన రహదారి అనంతగిరి సమీపంలో కొండచరియలు బుధవారం జారిపడ్డాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

బెంబేలెత్తించిన టోర్నడో

మిచాంగ్ తుపాను వేళ గోదావరి జిల్లాల్లో విరుచుకుపడిన సుడిగాలులు

- వాతావరణంలో అసాధారణ మార్పులతో పీడనంలో కదలికలు
- ట్రాక్టర్లు, వరి కోత మెషి, ఇతర వాహనాలను ఎత్తిపడేసిన సుడిగాలి
- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, కొబ్బరి చెట్లు
- అమెరికాలో వస్తుంటాయని వినడమే తప్ప ఎప్పుడూ చూడలేదంటున్న ప్రజలు
- సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోలు
- తుపాను భూమికి సమీపంలో తీరం దాటడమే కారణమంటున్న నిపుణులు

సాక్షి, భీమవరం/ఆకివీడు: మిచాంగ్ తుపాను తీరం దాటే సమయంలో సముద్ర తీరంపైకి దూసుకొచ్చిన టోర్నడో (సుడిగాలులు) సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో టోర్నడో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని తీరప్రాంత సమీప గ్రామాలపై విరుచుకుపడి బీభత్సం సృష్టించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. టోర్నడోలు అమెరికాను వణికిస్తుంటాయని వినడమే తప్ప.. మన ప్రాంతంలో ఎన్నడూ చూడలేదని స్థానికులు చెబుతున్నారు.

వాహనాలను సైతం ఎగరేశాయి

పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల్లో మంగళవారం రాత్రి టోర్నడో బీభత్సం సృష్టించింది. ట్రాక్టర్లు, వరి కోత మెషిన్లు, ఇతర వాహనాలు సుడిగాలుల్లో చిక్కుకుని పైకి ఎగిరి కొంతసేపటికి నేలపై పడ్డాయి. పశ్చిమ గోదావరి జిల్లాలోని నరసాపురం, వీరవాసరం, పాలకొల్లు, ఆచంట, ఆకివీడు మండలాల్లో టోర్నడో బీభత్సం సృష్టించి భారీగా ఆస్తి నష్టం కలగజేసింది. దాని ధాటికి నరసాపురం మండలం లిఖితపూడి, సరిపల్లి, మల్లవరంలంక గ్రామాల్లో 20 వరకు విద్యుత్ స్తంభాలు పడిపోగా.. 200కు పైగా కొబ్బరి చెట్లు విరిగిపడ్డాయి. రోడ్ల వెంబడి చెట్లు నేలకొరిగాయి. వీరవాసరం, అదే మండలంలోని వడ్డిగూడెం, తోలేరు గ్రామాల్లో 40 విద్యుత్ స్తంభాలు, 250 వరకు కొబ్బరి చెట్లు విరిగిపడ్డాయి. 40 ఎకరాల్లో అరటి పంట ధ్వంసమైంది. పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల, పరిసర గ్రామాల్లో 200 కొబ్బరి చెట్లు, 41 విద్యుత్ స్తంభాలు, 4 ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. ఆచంట మండలం పెదమల్లం, సిద్ధాంతం గ్రామాల మధ్య ఏర్పడిన టోర్నడో వృక్షాలను నేలకూల్చింది. ఆకివీడు మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. ట్రాక్టర్లు, ఇతర వాహనాలు సైతం పక్కకు పడిపోయాయి. కాగా.. కాకినాడ జిల్లాలోనూ టోర్నడో బీభత్సం సృష్టించింది. గండేపల్లి మండలం మల్లేపల్లి జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంక్ ఎదురుగా సుడిగాలి ధాటికి హైవేపై వెళ్తున్న ఆటోలు గాలిలో ఎగిరాయి. సుడిగాలి రావడంతో బంక్‌లోని ఉద్యోగులు భయంతో పరుగులు తీశారు. అన్నవరం రైల్వే గేటు సమీపంలో ఆగివున్న వాహనాలు ఎగిరిపడ్డాయి. ఆటోలో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. గేటుపక్కనే ఉన్న ఓ ఇంటి రేకులు ఎగిరిపడ్డాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. అన్నవరం క్షేత్రంలోనూ సుడిగాలి బీభత్సం



నరసాపురం మండలం లిఖితపూడిలో సుడిగాలి

సృష్టించింది. ఘాట్‌రోడ్‌లో వృక్షాలు నేల కూలాయి. మరోవైపు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్, వీఎల్ పురం, మోరంపూడి, హుకుంపేట, ప్రకాశం నగర్, దానవాయిపేట, ఆర్ట్స్ కళాశాల పరిసరాల్లో టోర్నడో కలకలం సృష్టించింది. నివాసాలు, దుకాణాలపై రేకులు గాల్లోకి ఎగిరాయి. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి.

వాతావరణంలో అసాధారణ మార్పులతో..



సముద్ర తీర ప్రాంతానికి ఆనుకొని తుపాను పయనించి తీరం దాటడంతో వాతావరణంలో అసాధారణ మార్పులు తలెత్తి టోర్నడోలు ఏర్పడ్డాయి. ఆ సమయంలో గాలుల వేగం గంటకు 90 నుంచి 110 కిలోమీటర్లు వరకు ఉంది. గతంలో కొల్లేరు సరస్సులో సుడిగాలులు వచ్చాయి.

– డాక్టర్ పి.రఘురామ్, అసోసియేట్ ప్రొఫెసర్, ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల, భీమవరం

పీడన వ్యత్యాసమే కారణం

తుపాను భూమికి చేరువగా తీరం దాటడం వల్ల టోర్నడోలు ఏర్పడేందుకు కారణమైందని నిపుణులు అంటున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో తీరప్రాంతం వెంబడి పెద్దఎత్తున ఆక్వా చెరువుల విస్తరించి ఉన్నాయి. సాధారణంగా నీరు, నేల ఉన్న ప్రదేశాల్లో ఉష్ణ వ్యత్యాసాల వల్ల పీడన వ్యత్యాసం ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. వాతావరణంలో అసాధారణ మార్పులు ఏర్పడినప్పుడు గాలి పొరలు విరూపణం (షియర్) చెంది పీడనంలో కదలికలు వచ్చి సుడులు (ఎడ్డీ ఫ్లో) ఏర్పడుతుంటాయి. ఇవి గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఉంటాయి. చుట్టుపక్కల పీడన పరిస్థితులను బట్టి 150 కిలోమీటర్లు వేగంతోనూ కదులుతుంటాయని వాతావరణ నిపుణులు అంటున్నారు. మిచాంగ్ తుపాను భూమికి చేరువగా తీరం దాటడం, తీరం వెంబడి ఉన్న అనుకూల పరిస్థితులతో టోర్నడోలు (సుడిగాలులు) ఏర్పడ్డాయంటున్నారు.



వీరవాసరంలో ఇంటిపై కూలిన చెట్లు



కొబ్బరి తోటలో విరిగిపడిన చెట్లు



చెరువుల వద్ద ధ్వంసమైన స్తంభాలు

78,133 మంది రైతులకు రూ.1,089.44 కోట్ల చెల్లింపు

- ఆన్‌లైన్‌లో 5.67 లక్షల టన్నుల ధాన్యం సేకరణ
- ఆఫ్‌లైన్‌లో మరో 1.25 లక్షల టన్నులు



కాకినాడ జిల్లా కాత్రావులపల్లిలో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తుపాను తీరం దాటడంతో రైతులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం వర్షం తెరపినివ్వడంతో ధాన్యం తరలింపునకు చర్యలు చేపట్టారు. మంగళవారం కురిసిన వర్షానికి లారీలు, మార్కెట్ యార్డుల్లో నిల్వచేసిన ధాన్యాన్ని పౌరసరఫరాలసంస్థ అధికారులు సమీపంలోని మిల్లులకు తరలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 81,433 మంది రైతుల నుంచి రూ.1,239.65 కోట్ల విలువైన 5.67 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇందులో 78,133 మంది రైతుల ఖాతాల్లో మద్దతు ధర మేరకు సుమారు రూ.1,089.44 కోట్లు జమచేశారు. తుపాను ప్రభావంతో ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించిన ప్రభుత్వం.. ఆఫ్‌లైన్ ప్రక్రియకు ఆదేశించింది. ఈ క్రమంలో దాదాపు 1.25 లక్షల టన్నుల వరకు ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే 73,925 టన్నుల ధాన్యం వివరాలను ఆన్‌లైన్ చేశారు.

అల్పపీడనంగా మారిన తుపాను

కోస్తా జిల్లాల్లో కొనసాగిన వర్షాలు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రాన్ని వణికించిన మిచాంగ్ తుపాను బలహీనపడి అల్పపీడనంగా కొనసాగుతోంది. మంగళవారం మధ్యాహ్నం బాపట్ల సమీపంలో తీరం దాటిన తర్వాత క్రమేపీ బలహీన పడినప్పటికీ, దాని ప్రభావంతో పలు జిల్లాల్లో బుధవారం కూడా భారీ వర్షాలు కురిశాయి. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో వర్షాలు కురిశాయి. ఏలూరు జిల్లా తాడువాయిలో మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వరకు 29.7 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అనకాపల్లి జిల్లా దార్లపల్లిలో 29.5, ఏలూరు జిల్లా రేచర్లలో 26, తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో 25 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. బుధవారం మధ్యాహ్నం నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టాయి. గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సాధారణ వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, 8 జిల్లాల పరిధిలో 137 మండలాల్లోని సుమారు వెయ్యి గ్రామాలపై మిచాంగ్ తుపాను ప్రభావం చూపింది.

- ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల రైతులు వణికి పోయారు. పెనుగంచిప్రోలు మండలం లింగగూడెం వద్ద గండివాగు, ముచ్చింతాల వద్ద వాగు, అనిగండ్లపాడు వద్ద దూళ్లవాగు, కూచివాగు పొంగటంతో వరి పైరు నీట మునిగింది. పూత, పిందె దశలో ఉన్న మిర్చి పంట నేలకు వంగిపోయింది. గంపలగూడెం మండలంలో కట్టెలేరులో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది.
- అనకాపల్లి జిల్లాలో బుధవారం కూడా వర్షాలు పడ్డాయి. అధికారుల ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తినష్టం తప్పింది. అనకాపల్లి జిల్లా పెద్దేరు జలాశయంలోకి 4 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో అంతే వరద నీరు 3 ప్రధాన గేట్ల ద్వారా పెద్దేరు నదిలోకి విడుదల చేస్తున్నారు. జిల్లాలోని 12 మండలాల్లో తుపాను ప్రభావం ఎక్కువగా కనిపించిందని.. వందల ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. విద్యుత్ శాఖకు రూ.21 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. నాలుగు జెర్సీ ఆవులు చనిపోయాయని, 25 ఇళ్లు, 86 పూరిళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు.
- అల్లూరి సీతారామరాజు జిల్లాలో వరితోపాటు రాజ్‌మా, కూరగాయ పంటలకు నష్టం వాటిల్లింది. చింతూరు డివిజన్‌లో పత్తి, మిరప పంటలు నీట మునిగాయి. ప్రధాన గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పరదానిపుట్టు కాజ్‌వే అవతల ఉన్న పెదబయలు, పాడేరు మండలాల్లోని 150 గ్రామాలకు రవాణా నిలిచిపోయింది. పెదబయలు మండలం పరదానిపుట్టుకు చెందిన కిల్లో రామకృష్ణ (40) మత్స్యగెడ్డలో చేపలు వేటాడుతూ జారి పడి కొట్టుకుపోయి మృతిచెందాడు.
- కాకినాడ జిల్లాలో ఈదురు గాలులు, భారీ వర్షాలతో పలు మండలాల్లో వరి పంట నేలకొరిగింది. పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట మండలం మేడపాడులో పూరిపాక కూలిపోయి ముక్కుర్తి నాగరాజు(62) మృతి చెందాడు. చేబ్రోలులో చెరువుకు గండిపడింది. కొత్తపల్లి కొండవరంలో సుడిగాలితో సుమారు 50 ఇంటి పైకప్పులు ఎగిరిపోగా, మరికొన్ని ఇళ్ల పైకప్పులు ధ్వంసమయ్యాయి. సుడిగాలికి దెబ్బతిన్న పిఠాపురం మండలం పి.దొంతమూరు, కొత్తపల్లి మండలం కొండెవరంలలో 100 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి భోజన, వసతి సదుపాయాలు కల్పించారు. జగ్గంపేట నియోజకవర్గంలో బుధవారం భారీ వర్షం కురిసింది.
- అమలాపురంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఇళ్లలోకి నీరు చేరింది. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల కాలనీలు ముంపునకు గురయ్యాయి.
- తిరుపతి జిల్లాలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కాళంగి నుంచి 44 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వచ్చింది. రిజర్వాయర్లన్నీ నిండిపోవటంతో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వాగులు, వంకల నుంచి వచ్చే వరద నీటితో జాతీయ రహదారిపై 5, 6 అడుగుల ఎత్తున నీరు ప్రవహించింది. గూడూరు డివిజన్‌లో ఇప్పటకీ కొన్ని గ్రామాలు జల దిగ్బంధంలోనే ఉన్నాయి.



ఎన్టీఆర్ జిల్లా అనిగండ్లపాడు వద్ద నీట మునిగిన ధాన్యం బస్తాలను ఒడ్డుకు చేరుస్తున్న రైతులు



పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో రహదారిపై ఆటంకాలను తొలగింపజేస్తున్న మునిసిపల్ కమిషనర్ షమ్మి



తిరుపతి జిల్లా వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం వద్ద వరదలో కొట్టుకుపోతున్న ఇల్లు



అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో వీవర్స్ కాలనీలో సహాయక చర్యల్లో పంచాయతీ సిబ్బంది

పంట నష్టం అంచనాకు ప్రత్యేక బృందాలు

- పొలాల్లో నీరు దిగిన వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన
- నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో పంట నష్ట పరిహారం జమ

సాక్షి, అమరావతి: మిచాంగ్ తుపానుతో నష్టపోయిన రైతన్నలకు వైఎస్ జగన్ ప్రభుత్వం కొండంత భరోసానిస్తోంది. తుపాను కారణంగా కురిసిన వర్షాలకు తడిసి, తేమ శాతం, రంగు మారిన ధాన్యాన్ని సాంకేతిక కారణాలను పట్టించుకోకుండా, నిబంధనలు సడలించి మరీ ప్రభుత్వమే కొనుగోలు చేసింది. అదీ రైతులకు ఏమాత్రం నష్టం రాకుండా మద్దతు ధరకే కొని, మిల్లులకు తరలించింది. మరోవైపు సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పంట నష్టం అంచనా వేసేందుకు వ్యవసాయ, ఉద్యాన శాఖలు సన్నద్ధమయ్యాయి. రెవెన్యూ శాఖతో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాయి. ఒకటి రెండ్రోజుల్లో ముంపు నీరు దిగిపోయిన వెంటనే క్షేత్రస్థాయి పర్యటనలకు ఈ బృందాలు సిద్ధమవుతున్నాయి. ఈ నెల మూడో వారంలోగా పంట నష్టం అంచనాలు కొలిక్కి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. నెలాఖరులోగా లేదా జనవరి మొదటి వారంలో పరిహారం పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సీఎం జగన్ ఆదేశాలతో రంగంలోకి

ఖరీఫ్ సీజన్‌లో 64.35 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, 28.94 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల ఏడు జిల్లాల్లో 14.91 లక్షల ఎకరాల్లో పంటలు ఇప్పటికే దెబ్బతిన్నట్టుగా గుర్తించారు. ఇక మిగిలిన విస్తీర్ణంలో 17 లక్షల ఎకరాల్లో పంటలు కోతలు పూర్తయ్యాయి. మరో 14.37 లక్షల ఎకరాల్లో కోతలకు సిద్ధంగా ఉన్నాయి. ఈ దశలో మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేసాయి. ప్రాథమికంగా సుమారు 80 వేల ఎకరాల్లో పంటలు ముంపునకు గురి కాగా, మరో లక్ష ఎకరాలకు పైగా కోతకు సిద్ధంగా ఉన్న పంట నేల కొరిగినట్టు అంచనా వేశారు.



పల్నాడు జిల్లా ముప్పాళ్లలో దెబ్బతిన్న అరటితోటను పరిశీలిస్తున్న రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది

వరితో పాటు మిరప, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ పంటలపై ప్రభావం చూపినట్టుగా గుర్తించారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తుపాను ప్రారంభమైంది మొదలు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు. రైతులకు అన్ని విధాలుగా అండగా నిలవాలని ఆదేశాలు జారీ చేశారు. ఫలితంగా కుండపోత వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు ఆర్బీకే సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా ఆర్బీకే సిబ్బంది రైతులతో నిత్యం మమేకమవుతూ వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు. స్వయంగా చేలకు వెళ్లి నష్ట నివారణకు తీసుకోవల్సిన చర్యలపై సూచనలు చేశారు. కోతలు పూర్తయిన పంటను కల్లాల నుంచే కొనుగోలు చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటను కాపాడుకునేలా రైతులకు వెన్నుదన్నుగా నిలిచారు. ముంపునకు గురైన పొలాల్లో నీరు నిలవకుండా యుద్ధ ప్రాతిపదికన తీసుకున్న చర్యలు ఫలితాన్నిచ్చాయి. వర్షాలు తెరిపినిచ్చిన కొద్ది గంటల్లోనే చేలల్లోని నీరు కిందకు దిగిపోవడం మొదలైంది. మరో వైపు నేలకొరిగిన వరి, ఇతర పంటలను కాపాడుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. వరి పంటను కోయకుండా రైతులను అప్రమత్తం చేశారు. నేలకొరిగిన వరిచేలలో కూడా ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్నారు. వేరుశనగ, పత్తి, మిరప, శనగ, మినుము, పెసర తదితర పంటలు సాగు చేసిన రైతులను కూడా ఇదే రీతిలో అప్రమత్తం చేశారు.

శరవేగంగా 'విద్యుత్' పునరుద్ధరణ

- మిచాంగ్ తుపానుతో అతలాకుతలమైన విద్యుత్ రంగం
- సరఫరా పునరుద్ధరణతోపాటు నష్టం అంచనాల్లో అధికారులు
- గృహ, తాగునీటి సర్వీసులకు తొలి ప్రాధాన్యం
- ఎనర్జీ అసిసెంట్ల సేవలతో తప్పిన పెను ప్రమాదాలు

సాక్షి, అమరావతి: మిచాంగ్ తుపాను రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. ఎడతెరిపిలేని వర్షాలు, వేగంగా వీచిన ఈదురు గాలులకు వందలాది గ్రామాల్లో వేలాది విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వందలాది ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. కిలోమీటర్ల కొద్దీ విద్యుత్ లైన్లు తెగిపోయాయి. ఈ విపత్కర పరిస్థితులను విద్యుత్‌శాఖ యంత్రాంగం సమర్థంగా ఎదుర్కొంటోంది. గ్రామాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాలను స్థానిక ఎనర్జీ అసిస్టెంట్లతో ముందుగానే గుర్తించి సరిచేయడం వల్ల పెనుప్రమాదాలు జరగకుండా అడ్డుకోగలిగారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లో నియమించిన ఎనర్జీ అసిస్టెంట్ల సేవలు ఇప్పుడు ఎంతో మేలు చేశాయి. భారీనష్టం జరిగిన చోట కూడా రికార్డు సమయంలో.. 4 నుంచి 18 గంటల్లోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గృహ, తాగునీటి సరఫరాకు అవసరమైన విద్యుత్ సర్వీసులకు ప్రాధాన్యం ఇచ్చి యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. వినియోగదారుల నుంచి టోల్ ఫ్రీ నంబరు 1912కి, కంట్రోల్ రూమ్ నంబర్లకు వచ్చిన ఫిర్యాదులను కాల్ సెంటర్ సిబ్బంది త్వరితగతిన క్షేత్రస్థాయి సిబ్బందికి తెలియజేయటం ద్వారా తక్కువ సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించగలుగుతున్నారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో వందశాతం సర్వీసులను పునరుద్ధరించి విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు సంస్థ సీఎండీ జె.పద్మజనార్ధనరెడ్డి బుధవారం చెప్పారు. భారీవర్షాల కారణంగా నెల్లూరు జిల్లాలో అతలాకుతలమైన విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు అధికారులు, సిబ్బంది కృషిచేస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోనూ వేగంగా పునరుద్ధరణ పనులు చేస్తున్నట్లు సీఎండీ ఐ.పృథ్వీతేజ్ తెలిపారు.



తిరుపతి జిల్లా కోట మండలంలో పొలాల్లో పడిపోయిన విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు, అధికారులు

తుపాను సహాయక చర్యల్లో వలంటీర్లు

లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లకు వెళ్లి ఆహార ప్యాకెట్ల పంపిణీ



అమలాపురం కార్మిక నగర్‌లో ముంపు బాధితులకు ఆహార పొట్లాలను అందిస్తున్న వలంటీర్



రామచంద్రాపురం వైఎస్సార్ నగర్‌లో ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న వలంటీర్ దుర్గాప్రసాద్

అమలాపురం టౌన్/రామచంద్రపురం: తుపాను సహాయక చర్యల్లో వలంటీర్లు అంకితభావంతో పనిచేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లకు వెళ్లి బాధితులకు ఆహార పొట్లాలు అందజేస్తున్నారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు అమలాపురం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన కార్మిక నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, సావరం, రావులచెరువు, మెట్ల కాలనీల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. సుమారు 120 ఇళ్లను వరద నీరు చుట్టుముట్టింది. ఈ నేపథ్యంలో వలంటీర్లు, వివిధ సచివాలయాల కార్యదర్శులు ముందుకొచ్చి బాధితులకు సేవలందించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోజనం పొట్లాలను వలంటీర్లు బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేస్తున్నారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఒకటో గ్రామ సచివాలయం వలంటీర్ దుర్గాప్రసాద్ ఔదార్యాన్ని చాటుకున్నాడు. మిచాంగ్ తుపాను ప్రభావంతో రెండు రోజులుగా పట్టణంలో జనజీవనం స్తంభించింది. దీంతో వలంటీర్ దుర్గాప్రసాద్ బుధవారం సొంతంగా ఆహారం వండించి పొట్లాలుగా కట్టి తుపాను బాధితులకు అందజేశారు. వైఎస్సార్ నగర్ రత్నంపేట, కొత్తూరు బైపాస్, డంపింగ్ యార్డు తదితర ఏరియాల్లో సేవలందించారు.

జలదిగ్బంధంలోనే చెన్నై శివార్లు



నీట మునిగిన ముడిచ్చూర్ ప్రాంతం

సాక్షి, చెన్నై: మిచాంగ్ తుపాను ప్రభావం నుంచి తమిళనాడు రాజధాని చెన్నై నగరం బుధవారం సాధారణ స్థితికి చేరుకోగా.. శివారు ప్రాంతాలు మాత్రంజలదిగ్బంధంలోనే ఉన్నాయి. తుపాను ధాటికి చెన్నైతో పాటు చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి వర్షాలు తెరిపినివ్వడంతో డీఎంకే ప్రభుత్వం చెన్నై నగరంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. మంగళవారం, బుధవారం సహాయక చర్యలను వేగవంతం చేసి.. నగరంలోని మెజారిటీ ప్రాంతాలను సాధారణ స్థితికి తీసుకువచ్చింది. బస్సులు, ఎలక్ట్రిక్ రైళ్ల సేవలను పునరుద్ధరించారు. కానీ నగర శివారుల్లోని తాంబరం, ఆవడి కార్పొరేషన్లు, ఉత్తర చెన్నై పరిధిలోని చాలా ప్రాంతాలు ఇంకా వరద నీటిలోనే మగ్గుతున్నాయి. వరద సాయం కింద వెంటనే రూ.5,060 కోట్లు విడుదల చేయాలని కోరుతూ ప్రధాని మోదీకి సీఎం స్టాలిన్ లేఖ రాశారు.





"నిజాయితీ అనేది అత్యుత్తమ విధానం.
- మిగెల్ డె సెర్వాంటీజ్

సాక్షి
గురువారం, 7 డిసెంబర్ 2023

మిచాంగ్ గుణపాఠం

ప్రకృతి వైపరీత్యాలు విరుచుకుపడినప్పుడల్లా మనిషి చేసిన, చేస్తున్న పాపాలు బయటపడతాయి. అంతవరకూ పాలకులు రూపొందించిన విధానాల్లోని వైఫల్యాలు బట్టబయలవుతాయి. తీవ్ర తుపానుగా పరిగణించిన మిచాంగ్ నాలుగురోజుల పాటు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను వణికించింది. దాని ధాటికి చెన్నై నుంచి తమిళ తీరప్రాంతాలతో మొదలుపెట్టి దక్షిణాంధ్ర జిల్లాలన్నీ తడిసిముద్దయ్యాయి. కోస్తా జిల్లాలు సైతం వర్షాలతో సతమతమయ్యాయి. పంటలు దెబ్బ తిన్నాయి. చెన్నైలో గత 47 ఏళ్లలో ఎప్పుడూ చూడనంత స్థాయిలో భారీ వర్షం కురిసింది. నగరం నగరమంతా వరదనీటిలో తేలియాడింది. వివిధ ఘటనల్లో మొత్తం 18 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంతవరకూ 2015 నాటి కుంభవృష్టే రికార్డు. ఈ ఏడాది చిన్నా పెద్దా స్థాయిలో దేశం ఆరు తుపాన్లనూ, వాటి దుష్పరిణామాలనూ చవిచూసింది. మొన్న జూన్‌లో గుజరాత్, మహారాష్ట్రల్లో బిపర్జయ్ తుపాను సృష్టించిన కల్లోలం అంతా ఇంతా కాదు. ఆకాశాన్నంటే భవంతులతో, రోడ్లపై నిరంతరం రివ్వుమంటూ దూసుకుపోయే వాహనాలతో, అరచేతిలో ఇమిడే సెల్‌ఫోన్‌తో దేన్నయినా క్షణాల్లో పొందగల వెసులుబాటు వగైరాలతో అత్యద్భుతంగా కనబడే నగరాలు, పట్టణాలు చినుకుపడితే నరకాన్ని తలపిస్తాయి. అటువంటిది కనీవినీ ఎరుగని రికార్డు స్థాయి కుంభవృష్టి పడితే ఇక చెప్పేదేముంది? కేవలం ఆది, సోమ వారాల్లో రాత్రింబగళ్లు కురిసిన వర్షపాతం ఏకంగా 35 సెంటీమీటర్లంటే పరిస్థితి ఎలావుందో ఊహించుకోవచ్చు. శివారుల్లో వున్న చెరువులు, రిజర్వాయర్లు, అడయార్, కూవమ్ నదులు, బకింగ్‌హామ్ కాల్వ పూర్తిగా నిండి వరద జలాలు చెన్నై నగరాన్ని ముంచెత్తాయి. ఫలితంగా అన్ని హైవేలు, సబ్‌వేలు మూతబడక తప్పలేదు. వందలాది వాహనాలు కొట్టుకుపోయాయి. ప్రముఖులు నివాసం ఉండే పోయెస్ గార్డెన్ రోడ్డు ఏడడుగుల మేర కుంగిపోయి అందులో ట్రాన్స్‌ఫార్మర్లు, వాహనాలు కూరుకుపోయాయంటే పరిస్థితి ఎలా ఉన్నదో ఊహించుకోవచ్చు. వాతావరణ విభాగం చెబుతున్న ప్రకారం మిచాంగ్ గత తుపానులకు భిన్నమైనది. సాధారణంగా తీరానికి సుదూరంగా తుపాను తిరుగాడుతుంది. కానీ ఈసారి తీరానికి 90 కిలోమీటర్ల దూరంలోనే మిచాంగ్ లంగరేసింది. పైగా అది చాలా నెమ్మదిగా... అంటే గంటకు 5–7 కిలోమీటర్ల మధ్య వేగంతో కదిలింది. తుపాను వేగం సాధారణంగా గంటకు 10–18 కిలోమీటర్ల వేగంతో కదులుతుంది. తీరానికి దగ్గరగా వుండి మందకొడిగా కదలటం వల్ల విడవకుండా భారీ వర్షాలు కురిశాయి. 2015లో చెంబరామ్‌బాక్కమ్ సరస్సు, పూండి రిజర్వాయర్‌ల నుంచి ఒక్కసారి భారీయెత్తున నీటిని విడుదల చేసిన పర్యవసానంగా చెన్నై నీట మునిగింది. ఈసారి అన్ని జాగ్రత్తలూ తీసుకుని ఒక క్రమపద్ధతిలో నీరు వదిలినా మిచాంగ్ తీవ్రత కారణంగా ఇంచుమించు అప్పటి పరిస్థితే ఏర్పడింది. తీరానికి ఆవల ఉండాల్సిన సముద్రం నగరబాట పట్టిందా అన్నంతగా వరద పోటెత్తింది.

అభివృద్ధి పేరు మీద అన్నిటినీ ఒకేచోట కేంద్రీకరిస్తే వృత్తి ఉద్యోగాల కోసం, చిన్నా చితకా వ్యాపారాల కోసం దూరతీరాల నుంచి సైతం జనం అక్కడికి చేరుకుంటారు. జనాభా అపరిమితంగా పెరుగుంది. నగరీకరణ, పట్టణీకరణ జరుగుతున్నప్పుడు ఆ వంకన భూబకాసురులు ప్రవేశిస్తారు. సరస్సులు, చెరువులు మాయమవుతాయి. కాల్వలు కుంచించుకు పోతాయి. పచ్చటి చెట్లు నేలకొరుగుతాయి. ఎటుచూసినా కాంక్రీట్ కీకారణ్యాలే విస్తరిస్తుంటాయి. మన దేశంలోనే కాదు... వేరే దేశాల్లో ఇదే పరిస్థితి. అయితే ఆ దేశాల్లో కాస్త ముందే మేల్కొని అభివృద్ధి వికేంద్రీకరణ వైపు కదిలారు. కానీ మన దగ్గర ప్రకృతి విలయాలు కళ్ల ముందే కనబడుతున్నా ఆ అంశంపై పాలకులు దృష్టి సారించలేదు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు హయాంలో అమరావతి నిర్మాణానికి చేసిన ప్రయత్నం ఇందుకు ఉదాహరణ. వికేంద్రీకరణతో పాటు విపత్తులు ముంచుకొచ్చినప్పుడు తలెత్తగల సమస్యలను ముందే గుర్తించి అందుకు తగ్గట్టు మౌలిక సదుపాయాలు ఏర్పరిస్తే ఇబ్బందులు తగ్గుతాయి. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ స్థితిగతులు మారాయి. కర్బన ఉద్గారాలు అపరిమితంగా పెరిగిన పర్యవసానంగా భూగోళం వేడెక్కడం, ఆ వేడిమిలో 90 శాతం సముద్రాలకే పోవటం వల్ల వాటి జలాలు వేడెక్కుతున్నాయి. తుపానులకు అదే ప్రధాన వనరు.

ఈ పరిస్థితుల్లో నగరీకరణ, పట్టణీకరణలపై పునరాలోచించటం, ఇప్పటికే ఉన్న నగరాలు, పట్టణాల్లో ప్రస్తుత స్థితిని మెరుగుపరచటానికి అనుసరించాల్సిన విధానాలకు రూపకల్పన చేయటం అవసరం. పారిస్ ఒడంబడికకు అనుగుణంగా అహ్మదాబాద్‌లోని అర్బన్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఈ విధానాలకు తుదిరూపం ఇచ్చింది. తమిళనాడు సర్కారు దాని ఆధారంగా చెన్నైకు మొన్న జూన్‌లో సవివరమైన ప్రణాళికను రూపొందించింది. 2050కల్లా ఆ నగరాన్ని కర్బన ఉద్గారాల బారి నుంచి రక్షించటానికి తీసుకోవాల్సిన చర్యలపై ఒక విధానాన్ని ప్రకటించింది. నీటి కొరత నివారణ, పునరుత్పాదక ఇంధన వనరుల పెంపు, విద్యుత్‌తో నడిచే బస్సులు వందశాతం ఉండేలా చూడటం, నగరంలో హరితవనాల్ని 35 శాతానికి విస్తరించటం, పకడ్బందీ పారిశుద్ధ్యం, చెన్నై వరద ముంపు బారిన పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవటం అందులో కొన్ని. నగర విస్తరణకూ, కాలనీల నిర్మాణానికీ విచ్చలవిడి అనుమతులీయటం విరమించుకుంటే, డ్రెనేజీ వ్యవస్థల పునర్వ్యవస్థీకరణకు చర్యలు తీసుకుంటే ప్రతి నగరమూ మెరుగవుతుంది. మిచాంగ్ వంటి తీవ్ర తుపానుల వల్ల జరిగే నష్టం కనిష్ఠస్థాయికి పరిమితమవుతుంది. పాలకులు ఈ దిశగా ఆలోచించాలి.

ఇంకా ఎందుకీ విదేశీ మొగ్గు?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

'అమెరికా ఆర్థిక వ్యవస్థ బాగుపడటానికి విద్య, ఉద్యోగార్థులై అమెరికాకు వస్తున్న భారతీయులు ఎంతగానో దోహదపడుతున్నారు' అని పాతికేళ్ల కిందే ఓ అమెరికా రాయబారి వ్యాఖ్యానించాడు. ఇప్పటికీ ఈ పరిస్థితిలో మార్పు రాలేదు. జాతీయ స్థాయి విద్య, ఉపాధి సౌకర్యాలు దేశ యువతకు అందించలేక పోవడానికి కారణం... మనదేశంలో తగిన వనరులు లేకపోవడం కాదు. అది పాలకుల పరాధార మనస్తత్వం. అందుకే తల్లితండ్రులు, పిల్లలు విదేశీ వనరుల పట్ల వ్యామోహాన్ని పెంచుకోవలసి వచ్చింది. కానీ దీన్ని సరిదిద్దవలసిన నేతలకు నైతికత, విశ్వసనీయత కరవైపోయాయి. పైగా, ప్రజా ప్రాతినిధ్య సభలుగా రాణించవలసిన రాజ్యాంగ సంస్థలను భ్రష్టు పట్టించడమే పాలకులు పనిగా పెట్టుకున్నారు.

"భారత భూమి మీద పిల్లల్ని కనడం అమెరికాకు దత్తత ఇవ్వడానికేనని తెలిసుంటే... ప్రసవానికొక పునర్జన్మ నెత్తకపోదును... అమెరికా ఖజానా నింపుకొనే యుద్ధంలో/ బిడ్డను యుద్ధభూమికి అంకితమిచ్చిన తల్లిగుండె/ కన్నీరింకిన మేఘాలై వర్షిస్తుంది/ స్వార్థ సామ్రాజ్య నేతలకు/ తల్లి ఉసురు తగలకపోదు."

- కవయిత్రి డాక్టర్ పెళ్లకూరు జయప్రద

ఇంతకూ అన్ని వసతులు, సౌకర్యాలు పొదిగి ఉన్న భారత భూమిని వదిలేసి మన యువత పరాయి పంచలలో విద్య కోసం, ఉద్యోగాల కోసం ఎందుకు ఎగబడవలసిన దుఃస్థితి వచ్చింది? భారత పాలనా చక్రాలు, దేశ నేతలు... జాతీయ స్థాయి విద్య, ఉపాధి సౌకర్యాలు దేశ యువతకు అందించలేక పోవడానికి దేశంలో తగిన వనరులు లేక కాదు. భారత సెక్యులర్ రాజ్యాంగం అందించిన దేశీయ వనరుల వినియోగానికి సంబంధించిన అధ్యాయాలను అడ్డదిడ్డమైన నిబంధనలతో జత చేసినందున దేశ పౌరులు ప్రయోజనం పొందలేక పోతున్నారు. సంపన్న గుత్త వర్గాలు ఈ అవకతవకల ఆధారంగా దేశ వనరులను యథేచ్ఛగా సొంతం చేసుకుని పౌరులకు దేశీయ విద్య, ఉద్యోగ అవకాశాలను దెబ్బ తీస్తున్నారు. ఫలితంగా విదేశీ విద్య, ఉపాధి వనరులనన్నా సద్వినియోగం చేసుకొని బతుకుదామన్న తపనలో ఈ వ్యామోహాన్ని తల్లిదండ్రులు పెంచుకోవలసి వచ్చింది.

ఈ వాస్తవాన్ని మన దేశం దృష్టికి మొదటిసారిగా పాతికేళ్లనాడే – ఎవరో కాదు, భారతదేశంలోని అమెరికా రాయబారే తీసుకొచ్చాడు. "అమెరికా ఆర్థిక వ్యవస్థ బాగుపడటానికి విద్య, ఉద్యోగార్థులై అమెరికాకు వస్తున్న భారతీయులు ఎంతగానో దోహదపడుతున్నారు" అని ఆయన కీర్తించిన సంగతి మనం మరచిపోరాదు. ఈ పాతికేళ్లగానూ ఈ పరిస్థితిలో మార్పు లేదు. అంటే, భారత పాలకులు దేశంలో విద్య, ఉద్యోగ వనరులను భారత యువతకు కల్పించకుండా పరాధార మనస్తత్వానికి అలవాటు పడిన ఫలితంగా ఈ దుఃస్థితి దాపురించి కొనసాగుతోందని మరచిపోరాదు.

ఈ దశలో గత పాతికేళ్లుగా పార్లమెంటు, రాష్ట్రాల శాసనసభలకు ప్రజా ప్రతినిధుల పేరిట ఎన్నికవుతూ వస్తున్న వివిధ పార్టీల ఛోటా–మోటా రాజకీయ నాయకులు తమ ఆస్తులకు మించిన ధనరాసులతో ఎలా తూగుతూ తమ అవినీతి సామ్రాజ్యాలను నిర్మించుకుంటూ వస్తున్నారో 'ఏడీఆర్' సాధికార నివేదికలు బట్టబయలు చేస్తున్నాయి. అయినా మార్పు లేదు. ఈ పరిస్థితుల్లో దేశంలో విద్య, వైద్యాభివృద్ధి వనరులు ప్రజలకు ఇబ్బడిముబ్బడిగా ఎలా, ఎక్కడినుండి లభిస్తాయి? అందుకే నన్నయ మహాకవి మహాభారతం 'ఆదిపర్వం'లోనే 'సరమ' అనే కుక్కపిల్ల ద్వారా సార్వకాలికమైన విజ్ఞానాన్ని ప్రజలకు పంచిపెట్టాడు. 'ఆదిపర్వం' తొలి ఆశ్వాసంలో పాండవుల ముని మనుమడైన జనమేజయ మహారాజు నిర్వహించిన ఒక యజ్ఞం గురించి ప్రస్తావిస్తాడు. ఆ యజ్ఞ భూమికి 'సరమ' అనే కుక్క పిల్ల వస్తే అపవిత్రంగా పరిగణించి జనమేజయుడి సోదరులు దాన్ని దారుణంగా కొట్టి బయటకు పంపించివేస్తారు. ఆ 'సరమ' జరిగిన దారుణాన్ని తల్లికి వివరిస్తుంది. అప్పుడు నీతులు పేదవాళ్ళకే కాదు, అందరికీ వర్తించాలనీ, ఈ పని చేయడం తగునా, తగదా అన్న ఆలోచన, సార్వకాలిక సత్యం అందరూ పాటించాలనీ 'సరమ' తల్లి బోధిస్తుంది.



రెండో మాట

ఇక, 'మట్టి'కి అనువాదం 'రైతు' అని చెబుతూ గ్లోబలైజేషన్ పేరిట 'చాపకింద నీరులా' జరుగుతున్న తతంగం ఏమిటో మరొక ఆధునిక కవి ఇలా వర్ణించాడు:

"కాడెద్దులు పోయి
కంప్యూటర్లు వచ్చాయి
భుజాల మీద నాగలి పోయి
బైలార్స్ ట్రాక్టర్లు వచ్చాయి
ఆకలికి తప్ప అన్నిటికీ
యంత్రాలు వచ్చాయి."

అయినా రైతు దుఃస్థితి మారలేదని ఒక కవి స్పందిస్తే- ఇదే సమయంలో 'వానకు కూడా దరిద్రం పట్టుకుంది/ కురవకుండానే రైతు కళ్ళల్లో నీళ్ళు నింపుతోం'దని మరో కవి వ్యంగ్యంగా అంటించాడు. ఇదిలా ఉండగా, మరో కవి ప్రస్తుత వ్యవసాయ పరిస్థితుల్ని వర్ణిస్తూ: "కాడికి కంప్యూటర్/ మేడికి కీబోర్డు, వెబ్‌సైట్‌లో విత్తడం, ఇంటర్నెట్‌లో అమ్మడం" అని గ్లోబల్ వ్యవసాయాన్ని వ్యంగ్యంగా చిత్రించాడు. మరో ఆధునిక కవి –

"కళ్లముందు పంటకళ్లం అదృశ్యమైనప్పుడు
ఇళ్లల్లో దూలాలకు వేలాడేవి
విత్తనాల సంచులు కాదు – రైతుల శవాలు" అని ఆక్రోశించాడు.

ఇలాంటి నిరాశావాదానికి విరుగుడు అన్నట్టు, రైతుకు బలంగా కొమ్ముకాస్తూ, రాబోయే మంచిరోజుల్ని తలచుకొని, రైతు ఆగ్రహిస్తే వచ్చే పరిణామాన్ని వివరిస్తూ, ఆహ్వానించదగ్గ ఆశావాదాన్ని కోడూరి విజయకుమార్ ఇలా వ్యక్తం చేశాడు:

"మట్టి చేతులు కూడా మాట్లాడతాయి
వాటి మాటల భాషే వేరు –
మట్టి చేతులు మాట్లాడటం ప్రారంభించాక
నోళ్లున్న మారాజుల సింహాసనాలే కదిలిపోతాయి
ఆ రోజుకి ఎదురు చూడాల్సిందే"!

కానీ మన నేతలకి నైతికత, విశ్వసనీయత కరువైపోయాయి. దీనికి కారణం అడ్డగోలు సంపాదనల ద్వారా ఎదిగిపోవడం. ప్రజా ప్రాతినిధ్య సభలుగా రాణించవలసిన రాజ్యాంగ సంస్థలను భ్రష్టు పట్టించడం. ఆఖరికి దేశ తొలి ప్రధాన మంత్రి, జాతీయ కాంగ్రెస్ నిర్మాతలలో అగ్రగణ్యుడైన జవహర్‌లాల్ నెహ్రూను నామరూపాలు లేకుండా చేసే ప్రయత్నాలను చాపకింద నీరులా నేటి పాలక వర్గం చేస్తోంది. పేరును మాయపుచ్చినంత మాత్రాన ఆ వ్యక్తి నెలకొల్పిన మంచి సంప్రదాయాలు చెక్కు చెదిరిపోవు. నెహ్రూ మాదిరిగా తమ కపటాన్ని చీల్చి తమ వ్యక్తిత్వంలోని పరిమితుల్ని అంత బాహాటంగా చెప్పుకున్నవారు లేరు. "నేను ధనిక వర్గంలో పుట్టి పెరిగినందున భావవ్యాప్తిలో కమ్యూనిస్టులు వెళ్లగలిగినంత దూరం వెళ్లలేను" అన్నారు. అందుకే పాలకులకు నైతికత ప్రధాన సూత్రంగా ఉండాలి.

అందుకే ఏ ప్రార్థన చేసినా అది స్వార్థం కోసం కాదు, కార్య సాధన కోసం గుండె ధైర్యం ఇవ్వమని విశ్వకవి రవీంద్రుడు ఎందుకు కోరుకున్నాడో వినండి:

"నన్ను ప్రార్థించనీ – ప్రమాదాల నుంచి
రక్షించమని కాదు
ధైర్య సాహసాలతో ఎదుర్కొనే శక్తిని
కలిగించమని ప్రార్థించనీ
నన్ను కోరుకోనీ
నాకు సంభవించే నా బాధలను పోగొట్టమని కాదు
కష్టనష్టాలను అతి తేలికగా భరించగలిగే శక్తిని కోరుకోనీ
నన్ను ఆశించనీ
నా జీవిత పోరాటంలో మిత్రుల సహకారాన్ని
దిగ్విజయం పొందడానికి నా స్వంత శక్తిని ఆశించనీ
ఓ ప్రభూ!
నాకు కలిగే దిగ్విజయాలలో మాత్రం నీ కరుణా
కటాక్షాలను స్మరించే పిరికివానిగా చేయకు
పరాజయాలలో నీ చేయూత అర్థించనీ"!

శభాష్, ఈ నిర్మలమైన మనస్సు పాలకుల మెదళ్లను ఏనాటికి కుదిపి కదుపుతుందో!

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చీకటి దినమే!



ఇండియాకు సంబంధించి డిసెంబర్ 6 ఎప్పటికీ చీకటి దినమే! హింసాత్మక కాషాయ గూండాల వల్ల ఆ రోజు ఒక చారిత్రక మసీదు నేలమట్టం కావడమే కాదు, భారతీయ ముస్లింలు ద్వితీయ శ్రేణి పౌరులం అని అనుకునేట్టు చేసింది. ఇక మోదీ భారతం మనం ఇప్పటికీ ఆ రోజు నుంచి కోలుకోలేదని గుర్తుచేస్తుంటుంది.

– అర్ఫా ఖానమ్ షేర్వాణీ, జర్నలిస్ట్

సాంస్కృతిక నరమేధం



భారతదేశానికి చీకటి రోజు ఎప్పడంటే – ఇస్లాం మూఢవిశ్వాసి అయిన బాబర్... రామ జన్మస్థలాన్ని ధ్వంసం చేసి, అక్కడి విగ్రహాలను విరూపం చేసి, ఒక భయానక సాంస్కృతిక నరమేధానికి సంకేతంలా మిగిలిన ఆలయ శిథిలాలతో మసీదును నిర్మించడం! నిజంగా ఏమాత్రం భారతీయత మిగిలినవాళ్లయినా ఈ హింసను తీవ్రవాదంగా పరిగణించి దుఃఖపడతారు.

– సావిత్రీ ముముక్షు, విశ్లేషకురాలు

సమితి ప్రేమ



బాధితులు కనుక యూదులు కాకపోయుంటే ఐక్యరాజ్య సమితి మౌనంగా ఉండిపోయేదా? లేదు. ఇది కచ్చితంగా నిర్వహణ లోపం కాదు. యూదు వ్యతిరేకత! ఒక్క పన్ను చెల్లింపుదారు కూడా ఇకమీదట ఐరాసకు నిధులు ఇవ్వకూడదు. నేటికి కూడా ఆ సంస్థ అక్టోబర్ 7 నాటి హమాస్ దురాగతాన్ని గట్టిగా ఎందుకు ఖండించలేక పోతోంది?

– మైక్ లీ, యూఎస్ సెనేటర్

అందుకే డిఫరెంట్



మీలో ఎందరు గాడ్‌ఫాదర్ నవలను చదివారో తెలియదుగానీ, (గాడ్‌ఫాదర్) సినిమా మైకేల్ కార్లియోనీ సోదరుడు సనీ కార్లియోనీ పాత్రకు న్యాయం చేయలేదు. యాభై ఏళ్లుగా అందరు దర్శకులూ మన హీరోలను మైకేల్ పాత్ర ఆధారంగా మలిచారు, నాతో సహా ('సర్కార్'లో అభిషేక్ బచ్చన్). ఒక్క సందీప్ రెడ్డి వంగా మాత్రమే మైకేల్‌ను చెత్తబుట్టలో వేసి, సనీని హీరో చేశాడు ('యానిమల్'లో). అన్నట్టూ, 'సర్కార్'లో కేకే మీనన్ పోషించిన విష్ణు పాత్రకు నమూనా సనీ!

– రాంగోపాల్ వర్మ, దర్శకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

జనాభా పెరగాలా?

రష్యా, ఉత్తర కొరియాలు ప్రస్తుతం జనాభా కొరతను ఎదుర్కొంటున్నాయి. అందుకే ఈ రెండు దేశాల అధీశులూ తమ తమ దేశాల్లో ఎక్కువ మంది పిల్లలను కనాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. గతంలో రష్యాలో మహిళలు ఎక్కువ మంది పిల్లలను కంటే ప్రభుత్వం ఓ బిరుదు ఇచ్చేది. ప్రసుతం ఉక్రెయిన్‌తో యుద్ధంలో తల మునకలుగా ఉన్న రష్యాలో జనాభా గణనీయంగా తగ్గిపోయిందనీ, దేశ జనాభా పెంచు కోవాలనే తలంపు రష్యాలో బలంగా కనిపిస్తోందనీ వార్త. పిల్లలు ఉంటే దేశ రక్షణకు, భద్రతకు ముప్పు ఉండదు అని పుతిన్ అభిప్రాయంగా ఉంది. అదే అభిప్రాయంతో ఉత్తర కొరియా కూడా ఉంది. ఈ దేశంలో గత పది సంవత్సరాలుగా జననాల రేటు తీవ్రంగా తగ్గిపోయిందనీ, పొరుగు దేశం దక్షిణ కొరియా చెబుతోంది. దీనికి స్పందిస్తూ ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ దేశం బలంగా ఉండాలంటే జననాలను పెంచటం ప్రతి మహిళ విధి అని చెప్పారు. గత ఆదివారం జరిగిన 'నేషనల్ మదర్స్' సమావేశంలో కిమ్ ఈ మాట అన్నారు. జనాభా పెరగడం వల్ల అప్పుడ దేశ భద్రత పెరుగుతుందన్నారు. అదే సమయంలో పిల్లల సంరక్షణ, వారి విద్య, వారి సామర్థ్యం తల్లులతోనే సాధ్యం అవుతుందని అన్నారు. అయితే ఉత్తర కొరియా తమ దేశ జనాభా ఎంత అనేది తెలపడం లేదు. పిల్లలకు చదువు చెప్పించటం, వారి అలనా పాలనా చూడడం అనేవి చాలా వ్యయ, ప్రయాసలతో కూడుకున్న వ్యవహారాలు. అందుకే ఉత్తర కొరియాలో అనేక కుటుంబాలు ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలను కనేందుకు సిద్ధంగా లేవని కొంత మంది వాదన. ఉత్తర కొరియా ఎక్కువగా కార్మికులపై ఆధార పడిందనేది సత్యం. ఆర్థిక వ్యవస్థ కూడా కాస్త దెబ్బ తిన్నది. అందు నిమిత్తమే అది జనాభా పెరుగుదలపై ఎక్కువగా దృష్టి పెట్టలేదని తెలుస్తోంది.

ఇప్పుడు రష్యా, ఉత్తర కొరియా దేశాలు ఎక్కువ మంది పిల్లలను కంటే ఆ యా కుటుంబాలకు ఏ ప్రయోజనాలు ఉంటాయో తెలుపవలసి ఉంది. ఆ దేశాలలోని ప్రభుత్వాలు కుటుంబాలకు తగిన భరోసా ఇస్తేనే జనాభా పెరగడానికి అవకాశం ఉంటుంది. తద్వారా జనాభా కొరత ఈ దేశాలకు ఉండకపోవచ్చు. తగిన భరోసా ఇవ్వక పోతే ఎట్టి పరిస్థితులలోనూ జనాభా పెరగదు. మహిళలు కూడా పిల్లలను కనడానికి ఆసక్తి చూపరు. ఈ విషయం రెండు దేశాలూ గ్రహిస్తే చాలు. పిల్లల చదువుకూ, వారి వికాసానికీ తగిన వనరులు ఆ యా దేశాలు కల్పించాలి. అప్పుడే జనాభా పరిపుష్టిగా ఉంటుంది.

– కనుమ ఎల్లా రెడ్డి; పౌరశాస్త్ర అధ్యాపకులు, తాడిపత్రి

ప్రజాస్వామ్యానికి దూరమైతే మిగిలేది ఇదే!

అభిప్రాయం



పి. వేణుగోపాల్ రెడ్డి

తెలంగాణ ఏర్పడిన తరువాత శాసనసభకు జరిగిన మూడో ఎన్నికలు బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్ర శేఖర రావుకు ప్రత్యేకమైనవి. ఈ ఎన్నికలలో ప్రజలు ఆయన ధోరణిని ఓడించారనడం సబబు. రంగం నుంచి బీజేపీ తప్పుకొన్న విషయం ఎన్నికల సంరంభానికి ముందే వెల్లడైంది. మునుగోడు ఉప ఎన్నిక వరకూ అసెంబ్లీ ఎన్నికలలో విజయం బీజేపీదే అన్నంత ధీమా ఉందన్నది నిజం. ఈ ఎన్నికలు ప్రత్యేక తెలంగాణలో కాంగ్రెస్‌ను తొలిసారి అధికారంలో నిలబెట్టాయి. బీజేపీ కూడా స్వయంకృత అపరాధాలకు అతీతం కాదన్న విషయాన్ని రుజువు చేశాయి. కానీ కేసీఆర్‌కు మాత్రం ఈ ఎన్నికలు గొప్ప గుణపాఠాలు. నిజానికి ప్రజాస్వామ్యానికి దూరంగా జరిగే నేతలకు మిగిలే అంతిమ అనుభవం ఇదేనని చాలా గొప్పగా చెప్పాయి.

'నిధులు, నీళ్లు, నియామకాలు' అన్న నినాదం ఉద్యమానికి ఊపిరి ఇచ్చినప్పటికీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ముమ్మాటికీ ఆత్మగౌరవం అనే నినాదం మీద నిర్మితమైందని మరచిపోలేం. అయితే కేసీఆర్ ఈ రకమైన సెంటిమెంట్‌ను ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో గౌరవించిన తీరు ముందు నుంచి ప్రశ్నార్థకంగానే ఉన్నది. ఆయన మొదటి మంత్రిమండలి మహిళా ప్రాధాన్యం లేకుండానే చిరకాలం నడిచింది. కేసీఆర్ ఉద్యమ నేత స్థాయి నుంచి సీఎం పదవికి వెళ్లిన వ్యక్తేనా అనిపించేలా చేయడానికి ఇది చాలు. అప్పటి నుంచి 2023 ఎన్నికలలో ఆయన పార్టీ ఓటమి వరకూ జరిగిన కొన్ని పరిణామాలు కేసీఆర్ వ్యక్తిత్వం గురించి ప్రశ్నించుకునేటట్టు చేస్తూనే ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక సీనియర్ నాయకుడు, సిట్టింగ్ ఎంపీ ఈ ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత చేసిన వ్యాఖ్యలలో ఆ ప్రశ్నలకు సమాధానం కూడా ఉంది. తాను తొమ్మిదేళ్లలో అసలు కేసీఆర్ ఇంటర్వ్యూ కూడా సంపాదించలేక పోయానని బయటపెట్టారు. అలా అని సొంత పార్టీ నాయకులనూ, ఎమ్మెల్యేలనూ, ఎంపీలనూ ప్రగతి భవన్‌లోకి నేరుగా అనుమతించారని అనుకుంటే పొరపాటు. ఈటెల రాజేందర్ బీఆర్‌ఎస్‌ను వీడుతూ సరిగ్గా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు.

ఉద్యమ నేత స్థాయి నుంచి ముఖ్యమంత్రి పీఠానికి వెళ్లిన కేసీఆర్ ఈ విషయాన్ని అసలు గుర్తించారా? ముమ్మాటికీ లేదు. అంటే కేసీఆర్ తెలంగాణ ఉద్యమ తాత్వికతనే విస్మరించారు. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది వచ్చి హైదరాబాద్‌తో సహా తెలంగాణ ఇతర ప్రాంతాలలోనూ నివాసం ఏర్పరుచుకున్నారు. కానీ తెలంగాణ సమాజం ఆత్మగౌరవం గురించి ఆలోచింపచేసినవారు కొందరు ఆంధ్ర ప్రాంతీయులేనన్న వాదన ఉంది. అలాంటి అవమానాలను తెలంగాణ



సమాజం భరించలేదు. నిజానికి ఏ సమాజమూ భరించదు. ఏదో ఒకరోజు ప్రశ్నిస్తుంది. మద్రాసు ప్రెసిడెన్సీలో తమిళుల నుంచి అవమానాలను ఎదుర్కొన్న తెలుగ భాషా ప్రాంతాల వారు, నిజాం రాజ్యంలో తెలుగు ప్రాంతాల వారి పట్ల కూడా అదే ధోరణి ప్రదర్శించారంటే సత్యదూరం కాబోదు. అంతకంటే పెద్ద వాస్తవం కేసీఆర్ కూడా సీఎం హెూదాలో అవమానకరమైన ధోరణిలోనే వ్యవహరించడం!

విలేకరుల సమావేశాలలో ఆయన వ్యవహరించిన తీరు అసలు ప్రజాస్వామ్యానికి శోభను కూర్చేదని ఎవరైనా అనగలరా? పత్రికా స్వేచ్ఛ గురించి ఆయన ఏనాడూ గౌరవంగా లేరు. ప్రశ్న ఎంత లోతైనదైనా ఆయన దానికి చాలా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం దేశ ప్రజలకు అనుభవమే. దీనికి మించినది ఎన్నికల ప్రచార సభలలో ఆయన ప్రదర్శించిన ధోరణి. 'నేను చెప్పేది నేను చెప్పాను. నాకు ఓటేయకపోతే మీ ఖర్మ' అనే దాకా ఆయన వెళ్లారు. ఇది ప్రజాస్వామ్యం మీద నమ్మకమున్న ఏ నాయకుడూ చేయడు, చేయకూడదు! తనకు ఓటు వేయమని అడగడానికి వెళ్లి, సభలో చప్పట్లు చరిచిన వారిపై కూడా విరుచుకుపడే స్వభావం ఆయన స్థాయిని నిజంగానే దిగజార్చింది. 'వాడిని ఇలా గుంజుకు రండి', 'కిరికిరిగాళ్లు' వంటి మాటలు తరచు వాడడం సభా మర్యాద కూడా కాదన్న సంగతి ఆయన పూర్తిగా విస్మరించారు. గుజరాత్ వాళ్లకీ, ఢిల్లీ వాళ్లకీ ఇక్కడేం పని అంటూ ఆయన అత్యంత హేయంగా మాట్లాడారు. టీఆర్‌ఎస్ రూపు మార్చి బీఆర్‌ఎస్ అయిన తరువాత మహారాష్ట్రకు ఈయన ఎన్నిసార్లు పోయి రాలేదు! మహారాష్ట్ర వాసుల నుంచి ఆయనకు ఇలాంటి ప్రశ్నే వస్తే దానికి ఎలా స్పందించి ఉండేవారు? అవతలి పక్షం, అంటే బీజేపీ, కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి కేసీఆర్ ప్రయోగించిన భాష దారుణం. దానికి ఆ పార్టీల నాయకుల నుంచి కూడా అలాంటి స్పందనే వచ్చింది. ఈ ధోరణి ఎక్కడో ఒకచోట ఆగి ఉండవలసింది. ఈ రకమైన చౌరవ విపక్షాల నుంచి మొదలై ఉంటే కేసీఆర్‌కు మంచి గుణపాఠం అయ్యి ఉండేది. కానీ అలా జరగలేదు.

ఇది అహంకార ధోరణి అని నిస్సంశయంగా చెప్పడానికి ప్రజాస్వామ్య వాదులు వెనుకాడరు. దానికి తెలంగాణ సమాజం పెద్ద మూల్యమే చెల్లించింది. తెలంగాణ సాధనకు ఉపయోగపడిన నినాదంలోని నీళ్ల కోసం వృథాగా కొన్ని వందల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేసింది. కాళేశ్వరం, మేడిగడ్డల దగ్గర ఎదురైన అనుభవాలు ఇవే. అక్కడ కేసీఆర్ ఇంజనీర్ అవతారం కూడా ఎత్తారని ఇప్పుడు జనం చెబుతున్నారు. కొత్త సచివాలయం నిర్మాణంలో కూడా ఆయన మాటే అంతిమంగా ఉండేదన్న విమర్శ కూడా కొద్దికాలం వినిపించింది.

కేసీఆర్ నియంతృత్వ ధోరణి ఈ ఎన్నికలలో ఓటమి తరువాత కూడా కొనసాగడం ప్రజలను నిశ్చేష్టులను చేసింది. పార్టీ ఓడిపోతే ఆ పార్టీ నుంచి ముఖ్యమంత్రిగా ఉన్న నాయకుడు స్వయంగా వెళ్లి గవర్నర్‌కు రాజీనామా సమర్పించడం మర్యాద. ఇది రాజకీయ సంప్రదాయం కూడా. తెలంగాణతో పాటే ఎన్నికలు జరుపుకొన్న రాజస్థాన్ ముఖ్యమంత్రి ఈ మర్యాదను పాటించిన ఉదాహరణ ఎదురుగానే ఉంది. కానీ కేసీఆర్ తన ఓఎస్‌డీ ద్వారా గవర్నర్‌కు రాజీనామా లేఖను పంపించి గజ్వేల్‌లోని ఫామ్ హౌస్‌కు వెళ్లిపోవడం మంచి సంప్రదాయం కాదని చెప్పక తప్పదు. గెలిస్తే సరే, ఓడినా కూడా రెండు దఫాలు ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి తన సొంత పార్టీ కార్యకర్తల పట్ల చూపవలసిన కనీస బాధ్యతను కూడా కేసీఆర్ ఎందుకు చూపలేకపోయారు? ఆయన కాకుండా పార్టీ నేతగా ఆయన కుమారుడు కేటీఆర్ ధన్యవాదాలు తెలియచేసే బాధ్యతను స్వీకరించడం కూడా సరైనది కాదు. ఇది అహంకారం కాదు అని ఆ పార్టీ నాయకులు ఎవరైనా చెబితే అది కూడా చాలదు. ఎందుకంటే అహంకారమేనన్న వాస్తవాన్ని అప్పుడు కేసీఆరే రూఢి చేసినట్టు అవుతుంది. కేసీఆర్‌కూ గవర్నర్‌కూ విభేదాలు ఉండవచ్చు. అయినా ఒక ప్రజా నాయకునిగా కేసీఆర్ తన బాధ్యతను తాను నిర్వర్తించి ఉండవలసింది కాదా! రాజస్థాన్‌లో కూడా సొంత పార్టీ నియమించిన గవర్నర్ లేరు. అధికారం నుంచి దిగిపోతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. గవర్నర్ కేంద్రంలో బీజేపీ నియమించినవారే. మరి ఆయన ఆ మర్యాద ఎందుకు చూపించారు?

ఆత్మ గౌరవం అంటే అహంకార ప్రదర్శన కాదు. ఈ సంగతి కేసీఆర్‌కు ఎవరైనా ఇంకా ముందే గుర్తు చేసి ఉండవలసింది. ఈ ఎన్నికలలో కేసీఆర్–బీఆర్‌ఎస్ ఓటమి రాష్ట్రాన్ని 'అభివృద్ధి చేయనందుకు' అని ఒక్కమాటలో చెప్పలేం. అందుకు ఆ పార్టీ అంతో ఇంతో చేసింది. మన్ను తిన్న పాములా పడి ఉన్న కాంగ్రెస్ ఆరేడు మాసాలలోనే ఇంత ఫలితం సాధించడానికీ, బీఆర్‌ఎస్ ఓడిపోవడానికీ కారణం కేసీఆర్ అహంకార ధోరణి! అది బీఆర్‌ఎస్ గుర్తించవలసి ఉంటుంది. ప్రజాస్వామ్యాన్ని గౌరవించని నాయకుడు అంటే, ప్రజానీకాన్ని గుర్తించని నాయకుడనే. ఇక్కడ ఓడిపోయినది అలాంటి నాయకుడే! ప్రజలకు దూరమైన నాయకుడే!!

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్
ఈ–మెయిల్: pvg@ekalavya.net

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.దశమి రా.2.43 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** హస్త పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ప.2.21 నుండి 4.05 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.01 నుండి 10.49 వరకు, తదుపరి ప.2.28 నుండి 3.16 వరకు, **అమృత ఘడియలు:** రా.12.48 నుండి 2.33 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.21, **సూర్యాస్తమయం:** 5.21.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

19న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 23 నుంచి 2024, జనవరి 1వ తేదీ వరకు పది రోజుల పాటు జరుగనున్న వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలను పురస్కరించుకుని ఈ నెల 19వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం ఆలయ శుద్ధి, అనంతరం సంప్రోక్షణం, స్వామివారి మూలవిరాట్టుకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు.ఆ తర్వాత భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. ఈ కారణంగా ఆలయంలో అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.

17 నుంచి ధనుర్మాస తిరుప్పావై ప్రవచనాలు

పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 17 నుంచి 2024, జనవరి 14వ తేదీ వరకు తిరుపతితోపాటు దేశవ్యాప్తంగా 216 కేంద్రాల్లో ప్రముఖ పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇందు కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. తిరుమల శ్రీవారి ఆలయంలోనూ ధనుర్మాసంలో సుప్రభాతం బదులు తిరుప్పావై నివేదించడం విశేషం. తిరుపతిలో అన్నమాచార్య కళామందిరంతోపాటు ఏడు ప్రాంతాల్లో తిరుప్పావై ప్రవచనాలు పారాయణం చేస్తారు.

కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ శాఖల మధ్య సమన్వయం అవశ్యం

సీబీఐసీ చీఫ్ కమిషనర్ సంజయ్ రౌత్

సాక్షి, అమరావతి: కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ శాఖల మధ్య సమన్వయం, పరస్పర సహకారం అత్యంత ఆవశ్యకమని కేంద్ర పరోక్ష పన్నుల బోర్డ్– కస్టమ్స్ శాఖ(సీబీఐసీ) చీఫ్ కమిషనర్ సంజయ్ రౌత్ అన్నారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ శాఖల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు శాఖల మధ్య సమాచార మార్పిడి, సాంకేతిక సహకారం మరింత పెంపొందించాలని సూచించారు. పన్ను చెల్లింపుదారుల సమస్యలను సత్వరం పరిష్కరించి మెరుగైన సేవలు అందించాలని ఉద్యోగులను ఆదేశించారు. రాష్ట్ర జీఎస్టీ కమిషనర్ ఎం.గిరిజా శంకర్ మాట్లాడుతూ బోగస్ రిజిస్ట్రేషన్లు, బోగస్ ఇన్వాయిస్‌లకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీజీఎస్టీ కమిషనర్ సాధు నర్సింహారెడ్డి మాట్లాడుతూ మూడు నెలలకోసారి కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ శాఖల సమన్వయ సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో జీఎస్టీ ఇంటెలిజెన్స్ అదనపు కమిషనర్ ఎం.రామిరెడ్డితోపాటు కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ శాఖల అదనపు కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఐదేళ్ల జైలు

విజయవాడ స్పోర్ట్స్: భార్యను వేధింపులకు గురి చేసి ఆమె ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించిన భర్తకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ మహిళా సెషన్స్ కం ఐదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఐ.శైలజాదేవి బుధవారం తీర్పు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, కృష్ణలంక గౌతమీనగర్‌కు చెందిన వంకా దుర్గాప్రసాద్‌కు ఖమ్మం జిల్లాకు చెందిన శోభారాణితో 2008లో వివాహమైంది. వీరికి సంతానం లేకపోవడంతో దుర్గాప్రసాద్ వైద్యులను సంప్రదించాడు. వారు ఇచ్చిన మందులు వాడకుండా అతడు నిత్యం మద్యం మత్తులోనే ఉండేవాడు. దీంతో దంపతులిద్దరికీ తరచూ వివాదం జరుగుతుండేది. భర్త నిత్యం శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో శోభారాణి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని మృతి చెందింది. 2014 నవంబర్ 5వ తేదీన జరిగిన ఈ ఘటనపై కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. 16 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు దుర్గాప్రసాద్‌కు కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

నేను.. సీఎం ఆఫీసునుంచి మాట్లాడుతున్నా..

ఫేక్‌కాల్‌తో వికలాంగుల సంక్షేమ శాఖ ఉద్యోగికి బురిడీ

అనంతపురం ఎడ్యుకేషన్: 'హలో బాబూ.. నేను సీఎం గారి ఆఫీసు నుంచి మాట్లాడుతున్నా'నంటూ ఓ వ్యక్తి ఫేక్‌కాల్ చేసి అనంతపురంలోని వికలాంగుల సంక్షేమ శాఖ ఉద్యోగిని బురిడీ కొట్టించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. కుందుర్పి మండలకేంద్రంలో జరిగిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్ రసూల్ వెళ్లారు. ఆయన మీటింగ్‌లో ఉన్న సమయంలో 7793908884 నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ఫోన్ తీయగానే 'హలో..నేను సీఎం గారి ఆఫీసు నుంచి మాట్లాడుతున్నా' అన్నదానం కోసం రూ.10 వేలు పంపండి' అని కోరాడు. దీంతో ఏడీ తన కార్యాలయానికి ఫోన్ చేసి జూనియర్ అసిస్టెంట్ చాంద్‌బాషాతో మాట్లాడి.. సదరు నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. చాంద్‌బాషా హడావుడిగా సదరు నంబరుకు ఫోన్ చేశారు. అవతలి వ్యక్తి స్పందిస్తూ 'ఏమీ లేదమ్మా..ఇక్కడ జర్నలిస్ట్ యూనియన్ వారిది ఈరోజు వార్షికోత్సవం ఉందట. వారికి భోజనాలు ఏర్పాటు చేయాలి. రూ. పదివేలు పంపు' అని కోరాడు. దీంతో తన వద్ద అంత లేవంటూ చాంద్‌బాషా రూ.వెయ్యి ఇస్తానని అన్నాడు. సరే బాలకృష్ణ పేరుతో ఉన్న 80961 82261 అనే నంబరుకు ఫోన్‌పే చేయమన్నాడు. దీంతో చాంద్‌బాషా రూ. వెయ్యి పంపించాడు. కాగా..ఇలాంటి ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

3 నెలల్లో.. 4 క్లస్టర్లు



మార్చిలోగా 4 ఎంఎస్ఎంఈ క్లస్టర్లు ప్రారంభించేలా ప్రణాళిక

- బంగారు నగలు, ఫర్నిచర్, పప్పుదినుసులు, రెడీమేడ్ దుస్తుల తయారీ క్లస్టర్లు
- జగ్గయ్యపేట, రాజమహేంద్రవరం, మాచవరం, నెల్లూరుల్లో చురుగ్గా సాగుతున్న పనులు
- రూ.46.03 కోట్లతో వీటిని అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం
- వీటితో 25 వేలమందికి ఉపాధి అవకాశాలు
- ఇప్పటికే ప్రారంభమైన కాకినాడ ప్రింటింగ్ క్లస్టర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అత్యధికమందికి ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలు మంచి ఫలితాలిస్తున్నాయి. తక్కువ వ్యయంతో ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా పోటీ మార్కెట్‌లో నిలబడే విధంగా క్లస్టర్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఔత్సాహికుల చేయిపట్టుకుని నడిపిస్తోంది. దేశంలోనే మొదటగా కాకినాడలో ఏర్పాటైన ప్రింటింగ్ క్లస్టర్ విజయవంతంగా అందుబాటులోకి రావడంతో.. అదే స్ఫూర్తితో ఎంఎస్ఎంఈ క్లస్టర్లను అభివృద్ధి చేస్తోంది. రూ.46.03 కోట్లతో అభివృద్ధి చేస్తున్న నాలుగు క్లస్టర్లను మూడునెలల్లోగా అందుబాటులోకి తీసుకువాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి పరిశ్రమలశాఖ అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో రూ.8 కోట్లతో బంగారు ఆభరణాల తయారీ క్లస్టర్, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వద్ద రూ.14.98 కోట్లతో ప్రింటింగ్ క్లస్టర్, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మాచవరం వద్ద రూ.14.83 కోట్లతో పప్పుదినుసులు తయారు చేసే పల్సెస్ క్లస్టర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రం నెల్లూరు వద్ద రూ.8.22 కోట్లతో గార్మెంట్ క్లస్టర్లను అభివృద్ధి చేస్తోంది. చుట్టపక్కల ప్రాంతాల్లో ఉండే సూక్ష్మ, చిన్నతరహా యూనిట్లు జట్టుకట్టి ఒక ప్రత్యేక కంపెనీగా ఏర్పడి ఈ క్లస్టర్లలో ఉమ్మడిగా మౌలిక వసతులను ఏర్పాటు చేసుకుంటున్నాయి. మార్చిలోగా ఈ నాలుగు క్లస్టర్లను ప్రారంభించే విధంగా పనులు చురుగ్గా సాగుతున్నాయని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.గోపాలకృష్ణ 'సాక్షి'కి తెలిపారు. ఈ నాలుగు క్లస్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాల్సిన మ్యాచింగ్ గ్రాంట్, ఎస్‌పీవీలు సమకూర్చాల్సిన మొత్తం ఇప్పటికే జమచేయడంతో పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ నాలుగు క్లస్టర్లతో సుమారు 25 వేలమందికి ఉపాధి లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

గత ప్రభుత్వం బకాయిలు

గత ప్రభుత్వం ఎంఎస్ఎంఈలను పూర్తిగా నిర్లక్ష్యం చేయగా ఈ ప్రభుత్వం ప్రోత్సాహకాలను ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ ఆదుకుంటోందని పారిశ్రామికవేత్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఎంఎస్ఎంఈలకు, స్పిన్నింగ్ మిల్లులకు కలిపి బకాయి పెట్టిన రూ.1,588 కోట్లను విడుదల చేయడమే కాకుండా రూ.2,087 కోట్ల ప్రోత్సాహకాలను విడుదల చేసి ఆదుకుందని తెలిపారు. ఇప్పుడు తాజాగా ఫిబ్రవరిలో ప్రోత్సాహకాలు విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంపై ఎంఎస్ఎంఈ అసోసియేషన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలో గత నాలుగున్నరేళ్లలో ఎంఎస్ఎంఈల సంఖ్య గణనీయంగా పెరిగింది. గత ప్రభుత్వం దిగిపోయేనాటికి రాష్ట్రంలో ఉన్న ఎంఎస్ఎంఈలు 1,93,530 కాగా.. వీటి సంఖ్య ఈ ఏడాది ఆగస్టు చివరినాటికి ఏకంగా 5,81,152కు చేరింది. నాలుగున్నరేళ్లలో కొత్తగా 3.87 లక్షల యూనిట్లు ఏర్పాటయ్యాయి. రాష్ట్రంలో మొత్తం ఎంఎస్ఎంఈల ద్వారా 34.83 లక్షల మందికి ఉపాధి లభిస్తుంటే.. ఈ నాలుగున్నరేళ్లలోనే కొత్తగా 12.61 లక్షల మందికి ఉపాధి లభించినట్లు ఉద్యమ్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

క్లస్టర్ పేరు	ఏర్పాటవుతున్న ప్రదేశం	ప్రాజెక్టు వ్యయం (రూ.కోట్లలో)
ప్రింటింగ్ క్లస్టర్	రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా	14.98
పల్సెస్ క్లస్టర్	మాచవరం, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా	14.83
ఆభరణాల తయారీ	జగ్గయపేట, ఎన్టీఆర్ జిల్లా	8.00
రెడీమేడ్ గార్మెంట్ క్లస్టర్	నెల్లూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా	8.22

ఎస్ఐ మెయిన్స్ ఫలితాల వెల్లడి

ఓఎంఆర్ షీట్ల స్కాన్ కాపీలు డౌన్‌లోడ్‌కు అవకాశం

సాక్షి, అమరావతి: ఎస్ఐ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన మెయిన్స్ రాత పరీక్షల ఫలితాలను రాష్ట్ర పోలీసు నియామక మండలి బుధవారం ప్రకటించింది. మొత్తం నాలుగు పేపర్లుగా అక్టోబరు 14, 15 తేదీల్లో నిర్వహించిన పరీక్షలకు 31,193 మంది హాజరయ్యారు. ముందుగా పేపర్–1, పేపర్–2 జవాబుపత్రాలను మూల్యాంకనం చేశారు. వాటిలో అర్హత సాధించిన 25,839 మంది అభ్యర్థుల పేపర్–3, పేపర్–4 జవాబుపత్రాలను మూల్యాంకనం చేసి ఫలితాలను పోలీసు నియామక మండలి ప్రకటించింది. మెయిన్ పరీక్షల తుది 'కీ', ఫలితాలు, అభ్యర్థుల జవాబు పత్రాలు (ఓఎంఆర్ షీట్లు) స్కాన్ కాపీలను తమ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. అభ్యర్థులు తమ పేపర్–3, పేపర్–4 ఓఎంఆర్ షీట్ల స్కాన్ కాపీలను ఈ నెల 8వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎస్ఐ పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను త్వరలో వెల్లడిస్తామని పోలీసు నియామక మండలి చైర్మన్ అతుల్‌సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముఖ్యమైన సమాచారం

అభ్యర్థులు తుది కీ, మెయిన్ పరీక్షల ఫలితాలు, ఓఎంఆర్ షీట్ల స్కాన్ కాపీలను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన వెబ్‌సైట్: www.slprb.ap.gov.in
■ ఏమైనా సందేహాలు ఉంటే సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 9441450639, 9100203323 ■ ఏమైనా సందేహాలు ఉంటే సంప్రదించాల్సిన మెయిల్ ఐడీ: mail&slprb@ap.gov.in

పాలనా వికేంద్రీకరణ కోసమే ఉద్యమం

1,165వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: చిన్న రాష్ట్రాలు, పరిపాలనా వికేంద్రీకరణ ద్వారానే అందరికీ సమాన ఫలాలు అందుతాయనే డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తితో బహుజన పరిరక్షణ ఉద్యమం కొనసాగుతుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,165వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ కలలుగన్న సమాజ నిర్మాణం కోసం ఏపీలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తుంటే.. కులవాదులు తప్పుడు కేసులు వేసి అడ్డుకోవడం వెనుక భారీ కుట్రలు దాగి ఉన్నాయన్నారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఏపీలో పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణంతో పాటు సంక్షేమం పెద్ద ఎత్తున అందుతుందనేందుకు పలు సంస్థలు ఇచ్చిన నివేదికలే నిదర్శనమని చెప్పారు. అమరావతి పేరుతో చంద్రబాబు చేసిన రూ.3.50 లక్షల కోట్ల దోపిడీ సొమ్మును కాపాడుకునేందుకే అమరావతి ఉద్యమం ప్రారంభించారనేది బహిరంగ సత్యమన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. నేతలు పులి దాసు, పల్లె బాబు, మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై తలనీలాల టెండర్ వాయిదా!



తలనీలాల బహిరంగ వేలం ప్రక్రియ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు సమర్పించే తలనీలాలను సేకరించుకునే హక్కు కోసం బుధవారం నిర్వహించిన టెండర్ సరైన ధర రాకపోవడంతో వాయిదా పడింది. ఇంద్రకీలాద్రి మహా మండపం ఆరో అంతస్తులో ఏఈవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో నిర్వహించిన టెండర్ ప్రక్రియలో తణుకుకు చెందిన ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్, సికింద్రాబాద్‌కు చెందిన నాగకుమారి ఎంటర్‌ప్రైజర్స్, హిందూపురానికి చెందిన సుమిత్ ఎంటర్‌ప్రైజర్స్‌కు చెందిన కాంట్రాక్టర్లు బహిరంగ వేలం ప్రక్రియలో పాల్గొన్నారు. ప్రథమ ధరావత్తు రూ.50 లక్షలుగా దేవస్థానం నిర్ణయించి టెండర్ ప్రక్రియను ప్రారంభించింది. దేవస్థానం పాటను రూ.9 కోట్ల నుంచి ప్రారంభించింది. కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో పాటను క్రమంగా రూ. 8 కోట్ల వరకు తగ్గించింది. గత ఏడాది రూ.7.87 కోట్ల వరకు పలకగా, ఈ ఏడాది పాటను పెంచేందుకు కాంట్రాక్టర్లు సుముఖత వ్యక్తం చేయలేదు. కాంట్రాక్టర్లు ముగ్గురు కలిసి పాటను పెంచేందుకు సరేమిరా అన్నారు. దీంతో ఏఈవో చంద్రశేఖర్ టెండర్ వ్యవహారాన్ని ఆలయ ఈవో కె.ఎస్. రామారావు దృష్టికి తీసుకువెళ్లడంతో బహిరంగ వేలాన్ని వాయిదా వేయాలని సూచించారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో చెన్నై, కర్ణాటకలకు చెందిన కాంట్రాక్టర్లు బహిరంగ వేలానికి హాజరు కాలేకపోయినట్లు తెలిసింది. ఇదే విషయం ఆలయ ఈవో దృష్టికి వెళ్లడంతో మరో మారు బహిరంగ వేలాన్ని నిర్వహించేందుకు తేదీని నిర్ణయించాలని సూచించారు. టెండర్ ప్రక్రియను ఏఈవో వెంకటరెడ్డి, సూపరింటెండెంట్లు అమృతరావు, సునీత, డీవీవీ సత్యనారాయణ నిర్వహించారు.

విద్యార్థులకు 'కళా ఉత్సవ్' పోటీలు

సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో సృజనాత్మకతను, కళలను ప్రోత్సహించేందుకు 'కళా ఉత్సవ్–2023' పోటీల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ప్రతిభగల విద్యార్థులను ఎంపిక చేసేందుకు ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. 9వ తేదీ నుంచి ఇంటర్మీడియెట్ విద్యార్థులకు సంగీతం, నాట్యం, నాటకం, ఆర్ట్ వంటి 10 అంశాల్లో పోటీలు జరుగుతాయి. జిల్లా స్థాయిలో ఎంపికైన వారికి డిసెంబర్ 14, 15 తేదీల్లో విజయవాడలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని జనవరి 9 నుంచి 12 వరకు ఢిల్లీలో జరిగే జాతీయ పోటీలకు ఎంపిక చేయనున్నారు. జాతీయ స్థాయిలో ఎంతో ప్రత్యేకత ఉన్న ఈ పోటీలు అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు, జూనియర్ కాలేజీల విద్యార్థులు పాల్గొనవచ్చు.

డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘానికి వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు
- తెలంగాణలో ఓటు వేసిన వారిని ఏపీలో ఓటేయకుండా చూడాలని వినతి
- చంద్రబాబు దుష్ప్రచారాలను నమ్మొద్దు
- ప్రజలకు మంత్రుల వినతి



రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేస్తున్న మంత్రులు చెల్లుబోయిన, జోగి, విప్ అప్పిరెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే విష్ణు

సాక్షి, అమరావతి : తెలంగాణలో ఓటు వేసిన వారిని తిరిగి ఆంధ్రప్రదేశ్‌లో ఓటు వేయకుండా చూడాలని వైఎస్సార్ సీపీ నేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు విజ్ఞప్తి చేశారు. సచివాలయంలోని ఎన్నికల కమిషన్ కార్యాలయంలో బుధవారం మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జోగి రమేష్, శాసన మండలిలో విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎంపీ గురుమూర్తి, గోరంట్ల మాధవ్ తదితరులు మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చెల్లుబోయిన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు పారదర్శకంగా జరగాలనేది సీఎం జగన్ ఆకాంక్షగా చెప్పారు. దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు దిట్టని, మోసాలు చేయడమే ప్రధాన అజెండాగా పెట్టుకుని పనిచేస్తున్నారని ఆరోపించారు. ఒక సామాజికవర్గానికి చెందిన కొంతమంది ఓట్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఉన్నాయని తెలిపారు. డూప్లికేట్ ఓట్లను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు తాను చేసిన తప్పులను ఇతరులపైకి నెడుతూ తనకున్న పచ్చమీడియా సహకారంతో దుష్ప్రచారానికి ఒడిగడుతుంటారని, ఢిల్లీ వెళ్లి జాతీయ మీడియాలో అబద్ధాలు చెప్పేందుకు యత్నిస్తున్నారని.. ఆయన మాటలను ప్రజలు నమ్మొద్దని సూచించారు.

హైదరాబాద్, ఏపీలో కలిపి 4 లక్షల 30 వేల 264 డూప్లికేట్ ఓట్లు

మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ హైదరాబాద్, ఏపీలో రెండుచోట్ల కలిపి 4 లక్షల 30 వేల 264 డూప్లికేట్ ఓట్లున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని ఆధారాలతో సహా ఎన్నికల కమిషన్‌కు ఇచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా డబుల్ ఎంట్రీలను తొలగించాలని కోరినట్లు తెలిపారు. అర్హులైన వ్యక్తికి దేశంలో ఒకేచోట ఓటు ఉండాలనేది వైఎస్సార్‌సీపీ విధానమన్నారు. ఇదే అంశాన్ని ఇప్పటికే పలుమార్లు ఎన్నికల కమిషన్‌కు తెలియచేశామని, తాము అందించిన ఆధారాలను పరిశీలించి ఇలాంటి ఓట్లపై విచారణ జరిపించి.. తొలగించాలని కోరినట్లు వివరించారు.

ఇది కచ్చితంగా ఫోరం షాపింగే

- రాజధాని రైతుల రిట్ పిటిషన్‌పై అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ ధ్వజం
- నీతిలేని వ్యక్తులే ఇలాంటి తప్పుడు మార్గాలను అనుసరిస్తారు
- గతంలో కార్యాలయాల తరలింపు జరిగిపోతోందంటూ పిల్స్ వేశారు
- ఆ వ్యాజ్యాలను ధర్మాసనమే విచారణ జరిపింది
- అయినా ఇప్పుడు పిల్ కాకుండా రిట్ పిటిషన్ వేశారు
- ధర్మాసనాన్ని తప్పించుకునేందుకే రిట్ పిటిషన్ వేశారు
- దీని వెనుక వారి ఉద్దేశం ఫోరం షాపింగే
- రిజిస్ట్రీ కూడా నంబర్ ఇవ్వడం సరికాదు
- హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్
- తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా

సాక్షి, అమరావతి : ఉత్తరాంధ్ర అభివృద్ధి పర్యవేక్షణ, సమీక్ష నిమిత్తం విశాఖపట్నంలో ప్రభుత్వ క్యాంప్ కార్యాలయాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తిస్తూ ఐఏఎస్‌ల కమిటీ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా ప్రభుత్వం జారీ చేసిన జీవో 2283ని సవాలు చేస్తూ రిట్ పిటిషన్ దాఖలు చేయడం వెనుక రాజధాని రైతుల దురుద్దేశాలను అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్ హైకోర్టు ముందుంచారు. ఈ జీవోపై రిట్ పిటిషన్ దాఖలు చేయడం ఫోరం షాపింగ్ (కావాల్సిన న్యాయమూర్తి వద్దకు కేసు వచ్చేలా చేయడం) కిందకే వస్తుందని కోర్టుకు నివేదించారు. నీతి లేని వ్యక్తులే ఇలాంటి తప్పుడు మార్గాలను అనుసరిస్తారని తెలిపారు.

జీవో 2283ని రద్దు చేయాలని, అప్పటి వరకు జీవో అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ అమరావతి పరిరక్షణ సమితి మేనేజింగ్ ట్రస్టీ గద్దె తిరుపతి రావు, రాజధాని రైతులు మాదాల శ్రీనివాసరావు, వలపర్ల మనోహరం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ముందుకు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపించారు. ఈ వ్యాజ్యంపై రిజిస్ట్రీ ఎలాంటి అభ్యంతరాలు లేవనెత్తకుండా నంబరు కేటాయించడంపై శ్రీరామ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

గతంలో ప్రభుత్వ కార్యాలయాల తరలింపు జరుగుతోందంటూ ధర్మాసనం ముందు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు (పిల్) దాఖలు చేసిన అమరాతి పరిరక్షణ సమితి, మరికొందరు.. ఇప్పుడు అదే అంశంపై రిట్ పిటిషన్ వేయడం ఆశ్చర్యకరమని ఏజీ అన్నారు. కార్యాలయాల తరలింపు వ్యవహారం రాజధాని అంశంతో ముడిపడి ఉందని, అలా తరలించడం హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పునకు విరుద్ధమని పిటిషనర్లు వారి వ్యాజ్యంలో స్వయంగా పేర్కొన్నారని, వారికి ఎలాంటి దురుద్దేశాలు లేకుంటే పిల్ దాఖలు చేసి ఉండే వారని తెలిపారు. పిల్ దాఖలు చేస్తే ఈ వ్యవహారం మొత్తం ధర్మాసనం ముందుకే వస్తుందని తెలిసి రిట్ దాఖలు చేశారన్నారు. రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ వ్యవహారంలో కూడా ఇలానే ఫోరం షాపింగ్‌కు పాల్పడ్డారని, దీంతో ధర్మాసనమే ఆ వ్యాజ్యాలను తెప్పించుకుని విచారణ జరిపిందన్నారు. రాజధాని వ్యవహారం కేవలం పిటిషనర్లకు మాత్రమే సంబంధించింది కాదని, పెద్ద సంఖ్యలో ప్రజలకు సంబంధించిందన్నారు. అందువల్ల పిల్ మాత్రమే దాఖలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. కార్యాలయాల తరలింపు విషయంలో అభ్యంతరాలుంటే తమ వద్దకు రావాలని పిటిషనర్లకు గతంలోనే ధర్మాసనం స్వేచ్ఛనిచ్చిందని, ఈ విషయం వారికీ తెలుసునన్నారు. అయినా ధర్మాసనం ముందుకు వెళ్లకుండా సింగిల్ జడ్జి వద్దకు వచ్చారని వివరించారు. చాలా తెలివిగా పిటిషన్‌ను తయారు చేశారని, అంతే తెలివిగా ధర్మాసనం ముందుకు రాకుండా చేశారన్నారు. వారి అంతిమ ఉద్దేశం ఫోరం షాపింగేనని చెప్పారు. ఫోరం షాపింగ్ విషయంలో సుప్రీం కోర్టు వెలువరించిన పలు తీర్పులను ఆయన కోర్టు ముందుంచారు. అసలు ఈ పిటిషన్ విచారణార్హతపైనే ఏజీ అభ్యంతరాలు లేవనెత్తారు. దాదాపు గంటసేపు వాదనలు వినిపించిన ఏజీ.., తదుపరి వాదనలకు సమయం లేకపోవడంతో విచారణను శుక్రవారానికి వాయిదా వేయాలని కోరారు. దీంతో న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

భారీగా లోటు భర్తీ చేసిన మిచాంగ్

- కుండపోత వర్షాల ఫలితం
- ఈ నెల 2 వరకు రాష్ట్రంలో 31.3 శాతం లోటు వర్షపాతం
- నాలుగు రోజుల్లోనే 15 శాతంతో సాధారణ స్థితికి చేరిక
- భూగర్భ జలాల పెరుగుదలకూ మిచాంగ్ దోహదం



ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం కట్టెలేరు వద్ద వరద ప్రవాహం

సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తీవ్ర తుపాను రాష్ట్రంలో లోటు వర్షపాతాన్ని భారీగా పూడ్చింది. కేవలం నాలుగు రోజుల్లో కురిసిన కుండపోత వర్షం ఈ పరిస్థితికి కారణమైంది. వాస్తవానికి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నైరుతి రుతుపవనాలు సకాలంలో ఆశించిన వర్షాలను కురిపించలేదు. దీంతో ఆ సీజన్‌లో కురవాల్సిన దానికంటే 15 శాతం తక్కువగా వర్షం కురిసింది. ఆ తర్వాత అక్టోబర్ నెల నుంచి మొదలయ్యే ఈశాన్య రుతుపవనాలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ రుతుపవనాలు నైరుతి రుతుపవనాలకంటే ఘోరంగా దెబ్బతీశాయి. సాధారణంగా ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో వాయుగుండాలు, తుపానులు ఏర్పడి భారీ వర్షాలకు కారణమవుతాయి. అయితే.. ఈ ఏడాది వాటి జాడ లేక వానలు మొహం చాటేశాయి. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో భారీ లోటు వర్షపాతం నమోదైంది. జూన్ నుంచి డిసెంబర్ ఒకటి వరకు 837.9 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా.. 575.6 మి.మీ. మాత్రమే కురిసింది. అంటే 31.3 శాతం లోటు వర్షపాతం నమోదైంది. బంగాళాఖాతంలో వారం రోజుల క్రితం ఏర్పడిన అల్పపీడనం దశల వారీగా బలపడుతూ తుపానుగా మారింది. ఇది రాష్ట్రంపై ఈ నెల 2వ తేదీ నుంచి ప్రభావం చూపడం మొదలుపెట్టింది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా రాయలసీమలో ఒకట్రెండు జిల్లాలు మినహా రాష్ట్రమంతటా విస్తారంగా వర్షాలను కురిపించింది. పలు జిల్లాల్లో కుంభవృష్టి కురిసింది. ఫలితంగా కేవలం నాలుగు రోజుల్లోనే 31 శాతం లోటున్న వర్షపాతం 15 శాతానికి దిగివచ్చింది. డిసెంబర్ రెండున 31.3 శాతం లోటు వర్షం ఉండగా 6వ తేదీ నాటికి 15.3 శాతానికి తగ్గి సాధారణ స్థితికి చేరుకుంది. కురవాల్సిన దానికంటే 20 శాతానికి పైగా వర్షపాతం నమోదైతే లోటు గాను, అంతకు తక్కువగా రికార్డయితే సాధారణం గాను పరిగణిస్తారు.

రాష్ట్రంలో వర్షపాతం పెరుగుదల ఇలా (మి.మీ.)

తేదీ	సాధారణం	కురిసింది	శాతం	స్థితి
01.12.23	837.9	575.6	-31.3	లోటు
02.12.23	838.5	576.0	-31.3	లోటు
03.12.23	839.4	583.6	-30.5	లోటు
04.12.23	839.8	597.3	-28.9	లోటు
05.12.23	842.1	652.3	-22.5	లోటు
06.12.23	844.6	715.1	-15.3	సాధారణం

మొత్తమ్మీద చూస్తే ప్రస్తుతం 14 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా.. మిగిలిన 12 జిల్లాల్లో లోటు కొనసాగుతోంది. సాధారణ వర్షపాతం జాబితాలో విజయనగరం, పార్వతీపురం మన్యం, ఏఎస్సార్, అనకాపల్లి, తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఎస్పీఎస్సార్ నెల్లూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలున్నాయి. మరోవైపు డిసెంబర్ ఆరంభం నుంచి ఇప్పటివరకు అంటే.. 6 రోజుల్లో రాష్ట్రంలో 15.4 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా.. దాదాపు నాలుగు రెట్లు అధికంగా 62.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరోవైపు మిచాంగ్ తీవ్ర తుపాను ప్రభావంతో కురిసిన కుండపోత వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు మెరుగుపడతాయని నిపుణులు చెబుతున్నారు.

ఆర్జీయూకేటీతో తిరుపతి ఐఐటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్‌సత్యనారాయణ

ఏర్పేడు (తిరుపతి జిల్లా): విద్య, వైజ్ఞానిక సహకారాన్ని పెంచేందుకు రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)తో ఒప్పందం జరిగినట్లు ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అకడమిక్, సైంటిఫిక్ సంబంధాన్ని సులభతరం చేయడం, ఉమ్మడి పరిశోధనా కార్యకలాపాలను అందించడం, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టోరల్ ప్రోగ్రాంలో పరస్పర సహాయాన్ని అందించడానికి అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగినట్లు వివరించారు. రెండు సంస్థల మధ్య అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి, సాంకేతిక సహకారాలు, అకడమిక్ ఇంటరాక్షన్‌లు, మద్దతును ప్రోత్సహించడం ఈ ఎంఓయూ లక్ష్యమని తెలిపారు. పరిశోధకుల ఉమ్మడి పర్యవేక్షణ, సెమినార్లు, వర్క్ షాపులు, సమావేశాల ఉమ్మడి సంస్థ, ఉమ్మడి ప్రచురణలు, పేటెంట్, సౌకర్యాలు, వనరులను పంచుకోవచ్చునని చెప్పారు. ఇది రెండు సంస్థల అధ్యాపకులు, విద్యార్థులలో ఆవిష్కరణ శ్రేష్ఠత యొక్క సంస్కృతిని ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ విజయకుమార్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.



పవర్‌ఫుల్ నిర్మల

ఫోర్బ్స్ జాబితాలో 32వ స్థానం

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన మహిళల జాబితాలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ స్థానం సంపాదించారు. తమ తమ రంగాలను ప్రభావవంతం చేయగల సత్తా, మీడియా, డబ్బు, సమాజంపై ప్రభావం చూపగల భిన్న రంగాల అతివలతో ఈ జాబితాను ఫోర్బ్స్ మేగజైన్ తయారుచేసింది. 2023 ఏడాదికి విడుదలచేసిన ఈ జాబితాలో నిర్మలా సీతారామన్ 32వ స్థానంలో నిలిచారు. నిర్మలతోపాటు మరో ముగ్గురు భారతీయ మహిళలు ఈ జాబితాలో స్థానం సంపాదించారు. హెచ్‌సీఎల్ కార్పొరేషన్ సీఈఓ రోషినీ నాడార్ మల్హోత్రా, స్టీల్ అథారిటీ చైర్‌పర్సన్ సోమా మొండల్, బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా ఈ జాబితాలో ఉన్నారు. రోషినీ 60వ ర్యాంక్, మొండల్ 70వ ర్యాంక్, కిరణ్ 76వ ర్యాంక్ సాధించారు. ఐరోపా కమిషన్ మహిళా చీఫ్ ఉర్సులా వోన్ డీర్ లేయెన్ ఈ జాబితాలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు.రెండో ర్యాంక్‌లో యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ చీఫ్ క్రిస్టినా లగార్డే, మూడో స్థానంలో అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ నిలిచారు.

అమెరికాలో మళ్లీ కాల్పుల మోత

ఆస్టిన్(అమెరికా): అమెరికాలో మళ్లీ తుపాకుల మోత మోగింది. గతంలో జైలుకు వెళ్లొచ్చిన 34 ఏళ్ల షేన్ జేమ్స్ అనే వ్యక్తి టెక్సాస్ రాష్ట్రంలోని ఆస్టిన్ నగరంలో నాలుగు వేర్వేరు చోట్ల జరిపిన కాల్పుల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు పోలీసులు అధికారులుసహా ముగ్గురు గాయపడ్డారు. నిందితుడిని కారులో వెంబడించి మరీ పోలీసులు అరెస్ట్‌చేశారు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం పదిన్నర నుంచి రాత్రి ఏడింటి దాకా ఈ కాల్పుల ఘటనలు జరిగాయి. శాన్ ఆంటోనియో ప్రాంతంలో కాల్పులు జరిపాక 129 కిలోమీటర్ల దూరం ప్రయాణించి మరో చోటా ఇతను కాల్పులకు తెగబడ్డాడు. ఎందుకు కాల్పులు జరిపాడు? మృతులతో ఈయనకు ఉన్న సంబంధం ఏంటి? అనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అమెరికాలో ఈ ఏడాది ఇది 42వ కాల్పుల ఘటన.



కన్నీటి కిమ్

సోషల్ మీడియాలో వీడియో వైరల్

ప్యాంగ్యాంగ్: కఠిన ఆంక్షలతో దేశ ప్రజలకు కన్నీరుపెట్టించే ఉత్తరకొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ తాజాగా ఒక కార్యక్రమంలో కంటతడిపెట్టుకున్నారు. సంబంధిత వీడియో ఒకటి ప్రపంచవ్యాప్తంగా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతోంది. అగ్రరాజ్యం అమెరికా సహా పలు దేశాలు ఉత్తరకొరియాపై ఆంక్షల కొరడా ఝుళిపించడంతో ఉత్తరకొరియా పరిస్థితి ఏమాత్రం బాగోలేదని పలు అంతర్జాతీయ కథనాలు కోడై కూస్తున్నాయి. దీంతో రోజు గడవడమే కష్టంగా ఉన్న దయనీయ పరిస్థితుల్లో అక్కడి ప్రజలు పిల్లలను కనడం తగ్గించేశారు. గత ఏడాది ఉ.కొరియాలో జననాల రేటు రికార్డు స్థాయిలో 1.8 శాతానికి పడిపోయింది. జనాభా ఊహించనంతగా తగ్గిపోతుండటంతో దేశాధినేత కిమ్‌కు బెంగపట్టుకుంది. దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అనే నానుడి విన్నాడో ఏమో.. దేశ జనాభా రేటును పెంచాలని కంకణం కట్టుకున్నాడు. అనుకున్నదే తడవుగా తల్లులతో ఇటీవల ఒక సమావేశం ఏర్పాటుచేశాడు. 'జననాల రేటులో తగ్గుదలను అడ్డుకుందాం. జనాభాను పెంచే బాధ్యత మీదే. రాజకీయ పార్టీలో, దేశ వ్యవహారాల్లో ఒడిదుడుకులు ఎదురైన ప్రతీ సందర్భంలో తల్లులనే గుర్తుచేసుకుంటా. కుటుంబ బాధ్యతలు చూసుకుంటూ అందరి బాగోగులు చూసుకునే తల్లులకు నా ధన్యవాదాలు' అని తల్లులతో మాట్లాడుతూ కిమ్ ఒకింత భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నాడు. ప్రస్తుతం ఉత్తరకొరియా జనాభా 2.5 కోట్లు మాత్రమే.

పెంట్ హౌస్ రూ. 1,133 కోట్లు!

దాని విస్తీర్ణం 22 వేల చదరపు అడుగులు • దుబాయ్‌లో దుమ్ము రేపే రికార్డు



వామ్మో అనుకుంటున్నారా? కానీ ఇది నిజంగా నిజం. దుబాయ్‌లో అత్యంత ఖరీదైన పామ్ జుమేరియా ప్రాంతంలో కడుతున్న కోమో రెసిడెన్సెస్ అనే 71 అంతస్తుల ఆకాశహర్మ్యంపై ఈ పెంట్ హౌస్ రానుంది. ఓ అజ్ఞాత కుబేరుడు దీన్ని ఏకంగా రూ.1,133 కోట్లకు కొనుక్కున్నాడు! ఈ ఐదు పడకగదుల పెంట్ హౌస్ విస్తీర్ణం 22 వేల చదరపు అడుగులు. ప్రపంచ రియల్టీ మార్కెట్లో అత్యంత ఎక్కువ ధర పలికిన మూడో పెంట్ హౌస్‌గా ఇది కొత్త రికార్డు సృష్టించింది. దుబాయ్ వరకూ అయితే దీనిదే రికార్డు. 2027లో కోమో టవర్ నిర్మాణం పూర్తయ్యాక ఇది కొనుగోలుదారుకు అందుబాటులోకి రానుంది! అతని వివరాలను రహస్యంగా ఉంచినట్లు నిర్మాణ భాగస్వామి ప్రావిడెంట్ ఎస్టేట్ పేర్కొంది. అయితే ''ఆ కుబేరుడు తూర్పు యూరప్ ప్రాంతానికి చెందిన వ్యక్తి'' అని ప్రావిడెంట్ ఎస్టేట్‌కు అసోసియేట్ పార్ట్‌నర్ అయిన శామ్ హౌరానీ వెల్లడించారు. రియల్టీ స్వర్గధామమైన దుబాయ్‌లో అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్లు, విల్లాలు, పెంట్ హౌస్‌ల ధరలు చుక్కలనంటడం ఇది తొలిసారేమీ కాదు. కొద్ది నెలల క్రితం మర్సా అల్ అరబ్ హోటల్ పెంట్ హౌస్ ఏకంగా రూ.956 కోట్లకు అమ్ముడైంది.

ప్రత్యేకతలెన్నో...

ఎన్నెన్నో ప్రత్యేకతలు కోమో రెసిడెన్స్ పెంట్ హౌస్ సొంతం

- ఇందులో 360 డిగ్రీల స్కై పూల్ ఉంటుంది.
- ఇది వ్యూహాత్మకంగా కూడా చాలా కీలకమైన చోట రానుంది.
- దీనిపై నుంచి ఇటు చూస్తే ప్రపంచంలోకెల్లా ఎత్తైన భవనం బుర్జ్ ఖలీఫా, అటు చూస్తే దానికి సాటి వచ్చే బుర్జ్ అల్ అరబ్, దుబాయ్ మరీనా వంటి ఆకాశాన్నంటే నిర్మాణాలెన్నో కనువిందు చేస్తాయి.

కోమో రెసిడెన్సెస్ టవర్ ఎత్తు 300 మీటర్ల (984 అడుగుల) పై చిలుకే.

- ఇంతా చేసి, ఈ అపార్ట్‌మెంట్‌లో ఒక్కో ఫ్లోర్‌లో కేవలం ఒకట్రెండు ఫ్లాట్లు మాత్రమే ఉంటాయి.
- రెండు నుంచి ఏడు పడకగదులతో కూడుకుని ఉండే ఈ ఫ్లాట్లకు ప్రైవేట్ లిఫ్టులు, ప్రైవేట్ శాండీ బీచ్‌లు, 25 మీటర్ల లాప్ పూల్స్, రూఫ్ టాప్ ఇన్ఫినిటీ పూల్ వంటి చాలా ప్రత్యేకతలుంటాయి.
- ఈ ఫ్లాట్ల ధర రూ.47.5 కోట్ల నుంచి మొదలవుతుంది.

ప్రపంచ రికార్డు రూ.3,670 కోట్లు

మొనాకోలోని ఓడియన్ టవర్ పెంట్ హౌస్ రూ.3,670 కోట్లతో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పెంట్ హౌస్‌గా రికార్డు సృష్టించింది. లండన్‌లోని వన్ హైడ్ పార్క్ పెంట్ హౌస్ రూ.1,975 కోట్లతో రెండో స్థానంలో ఉంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

కశ్మీర్ అసెంబ్లీలో పీఓకేకు 24 సీట్లు!

పాక్ ఆక్రమిత్ కశ్మీర్ మనదే

- అందుకే 'రిజర్వ్' నిర్ణయం: అమిత్ షా
- కశ్మీరీ నిర్వాసితులకు 2 సీట్లు
- పీఓకే నిర్వాసితులకు ఒక స్థానం
- రెండు బిల్లులకు లోక్‌సభ ఆమోదం



న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్ అసెంబ్లీలో పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతానికి 24 సీట్లు రిజర్వు చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది! పీఓకే కూడా మన భూభాగమే కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ మేరకు జమ్మూ కశ్మీర్ పునర్‌వ్యవస్థీకరణ (సవరణ), రిజర్వేషన్ (సవరణ) బిల్లులను బుధవారం ఆయన లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆరు గంటలపై చిలుకు చర్చ అనంతరం సభ వాటిని ఆమోదించింది. అసెంబ్లీలో సీట్లను పెంచడంతో పాటు పలు కీలక అంశాలు ఈ బిల్లుల్లో ఉన్నాయి. గతంలో జమ్మూ కశ్మీర్ అసెంబ్లీలో 83 స్థానాలుండగా వాటిని 90కి పెంచాలని ప్రతిపాదించారు. కశ్మీర్ డివిజన్లో స్థానాలను 46 నుంచి 47కు, జమ్మూ డివిజన్లో 37 నుంచి 43కు పెంచారు. ''పాక్ ఆక్రమిత కశ్మీర్ కూడా భారత్‌లో అంతర్భాగమే. కనుక అక్కడ కూడా 24 స్థానాలను అసెంబ్లీలో రిజర్వు చేశాం'' అని అమిత్ షా సభకు వెల్లడించారు.

అన్యాయాన్ని సరిదిద్దేందుకే బిల్లులు

70 ఏళ్లుగా తమ హక్కులన్నింటినీ కోల్పోయి అన్ని విధాలా అన్యాయానికి గురైన కశ్మీరీలకు పూర్తిగా న్యాయం చేయడమే ఈ బిల్లుల ఉద్దేశమని అమిత్ షా చెప్పారు. కశ్మీర్లో ఉగ్రవాదానికి ఇప్పటిదాకా 45 వేల మంది బలయ్యారని ఆవేదన వెలిబుచ్చారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యమివ్వకుండా మొదట్లోనే ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపి ఉంటే పండిట్లు లోయను వీడాల్సిన అవసరమే వచ్చేది కాదన్నారు. ''కశ్మీర్లో 1947లో 31,789 కుటుంబాలు 1965–71 మధ్య 10,065 కుటుంబాల వారు నిర్వాసితులయ్యారు. ఇక 1980ల్లో ఉగ్రవాదం వల్ల మరెన్నో వేల మంది స్వదేశంలోనే శరణార్థులయ్యారు. వారందరికీ తిరిగి గుర్తింపుతో పాటు హక్కులు, అన్నిరకాల ప్రాతినిధ్యం కల్పించడమే తాజా బిల్లుల లక్ష్యం'' అని వివరించారు. 2024లోనూ కేంద్రంలో మోదీ ప్రభుత్వమే తిరిగి అధికారంలోకి వస్తుందన్న నమ్మకం మాకుంది. అనంతరం రెండేళ్లలో జమ్మూ కశ్మీర్‌ను పూర్తిగా ఉగ్రవాద విముక్తం చేసి తీరతాం'' అని చెప్పారు. ''కశ్మీరీల్లో ఎంతోమంది శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. బిల్లుతో వారికి హక్కులు సమకూరుతాయి. విద్య, ఉద్యోగావకాశాలు వస్తాయి. ఎన్నికల్లో నిలబడి గెలిచే ఆస్కారముంటుంది'' అని తెలిపారు.

బిల్లుల విశేషాలు..

- జమ్మూ కశ్మీర్లో అసెంబ్లీ స్థానాల సంఖ్య 90కి పెరుగుతుంది.
- ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు అసెంబ్లీలో తొలిసారిగా 9 స్థానాలు రిజర్వు చేశారు.
- కశ్మీర్ నుంచి వలస వెళ్లిన వారి కుటుంబాలకు 2 స్థానాలు కేటాయించారు. వీటిలో ఒక మహిళకు అవకాశమిస్తారు.
- పీఓకే నుంచి నిర్వాసితులై వచ్చి స్థిరపడిన వారికి ఒక స్థానం కేటాయించారు.
- రాష్ట్ర ప్రభుత్వోద్యోగాలు, వృత్తి విద్యా సంస్థల్లో పలు కేటగిరీల వారికి జమ్మూ కశ్మీర్ రిజర్వేషన్ బిల్లు ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తారు.
- ఆర్థికంగా వెనకబడ్డ వర్గాలకు కూడా రిజర్వేషన్లు అందుతాయి.
- ప్రస్తుత రిజర్వేషన్ చట్టంలోని 'బలహీన, గుర్తింపునకు నోచని వర్గాలు (సామాజిక కులాలు)' అనే పదబంధాన్ని 'ఇతర వెనకబడ్డ'గా మారుస్తారు.
- జమ్మూ కశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రాష్ట్రాన్ని లద్దాఖ్, కశ్మీర్ అని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజిస్తారు.

నెహ్రూ వల్లే కశ్మీర్లో కుంపట్లు

- అమిత్ షా వ్యాఖ్యలు
- లోక్‌సభలో దుమారం
- కాంగ్రెస్, విపక్షాల వాకౌట్

జమ్మూ కశ్మీర్ ఏడు దశాబ్దాలుగా అనుభవిస్తున్న కష్టనష్టాలన్నింటికీ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చేసిన భారీ తప్పిదాలే ఏకైక కారణమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా లోక్‌సభలో ఆరోపించారు. అవే అక్కడ ఉగ్రవాదానికి, వేర్పాటువాద కుంపట్లకు, పాక్ ఆక్రమిత కశ్మీర్ పుట్టుకకు కారణమయ్యాయని దుయ్యబట్టారు. ''మన సైన్యం పాక్ దళాలను తరిమికొడుతున్న వేళ కశ్మీర్‌ను పూర్తిగా తిరిగి స్వాధీనం చేసుకోక ముందే నెహ్రూ ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించారు. అంతటితో ఆగకుండా కశ్మీర్ అంశాన్ని హడావుడిగా, అనవసరంగా ఐక్యరాజ్యసమితి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చేసిన ఈ రెండు ఘోర తప్పిదాలే కశ్మీర్‌లో ఆరని కుంపట్లకు కారణమయ్యాయి. నెహ్రూది నిజంగా చారిత్రక తప్పిదం!'' అని మండిపడ్డారు. దీనిపై కాంగ్రెస్, విపక్షాలు తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చాయి. బీజేపీ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించాయి. షా వ్యాఖ్యలను నిరసిస్తూ వాకౌట్ చేశాయి. అనంతరం అమిత్ షా మాట్లాడుతూ, నెహ్రూయే గనక అప్పట్లో సరైన చర్యలు తీసుకుని ఉంటే కశ్మీర్లో చాలా భాగాన్ని పాక్‌కు కోల్పోయే వాళ్లమే కాదని పునరుద్ఘాటించారు. అంతేగాక పాక్ ఆక్రమిత కశ్మీర్ ఎప్పుడో తిరిగి భారత్‌లో అంతర్భాగంగా మారేదని అభిప్రాయపడ్డారు. ''అప్పటికి మన సైన్యం పంజాబ్ దాటి కశ్మీర్‌కేసి దూసుకుపోతోంది. నెహ్రూ కాల్పుల విరమణను కనీసం మూడు రోజులు ఆలస్యం చేసినా పీఓకే ఇప్పుడు భారత్‌లో అంతర్భాగంగా ఉండేది'' అని ఆక్షేపించారు. అంతా అయిపోయాక, కాల్పుల విరమణ పొరపాటు నిర్ణయమని నెహ్రూ తీరిగ్గా అంగీకరించారని విమర్శించారు. ఆయన చేసిన సరిదిద్దుకోలేని తప్పిదం వల్ల భారీ భూభాగాన్ని దేశం కోల్పోవాల్సి వచ్చిందన్నారు. 1962లో చైనాతో భారత యుద్ధానికి దారి తీసిన నెహ్రూ 'భారీ తప్పిదం' గురించి కూడా మాట్లాడాలని బిజూ జనతాదళ్ సభ్యుడు భర్తృహరి మహతబ్ కోరగా అమిత్ షా తనదైన శైలిలో స్పందించారు. ''నెహ్రూ తప్పిదాల్లో రెండింటిని ప్రస్తావిస్తేనే విపక్షాలు అలిగి వాకౌట్ చేశాయి. ఇక భారీ తప్పిదం గురించి మాట్లాడితే ఏకంగా రాజీనామా చేసేవేమో!'' అంటూ ఎద్దేవా చేశారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఎవరినీ అవమానించడానికి కాదని, జరిగిన వాస్తవాలను దేశం ముందుంచే ప్రయత్నం మాత్రమేనని స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ఇక 370 ఆర్టికల్‌ను రద్దు చేసే దమ్ము గత కాంగ్రెస్ సర్కారుకు లేకపోయిందని అమిత్ షా ఎద్దేవా చేశారు.

రాహుల్‌కు పరిణతి లేదు

- గాంధీల అహంకారమే తప్ప చతురత అబ్బలేదు
- కాంగ్రెస్‌ను ఆయన కాపాడటం అనుమానమే
- డైరీలో రాసుకున్న ప్రణబ్ ముఖర్జీ
- తాజా పుస్తకంలో వెల్లడించిన కూతురు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీలో చరిష్మా గానీ, రాజకీయ పరిణతి, అవగాహన గానీ లేవని దివంగత రాష్ట్రపతి, ఆ పార్టీ దిగ్గజ నేత ప్రణబ్ ముఖర్జీ అభిప్రాయపడ్డారట. అది కాంగ్రెస్‌కు చాలా సమస్యగా పరిణమించిందని ఆవేదన పడ్డారట. అంతేకాదు, గాంధీ–నెహ్రూ కుటుంబ అహంకారమైతే రాహుల్ కు వచ్చింది గానీ వారి రాజకీయ చతురత మాత్రం అబ్బలేదు' అని కొన్నేళ్ల కిందట తన డైరీలో రాసుకున్నారట. 'కాంగ్రెస్ పార్టీకి పునర్‌వైభవాన్ని రాహుల్ తీసుకురాగలడా? ప్రజల్లో స్ఫూర్తి నింపగలరా? ఏమో! నాకైతే తెలియదు' అంటూ అనుమానాలు వెలిబుచ్చారట. 'ప్రణబ్: మై ఫాదర్' పేరిట రాసిన తాజా పుస్తకంలో ఆయన కూతురు శర్మిష్ఠ ముఖర్జీ ఈ మేరకు పలు వివరాలు వెల్లడించారు. సోమవారం విడుదల కానున్న ఈ పుస్తకంలో ఇలాంటి చాలా విషయాలను ఆమె పంచుకున్నారు. ముఖ్యంగా రాహుల్ కేంద్ర ప్రభుత్వ ఆర్డినెన్సు చించివేశారని తెలిసి ప్రణబ్ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారని చెప్పారు. 'అలా చేయడానికి ఆయన ఎవరసలు? కనీసం కేబినెట్ సభ్యుడు కాదు. పైగా అప్పుడు ప్రధాని (మన్మోహన్ సింగ్) విదేశాల్లో ఉన్నారు. తన చర్య పార్టీపై, ప్రభుత్వం పై ఎలాంటి ప్రభావం చూపుతుంది ఆలోచించరా? సొంత ప్రభుత్వ ఉత్తర్వులను అలా మీడియా ముందు ముక్కలు చేయడం 2014లో యూపీఏ కూటమి ఓటమికి కూడా ఒక కారణమైంది' అని ప్రణబ్ మండిపడ్డారట. 'రాహుల్ హుందాగానే ప్రవర్తిస్తారు. కానీ దేన్నీ సీరియస్‌గా తీసుకోరు. బహుశా ఆయనకు అన్నీ చాలా సులువుగా లభించడమే కారణం కావచ్చు. రాహుల్ మాత్రం అత్యంత కీలక సమయాలు, సందర్భాల్లో కూడా చీటికీమాటికీ దేశం విడిచి ఎటో మాయమవుతారు. ఇది కాంగ్రెస్ నేతలకు, కార్యకర్తలకు తప్పుడు సందేశమే ఇచ్చింది' అని ప్రణబ్ అభిప్రాయపడ్డట్టు శర్మిష్ఠ తెలిపారు.

ఎంపీ పదవికి 10 మంది రాజీనామా

- త్వరలో రాజీనామా చేయనున్న మరో ఇద్దరు
- కేంద్ర మంత్రి పదవుల నుంచి తప్పుకోనున్న ముగ్గురు నేతలు
- రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో వీరికి కీలక పదవులు

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రులు నరేంద్రసింగ్ తోమర్, ప్రహ్లాద్ సింగ్ పటేల్‌తోపాటు పలువురు బీజేపీ ఎంపీలు తమ పార్లమెంట్ సభ్యత్వానికి బుధవారం రాజీనామా సమర్పించారు. ఇటీవల జరిగిన రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో వీరు ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు ఎంపీ పదవులకు రాజీనామా చేశారు. ఇకపై ఎమ్మెల్యేలుగానే కొనసాగాలని నిర్ణయించుకున్నారు. మొత్తం 12 మంది బీజేపీ ఎంపీలు పార్లమెంట్ సభ్యత్వం వదులుకుంటున్నారు. వీరికి సొంత రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి లేదా మంత్రి పదవులు దక్కుతాయని ప్రచారం సాగుతోంది. బుధవారం 10 మంది బీజేపీ ఎంపీలు రాజీనామా చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన రాకేశ్ సింగ్, ఉదయప్రతాప్ సింగ్, రితీ పాఠక్, రాజస్తాన్‌కు చెందిన కిరోడీలాల్ మీనా, దియా కుమారి, రాజవర్ధన్ సింగ్ రాథోడ్, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గోమతిసాయి, అరుణ్ సావో రాజీనామా సమర్పించారు. వీరిలో కిరోడీలాల్ మీనా ఒక్కరే రాజ్యసభ సభ్యుడు. మిగిలినవారంతా లోక్‌సభ సభ్యులు. మరో కేంద్ర మంత్రి రేణుకా సింగ్‌తోపాటు ఎంపీ మహంత్ బాలక్‌నాథ్ యోగి అతి త్వరలో రాజీనామా చేస్తారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. నరేంద్రసింగ్ తోమర్, ప్రహ్లాద్ సింగ్ పటేల్, రేణుకా సింగ్ కేంద్ర మంత్రి పదవుల నుంచి తప్పుకోనున్నారు. రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో నూతన ముఖ్యమంత్రులను బీజేపీ అధిష్టానం ఇంకా నియమించలేదు. ఎంపీ పదవులకు రాజీనామా చేసిన వచ్చిన వారిలో కొందరికి ముఖ్యమంత్రులుగా అవకాశం కల్పించబోతున్నానని తెలుస్తోంది. మరోవైపు కేంద్రంలో మూడు మంత్రి పదవులు ఖాళీ అవుతున్నాయి. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల కంటే ముందే ఈ మూడు పదవులను భర్తీ చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యోచిస్తున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి లబ్ధి చేకూరేలా ఈ భర్తీ ఉంటుందని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు.

వందకు పైగా వెబ్‌సైట్లపై నిషేధం

వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న వెబ్‌సైట్లపై కేంద్రం కొరడా

న్యూఢిల్లీ: పార్ట్ టైమ్ జాబ్ మోసాలు, మోసపూరిత పెట్టుబడులకు పాల్పడుతున్న 100కు పైగా వెబ్‌సైట్లను నిషేధిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. ఈ తరహా ఆన్‌లైన్ మోసాలపై ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ లోతుగా పరిశీలన జరిపిన తర్వాత చేసిన సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. నిషేధానికి గురైన వెబ్‌సైట్లు అన్నీ విదేశాల నుంచే పని చేస్తున్నట్లు వెల్లడించింది. 'చాట్ మెసెంజర్లు, రెంటెడ్ అకౌంట్ల ద్వారా ఇవి కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇలా మోసపూరితంగా కొల్లగొట్టిన మొత్తాల ద్వారా కొన్ని అంతర్జాతీయ కంపెనీలు, విదేశీ ఏటీఎం కార్డులు, క్రిప్టో కరెన్సీ వంటివాటికి సాయంతో మనీ లాండరింగ్‌కు పాల్పడుతున్నారు' అని తెలిపింది.

తస్మాత్ జాగ్రత్త

పార్ట్ టైం జాబ్ మోసాలు తదితరాలపై ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పలు హెచ్చరికలు చేసింది. 'నిరుద్యోగులు, రిటైర్డ్ వ్యక్తులు, మహిళలను వీరు ఎక్కువగా లక్ష్యం చేసుకుంటారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ లేదా మరేదైనా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరువ అవుతారు. 'ఇంట్లో కూర్చొనే ఉద్యోగాలు చేయండి', 'ఇంట్లో కూర్చొనే సంపాదించండి' వంటి ఆకట్టుకునే పదాలతో డిజిటల్ ప్రకటనలు ఇచ్చి ప్రజలపై వల విసురుతారు. ఇన్ని లైకులు కొడితే చాలు అనో ఇంకా ఏవేవో చెప్పి నమ్మబలుకుతారు. నమ్మకం కలిగించేందుకు తొలుత కమిషన్ ఇస్తారు. తర్వాత భారీ లాభాలను ఆశ చూపి పెద్ద మొత్తాలను పెట్టుబడిగా పెట్టేలా నమ్మిస్తారు. వారి వలలో పడి పెట్టుబడి పెట్టగానే మోసగిస్తారు' అని హెచ్చరించింది. అనుమానాస్పద లింకులు, ఫోన్‌కాల్స్ వంటివి వస్తే వెంటనే ఆయా ఫోన్‌నంబర్లు, సోషల్ మీడియా లింకుల వివరాలను నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్(ఎన్‌సీఆర్‌పీ) హెల్ప్‌లైన్‌కు అందించి, ఫిర్యాదు చేయాలని సూచించింది. సైబర్ సేఫ్ భారత్ ఏర్పాటే లక్ష్యమని కేంద్రం పేర్కొంది.



ఉత్తరగాజాలోని రఫా పట్టణంలో సహాయక శిబిరం వద్ద ఆహారం తీసుకుంటున్న చిన్నారులు

దేశాన్ని విడదీసే కుట్రలు సాగనివ్వం

లోక్‌సభలో కేంద్రమంత్రి అర్జున్‌రామ్

న్యూఢిల్లీ: గోమూత్ర రాష్ట్రాలు అంటూ తమిళనాడుకు చెందిన డీఎంకే ఎంపీ డీఎన్‌వీ సెంథిల్ కుమార్ చేసిన వ్యాఖ్యలు బుధవారం లోక్‌సభలో తీవ్ర అలజడి సృష్టించాయి. అధికార బీజేపీ సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. మధ్యాహ్నం 12 గంటలకు సభకు పునఃప్రారంభమైన తర్వాత కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఈ అంశాన్ని లేవనెత్తారు. సెంథిల్ కుమార్ అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, డీఎంకే సీనియర్ నేత టీఆర్ బాలు ఆమోదిస్తున్నారా? అని నిలదీశారు. దేశాన్ని ఉత్తర, దక్షిణ భారతదేశంగా విడదీసే కుట్రలను సాగనివ్వబోమని తేల్చిచెప్పారు. సెంథిల్ కుమార్ వెంటనే క్షమాపణ చెప్పాలని మేఘ్వాల్ డిమాండ్ చేశారు. మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని గెలిపించారని, దేశం పట్ల వారి తీర్పును వెలువరించారని అన్నారు. టీఆర్ బాలు స్పందిస్తూ.. సెంథిల్ కుమార్ అలా మాట్లాడడం సరైంది కాదని చెప్పారు. సెంథిల్‌ను తమ ముఖ్యమంత్రి స్టాలిన్ హెచ్చరించారని తెలిపారు. సెంథిల్ కుమార్ వ్యాఖ్యలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రికార్డుల నుంచి తొలగించారు.

సభలో సెంథిల్ కుమార్ క్షమాపణ

తను వ్యాఖ్యల పట్ల డీఎంకే ఎంపీ డీఎన్‌వీ సెంథిల్ కుమార్ విచారం వ్యక్తం చేశారు. బుధవారం లోక్‌సభలో క్షమాపణ కోరారు. ప్రజల మనోభావాలను గాయపర్చడం తన ఉద్దేశం కాదని, తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానని చెప్పారు. అనుకోకుండానే ఈ మాట ఉపయోగించానని, తనకు ఎలాంటి దురుద్దేశం లేదని సెంథిల్ కుమార్ వివరణ ఇచ్చారు. ఆయన మంగళవారం క్షమాపణ కోరుతూ 'ఎక్స్'లో పోస్టు చేసిన సంగతి తెలిసిందే.

భారతీయ సంస్కృతిని కించపర్చే కుట్ర

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు రాష్ట్రాల్లో పరాజయం పాలైన కాంగ్రెస్ పార్టీ భారతీయ సంస్కృతిని, గుర్తింపునకు కించపర్చేందుకు కుట్ర పన్నిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ బుధవారం మండిపడ్డారు. ఎన్నికల్లో ఓటమికి కారణాలు అన్వేషించకుండా దేశాన్ని అప్రతిష్టపాలు చేయడానికి కుయుక్తులు సాగిస్తోందని ధ్వజమెత్తారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో అమేథీలో రాహుల్ గాంధీ ఓడిపోయిన తర్వాతే ఉత్తర–దక్షిణ భారతదేశం అనే విభజనను తెరపైకి తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు.

గాజాలో భయం భయం

- భూతల దాడులు ఉధృతం చేసిన ఇజ్రాయెల్ సైన్యం
- ఆహారం, నీరు, ఔషధాలు అందక జనం విలవిల

ఖాన్ యూనిస్: గాజాస్ట్రిప్‌లో పరిస్థితులు మరింత క్షీణిస్తున్నాయి. ఇజ్రాయెల్ సైన్యం భూతల దాడులు ఉధృతం చేసింది. మిలిటెంట్ల ఆచూకీ కోసం ఇజ్రాయెల్ సైనికులు ప్రతి ఇంటినీ సోదా చేస్తున్నారు. మరోవైపు దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్, ఉత్తర గాజాలోని జబాలియా, షుజాయియా నగరాలను ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు చుట్టుముడుతున్నాయి. ఈ మూడు నగరాల్లో వేలాది మంది పాలస్తీనా పౌరులు చిక్కుకుపోయారు. దక్షిణ గాజాలో 6 లక్షల మందికి పైగా ఉన్నారని, వారంతా ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించిందని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. గాజాలోని శరణార్థి శిబిరాలన్నీ ఇప్పటికే బాధితులతో నిండిపోయాయని, ఇక ఎక్కడికి వెళ్లాలో తెలియక ఎవరికీ దిక్కుతోచడం లేదని పేర్కొంది. ప్రజలకు ఆహారం, నీరు, ఔషధాలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. ఖాన్ యూనిస్ సిటీపై ఇజ్రాయెల్ సైన్యం బుధవారం బాంబుల వర్షం కురిపించింది. హమాస్ ముఖ్యనేతలంతా ఖాన్ యూనిస్‌లో మాటు వేశారని, వారిని బంధించక తప్పదని ఇజ్రాయెల్ సైన్యం చెబుతోంది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం : 7 : డిసెంబర్ : 2023



బుధవారం బెంగళూరు బసవనగుడి దొడ్డ బసవణ్ణ గుడి వద్ద వేరు శెనక్కాయలు కొంటున్న విద్యార్థులు. వచ్చే సోమవారం నుంచి శెనక్కాయల జాతర జరగనుంది

న్యూస్‌రీల్

ఆవులపై పెద్దపులి పంజా



మైసూరు: పులి దాడిలో రెండు మూగజీవాలు బలి అయ్యాయి. ఈ ఘటన జిల్లాలో హుణసూరు తాలూకా హనగోడిగే సమీపంలోని నేగత్తూరిలో జరిగింది. గ్రామానికి చెందిన ఎన్‌సీ ఆకాశ్ కాలేజీ నుంచి వచ్చి పొలంలో కట్టిన పశువులకు నీరు తాగించేందుకు ఊరి బయటకు తీసుకెళ్లాడు. ఈ సమయంలో పొదల్లో నుంచి వచ్చిన పులి ఒక పశువుపై దాడి చేసి చంపేసింది. ఆకాశ్ ధైర్యంగా కట్టెతో పులిని కొట్టాడు. అయినా వదలకుండా పులి ఆ రెండో మూగజీవిని అడవిలోకి లాక్కెళ్లి చంపేసింది. ఇరుగుపొరుగు పొలాల్లోని రైతులు అక్కడికి వచ్చి చూడగా ఆకాశ్ ఆవుల వద్ద ఏడుస్తూ ఉన్నాడు. పులి దాడికి నిరసనగా వందలాది మంది గ్రామస్తులు అటవీ అధికారులు సంఘటన స్థలానికి రావాలని పట్టుబట్టారు. జిల్లాలో ఇటీవల పెద్దపులి దాడులు పెరిగిపోవడంతో గ్రామీణ ప్రజల్లో కలవరం నెలకొంది.

తల్లిని చేసి పెళ్లికి నో

- కామాంధునికి పదేళ్ల జైలు

మైసూరు: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెను తల్లిని చేశాడు, మూడుముళ్లు అనగానే ముఖం చాటేసిన దుండగునికి మైసూరులోని ఏడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు పదేళ్ల జైలు శిక్షను విధించింది. జిల్లాలోని హుణసూరు తాలూకా రత్నాపురి గ్రామంలో నివాసం ఉండే యువతిని.. అదే గ్రామానికి చెందిన సల్మాన్ ఖాన్ (20) అనే యువకుడు ప్రేమ, పెళ్లి పేరుతో లోబర్చుకుని తరచూ అత్యాచారానికి ఒడిగట్టాడు. ఆ తర్వాత బాధితురాలు గర్భవతి అయి మగ శిశువుకు జన్మనిచ్చింది. పెళ్లి చేసుకోమంటే సల్మాన్ ఖాన్ నిరాకరించడంతో బాధితురాలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నిందితునిపై ఆరోపణలు నిరూపితం కావడంతో పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ. 35 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. అలాగే బాధితురాలికి దోషి నుంచి రూ.30 వేలు, ప్రభుత్వం నుంచి రూ. 5 వేల పరిహారం ఇప్పించాలని ఆదేశించారు.



చిక్కమగళూరులో వీరభద్రేశ్వర ఆలయంలో కెండోత్సవం ఘనంగా జరుగుతోంది. నిప్పుల గుండంలో నడుస్తున్న ఓ భక్తుడు

ముఖాన్ని కవర్‌తో కప్పేసుకుని..

మైసూరు: కాలేజీ విద్యార్థి ఒకరు ప్లాస్టిక్ కవర్‌తో ముఖాన్ని కప్పేసుకుని ఊపిరి ఆడకుండా చేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మైసూరు నగరంలో జరిగింది. మైసూరు మానస గంగోత్రి ప్రాంతీయ విద్యా సంస్థలో మొదటి ఏడాది డిగ్రీ చదువుతున్న విద్యార్థి అక్షజ్ (17)ను మృతునిగా గుర్తించారు. ఇతడు హైదరాబాద్‌కు చెందిన వాసిగా సమాచారం. విద్యా సంస్థ హాస్టల్‌లో కావేరి బ్లాక్‌లో రూమ్ నంబర్ 11లో ఉంటున్నాడు. మానసికంగా కృంగిపోవడమే కారణమని అనుమానిస్తున్నారు. గతంలో కూడా బ్లేడుతో చేతిపై కోసుకున్న గాయాలున్నాయి. జయలక్ష్మిపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FOR SALE

- FOR SALE, 15 UNITS Rental Building,3L rent monthly, A katha,in Bommanahalli, 2.8 Cr negotiable, moving abroad Sale, interested persons Call 7287039697. [I-862945]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నిధుల మాటపై నిరసన



బుధవారం బెళగావి విధానసభలో స్పీకర్‌ను చుట్టుముట్టిన బీజేపీ ఎమ్మెల్యేలు



విధాన పరిషత్‌లో వేతన సవరణ గురించి ప్రతిపక్ష ఎమ్మెల్సీల ధర్నా

- బెళగావి అసెంబ్లీ సమావేశాలు..
- ముస్లింలకు రూ.10 వేల కోట్ల ప్రకటనపై బీజేపీ భగ్గు
- సీఎంకు వ్యతిరేకంగా ఆందోళన

బనశంకరి: హుబ్లీలో నిర్వహించిన ముస్లింల సమావేశంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ముస్లిం సముదాయ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు ఇస్తామని ప్రకటన చేయడం బెళగావి సువర్ణసౌధ శాసనసభ సమావేశాల్లో మూడవ రోజైన బుధవారం అధికార విపక్షాల మధ్య తీవ్ర గొడవకు దారితీసింది. ముఖ్యమంత్రి ప్రకటన వెనక్కి తీసుకోవాలని విపక్ష బీజేపీ డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు. దీంతో బీజేపీ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు.

ఇరువర్గాల వాగ్వాదం

ఉదయం ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన వెంటనే బీజేపీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఈ విషయాన్ని ప్రస్తావించారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి బయట జరిగిన కార్యక్రమంలో నిధుల ప్రకటన చేయడం సరికాదన్నారు. సీఎం సమాధానమివ్వాలన్నారు. ఇందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు అభ్యంతరం వ్యక్తంచేస్తూ బీజేపీకి వ్యతిరేకంగా కేకలేశారు. ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్వివాదం చేసుకోవడంతో సభలో గందరగోళం నెలకొంది. స్పీకర్ యుటీ.ఖాదర్ పదేపదే మనవి చేసినప్పటికీ ఇరుపక్షాల సభ్యులు వెనక్కి తగ్గలేదు.

బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ మాట్లాడుతూ రైతులకు కరువు నిధులు ఇవ్వడానికి డబ్బులేదు, కానీ ముస్లిం అభివృద్ధికి రూ.10 వేలకోట్లు ఇస్తామని సీఎం ప్రకటించారు. అసెంబ్లీ జరుగుతున్న సమయంలో ఇలా చెప్పడం తప్పు. ముఖ్యమంత్రి ఆ ప్రకటను వెనక్కి తీసుకోవాలని కోరారు. లేదంటే ఆయన అసెంబ్లీలో మాట్లాడటానికి అవకాశమిచ్చేది లేదనడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గళమెత్తారు.

సీఎం మాటల్లో తప్పేముంది: మంత్రులు

ఆరోగ్యశాఖామంత్రి దినేశ్ గుండూరావ్ సమాధానం ఇస్తూ, ముఖ్యమంత్రి రూ.10 వేలు కోట్లు ఇస్తామని చెప్పలేదు, దశలవారీగా ఇస్తామని అన్నారు, ఇందులో తప్పేముందని సమర్థించుకున్నారు. కానీ విపక్ష ఎమ్మెల్యేలు మాత్రం ముఖ్యమంత్రి సాయం ప్రకటనను వెనక్కి తీసుకోవాలని పట్టుబట్టారు. కానీ స్పందన లేకపోవడంతో సభ నుంచి వాకౌట్ చేస్తున్నామని చెప్పి బయటికి వచ్చారు. స్పీకర్ యుటీ.ఖాదర్ స్పందిస్తూ ఇది సరికాదని, కరువు, ఉత్తర కర్ణాటక గురించి చర్చించాలని, చిన్న విషయాన్ని పట్టుకుని ఇలా చేస్తే ఎలా అని చెప్పినప్పటికీ బీజేపీ సభ్యులు పట్టించుకోలేదు. మంత్రి హెచ్‌కే.పాటిల్ మాట్లాడుతూ అశోక్ చేసిన వ్యాఖ్యలు సరికాదని, ఆ మాటలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలన్నారు. విపక్ష నేతలు సీఎం వీడియో పూర్తిగా చూస్తే నిజం తెలుస్తుందన్నారు. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా సీఎంని సమర్థిస్తూ బీజేపీపై విమర్శలు గుప్పించారు. తరువాత సభ కొనసాగింది.

పరిషత్‌లో వేతన సవరణ గొడవ

ప్రభుత్వ ఉద్యోగులకు 7వ వేతన సవరణ కమిషన్ గురించి సీఎం సిద్దరామయ్య సమాధానం ఇస్తారని పరిషత్ సభాపతి బసవరాజహొరట్టి హామీ ఇవ్వడంతో ప్రతిపక్షాలు ధర్నాను విరమించారు. బుధవారం విధాన పరిషత్‌లో సభ ప్రారంభం కాకముందే సభాపతి ముందు ప్రతిపక్షాలు ధర్నాకు దిగాయి. ప్రభుత్వ ఉద్యోగులకు 7వ వేతన కమిషన్ నివేదిక ఆలస్యం కావడానికి ప్రభుత్వ అలసత్వ ధోరణి కారణమని, దీనిపై ముఖ్యమంత్రి జవాబు ఇవ్వాలని పట్టుబట్టారు. చీఫ్ విప్ సలీం అహ్మద్ స్పందిస్తూ ముఖ్యమంత్రి తరఫున సభా నేత ఎన్ఎస్.బోసురాజు ఇప్పటికే సమాధానం ఇచ్చారని, సీఎం ప్రకటన అవసరం లేదని అన్నారు. దీంతో కోపోద్రిక్తులైన విపక్షసభ్యులు కోటా శ్రీనివాస పూజారి, వైఏ.నారాయణస్వామితో పలువురు నివేదిక పూర్తయినా సర్కారు స్వీకరించడం లేదని ఆరోపించారు. నివేదికను అమలు చేయడానికి ప్రభుత్వం వద్ద డబ్బు ఉందా, లేక నష్టాల్లో ఉందా అని చెప్పాలని ప్రశ్నించారు.

వాయిదా తరువాత మళ్లీ

ప్రతిపక్షాలు బ్లాక్‌మెయిల్ కు పాల్పడుతున్నాయని, ఉత్తర కర్ణాటక సమస్యల గురించి సుదీర్ఘంగా చర్చించాలి, సమయం వృథా చేయరాదని సలీం అహ్మద్ మనవిచేశారు. సభలో మరింత గందరగోళం నెలకొనడంతో సభాపతి పది నిమిషాల పాటు పరిషత్‌ను వాయిదావేశారు. సభ ప్రారంభం కాగానే మళ్లీ ప్రతిపక్ష ఎమ్మెల్సీలు ధర్నాకు దిగారు. దీంతో సీఎంతో మాట్లాడి దీనిపై సమాధానం ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో శాంతించారు.

అసెంబ్లీ బయట కులాసా..
సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థులు





భోజనాలు ఆరగిస్తున్న బాలికలు



అంబేడ్కర్ వర్ధంతిని రాష్ట్రంలో ఘనంగా ఆచరించారు. బెళగావి అసెంబ్లీ ఎదుట విగ్రహానికి పూలమాలలు వేసిన దృశ్యం

హుబ్లీలో సిటీ బస్ దగ్ధం

హుబ్లీ: హుబ్లీ- ధార్వాడ మధ్య బీఆర్టీఎస్ చిగరి బస్సులో బుధవారం ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. ఏపీఎంసీ బస్టాప్‌లో బీఆర్‌టీఎస్ బస్సు (నంబర్ కేఏ-25/ఎఫ్ 3472) ధార్వాడ నుంచి హుబ్లీకి వస్తుండగా బస్సులో పొగలు కనిపించాయి. బస్సు డ్రైవర్ హుటాహుటిన బస్సును నిలిపి ప్రయాణికులను కిందకు దింపేశారు. కొన్నిక్షణాల్లోనే బస్సు మంటల్లో చిక్కుకుంది. డ్రైవర్ జాగ్రత్త వల్ల 30 మందికి పైగా ప్రయాణికులకు ప్రాణాపాయం తప్పింది. ఈ ప్రత్యేక సిటీ బస్సుల్లో తరచు ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నట్లు ప్రయాణికులు ఆరోపించారు. నాసిరకం బస్సులే కారణం కావచ్చని అన్నారు. గత నెలలో ఆర్‌టీసీ బస్సు ఇంజిన్‌లో మంటలు చెలరేగి బస్సు దగ్ధమైన ఘటన బెళగావి జిల్లా చిక్కోడిలో జరిగింది.

లిడ్కర్ రాయబారిగా నటుడు డాలి

శివాజీనగర: లిడ్కర్ ఉత్పత్తుల రాయబారిగా ప్రముఖ నటుడు డాలి ధనుంజయ్‌ను నియమించాము, ఆయన ఉచితంగానే ఈ పదవిని అంగీకరించారని సీఎం సిద్దరామయ్య తెలిపారు. బుధవారం విధానసౌధ ముందు భాగంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. నటుడు డాలి ధనుంజయ్ ఇక నుంచి లిడ్కర్ చర్మ ఉత్పత్తుల రాయబారి అని సీఎం ప్రకటించారు. ఆయనొక ప్రజాభిమానం కలిగిన నటుడు, సమాజంపై ఆసక్తి కలిగినవారని అన్నారు. లిడ్కర్‌లో 50 వేల మందికి పైగా చర్మకారుల కుటుంబాలు సభ్యత్వం కలిగి ఉన్నాయన్నారు. త్వరలోనే డాలిపై ప్రకటన చిత్రీకరణ జరుగుతుందని తెలిపారు.

ఏపీఎల్ కుటుంబాలకూ ఆరోగ్యసాయం: సీఎం

- త్వరలో కొత్త హెల్త్ కార్డులు జారీ

బనశంకరి: ఆయుష్మాన్ భారత్- ఆరోగ్య కర్ణాటక హెల్త్ కార్డులకు ఆరోగ్యశాఖ కొత్తరూపునిచ్చినట్లు సీఎం సిద్దరామయ్య తెలిపారు. ఆయన నగరంలో మాట్లాడుతూ నూతన హెల్త్ కార్డులను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో 5.9 కోట్ల మంది ప్రజలకు కొత్త హెల్త్‌కార్డులను అందించాలని ఆరోగ్యశాఖ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఏపీఎల్ కుటుంబాలకు సైతం ఈ పథకంలో చేర్చామని, ఆ కుటుంబాలకు రూ.5 లక్షల వైద్యఖర్చుల్లో ప్రభుత్వం రూ.1.5 లక్షల (30 శాతం) వరకూ చెల్లిస్తుందన్నారు. బీపీఎల్ రేషన్‌కార్డులు కలిగిన పేద కుటుంబాలవారికి ఏడాదికి రూ.5 లక్షల వరకు చికిత్స వ్యయం అందిస్తుందన్నారు.

ఉగ్రవాదులను సీఎం కలుస్తారా: యత్నాళ్

బనశంకరి: ముఖ్యమంత్రి సిద్దరామయ్య అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ అయిన ఐసిస్ మద్దతుదారుడు తన్వీర్ పీర్ అనే వ్యక్తితో వేదికపై కూర్చున్నారని బీజేపీ ఎమ్మెల్యే బసవనగౌడ పాటిల్ యత్నాళ్ ఆరోపించారు. బుధవారం ఎక్స్ లో ట్వీట్ చేసిన యత్నాళ్ , సిద్దరామయ్యతో తన్వీర్‌పీర్ దిగిన ఫోటో ను పోస్ట్ చేశారు. తన్వీర్‌పీర్ పాశ్చాత్య దేశాల ఉగ్రవాదులతో సంబంధం ఉందంటూ మరో ఫోటోను కూడా షేర్ చేశారు. సిద్దు, తన్వీర్‌పీర్‌తో గతంలో కూడా అనేక సభలు సమావేశాల్లో వేదికల్లో పాల్గొన్నారని ఆరోపించారు. తన్వీర్ పీర్ నేపథ్యం సీఎంకు తెలుసా? అని ప్రశ్నించారు. ఇతనిపై ఎన్ఐఏతో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

బిడ్డ మృతదేహాన్ని వదిలేశారు

- వలస కూలీ దంపతులపై కేసు

దొడ్డబళ్లాపురం: రెండు రోజుల క్రితం దొడ్డ తాలూకా బాశెట్టిహళ్లిలోని పారిశ్రామికవాడలో మురుగు కాలువ పక్కన లభించిన చిన్నారి మృతదేహం కేసులో తల్లిదండ్రులే బాధ్యులని పోలీసులు గుర్తించారు. వివరాలు.. వారం కిందటే ప్రమేశ్, విభాకుమారి అనే దంపతులు కూలీ పనుల కోసం బిహార్ నుంచి వచ్చారు. వారికి 16 నెలల పాప రుచి ఉంది. శ్వాసకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతుండేది. బాశెట్టిహళ్లిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చూపించినా చికిత్స ఫలించక చిన్నారి మృతిచెందింది. డబ్బు లేక, ఎవరూ తెలియని ఊరిలో శవ సంస్కారం ఎలా చేయాలో తెలియక పాప శవాన్ని డ్రైనేజీ పక్కన పెట్టేసి జారుకున్నారు.

తాయత్తు పట్టించింది

పాపమెడలో ఉన్న తాయత్తు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు అలాంటి తాయత్తును ఉత్తర భారతదేశానికి చెందిన వారే ధరిస్తారని తెలిసి వలస కూలీల కోసం గాలింపు జరిపారు. చివరకు తల్లి తండ్రులను గుర్తించి కేసు నమోదు చేశారు.



చిన్నారి తల్లిదండ్రులు విభాకుమారి, ప్రమేశ్

ముక్క లేకుండా బిర్యానీ ఇస్తారా?

- హోటల్‌పై కస్టమర్ కేసు
- పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశం





చికెన్ బిర్యానీ తెచ్చే గొడవలు అనేకం

దొడ్డబళ్లాపురం: చికెన్ ముక్క లేకుండా బిర్యాని తినడం ఎంత అవమానకరమో మాంసప్రియులకు తెలుసు. అయితే మైసూరు బజ్జీలో మైసూరు ఉంటుందా?, అలాగే చికెన్ బిర్యానీలో చికెన్ ఉంటుందా? అని వాదించిన హోటల్‌కు కస్టమర్ కోర్టు ద్వారా షాక్ ఇచ్చాడు. ముక్క లేకుండా బిర్యాని ఇచ్చిన హోటల్ యాజమాన్యంపై కేసు వేసి కోర్టులో గెలిచి పరిహారం సాధించుకున్నాడు.

రూ.30 వేలు ఇవ్వాలని కేసు..

వివరాలు.. బెంగళూరు ఐటీఐ లేఔట్ నివాసి కృష్ణప్ప.. మే నెలలో భార్యకు బాగాలేక వంట చేయలేదు. దీంతో స్థానిక ప్రశాంత్ హోటల్‌కు వెళ్లి రూ.150 పెట్టి చికెన్ బిర్యాని తీసుకున్నాడు. ఇంటికి తీసికెళ్లి పొట్లం విప్పి చూడగా అందులో చికెన్ ముక్కలు లేవు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన కృష్ణప్ప వినియోగదారుల కోర్టులో కేసు వేశాడు. సాక్ష్యం కోసం బిర్యాని ఫోటోలు, బిల్లు ఇచ్చాడు. తనకు రూ.30వేల నష్టపరిహారం అడిగాడు. కేసు పరిశీలించిన కోర్టు రూ.1000 పరిహారం, బిర్యానీ ధర రూ.150 తిరిగి ఇవ్వాలని హోటల్‌వారికి ఆదేశించింది. ఈ కేసులో కృష్ణప్ప తానే వాదించుకుని గెలిచాడు.

కోడికూర కోసం భార్య హత్య.. 6 ఏళ్ల జైలు

చికెన్‌కూర వండలేదనే కోపంతో భార్యను హత్య చేసిన కిరాతక భర్తకి కోర్టు 6 ఏళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధించిన సంఘటన దావణగెరె జిల్లా హరిహరలో చోటుచేసుకుంది. హరిహర తాలూకా మాగనహళ్లికి చెందిన కెంచప్ప భార్య శీలా కోడికూర వండలేదని గొడవ పెట్టుకున్నాడు. కోపం పట్టలేక కత్తితో పొడిచి హత్య చేసాడు. హరిహర గ్రామీణ పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో కెంచప్ప నేరం రుజువు కావడంతో కోర్టు పై విధంగా తీర్పు వెలువరించింది. కాగా, జైల్లో కెంచప్పకు వారానికి రెండుసార్లు మాంసాహారం లభిస్తుంది.

సిద్దుపై ఆగ్రహావేశాలు తప్పవు: యడ్డి

శివమొగ్గ: మైనార్టీలకు డబ్బులు ఇస్తే అభ్యంతరం లేదు, అయితే దాన్ని గొప్పగా చెబుతూ రూ. 10 వేల కోట్లు ఇస్తున్నట్లు చెప్పడం, వారిని ప్రసన్నం చేసుకునే చర్య సరికాదని మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప అన్నారు. బుధవారం శివమొగ్గలో మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్య చర్య వల్ల హిందువుల ఆగ్రహావేశాలకు కారణమవుతారని చెప్పారు. సీఎం మాటలను ఇప్పటికే కొందరు మఠాధీశులు ఖండించారని చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలను తాము ప్రధాని మోదీ పేరు మీదే ఎదుర్కొంటామని చెప్పారు.



అరటి గెల భళా

మండ్య: మండ్య తాలూకాలోని హోళలు గ్రామానికి చెందిన రైతు హెచ్.వై. శివకుమార్ ఇంటి పెరట్లో నాటిన అరటి చెట్టుకు సుమారు 500 అరటికాయల పెద్ద గెల కాసింది. ఇటీవల తమిళనాడుకు వెళ్లిన ఆయన రెండు అరటి మొక్కలను తెచ్చి నాటినట్లు చెప్పాడు. ఒక అరటి చెట్టు ఏపుగా పెరిగి ఒకే గెలలో 500 కాయలను కాసిందని సంతోషం వ్యక్తంచేశాడు.

చల్ చల్ బండి





బుధవారం చిక్కమగళూరు దగ్గర కెంపనహళ్లిలో రాష్ట్రస్థాయి ఎద్దుల బండ్ల పోటీలు. వాయువేగంతో దౌడు తీయిస్తున్న కుర్రకారు

క్లుప్తంగా

గణితం పుస్తకాల పంపిణీ



గణితం పుస్తకాలను అందించిన చంద్రశేఖర్

రాయచూరు రూరల్: విద్యార్థులు గణితంపై భయాందోళన చెందాల్సిన అవసరం లేదని తాలూకా విద్యా శాఖ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఆదర్శ పాఠశాలలో గణిత శాస్త్ర పుస్తకాలను అందించి మాట్లాడారు. ఆర్యభట్ కనుగొన్న గణితంపై విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించినప్పుడు క్రమశిక్షణతో వింటే దాని కన్నా సులభమైన విషయం మరొకటి ఉండదన్నారు.

27న నగరసభ 12వ వార్డుకు ఉప ఎన్నిక

రాయచూరు రూరల్: నగరసభ 12వ వార్డుకు ఈనెల 27న ఉప ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ వెల్లడించారు. ఆయన ఈమేరకు సోమవారం సాయంత్రం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. 8న నోటిఫికేషన్ విడుదల అవుతుంది. నామినేషన్లు వేయడానికి 15 చివరి తేదీగా నిర్ధారించారు. 16న నామినేషన్ల పరిశీలన, 18 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు, 27న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

న్యాయవాదులకు భద్రత ఏదీ?



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

హొసపేటె/కంప్లి: చిక్కమగళూరులో న్యాయవాది ప్రీతమ్‌పై జరిగిన అమానుష దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లికార్జునయ్య తెలిపారు. మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఈ ఘటనలో దోషులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. లాయర్ల రక్షణకు చట్టాన్ని అమలు చేయాలని, 15 మంది న్యాయవాదులపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం న్యాయవాదులు కోర్టు వద్ద నుంచి పట్టణంలోని ప్రధాన రోడ్ల గుండా నిరసన ర్యాలీని చేపట్టి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ తర్వాత తహసీల్దార్ రేణుకమ్మకు వినతిపత్రాన్ని అందించారు. సీనియర్, యువ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

షట్టర్ పగులగొట్టి రూ.10 వేలు, బైక్ చోరీ

రాయచూరు రూరల్: తాలూకాలో గద్వాల రోడ్డులోని మండలగేర వద్ద దుండగులు మంగళవారం రాత్రి ఓ దుకాణం షట్టర్ తాళాలు పగులగొట్టి రూ.10 వేల నగదుతో పాటు ద్విచక్ర వాహనం చోరీ చేసిన ఘటన జరిగింది. సిద్దప్ప, వెంకటేష్‌ల కిరాణ దుకాణం, నారాయణ బార్‌లో కొందరు దుండగులు చోరీకి పాల్పడినట్లు యాపలదిన్ని పోలీసులు తెలిపారు. ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రక్తదానంతో వ్యాధులు దూరం



రక్తదాతను అభినందిస్తున్న దృశ్యం

హొసపేటె: రక్తదానం చేస్తే గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుందని, రక్తపోటు, మధుమేహం, పక్షవాతం, ఊబకాయం వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ సోమశేఖర్ కబ్బేర్ తెలిపారు. బుధవారం ప్రౌఢదేవరాయ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యూఎం రోహిత్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. నేషనల్ సర్వీస్ ప్రాజెక్ట్ యూనిట్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.బసవరాజు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలకు డిమాండ్



ఆందోళనలో పాల్గొన్న రైతులు

రాయచూరు రూరల్: జిల్లాలోని పత్తి రైతులను ఏపీఎంసీలో అధికారులు, వర్తకులు, మధ్యవర్తులు నిండా మోసం చేస్తున్నారని రాష్ట్ర రైతు సంఘం జిల్లాధ్యక్షుడు లక్ష్మణగౌడ ఆరోపించారు. బుధవారం ఏపీఎంసీ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. వర్తకులు మార్కెట్‌లో ధర నిర్ణయించిన అనంతరం మిల్లుకు వెళ్లి అన్‌లోడ్ చేసిన తర్వాత రూ.300 తగ్గించి ఇస్తున్నారన్నారు. కందులు, పొద్దు తిరుగుడు విత్తనాల విషయంలో కూడా ఇదే బాటలో వ్యవహరిస్తున్న వర్తకులు, అధికారులపై చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

తప్పిన తుపాను ముప్పు.. వరికోతలకు ఊపు

- ఆయకట్టులో నగం మేరకు వరికోతలు పూర్తి
- పంట దిగుబడితో పాటు ధర కూడా ఆశాజనకం
- ధర గిట్టుబాటుగా ఉన్నా ఇంకా పెరుగుతుందని రైతుల్లో ఆశ



యంత్రంతో వరికోత కోస్తున్న దృశ్యం



వరి ధాన్యాన్ని రాశులుగా పోసిన దృశ్యం

సాక్షి, బళ్లారి: ఈసారి తుంగభద్ర ఆయకట్టు కింద సాగు చేసిన పంటల్లో రైతులకు వరి పంట మినహా మిగిలిన పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలు దాదాపు నష్టాలనే తెచ్చిపెడుతుండగా గత నాలుగు రోజుల నుంచి మిచాంగ్ తుపాను రైతన్నలను భయభ్రాంతులకు గురి చేసింది. వరి కోతలు జరుగుతుండగా వర్షాలు పడితే గింజలు పూర్తిగా నేలపాలు అవుతాయని రైతులు ఆందోళన చెందారు. తుపాను ప్రభావంతో మబ్బులు కమ్ముకుని చిరుజల్లులు కురవడం మినహా ఎలాంటి ప్రభావం చూపకపోవడంతో ఆయకట్టు కింద వరి సాగు చేసిన రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మరో వైపు రైతులకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక ఎకరాకు 50 బస్తాల దిగుబడి లభించడంతో పాటు మార్కెట్‌లో ధర కూడా ఆశాజనంగా ఉంది. ఈనేపథ్యంలో తుంగభద్ర ఆయకట్టు కింద విజయనగర, బళ్లారి, రాయచూరు, కొప్పళ నాలుగు జిల్లాల్లో ఎక్కడ చూసినా లక్షలాది ఎకరాల్లో సాగు చేసిన వరి కోతలు ఊపందుకుంటున్నాయి. మిచాంగ్ తుపాను ప్రభావం ప్రస్తుతం కోత దశలో ఉన్న వరిపైరుపై చూపి ఉంటే పెద్ద ఎత్తున ఈసారి కూడా నష్టపోయే ప్రమాదం ఉండేదని, అయితే ఆ ముప్పు తప్పిందని రైతన్నలు పేర్కొన్నారు.

కోతమిషన్లకు పెరిగిన డిమాండ్

గత నాలుగు రోజుల నుంచి నిలిపివేసిన వరికోతలను బుధవారం నుంచి ఒక్కసారిగా ముమ్మరం చేశారు. దీంతో వరికోత మిషన్లకు భారీ డిమాండ్ ఏర్పడుతోంది. వరికోతలు ముమ్మరంగా సాగుతుండటంతో కరువు సమయంలో చిన్న, సన్నకారు రైతులతో పాటు వ్యవసాయ కూలీల కుటుంబాలకు కూడా చేతినిండా పని దొరుకుతోంది. ఒక్క వరి పంట సాగు చేసిన రైతులకు పంటతో పాటు గిట్టుబాటు ధర కూడా ఆశాజనకంగా ఉంది. రెండు రోజుల నుంచి వరి ధాన్యం ధర మరింత పెరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఆర్ఎన్ఆర్ రకం వరికి క్వింటాల్‌కు ఏకంగా రూ.3000 ధర పలుకుతుండగా, సోనామసూరికి రూ.2600 వరకు మార్కెట్‌లో ధర ఉన్నా ఎక్కువ మంది రైతులు వరిధాన్యాన్ని అమ్ముకోవడానికి సిద్ధంగా లేరని వ్యాపారస్తులు అంటున్నారు. ఒక ఎకరం సాగు చేసిన రైతులకు 50 బస్తాలకు పైగా దిగుబడి రావడంతో దాదాపు 30 నుంచి 30 క్వింటాళ్లు వస్తుండటంతో ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం అయితే ఒక ఎకరాకు రూ.75 వేల నుంచి రూ.80 వేలు వరకు రాబడి వస్తోందని, పెట్టుబడి పోను ఒక ఎకరాకు దాదాపు రూ.50 వేల వరకు ఆదాయం వస్తోందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గోదాముల్లో ధాన్యం నిల్వకు ఏర్పాట్లు

వరితో పాటు ఇతర పంటలు కూడా సాగు చేయడం వల్ల వరిలో ఆదాయం వస్తున్నా మిగిలిన పంటల్లో నష్టాలు రావడంతో వరికి భవిష్యత్తులో ఇంకా ధర పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. తుంగభద్ర డ్యాం ఆయకట్టుతో పాటు దేశంలో పలు డ్యాంల్లో కూడా ఈసారి ఖరీఫ్ తప్ప రబీలో పంటలు సాగు చేసేందుకు సాగునీరు లేకపోవడంతో పాటు రబీ సీజన్‌కు క్రాఫ్‌హాలిడే ప్రకటించిన నేపథ్యంలో వరిధాన్యాన్ని నిల్వ చేసుకుంటే ఖచ్చితంగా క్వింటాల్‌కు మరో రూ.500 నుంచి రూ.1000ల వరకు ధర పెరిగే అవకాశం ఉంటుందని రైతుల ఆశలు పెంచుకుంటున్నారు. దీంతో గోదాముల్లో వడ్లను నిల్వ ఉంచుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బియ్యం ధరలు కూడా రోజురోజుకు పెరుగుతుండటంతో ఖచ్చితంగా వరి ధాన్యానికి మరింత ధర పెరుగుతుందనే ఉద్దేశంతోనే ఆర్థికంగా ఇబ్బందులు లేని రైతులు, గోదాముల్లో నిల్వ ఉంచుకునే సదుపాయం ఉన్న రైతులతో పాటు పలువురు చిన్న, సన్నకారు రైతులు ధాన్యాన్ని నిల్వ ఉంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇది శుభపరిణామమేనని తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తం గౌడ పేర్కొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి



హొసపేటెలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి దృశ్యం



రాయచూరులో అంబేడ్కర్ ప్రతిమకు పుష్పాంజలి

హొసపేటె: నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద బుధవారం రాజ్యాంగశిల్పి, భారతరత్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లాధికారి ఎంఎస్ దివాకర్, జెడ్పీ సీఈఓ బి.సదాశివ ప్రభు, జిల్లా ఎస్పీ బీఎల్ శ్రీహరిబాబు, డిప్యూటీ కలెక్టర్ అనురాధ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు హెచ్‌వీ మంజునాథ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఎస్సీ, ఎస్టీ, ఇతర సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రాయచూరులో..

రాయచూరు రూరల్: నగరంలోని అంబేడ్కర్ ప్రతిమ వద్ద వివిధ పార్టీలకు చెందిన నేతలు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, జెడ్పీ సీఈఓ రాహుల్ పాండే తుకారాం, ఎస్పీ నిఖిల్, డీఎస్ఎస్ నేతలు రవీంద్రనాథ పట్టి, తిమ్మారెడ్డి, గురురాజ్, వెంకటేష్, జేడీఎస్ నేతలు విరుపాక్షి, మహంతేష్ పాటిల్, విశ్వనాథ్ పట్టి పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలు అదుర్స్



నాటకంలోని ఓ సన్నివేశం



బాలికల సమూహ నృత్యం

సాక్షి,బళ్లారి: క్రీడలు, నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుతాయని విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ రుద్రేష్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం రాత్రి తాలూకాలోని శ్రీధరగడ్డ గ్రామంలో మహాదేవతాత కళా సంఘం ఆధ్వర్యంలో మారెమ్మ ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. మన సంస్కృతి వారసత్వాలకు అద్దం పట్టేలా పల్లెలు, పట్టణాలు, నగరాల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రముఖులు మంజునాథ్, హంద్యాళ పురుషోత్తం, లింగప్ప, నిరంజన్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటర్లుగా ఉంటేనే సమాజంలో మార్పు



మాట్లాడుతున్న కమిషనర్ తుషార్‌గిరినాథ్

బనశంకరి: యువత ఓటరుగా పేరు నమోదు చేసుకొని ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని జిల్లా ఎన్నికల అధికారి బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్ పిలుపునిచ్చారు. బుధవారం విజయనగర ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన యువ ఓటర్ల నమోదు అభియాన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో మార్పు తీసుకొని రావడం యువతతో మాత్రమే సాధ్యమన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వచ్చినప్పుడు సహకరించాలన్నారు. ఓటరు హెల్ప్ లైన్ యాప్ ద్వారా కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. కళాశాలలో 4 వేల మంది విద్యార్థులు ఉండగా వెయ్యిమందికిపైగా ఓటర్లుగా పేర్లు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్వీప్ పర్యవేక్షక సమితి అధ్యక్షుడు కాంతరాజు, స్వీప్‌నోడల్ అధికారి పూర్ణిమ, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. వెంకటేశప్ప తదితరులు పాల్గొన్నారు.

సంగీత కళను ఆదరించాలి

రాయచూరు రూరల్: నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరు సంగీతాన్ని ఆదరించాలని దేవదుర్గ తాలూకా విద్యాశాఖాధికారి సుఖదేవ్ వెల్లడించారు. మంగళవారం రాత్రి క్రిష్ణ మోడోస్ కాలనీలో ఆశాపూర్ స్నేహ సాంస్కృతిక కళా సంస్థ ఏర్పాటు చేసిన సంగీత కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. నేడు టీవీలు, కంప్యూటర్ల యుగంలో యువత సంగీతం వైపు మరలడం అభినందనీయమన్నారు. సంగీతం వింటే అన్ని బాధలను మరచిపోవచ్చన్నారు. కార్యక్రమంలో మహానంద రెడ్డి, జోసెఫ్, విరుపాక్షప్ప, లింగనగౌడ, రాచప్ప, సిద్దలింగప్పలున్నారు.

గూళిహట్టి శేఖర్ ఆరోపణలు అవాస్తవం

దొడ్డబళ్లాపురం: కుల వివక్షతో తనను ఆర్ఎస్ఎస్ కార్యాలయంలోకి రానివ్వలేదని హొసదుర్గ మాజీ ఎమ్మెల్యే గూళిహట్టి శేఖర్ చేసిన ఆరోపణలపై ఆర్ఎస్ఎస్ వివరణ ఇచ్చింది. నాగపూర్‌లోని డాక్టర్ హెడెగేవార్ స్మారక భవనంలోకి తనను లోపలకు అనుమతించలేదని గూళిహట్టి శేఖర్ ఆరోపించారు. దీనిపై స్పందించిన ఆర్ఎస్ఎస్ ఒక ప్రకటన విడుదల చేసింది.ఆర్ఎస్ఎస్‌కు చెందిన ఏ కార్యాలయం, స్మారక కట్టడాల్లో కులం ఆధారంగా అనుమతులు ఉండవని, ఇప్పటి వరకూ అలాంటి సంఘటన ఎక్కడా జరగలేదని పేర్కొంది.

శాస్త్ర సాంకేతికతపై ఆసక్తి అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభించిన జడ్జి సునీల్ హొసమని

కోలారు: విద్యార్థులు శాస్త్ర సాంకేతికతపై ఎక్కువ ఆసక్తిని కనబర్చాలని జిల్లా న్యాయ సేవా ప్రాధికార అధ్యక్షుడు, సివిల్ న్యాయమూర్తి సునీల్ ఎస్.హొసమని తెలిపారు. బుధవారం నగరంలోని మదర్ థెరెసా పాఠశాలలో నిర్వహించిన జిల్లా బాలల విజ్ఞాన సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విజ్ఞాన సాంకేతిక పరిజ్ఞానంతో దేశాభివృద్ధి సాధ్యమైందన్నారు. విజ్ఞానాన్ని దేశ అభివృద్ధి కోసం ఉపయోగించాలి తప్ప చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు కాదన్నారు. సాంకేతిక పరిజ్ఞానం గురించి అవగాహన పెంచుకుని సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. భ్రూణ హత్యలు శిక్షార్హ అపరాధమని, వాటిని అరికట్టాలన్నారు. జిల్లా కాలుష్య నియంత్రణ అధికారి డాక్టర్ కె.మంజు, విషయ పరీక్షకురాలు గాయత్రి, డీఈఓ కృష్ణమూర్తి, విజ్ఞాన పరిషత్ మంజుల భీమరావ్ తదితరులు పాల్గొన్నారు.

13న జిల్లా స్థాయి వంటల పోటీలు

హొసపేటె: నగరంలోని హరిహర రోడ్డులోని జాతీయ కళాశాలలో విజయనగర జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుల కార్యాలయం ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిరుధాన్యాలు, సేంద్రియ మేళా–2024లో భాగంగా ఈనెల 13న జిల్లా స్థాయి చిరుధాన్యాల వంటల పోటీలు నిర్వహించనున్నారు. బెంగళూరులో జరిగే రాష్ట్ర స్థాయి చిరు ధాన్యాల వంటల పోటీల్లో విజయనగర జిల్లా నుంచి పోటీదారులు ఎంపిక కావాలి. ఈనేపథ్యంలో త్వరలో జరిగే జిల్లా స్థాయి చిరుధాన్యాల వంట పోటీల్లో ఆసక్తిగలవారు పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి పోటీదారుడు ఒక తీపి లేదా రుచికరమైన తృణధాన్యాలు, శాకాహార వంటకం తయారు చేయవచ్చు. ఇంట్లో తయారు చేసిన తృణ ధాన్యాల వంటకాలను పోటీల్లో ప్రదర్శించవచ్చు. జ్యూరీ నిర్ణయమే అంతిమం. తయారు చేసిన వంటకాల ప్రదర్శన, ఉపయోగించిన పదార్థాలు, ఆకృతి, రుచి వాసన, పోషణపై తుది తీర్పు ఉంటుంది. జిల్లా స్థాయిలో ఉత్తమమైన తీపి(స్వీట్), రుచికరమైన వంటకాన్ని ఎంపిక చేసి జిల్లా స్థాయి మొదటి బహుమతిగా రూ.5000 నగదును అందజేస్తున్నట్లు సంయుక్త వ్యవసాయ సంచాలకులు శరణప్ప ముద్గల్ ఒక ప్రకటనలో తెలిపారు.

మహనీయుడు శివకుమారస్వామీజీ

- ఆయన పేరుతో అధ్యయన పీఠం ఏర్పాటు చేయాలి



ప్రారంభిస్తున్న మాజీ మంత్రి సోమణ్ణ, సిద్దలింగ మహాస్వామి, హోం మంత్రి పరమేశ్వర్

తుమకూరు: బెంగళూరు విశ్వవిద్యాలయంలో సిద్ధగంగా మఠాధ్యక్షుడు, త్రివిధ దాసోహి దివంగత డాక్టర్ శ్రీ శివకుమార్ స్వామీజీ అధ్యయన పీఠాన్ని స్థాపించాలని మాజీ మంత్రి వి.సోమణ్ణ డిమాండ్ చేశారు. నగరంలోని శ్రీ సిద్ధగంగా మఠంలో వి.సోమణ్ణ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన గురుభవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వామీజీ చదివిన బెంగళూరు సెంట్రల్ కాలేజీ ఇప్పుడు విశ్వవిద్యాలయంగా మారిందని గుర్తు చేశారు. ఈ వర్సిటీలో స్వామీజీ అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లక్షలాది మంది పేదలకు భోజనం, విద్య, ఆశ్రయం కల్పించిన మహనీయుడు శివకుమార స్వామీజీకి భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హోం మంత్రి పరమేశ్వర్, సిద్దలింగ మహా స్వామి తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

సౌకర్యాలు దివ్యాంగుల దరిచేర్చాలి



మాట్లాడుతున్న జిల్లాధికారి అక్రంపాషా

కోలారు: దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి అందిస్తున్న వివిధ సౌకర్యాలను పక్కాగా అందించాలని జిల్లాధికారి అక్రంపాషా అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో దివ్యాంగులకు అందించాల్సిన ప్రభుత్వ సౌకర్యాలపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి అందుతున్న సౌకర్యాల గురించి ముమ్మరంగా ప్రచారం చేయాలన్నారు. తీవ్రమైన శారీరక వైకల్యం కలిగిన వారికి అందిస్తోన్న త్రిచక్రవాహనాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని దివ్యాంగుల సమస్యలు, వారి అవసరాలను జీపీ స్థాయిలో తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. దివ్యాంగులకు సౌకర్యాలను అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప, డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ శంకర్ వణిక్యాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

16న జాతీయ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కోలారు: నగరంలోని పోలీసు కవాతు మైదానంలో ఈనెల 16న అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ ఆధ్వర్యంలో జనవరి 24 నుంచి గుజరాత్‌లో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర అండర్–14, 16 క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపికను నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ రాజేష్ తెలిపారు. బుధవారం కన్నడ సంస్కృతి శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరోజున ఎంపిక చేసిన క్రీడాకారులను నేరుగా జాతీయ క్రీడా పోటీలకు పంపుతారన్నారు. అండర్–14 బాలబాలికలకు 80 మీటర్లు, 600 మీటర్లు, 1000 మీటర్లు, 80 మీటర్ల హర్డిల్స్, హై జంప్, లాంగ్ జంప్, జావలిన్ త్రో పోటీలను నిర్వహిస్తారన్నారు. అండర్–16 బాలబాలికలకు 60 మీటర్లు, 600 మీటర్లు, స్టాండింగ్ బ్రాండ్ జంప్, హై జంప్, త్రోబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఎంపిక ప్రక్రియలో పాల్గొనవచ్చని, పూర్తి వివరాలకు 9448132640 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. మునియప్ప, నాగేష్ పాల్గొన్నారు.

దివ్యాంగులపై చిన్నచూపు తగదు



విద్యార్థులకు శ్రవణ పరికరాలు అందిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: దివ్యాంగులపై సమాజంలో చులకన భావన తగదని, తల్లిదండ్రులు దివ్యాంగ పిల్లలను సమాజ ప్రధాన స్రవంతిలోకి తేవాలని బీఈఓ ఉమా తెలిపారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన ప్రపంచ దివ్యాంగ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులపై జాలి, దయ ఉంటే చాలదని, వారికి అవసరమైన సౌకర్యాలు, సహకారం అందించాలన్నారు. శీగేహళ్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మేశ్ మాట్లాడుతూ ప్రతి నెలా తమ వేతనంలో రూ.10 వేలను విద్యార్థుల కోసం ఖర్చు చేస్తున్నానన్నారు. శ్రవణ దోషం కలిగిన వారికి తన స్వంత ఖర్చుతో శ్రవణ పరికరాలను అందిస్తున్నానన్నారు. ప్రతి ఒక్కరు పిల్లల్లో భగవంతుడిని చూడాలన్నారు. పేదలకు తగిన దాన ధర్మాలు చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనలో విఫలం



పాల్గొన్న దళిత సంరక్షణ సమితి కార్యకర్తలు

మాలూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ఆశయాలను సాఫల్యం చేయడంలో మనం పూర్తిగా విఫలమయ్యామని దళిత సంరక్షణ సమితి సంస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌కుమార్ విచారం వ్యక్తం చేశారు. బుధవారం అంబేడ్కర్ ఉద్యానవనంలో అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్ ప్రతిమకు మాలార్పణ చేసి మాట్లాడారు. అంబేడ్కర్ అన్ని సముదాయాల వారికి కల్పించిన రిజర్వేషన్ సౌకర్యం కొంతమందికి మాత్రమే ఉపయోగపడుతోందని ఆరోపించారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవాలన్నారు. అంబేడ్కర్ చూపిన బాటలో నడవాలన్నారు.

ఉపపోలీస్ స్టేషన్ ప్రారంభించరూ



వినతిపత్రం అందిస్తున్న రామణ్ణ తదితరులు

కంప్లి: కొట్టూరు కోట ప్రాంతంలో ఉపపోలీస్ స్టేషన్‌ను ప్రారంభించాలని పంచాయతీ సభ్యులు తోటద రామణ్ణ తహసీల్దార్ అమరేష్ జాలహళ్లికి వినతిపత్రం అందించారు. కొట్టూరేశ్వర దేవస్థానానికి అమావాస్య రథోత్సవం, కార్తీకోత్సవాలకు భారీ ఎత్తున భక్తులు వస్తుంటారు. వారి భద్రత దృష్ట్యా ఉప పోలీసు స్టేషన్‌ను ప్రారంభించాలని కోరారు.

పంటల ధ్వంసంపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రైతు ప్రముఖులు

కంప్లి: సండూరు తాలూకా రంజిత్‌పుర భూముల్లో పంటలు, వ్యవసాయ పరికరాలను ధ్వంసం చేశారని ఆర్ఐపీసీ కర్మాగార యాజమాన్యంపై సండూరు పోలీసు స్టేషన్‌లో రైతు ప్రముఖులు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గౌడ సోమణ్ణ, తిమ్మప్ప, జీ.పరమేశ్వరప్ప సణ్ణ హాలిగమ్మల భూముల్లో ఉల్లి, జామ, సీతాఫలం, బొప్పాయి పంటలను ధ్వంసం చేసిన కర్మాగారం ప్రాజెక్ట్ మేనేజర్ ప్రభుగౌడ, ఉదయ్‌కుమార్, దినేష్ కుమార్‌లపై చట్టపరంగా చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని ఒత్తిడి చేశారు.

భ్రూణహత్యలకు అడ్డుకట్ట

- స్కానింగ్ సెంటర్లలో తనిఖీలకు కసరత్తు

బనశంకరి: కడుపులోఉండగానే బిడ్డను చిదిమివేసే సంస్కృతి జడలు విరబోసుకున్న వేళ రాష్ట్రంలో భ్రూణహత్యలు వెలుగు చూడటం కలకలం రేపింది. ఆడపిల్ల అంటేనే కడుపులోనే అంతమొందించే భ్రూణహత్యలను అడ్డుకునేందుకు రాష్ట్రపోలీస్‌శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచనలో ఉంది. భ్రూణహత్యలకు పాల్పడితే ఐపీసీ సెక్షన్ 302 కింద హత్యకేసు నమోదు చేయాలని చర్చజరుగుతోంది. కొత్త నిబంధన జారీకి సీనియర్‌పోలీస్ అధికారులు ఆరోగ్యశాఖ అధికారులకు సలహా ఇచ్చారు. రాష్ట్రంలో భ్రూణహత్య కేసులు వెలుగుచూడటంతో బయప్పనహళ్లి పోలీస్‌స్టేషన్‌లో భ్రూణహత్యకేసు నమోదు చేసి దర్యాప్తుచేపట్టిన పోలీసులు డాక్టర్లు, నర్సులతో పాటు 11 మందిని అరెస్ట్‌చేశారు. భ్రూణలింగ నిర్ధారణ కేసు అనంతరం ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. రాష్ట్రంలో 6 వేల స్కానింగ్ సెంటర్లు, క్లినిక్‌లు తనిఖీ చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఈనెల 30 నాటికి స్కానింగ్, క్లినిక్ సెంటర్ల డేటాను సేకరించనుంది.

దురలవాట్లు వీడండి

కంప్లి: దురలవాట్లకు విద్యార్థులు స్వస్తి పలకాలని అఖిల కర్ణాటక జనజాగృతి వేదిక జిల్లా సభ్యులు జీఆర్.సిద్దేష్ తెలిపారు. కూడ్లిగి పట్టణంలోని శ్రీరాఘవేంద్ర పారా మెడికల్ కళాశాలలో శ్రీక్షేత్ర ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి యోజన, అఖిల కర్ణాటక జనజాగృతి వేదిక నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా అడుగులు వేస్తూ ఉత్తమ భవిష్యత్తు రూపొందించుకోవాలన్నారు.

15న మాయానగరి విడుదల



సినిమా పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

కోలారు: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15న విడుదలయ్యే మాయానగరి చలన చిత్రాన్ని ప్రేక్షకులు థియేటర్లలోనే చూసి ఆదరించాలని చిత్ర హీరో భరత్ మనవి చేశారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ద్వారకీష్, సుచీంద్ర ప్రసాద్, శరత్ చిక్కణ్ణతో పాటు పలువురు ప్రముఖ నటులు ఈ చిత్రంలో నటించారన్నారు. ఇంటిల్లిపాది కలిసి చూసే చిత్రమని, అన్ని వర్గాల ప్రేక్షకులకు ఈ సినిమా నచ్చుతుందన్నారు. సినిమా షూటింగ్‌ను సాగర, జోగ్ ఫాల్స్, చిక్కమగళూరు, దేవరాయనదుర్గ తదితర చోట్ల చిత్రీకరించామన్నారు. దర్శకుడు శంకర్ ఆరాధ్య దర్శకత్వంలో, సంగీత దర్శకుడు అర్జున్ జన్య సంగీత మార్గదర్శనంలో ఈ సినిమా రూపుదిద్దుకుందన్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందం మంజు, విశ్వ తదితరులు ఉన్నారు.

ఏడో రోజుకు కాంట్రాక్టు లెక్చరర్ల ధర్నా



దర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

కోలారు: తమ వివిధ డిమాండ్ల సాధన కోసం కాంట్రాక్టు లెక్చరర్లు చేపట్టిన ధర్నా బుధవారం ఏడో రోజుకు చేరుకుంది. కాంట్రాక్టు లెక్చరర్లను పర్మనెంట్ చేయడంతో పాటు తమ న్యాయసమ్మతమైన డిమాండ్లను నెరవేర్చాలని యేళ్ల తరబడి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు అన్నీ కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలపై తీవ్ర నిర్లక్ష్య ధోరణిని చూపుతున్నాయని ఆరోపించారు. కాంట్రాక్టు లెక్చరర్లు అందరితో సమానంగా విధులు నిర్వహిస్తున్నా వారికి అందాల్సిన సౌకర్యాలు అందడం లేదన్నారు. తమ న్యాయసమ్మతమైన డిమాండ్లను నెరవేర్చే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ


దుప్పటి అందజేస్తున్న దృశ్యం

మైసూరు: కేఎంపీకే చారిటబుల్ ట్రస్టు దాతృత్వం చాటింది. విపరీత చలిగాలుల మధ్య రాత్రుల్లో మైసూరులోని రోడ్లపై, వీధుల్లో పడుకుని ఉన్న నిరాశ్రయులు, వీధి వ్యాపారులు, ఉదయాన్నే పని చేసే పౌరకార్మికులు, పేదలకు ట్రస్టు నిర్వాహకులు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని శాంతవేరి గోపాల్ గౌడ ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ శుశ్రుత గౌడ ప్రారంభించారు. మైసూరు నగరంలో 45 రోజుల పాటు ప్రతి రోజూ రాత్రి 11 నుంచి 12 గంటల మధ్య ఈ పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

వృద్ధుడి మిస్సింగ్

మైసూరు: ఆలయానికి వెళ్లి వృద్ధుడు తప్పిపోయాడు. జిల్లాలోని సరగూరు పట్టణ నివాసి చెన్ననాయక (80) నంజనగూడు శ్రీ కంఠేశ్వర దేవస్థానానికి బంధువులతో కలసి వెళ్లాడు. అక్కడకు వెళ్లిన తర్వాత చెన్ననాయక తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు గోవిందరాజు సరగూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విమానాశ్రయానికి కువెంపు పేరు పెట్టాలి


ధర్నా చేస్తున్న నాయకులు

శివమొగ్గ: శివమొగ్గ నూతన విమానాశ్రయానికి జాతీయ కవి కువెంపు పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ శాంతవేరి గోపాలగౌడ సమాజవాది అధ్యయన కేంద్రం ట్రస్టు డిమాండ్ చేసింది. బుధవారం శివమొగ్గ ప్రధాన తపాల కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు.

విష ఆహారం తిని ఆవులు మృతి

దొడ్డబళ్లాపురం: విషాహారం తిని ఆవులు మృతి చెందిన ఘటన తాలూకాలోని కాడతిప్పూరు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామ నివాసి హనుమనరసయ్యకు చెందిన రెండు ఆవులు బుధవారం ఉదయం మేతకు వెళ్లి కుప్పకూలాయి. వెళ్లి పరిశీలించగా రెండు ఆవులు ప్రాణాలు కోల్పోయాయి. ఆవుదూడ తీవ్ర అస్వస్థతకు గురైనట్లు గుర్తించారు. పశువుల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి


మంత్రి కృష్ణ బైరే గౌడకు వివరాలు తెలియజేస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం: ప్రభుత్వ భూమి కబ్జాదారుల పాలు కాకుండా రక్షించాలని కర్ణాటక రక్షణ వేదిక సింహ సైన్యం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంత్రి కృష్ణ బైరేగౌడను కలిసి వినతిపత్రం అందజేశారు. బెంగళూరు తూర్పు తాలూకా బిదరహళ్లి హోబళి మండూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వనజీనహళ్లి గ్రామంలో కోట్ల రూపాయల విలువైన 5 ఎకరాల 35 కుంటల ప్రభుత్వభూమిని బిల్డర్లు కొందరు కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నట్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆ భూమిని పరిరక్షించాలని కోరారు.

ఎద్దులబండిని ఢీకొన్న బైక్

• ఒకరి మృతి


ఓంకారప్పను ఒళ్లో పెట్టుకుని బంధువులకు సమాచారం ఇస్తున్న స్నేహితుడు

రాయదుర్గం రూరల్: మండలంలోని మల్లాపురం తాండా మలుపు వద్ద ఎద్దుల బండిని వెనుకవైపు నుండి ఢీకొన్న సంఘటనలో ఓంకారప్ప (38) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాయదుర్గం పట్టణం భగత్ సింగ్ కాలనీలో ఉండే ఓంకారప్ప స్నేహితుడు వెంకటేశులతో కలిసి బుధవారం బైక్‌లో కర్ణాటకలోని హిరికెరహళ్లికి వెళ్లి తిరిగివస్తున్నాడు. మల్లాపురం తాండా మలుపు వద్ద ముందు వెళుతున్న ఎద్దులబండిని ఢీకొట్టడంతో బండి వెనుక భాగం అతని ఎదకు గట్టిగా తగిలింది. దీంతో ఓంకారప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి క్షేమంగా బయటపడ్డాడు. కళ్లెదుటే స్నేహితుడు చనిపోవడంతో ఒళ్లో పెట్టుకుని వెంకటేశులు విలపిస్తూ పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. భార్య నాయకుల గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

శెనక్కాయల జాతరకు వేళాయె


శెనక్కాయలు కొంటున్న సందర్శకులు


బృహత్ నంది విగ్రహం

• ఈ నెల 11 నుంచి బసవనగుడిలో పరుష
• పురాతన నందికి ప్రత్యేక పూజలు

బనశంకరి: సిలికాన్ సిటీలో పెద్ద జాతరల్లో ఒకటైన బసవనగుడి శనక్కాయల పరుష కార్తీక మాసం చివరి సోమవారం నిర్వహించడం ఆనవాయితీ. ఈ నెల 11వ తేదీ నుంచి రెండురోజుల పాటు దొడ్డ బసవణ్ణ గుడి శనక్కాయల పరుష వైభవంగా జరుగుతుంది. దీనికోసం ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమ, మంగళవారాల్లో ఈ జాతర కనువిందు చేయనుంది. సిటిజనులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కూడా తరలిరావడం విశేషం.

అప్పుడే సందడి

బెంగళూరు రూరల్, తమిళనాడుతో పాటు ఏపీ నుంచి కూడా రైతులు, వ్యాపారులు వేరుశెనగను విక్రయిస్తారు. జాతరకు నాలుగు రోజుల సమయం ఉండగానే శనక్కాయల రైతులు, వ్యాపారులు బసవనగుడి బుల్ టెంపుల్ రోడ్డుకు ఇరువైపుల శనక్కాయలు విక్రయ కేంద్రాలు ఏర్పాటుచేసి వ్యాపారాలు నిర్వహించడం విశేషం. బసవనగుడి శనక్కాయల పరుషకు శనక్కాయలను తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ కు చెందిన రైతులు ఇక్కడికి వచ్చి విక్రయిస్తారు. జాతరలో వివిధ వస్తుసామగ్రి, బొమ్మల దుకాణాలు ఏర్పాటవుతాయి.

500 ఏళ్ల చరిత్ర

బసవనగుడి దొడ్డబసవణ్ణ శనక్కాయల పరుషకు ఐదు శతాబ్దాల చరిత్ర ఉందని చెబుతారు. ప్రస్తుతం బసవణ్ణ ఆలయం ఉన్న ప్రాంతంతో పాటు సుంకేనహళ్లి, గవిపుర ప్రాంతాల్లో గతంలో విస్తారంగా వేరుశనగను పండించేవారు. పంటకోతకు వచ్చే సమయానికి ఓ ఎద్దు వచ్చి పంటలను ధ్వంసం చేసి వెళ్లిపోయేది. దీంతో ఆ ఎద్దును ఎలాగైనా బంధించాలని ఆ ప్రాంత రైతులందరూ ఓ రోజు కాపుకాశారు. ఎప్పటిలా వచ్చిన ఎద్దును రైతులు పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో అనుకోకుండా ఎద్దు మూపురంపై గట్టి దెబ్బపడింది. దీంతో ఆ ఎద్దు కాస్తా ప్రతిమగా మారి అంతకంతకూ పెరిగి ఆ ప్రాంతాన్నంతటినీ ఆక్రమించసాగింది. భయపడిన రైతులు తప్పయిపోయిందని పరమ శివున్ని ప్రార్థించారు. శివుని ఆదేశాల మేరకు పండిన పంటను ఎద్దుకు నైవేద్యం ఇచ్చిన తర్వాతే అమ్ముతామని రైతులు మాట ఇచ్చారు. దీంతో నంది శిలా ప్రతిమ శాంతించి పెరగడం ఆగిపోయింది. అప్పటినుంచి ప్రతి ఏటా శనక్కాయల పరుషను కార్తీకమాసం చివరి సోమవారం వైభవంగా జరుపుతూ వస్తున్నారు. బసవణ్ణకు శనక్కాయలను నైవేద్యంగా సమర్పించడం వల్ల పంటలు సుభిక్షంగా ఉంటాయనేది ఇక్కడి రైతుల నమ్మకం. దొడ్డ బసవణ్ణ ఆలయాన్ని 1537లో నాడప్రభు కెంపెగౌడ నిర్మించారని తెలుస్తోంది. విగ్రహం కిందుగా వృషభావతి నది ప్రవహిస్తుందని అక్కడ శాసనాలను బట్టి తెలుస్తుంది. ఆలయంలో నిత్య పూజలు జరుగుతాయి. శనక్కాయల పరుసకు అద్దం పట్టేలా ఉండే నిలువెత్తు బొమ్మలు ఆకట్టుకుంటాయి.


బసవనగుడి దొడ్డబసవణ్ణ ఆలయగోపురం


దొడ్డబసవణ్ణ ఆలయం ముందు వృషభం, శనక్కాయ విక్రయాల ఆకృతులు


దొడ్డబసవణ్ణ ఆలయం వద్ద భక్తులు

రక్తదానం చాలా గొప్పది


రక్తదానం చేస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: ఆపదలో ఉన్నవారికి రక్తం దానం చేసి కాపాడాలని శ్రీజగద్గురు రేణుకాచార్య కళాశాల ప్రిన్సిపాల్ జయశ్రీ ఆర్.సాలిమఠ్ అన్నారు. నగరంలోని ఆ కళాశాల ఆవరణలో కళాశాల విద్యార్థులు, యువ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభించి మాట్లాడారు. అన్ని దానాల్లోకీ రక్తదానం చాలా గొప్పదన్నారు. అనంతరం విద్యార్థులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. ప్రొఫెసర్ కాంతరాజు, డాక్టర్ మరిగౌడ, నిర్వాహకులు శోభారాణి, ఆర్. రాజేశ్వరి, ఉపన్యాసకులు జ్యోతి, రాధిక గుడిహాల్, మంజుల, సత్యవతి, కోమ్, శారద పాల్గొన్నారు.

పిచ్చి కుక్కదాడి.. 20 మందికి గాయాలు

మైసూరు: పిచ్చి కుక్క దాడిలో 20 మందికి గాయపడిన ఘటన నంజనగూడు తాలూకా తాండవపుర గ్రామంలో జరిగింది. పిచ్చికుక్క గ్రామంలో సంచరిస్తూ దారినపోయేవారిపై దాడికి పాల్పడింది. దీంతో గ్రామానికి చెందిన రేవణ్ణ, హుచ్చప్ప, రవిరాజ్ తదితర 20 మంది గాయపడ్డారు. వీరిని నంజనగూడు ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స తర్వాత మైసూరు అంటువ్యాధుల ఆస్పత్రిలో చేర్పించారు.

కరెంటు వైర్లు తగిలి గడ్డిలోడు దగ్ధం


కాలిపోతున్న క్యాంటర్

దొడ్డబళ్లాపురం: కరెంటు వైర్లు తగిలి గడ్డి లోడుతో వెళ్తున్న క్యాంటర్ కాలిపోయిన ఘటన నెలమంగల తాలూకా ఇమచేనహళ్లి గ్రామం వద్ద గోపాల్ రాజ్ అనే రైతుకు చెందిన భూమిలో ఈ సంఘటన జరిగింది. సురేశ్ అనే వ్యక్తి క్యాంటర్‌లో గడ్డిని లోడ్ చేసుకొని వస్తుండగా విద్యుత్ తగిలి మంటలు వ్యాపించాయి. గమనించిన డ్రైవర్, క్లీనర్ కిందకు దూకి పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. అగ్నిమాపకదళం సిబ్బంది వచ్చేసరికి క్షణాల్లోనే గడ్డితో పాటు క్యాంటర్ కూడా కాలిపోయింది. సుమారు రూ.3 లక్షల నష్టం జరిగినట్టు సమాచారం. దాబస్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదర్శప్రాయుడు డాక్టర్ అంబేడ్కర్


బెంగళూరు రూరల్ కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్


నివాళులర్పిస్తున్న డాక్టర్ బొందురామస్వామి


మైసూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తుషార్‌గిరినాథ్

దొడ్డబళ్లాపురం: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారుల ఘన నివాళులర్పించారు. ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని కార్యాలయాలు, పాఠశాలల్లో ఆయన చిత్ర పటాలకు పూజలు చేసి నివాళులర్పించారు. బెంగళూరు గ్రామీణ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ శివశంకర్, పలువురు అధికారులు అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు కలెక్టర్ మాట్లాడుతూ అంబేడ్కర్ భావితరాలకు ఆదర్శప్రాయమన్నారు.

శివాజీనగర: బెంగళూరులోని కల్యాణనగర కర్ణాటక తెలుగు ప్రజా సమితి కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆ సమితి అధ్యక్షుడు డాక్టర్ బొందరామస్వామి పుష్పమాలను సమర్పించి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ చిరస్మరణీయుడని, ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని దేశానికి అందించారన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని అన్నారు.

మైసూరు:జిల్లా పాలన యంత్రాంగం ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. నగరంలోని పురభవనంలో అంబేడ్కర్ విగ్రహానికి జిల్లాధికారి డాక్టర్ కేవీ రాజేంద్ర, నగర పోలీసు కమిషనర్ రమేశ్, జిల్లా ఎస్పీ సీమా లాట్కర్, పాలికె కమిషనర్ అర్షద్ ఉర్ రెహమాన్ తదితరులు నివాళులర్పించారు.

చిక్కబళ్లాపురం: అంబేడ్కర్ దేశానికి వెలుగులు పంచిన మహనీయుడని జిల్లా కలెక్టర్ పీఎస్ రవీంద్ర అన్నారు. నగరంలోని ఎంజీ రోడ్డులో జైభీమ్ హాస్టల్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన నివాళులర్పించి మాట్లాడారు. జెడ్పీ సీఈఓ ప్రకాష్ నిట్టాలి, జిల్లా ఎస్పీ డీఎల్ నాగేశ్, ఏడీసీ తిప్పేస్వామి, జిల్లా సమాజకళ్యాణ ఇలాఖా డీడీ తేజానందరెడ్డి, కన్నడ ఉపన్యాసకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు సతీష్‌రెడ్డి, ఎస్.ఆర్.విశ్వనాథ్, మునిరాజు

బొమ్మనహళ్లి : బెళగావిలో సువర్ణ సౌధ ఎదుట అంబేడ్కర్ విగ్రహానికి బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం. సతీష్ రెడ్డి, యలహంక ఎమ్మెల్యే ఎస్.ఆర్. విశ్వనాథ్, దాసరహళ్లి ఎమ్మెల్యే మునిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు.అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. అనంతరం సువర్ణసౌధ ఎదుట మొక్కలు నాటారు.

బనశంకరి: పాలికే కేంద్ర కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటం, విగ్రహానికి బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్ పూలమాలవేసి నివాళులర్పించారు. పాలికె ప్రత్యేక కమిషనర్లు డాక్టర్ కే.హరీశ్‌కుమార్, రెడ్డిశంకరబాబు, రామచంద్రన్, వలయ కమిషనర్ స్నేహల్, వినోద్‌ప్రియ, డిప్యూటీకమిషనర్ మంజునాథ్‌స్వామి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

•పోస్టుమార్టంను అడ్డుకున్న కుటుంబ సభ్యులు

మండ్య: విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందిన ఘటన మద్దూరు తాలూకా చెన్నసంద్ర గ్రామంలో జరిగింది. మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకా హెబ్బాళగొప్ప గ్రామానికి చెందిన పరియయ్య కుమారుడు బసవరాజు (27) చెన్నపట్టణకు చెందిన సతీశ్ అనే వ్యక్తి వద్ద కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. మంగళవారం గ్రామానికి చెందిన పట్టలదమ్మ ఆలయం వద్ద ఉప్పినకెరె రోడ్డులో స్తంభం మారుస్తుండగా విద్యుత్ సరఫరా అయ్యింది. ఘటనలో బసవరాజు విద్యుదాఘాతానికి గురవ్వగా ప్రైవేటు నర్సింగ్ హోంకు తరలించారు. అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టమ్ నిర్వహించేందుకు వైద్యులు వెళ్తుండగా కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. బసవరాజు మృతికి పరిహారం చెల్లించే వరకు పోస్టుమార్టమ్ నిర్వహించరాదని డిమాండ్ చేశారు. వ్యక్తిగతంగా రూ. 8 లక్షలు చెల్లించేందుకు విద్యుత్ శాఖ అధికారులు అంగీకరించడంతో పోస్టుమార్టం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. మద్దూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

కిడ్నాప్, హత్యపై దర్యాప్తు

దొడ్డబళ్లాపురం: చెన్నపట్టణకు చెందిన ఎమ్మెల్సీ సీపీ యోగేశ్వర్ బావ మహదేవయ్య హత్య తెలిసినవారిపనేనని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఈకోణంలోనే దర్యాప్తు చేస్తున్నారు. మహదేవయ్య బంధువులు, స్నేహితులను విచారిస్తున్నారు. త్వరలోనే నేరస్తుల వివరాలు వెల్లడిస్తామని పోలీసులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. మహదేవయ్య కిడ్నాప్‌నకు గురైన సమయంలో ఇంటిలో ఎలాంటి పెనుగులాట,గొడవ జరగలేదని పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా కొన్ని ముఖ్యమైన డాక్యుమెంట్లు, నగలు గల్లంతైనట్లు సమాచారం. మహదేవయ్య అంత్యక్రియలు మంగళవారం చెన్నపట్టణ తాలూకా వడ్డరదొడ్డి గ్రామంలోని మహదేవయ్య తోటలో ముగిశాయి.

హోసూరు వార్తలు..

ఏనుగుల మంద సంచారం


రాయకోట సమీపంలో రోడ్డు దాటుతున్న ఏనుగుల మంద

కెలమంగలం: డెంకణీకోట తాలూకా రాయకోట అటవీ ప్రాంతంలో ఏనుగుల మంద సంచారంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. కొన్నిరోజుల క్రితం బెంగళూరు బన్నేరుగట్ట అటవీ ప్రాంతం నుంచి వందకు పైగా ఏనుగులు జవుళగిరి అటవీ ప్రాంతం మీదుగా వలస వచ్చాయి. ఈ ఏనుగులు గుంపులుగా విడిపోయి జవుళగిరి, నగనూరు, బేవనత్తం, ఉడేదుర్గం, శ్యానమావు అటవీ ప్రాంతాల్లో సంచరిస్తూ రైతుల పంట పొలాలపై దాడులు చేసి పాడుచేస్తున్నాయి. బుధవారం ఉదయం రాయకోట ప్రాంతంలో 40కి పైగా ఏనుగులు రోడ్డు దాటడం చూసి జనం భయపడ్డారు. అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఒంటరిగా బయటకు వెళ్లరాదని ప్రకటించారు.

ఘనంగా అంబేడ్కర్ వర్ధంతి


ఉళియాలంలో మాజీ మంత్రిచే నివాళులు

హోసూరు, కెలమంగలం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ 67వ వర్ధంతిని క్రిష్ణగిరి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ అధికార్లు, రాజకీయ పార్టీల నాయకులు, అంబేడ్కర్ అభిమానులు ఘనంగా జరుపుకొన్నారు. హోసూరు తాలూకా ఉళియాలం గ్రామంలో అన్నాడీఎంకే పార్టీ క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి పి.బాలక్రిష్ణారెడ్డి అధ్యక్షతన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. డెంకణీకోట పాత బస్టాండులో కాంగ్రెస్ నేతలు అబ్దుల్‌రహమాన్, తేన్‌కో అన్వర్‌ల నేతృత్వంలో నిర్వహించారు. డెంకణీకోట, కెలమంగలం, రాయకోట, అంచెట్టి, బేరికె తదితర ప్రాంతాల్లోనూ ఘనంగా నివాళులు అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

దొడ్డబళ్లాపురం: శిరాడి ఘాట్‌లో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గూడ్సు వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో టెంపో డ్రైవర్, మరో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. మృతులను హాసన్‌కు చెందినవారుగా పోలీసులు గుర్తించారు. సకలేశపుర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ముందు వెళ్తున్న లారీని కారు ఢీ

•కుటుంబానికి తీవ్ర గాయాలు

క్రిష్ణగిరి: హోసూరు – క్రిష్ణగిరి జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనింది. కారులోని ఆరు మందికి తీవ్ర గాయాలు తగిలాయి. ఈ ఘటన సూళగిరి వద్ద జరిగింది. వివరాలు.. పుదుచ్చేరికి చెందిన గణపతిలాల్ (40). మంగళవారం కుటుంబంతో కలిసి బెంగళూరుకు వెళుతున్నాడు. సూళగిరి సమీపంలోని ఒడ్డేనూరు వద్ద ముందు వెళుతున్న లారీని వీరి కారు ఢీకొట్టింది. కారు ముందు భాగం నుజ్జు కాగా, అందులోని గణపతిలాల్, అతని భార్య దేవి (35), కూతుళ్లు శశికుమారి (12), హేమలత (9), సాక్షి (6), నాలుగు నెలల పాపతో పాటు ఆరు మంది తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంలో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీసి చికిత్స కోసం హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రెండు లారీలు ఢీ, క్లీనర్ మృతి

కావేరి పట్టణం సమీపంలో లారీని కంటైనర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో క్లీనర్ మృతి చెందగా డ్రైవర్‌కు గాయాలు తగిలాయి. సేలం జిల్లా కడయంబట్టి ప్రాంతానికి చెందిన భూపతి (23). క్లీనర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తేని జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ తంగవేల్ (53)తో కలిసి కావేరిపట్టణం సమీపంలో వెళ్తుండగా వేగంగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొనడంతో భూపతి అక్కడికక్కడే మరణించాడు.

ఆర్టీసీ బస్సు- స్కూలు బస్సు ఢీ

• విద్యార్థులు సహా 10 మందికి గాయాలు


ప్రమాదంలో నుజ్జయిన స్కూల్ బస్సు

హోసూరు: హోసూరు- బాగలూరు రోడ్డులో ఆర్టీసీ బస్సు, ప్రైవేట్ పాఠశాల బస్సు నేరుగా ఢీకొన్న ప్రమాదంలో 10 మందికిపైగా గాయపడ్డారు. వివరాల మేరకు బాగలూరు నుంచి ప్రయాణికులను తీసుకెళుతున్న ఆర్టీసీ బస్సు హోసూరు వైపు నుంచి విద్యార్థులతో వస్తున్న విజయ్ విద్యాలయ బస్సు ఎలువపల్లి వద్ద బుధవారం ఉదయం ఢీకొన్నాయి. ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్, స్కూల్ బస్సులోని విద్యార్థులతో పాటు పది మందికి పైగా తీవ్ర గాయాల పాలయ్యారు. అదే తోవలో వస్తున్న మాజీ మంత్రి పి. బాలక్రిష్ణారెడ్డి, స్థానిక ప్రజలు కలిసి బాధితులను వాహనాల్లో హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తరువాత మాజీ మంత్రి ఆస్పత్రికెళ్లి బాధితులను పరామర్శించారు. పిల్లల తల్లిదండ్రులు ఏం జరిగిందోనని ఆందోళనతో విలపించారు. ఈ ఘటనతో బాగలూరు సమీపంలో కొద్ది సేపు ఉద్రిక్తత నెలకొంది. బాగలూరు పోలీసులు వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను సరిచేశారు.

అక్రమ మద్యం స్వాధీనం

కెలమంగలం: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురిని డెంకణీకోట పోలీసులు అరెస్ట్ చేశారు. డెంకణీకోట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ నేతృత్వంలో పోలీసులు మంగళవారం రాత్రి అయ్యూరు రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించారు. ఒక కారులో తరలిస్తున్న మద్యాన్ని, కారును సీజ్ చేశారు.

కారు, గుట్కా సీజ్

హోసూరు: మత్తిగిరి పోలీసులు మంగళవారం రాత్రి పూనపల్లి చెక్‌పోస్ట్ వద్ద కారును తనిఖీ చేయగా 195 కిలోల నిషేధిత గుట్కా పట్టుబడింది. కారుతో పాటు గుట్కాను వశపరచుకుని, దిండుకల్ జిల్లాకు చెందిన డ్రైవర్ విజయరాజ్ (25)ను అరెస్టు చేశారు. కర్ణాటక నుంచి సేలంకు గుట్కా తరలిస్తున్నట్లు తెలిసింది.

ఇంటివద్దనే ఆటో డ్రైవర్ హత్య


హతుడు అరుణ్

దొడ్డబళ్లాపురం: ఆటో డ్రైవర్ హత్యకు గురైన ఘటన బెంగళూరు బ్యాటరాయనపుర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. టింబర్ లేఔట్ నివాసి,ఆటో డ్రైవర్ అరుణ్(24 మంగళవారం రాత్రి ఇంటి తన ముందు స్నేహితులతో కలిసి మాట్లాడుతుండగా హఠాత్తుగా మారణాయుధాలతో వచ్చిన దుండగులు విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యారు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ అరుణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. గతంలో అరుణ్‌పై బ్యాటరాయనపుర పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదైంది. పాత కక్షల నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కలబుర్గి, గౌరీలంకేశ్ హత్యకేసుల విచారణకు ప్రత్యేక కోర్టు

•సీఎం ఆదేశాలు

బనశంకరి: సీనియర్ సాహితీవేత్త డాక్టర్ ఎంఎం.కలబుర్గి, సీనియర్ పాత్రికేయురాలు, సామాజికకార్యకర్త గౌరీలంకేశ్ హత్య కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. కేసు విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని ఇటీవల కలబుర్గి భార్య ఉమాదేవి కోరింది. అదేవిధంగా గౌరీలంకేశ్ హత్య కేసు విచారణకు కూడా ప్రత్యేక కోర్టు ఏర్పాటుచేసి న్యాయవాదిని నియమించాలని గౌరీ లంకేశ్ సోదరి కవితాలంకేశ్ కోరారు. దీంతో ఈరెండు కేసుల దర్యాప్తునకు ప్రత్యేక కోర్టు ఏర్పాటుచేయాలని పరిపాలనశాఖకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య సూచించారు.

క్లుప్తంగా...

అంబేడ్కర్ గొప్ప సంఘ సంస్కర్త: గవర్నర్

సాక్షి, అమరావతి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప సంఘ సంస్కర్త అని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా గవర్నర్ నివాళులర్పించారు. సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేడ్కర్ నిరుపమాన కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆదర్శాలు భావి తరాలకు కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు నిరుపమానం

సీఎం జగన్ నివాళి



సాక్షి, అమరావతి: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో హోం శాఖ మంత్రి తానేటి వనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, ప్రభుత్వ సలహాదారు(సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకరరావులు పాల్గొని నివాళులర్పించారు. 'భారత రాజ్యాంగ ప్రదాత, దేశ పాలనా మార్గదర్శకాల విధాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ గారి వర్ధంతి నేడు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు నిరుపమానం. ఆ మహనీయుని అడుగుజాడల్లో నడుస్తూ మన ప్రభుత్వం బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి అహర్నిశలూ కృషి చేస్తోంది. బాబా సాహెబ్ గారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు' అంటూ ట్వీట్ చేశారు.

ఏపీ, తెలంగాణ భవన్‌లో అంబేడ్కర్‌కు ఘన నివాళి

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణ భవన్‌లో బుధవారం బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భవన్ అధికారులు, సిబ్బంది అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేడ్కర్ కీలకపాత్ర పోషించారని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఏపీ/తెలంగాణ భవన్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'దళితుల అభివృద్ధిని ఓర్చుకోలేకపోతున్నారా?'



సాక్షి, తిరుపతి: సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ దళితులు అభివృద్ధి చెందుతుంటే టీడీపీ, జనసేన, ఈనాడు, ఏబీఎన్ ఓర్చుకోలేకపోతున్నాయని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలను, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్ నిజం చేశారని చెప్పారు. పేదల జీవితాలు బాగుపడాలంటే చదువు ఒక్కటే మార్గమని గుర్తించిన సీఎం జగన్.. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి దేశంలోనే ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టారని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాల్లోని పేద పిల్లలందరూ ఉన్నత చదువులు చదవాలని సీఎం జగన్ తపన పడుతుంటే.. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, ఎల్లో మీడియా కుట్రలు పన్నుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్కూళ్ల నిర్వహణకు నిధులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. గతంలో అమ్మ ఒడి పథకం కింద ఇచ్చిన నగదులో ప్రతి విద్యార్థికి రూ.1000 చొప్పున స్కూల్ నిర్వహణ కోసం (స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్) కేటాయించారు. దీని నుంచి రూ.183 కోట్లను విడుదల చేశారు. ఈ నిధులతో మనబడి నాడు–నేడు మొదటి దశ పనులు పూర్తయిన పాఠశాలల్లోను, మూడో దశలో పనులు చేపట్టాల్సిన పాఠశాలల్లో వివిధ రకాల మరమ్మతు పనులు చేపట్టనున్నారు. కంపెనీ వారంటీ ఉన్న పరికరాలకు సంస్థలే మరమ్మతులు చేయనుండగా, మిగిలిన పనులకు ఈ నిధులను ఖర్చు చేయనున్నారు.

తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడు?

● తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర బీజేపీకి త్వరలోనే కొత్త సారథి రాబోతున్నారా? ఈ ప్రశ్నకు పార్టీవర్గాల నుంచి అవుననే సమాధానమే వస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, అసెంబ్లీ ఎన్నికల దాకే బాధ్యతలు నిర్వహిస్తానని గతంలో అధిష్టానానికి స్పష్టం చేశారు. నాయకత్వం ఒత్తిడి మేరకు అప్పట్లో అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ఆయన ఇటీవలి ఎన్నికల ఫలితాలతో లోక్‌సభ ఎన్నికల దాకా కొనసాగేందుకు ఇష్టపడలేదని సమాచారం.

మళ్లీ బండి, ఈటల లేదా అర్వింద్

కొత్త అధ్యక్షుడిని నియమించాల్సి వస్తే.. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ లేదా ఈటల రాజేందర్‌ను లేదా నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురిలలో ఒకరిని జాతీయ నాయకత్వం నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..



శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పాతదేవరాయపల్లిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సంపూర్ణమ్మ తదితరులు



చిత్తూరు జిల్లా మొగిలివారిపల్లెలో పథకాల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, నేతలు



ఏలూరు జిల్లా నూజివీడు 2వ వార్డు సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



విజయనగరం జిల్లాలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్మోహనరావు

అబద్ధాల బాబు.. నిజం చెప్పరుగా!

తుపాను సాయంపైనా బాబు అవే అసత్యాలు

- భోజనం కూడా పెట్టడంలేదని అడ్డగోలు వాదన
- టీడీపీ హయాంలో కంటే మిన్నగా సహాయక చర్యలు
- ఆర్థిక సాయం, పంట నష్ట పరిహారం వంటివన్నీ గతంకంటే ఎక్కువే
- ఏ సీజన్‌లో పంట దెబ్బతింటే ఆ సీజన్ చివరలో పరిహారం
- చంద్రబాబు హయాంలో ఇచ్చింది అరకొరే.. అదీ ఎప్పుడిస్తారో తెలియదు
- పునరావాస కేంద్రాల నుంచి తిరిగి వెళ్లేటప్పుడు రూ.1000 నుంచి రూ.2500 ఆర్థిక సాయం
- ఇవన్నీ మరచి ఇష్టానుసారం ఆరోపణలు

సాక్షి, అమరావతి: అబద్ధాల్లో మహా దిట్టగా పేరొందిన చంద్రబాబు ఎప్పుడూ నిజాలు మాట్లాడరు. ఏది చెప్పినా అబద్ధమే. అదే తీరులో తుపాను సాయంపైనా అడ్డగోలు వాదనలతో ప్రజలను మభ్య పెట్టాలని ప్రయత్నిస్తున్నారు. మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా ముమ్మరంగా సహాయక చర్యలు జరుగుతుంటే.. కళ్లుండి కూడా చంద్రబాబు వాటిని చూడలేకపోతున్నారు. తుపాను బాధితులకు భోజనం కూడా పెట్టడంలేదంటూ అవలీలగా అబద్ధాలాడేస్తున్నారు. బాబు అధికారంలో ఉన్నప్పుడు వచ్చిన హుదూద్, తిత్లీ తుపాను సమయంలో చేయని సాయాన్ని కూడా చేసినట్లు, ఇచ్చిన అరకొర పరిహారాలను కూడా భారీగా ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ప్రస్తుతం వచ్చిన మిచాంగ్ తుపాను నుంచి ప్రజలను, ఆస్తులను రక్షించడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలను ముందస్తుగానే అప్రమత్తం చేసింది. ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చర్యలు చేపట్టింది. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి అవసరమైన సకల ఏర్పాట్లు చేసింది. పునరావాస కేంద్రాల్లో మంచి వాతావరణం కల్పించి, పౌష్టికాహారాన్ని అందించింది. అయినా ప్రజలకు ఏమీ చేయడంలేదంటూ చంద్రబాబు ప్రచారం చేస్తున్న తీరుపై ప్రజల్లోనే అసహనం వ్యక్తమవుతోంది.

ఉదారంగా సీఎం జగన్ సాయం

తుపాను ముందు జాగ్రత్త చర్యలతోపాటు దెబ్బతిన్న ప్రాంతాల పునర్నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఎంతో ఉదారంగా నిధులిస్తోంది. ప్రమాదవశాత్తూ ఎవరైనా చనిపోతే ఇచ్చే ఎక్స్‌గ్రేషియా నుంచి కూలిపోయిన ఇళ్లు, దెబ్బతిన్న పంటలు వంటి అన్నింటికీ చంద్రబాబు కంటే ఎంతో మెరుగ్గా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సాయం అందిస్తున్నారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, ఇవ్వాల్సిన పరిహారానికి సంబంధించి 2022–23 నుంచి 2025–26 సంవత్సరాల కోసం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్డీఆర్ఎఫ్) మార్గదర్శకాలకు అనుగుణంగా స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్డీఆర్ఎఫ్) నిబంధనలను సవరిస్తూ జీవో ఎంఎస్ నెంబర్ 5 విడుదల చేసింది. అందుకనుగుణంగా పరిహారం ఇస్తోంది.

ఇళ్లకిచ్చే పరిహారంపైనా వక్రీకరణలు

టీడీపీ ప్రభుత్వం ఇళ్లు కూలిపోయిన వారికి రూ.95 వేలతో కొత్త ఇల్లు కట్టించి, రూ.4 లక్షలతో కట్టించి ఇచ్చినట్లు అబద్ధాలు చెప్పుకుంటోంది. సీఎం జగన్ మైదాన ప్రాంతాల్లో ఇళ్లు కూలిపోతే రూ.1.20 లక్షలు, కొండ ప్రాంతాల ఇళ్లకు రూ.1.30 లక్షలు పరిహారం ఇస్తున్నారు. అలాగే దెబ్బతిన్న ఇళ్లకు ఇచ్చే పరిహారాన్ని రూ.8 వేల నుంచి రూ.10 వేలకు పెంచి ఇస్తున్నారు. దెబ్బ తిన్న ఇళ్లకు రూ.8 వేలు ఇచ్చిన టీడీపీ.. రూ.10 వేల ఆర్థిక సాయం చేసినట్లు అబద్ధాలాడుతోంది. దెబ్బతిన్న పశువుల షెడ్ల మరమ్మతులకు ఈ ప్రభుత్వంలో రూ.30 వేలు ఇస్తుంటే, దాన్ని రూ.2100 ఇచ్చినట్లు ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రకృతి విపత్తుల కారణంగా వ్యవసాయ భూముల్లో చేరిన మట్టి, ఇసుక మేట తొలగించేందుకు చంద్రబాబు హయాంలో హెక్టారుకి రూ.12 వేలు ఉండగా, వైఎస్ జగన్ ప్రభుత్వం దాన్ని రూ.18 వేలకు పెంచి ఆ సీజన్ చివరలో ఇస్తోంది. దెబ్బతిన్న వరి, వేరుశెనగ, పత్తి, చెరకు పంటలకు హెక్టారుకి రూ.15 వేల పరిహారాన్ని ఈ ప్రభుత్వం ఇస్తోంది. చంద్రబాబు హయాంలో ఇదే రూ.15 వేలు.. అదీ ఎప్పుడు ఇస్తారో కూడా తెలియక రైతులు అల్లాడేవారు. కానీ చంద్రబాబు రూ.20 వేలు ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారు. దెబ్బతిన్న వర్షాధార పంటలకు హెక్టారుకి గతంలో రూ.6,800 ఉన్న పరిహారాన్ని ఈ ప్రభుత్వం రూ.8,500కి పెంచి ఇస్తోంది. నీటి సదుపాయం ఉన్న భూములైతే ఇన్‌పుట్ సబ్సిడీ గతంలో రూ.13,500 ఇవ్వగా, సీఎం జగన్ రూ.17 వేలు ఇస్తున్నారు.



చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే.. ఇవిగో నిజాలు

చంద్రబాబు హయాంలో తిత్లీ, హుదూద్ తుపాన్లకు వరి పంట దెబ్బతింటే హెక్టారుకి రూ.15 వేలు ఇచ్చి రూ.20 వేలు ఇచ్చినట్లు దొంగ ప్రచారం చేసుకున్నారు. ఇప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వంలో హెక్టారుకు రూ.17 వేల పరిహారం ఇస్తున్నారు. ఆక్వాకు హెక్టారుకి రూ.30 వేలు పరిహారం ఇచ్చినట్లు చెబుతున్న చంద్రబాబు.. వాస్తవానికి ఇచ్చింది రూ.12,200 మాత్రమే. ఇదే ఆక్వా సాగుకు సీఎం వైఎస్ జగన్ హెక్టారుకి రూ.18 వేల పరిహారం ఇస్తుంటే.. రూ.8,200 ఇస్తున్నట్లు బాబు మాయ మాటలు చెబుతున్నారు. గాయపడిన వ్యక్తులకు రూ.59 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్న చంద్రబాబు.. రూ. లక్ష ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారు. ఇప్పుడు గాయాలైన వారికి రూ.74 వేలు ఇస్తున్న విషయాన్ని వక్రీకరిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన వారికి టీడీపీ హయాంలో రూ.2 లక్షలున్న పరిహారాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.2.5 లక్షలకు పెంచి ఇస్తోంది.

దెబ్బతిన్న బోట్లకిచ్చే పరిహారంపెంపు అయినా బాబు ఏడుపు

మత్స్యకారుల బోట్లకు ఇచ్చే పరిహారాన్ని కూడా సీఎం జగన్ ప్రభుత్వం పెంచింది. బోట్లు పాక్షికంగా దెబ్బతింటే చంద్రబాబు హయాంలో రూ.5 వేలు ఇవ్వగా ఇప్పుడు రూ.6 వేలు ఇస్తున్నారు. బోట్ల మరమ్మతులకు చంద్రబాబు రూ.2100 ఇవ్వగా, జగన్ ప్రభుత్వంలో రూ.3 వేలు ఇస్తున్నారు. పూర్తిగా దెబ్బతిన్న బోట్ల స్థానంలో కొత్త బోట్ల కొనుగోలుకు చంద్రబాబు హయాంలో రూ.10 వేలు ఉండగా ఇప్పుడు రూ.15 వేలు ఇస్తున్నారు. మోటార్ బోటు దెబ్బతింటే ఇప్పుడు రూ.20 వేలు ఇస్తుండగా..., అప్పట్లో రూ. 8,200 ఇచ్చిన చంద్రబాబు రూ.30 వేలు ఇచ్చినట్లు అబద్ధాలు చెప్పుకుంటున్నారు. తుపాను కారణంగా నిరాశ్రయులైన కుటుంబాలకు దుస్తుల కోసం టీడీపీ హయాంలో రూ.2 వేలు ఉన్న పరిహారాన్ని జగన్ ప్రభుత్వం రూ. 2,500కి పెంచి ఇస్తోంది. ఇంట్లో వస్తువులు కోల్పోయిన వారికివ్వాల్సిన సాయాన్ని కూడా జగన్ ప్రభుత్వం రూ.2 వేల నుంచి రూ.2500కి పెంచింది.

గతంలో లేని విధంగా రూ.1,000 నుంచి రూ.2,500 ఆర్థిక సాయం

పునరావాస కేంద్రాల్లో ఉన్న తుపాను బాధితులు తిరిగి ఇళ్లకు వెళ్లే ముందు చంద్రబాబు ప్రభుత్వం వారికి ఆర్థిక సాయం అందించేది కాదు. తొలిసారిగా వైఎస్ జగన్ ప్రభుత్వం పునరావాస కేంద్రాల నుంచి బాధితులు ఇళ్లకు తిరిగి వెళ్లే ముందు ప్రతి కుటుంబానికి రూ.1000 నుంచి రూ.2,500 వరకు ఇస్తోంది. ఈ నాలుగున్నరేళ్లలో ఏ విపత్తు వచ్చినా బాధిత కుటుంబాలకు ఆ సొమ్ము అందించింది. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు బాధిత కుటుంబాలను పట్టించుకున్న పాపాన పోలేదు.

నేడు మడకశిరలో సామాజిక సాధికార యాత్ర

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మంచిని వివరించడానికి వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతంగా కొనసాగుతున్నది. గురువారం ఈ యాత్ర శ్రీసత్యసాయి జిల్లాలోని మడకశిర నియోజకవర్గంలో జరుగుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులు యాత్రలో పాల్గొని సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా సీఎం జగన్ చేసిన మేలును ప్రజలకు వివరించనున్నారు.



వధూవరులకు సీఎం వైఎస్ జగన్ దంపతుల ఆశీర్వాదం

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ దంపతులు.. ఎమ్మెల్సీ తలశిల రఘురాం కుమార్తె వివాహ వేడుకకు హాజయ్యారు. విజయవాడలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం జరిగిన వేడుకలో వధువు ప్రణవ, వరుడు విష్ణులను సీఎం జగన్, వైఎస్ భారతీలు ఆశీర్వదించారు. పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు హాజరయ్యారు.

అంబేడ్కర్ మార్గాన్ని అనుసరిస్తున్న సీఎం జగన్

అంబేడ్కర్‌కు నివాళులర్పించిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు



సాక్షి, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించిన మార్గాన్ని అమలు చేస్తున్న సీఎం దేశంలో ఒక్క వైఎస్ జగన్ మాత్రమేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. భారత రాజ్యాంగాన్ని రచించి దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లేలా చేసిన అంబేడ్కర్ చిరస్మరణీయులని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేరుగు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు అంబేడ్కర్ వర్ధంతి, జయంతిల సందర్భంగా ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి అంతటితో సరిపుచ్చుతారేగానీ.. పేదరికాన్ని పారదోలేందుకు, సమానత్వం సాధించేందుకు ఆయన సూచించిన మార్గాలను మాత్రం నిర్లక్ష్యం చేస్తారని చెప్పారు. రాష్ట్ర మంత్రి వర్గంలోనూ, ఇతర పదవులల్లోనూ, అమలు చేస్తున్న పథకాల్లోనూ.. సమానత్వం సాధించే దిశగా నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్న వ్యక్తి సీఎం జగన్ ఒక్కరేనని కొనియాడారు. ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ అంబేడ్కర్ దూరదృష్టి, ఆలోచనల వల్ల దేశంలోని ప్రజాస్వామ్యం గొప్పగా పరిఢవిల్లుతోందన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి చేసి పేద పిల్లలు మంచి విద్యనభ్యసించాలని.. తద్వారా వారు ప్రపంచ స్థాయి విద్యార్థులుగా రూపొందాలని భావించి.. ఆ దిశగా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారని చెప్పారు. మరో ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ పేద, ధనిక పిల్లలనే తారతమ్యం లేకుండా అందరికీ విద్యనందించేలా విద్యా వ్యవస్థను సీఎం జగన్ తీర్చిదిద్దారని ప్రశంసించారు. ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనా విధానంలో భాగంగా సీఎం వైఎస్ జగన్.. అభివృద్ధిని, సంక్షేమాన్ని మేళవించి ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాబుతో పవన్ భేటీ

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ బుధవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. ఈ భేటీపై తెలుగుదేశం, జనసేన పార్టీలు అధికారికంగా మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. పవన్‌కళ్యాణ్ గురువారం విశాఖపట్నంలో పర్యటించనున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన ఘోర పరాజయం అనంతరం తొలిసారి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించేముందు పవన్‌కళ్యాణ్.. చంద్రబాబుతో సమావేశం కావడంపై రాజకీయ శ్రేణుల్లోను, జనసేన నేతల్లోను రకరకాలుగా చర్చలు సాగుతున్నాయి. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసే కార్యక్రమానికి చంద్రబాబును ఆహ్వానించారని వార్తలు రావడం, పవన్‌కళ్యాణ్ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మిత్రపక్షంగా పోటీచేసిన నేపథ్యంలో ఈ అంశంపైనా వీరి మధ్య ప్రధానంగా చర్చ జరిగి ఉండొచ్చని జనసేన నేతలు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో రెండుపార్టీలు ఉమ్మడిగా చేపట్టనున్న కార్యక్రమాలపైన కూడా చర్చించి ఉండొచ్చని అంటున్నారు.

'అట్లూరి' మామూలోడు కాదు!

- బాబు, చినబాబుతోనే సాన్నిహిత్యం?
- టీడీపీ నేతలతోనూ సన్నిహిత సంబంధాలు
- పలు చీటింగ్ కేసుల్లో నిందితుడిగా సినీ నిర్మాత అట్లూరి నారాయణరావు
- అరెస్టు విషయం తెలియడంతో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో (సీసీఎస్) నమోదైన ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) కేసులో అరెస్టు అయిన తెలుగు సినీ నిర్మాత అట్లూరి నారాయణరావుకు తెలుగుదేశం పార్టీ నేతలతో సన్నిహిత సంబంధాలున్నట్టు వెలుగులోకి వచ్చింది. సదరు నారాయణరావు అయితే ఏకంగా తనకు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు నారా లోకేష్‌లతో సైతం సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు చెప్పుకునే వాడని తెలిసింది. వందల మంది నుంచి డిపాజిట్ల రూపంలో రూ.540 కోట్లు వసూలు చేసి నిలువునా మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్న ఈ స్కామ్‌లో గత వారం అరెస్టు అయిన నారాయణరావుని సీసీఎస్ పోలీసులు కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకున్నారు. బుధవారంతో కస్టడీ గడువు పూర్తి కావడంతో నాంపల్లి కోర్టులో హాజరు పరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

సినీ రంగంలోకి ప్రవేశించాకే మోసగాడిగా...

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా పామర్రుకు చెందిన నారాయణరావు హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేశాడు. బంజారాహిల్స్‌లోని ఉంటూ సినీ నిర్మాతగా మారాడు. 2018లో 'నీది నాది ఒకే కథ', 2022లో 'నచ్చింది గర్ల్ ఫ్రెండు'చిత్రాలు తీశాడు. దీనికి అవసరమైన డబ్బు కోసమే మోసాలు చేయడం మొదలెట్టాడు. శేరిలింగంపల్లిలోని తారానగర్‌లో దేవాదాయ ధర్మాదాయ శాఖకు 3 ఎకరాల భూమికి నకిలీ పత్రాలు సృష్టించి, బంజారాహిల్స్‌కు చెందిన వ్యాపారి సయ్యద్ మహమూద్ హుస్సేన్‌ను సంప్రదించి ఆయన నుంచి రూ.1,65,12,500 కాజేశాడు. ఈ కేసు ప్రస్తుతం కోర్టు విచారణలో ఉంది.

'బాబు'ల వ్యవహారాలు చూసేవాడినంటూ..

నారాయణరావుకు తెలుగుదేశం నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. చంద్రబాబు, లోకేష్‌తో సైతం తాను దగ్గరగా మెలుగుతుంటానని ప్రచారం చేసుకునేవాడు. తరచుగా వారికలుస్తుంటాననీ, వారికి సంబంధించిన హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని వ్యవహారాలను పర్యవేక్షిస్తుంటానని చెప్పుకునే వాడని తెలిసింది.

ఆ డబ్బుతోనే మరో సినిమా..

ఎఫ్ఎంసీజీ కేసులో నారాయణరావును అరెస్టు చేసిన పోలీసులు ప్రాథమిక విచారణతో పాటు రెండు రోజుల పోలీసు కస్టడీ విచారణలో కీలక విషయాలు సేకరించారు. ఓ చార్టెడ్ అకౌంటెడ్ ద్వారా రాంబాబుకు పరిచయమైన నారాయణరావు తన పలుకుబడి వినియోగించి కేసు లేకుండా చేస్తానని హామీ ఇచ్చాడు. ఇందుకు రూ.2 కోట్లు ఇవ్వాలంటూ అడ్వాన్స్‌గా రూ.10 లక్షలు, కోటి విలువైన బంగారు ఆభరణాలు తీసుకున్నాడు. కానీ ఆ కేసు విషయంలో ఎలాంటి సహాయం చేయలేకపోయాడు. దీంతో ఇన్సాల్వెన్సీ పిటిషన్ (ఐపీ) దాఖలు చేసి బయటపడదామని రాంబాబుకు సలహా ఇచ్చి ఖమ్మం కోర్టులో అక్కడి న్యాయవాదితో దాఖలు చేయించే ప్రయత్నం చేశాడు. ఈలోగా బంగారు ఆభరణాలను పాతబస్తీలో కరిగించి రూ.90 లక్షలకు అమ్మేసి సొమ్ము చేసుకున్నాడు. ఈ డబ్బుతోనే మరో చిత్ర నిర్మాణం ప్రారంభించాడు. ఇది ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బుధవారం నారాయణరావును జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

● తెలంగాణ

నేడు రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం

- మధ్యాహ్నం 1.04 గంటలకు ముహూర్తం
- ఎల్బీ స్టేడియంలో భారీగా ఏర్పాట్లు, కాంగ్రెస్ పెద్దల హాజరు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సీఎంగా ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి సర్వం సిద్ధమైంది. కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేతగా ఎన్నికైన రేవంత్‌రెడ్డితో గురువారం మధ్యాహ్నం 1.04 గంటలకు గవర్నర్ తమిళిసై ప్రమాణ స్వీకారం చేయిస్తారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం జరగనుంది. ప్రమాణ స్వీకారం అనంతరం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక తదితరులు హాజరు కానున్నారు.

ప్రమాణ స్వీకారానికి రండి: రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రిగా తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకావాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకలను టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. సీఎల్పీ నేతగా ఎన్నికైన తర్వాత మంగళవారం రాత్రి ఢిల్లీ వెళ్లిన రేవంత్ బుధవారం అంతా బిజీబిజీగా గడిపారు. పార్టీ సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఖర్గేలతో.. సోనియా, రాహుల్, ప్రియాంకగాంధీలతో విడివిడిగా భేటీ అయ్యారు. గురువారం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు.

కేసీఆర్, చంద్రబాబులకు పిలుపు!

రేవంత్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాల్సిందిగా పలువురు జాతీయ నాయకులు, సీఎంలు, మాజీ సీఎంలకు టీపీసీసీ నుంచి ఆహ్వానాలు వెళ్లాయి. మాజీ సీఎం కేసీఆర్, ఏపీ మాజీ సీఎం చంద్రబాబులను రేవంత్ ఆహ్వానించారని గాంధీభవన్ వర్గాల సమాచారం.

భట్టికి రెవెన్యూ.. ఉత్తమ్‌కు ఆర్థికం?

కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గ కూర్పు కీలకంగా మారింది. ఎక్కువ మంది సీనియర్లు ఉండటం, ప్రాధాన్య శాఖల కోసం పోటీపడుతుండటంతో ఉత్కంఠ నెలకొంది. పలువురు సీనియర్లకు మంత్రులుగా అవకాశం ఖాయమైనా.. వారికి కేటాయించే శాఖలేమిటనేది ఇంకా తేలలేదు. సీఎం రేవంత్‌తో పాటు మంత్రులుగా మరో 12 మంది వరకు ప్రమాణం చేయనున్నట్లు సమాచారం. ఈ జాబితాలో సీనియర్ నేతలు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో భట్టికి రెవెన్యూ శాఖ, ఉత్తమ్‌కు ఆర్థిక శాఖ ఇవ్వవచ్చని, మరో సీనియర్ నేతకు హోంశాఖ ఇస్తారని టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి. అధిష్టానం సూచనలకు అనుగుణంగా.. ప్రమాణ స్వీకారం తర్వాత సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి ఆయా మంత్రులకు శాఖలను కేటాయిస్తారు.

ఢిల్లీలో చర్చోపచర్చలు

రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కాకుండా 17 మంది మంత్రులను నియమించొచ్చు. రేవంత్‌రెడ్డి మంగళవారం రాత్రి ఢిల్లీలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, ఏఐసీసీ పరిశీలకుడు డీకే శివకుమార్‌తో మంత్రివర్గ కూర్పుపై సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది.

రేవంత్‌ను కలవని సీనియర్లు

మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం దాకా ఢిల్లీలోనే ఉన్న రేవంత్‌రెడ్డి ఓవైపు.. ఉత్తమ్, భట్టి, శ్రీధర్‌బాబు తదితర సీనియర్లు మరోవైపు ఏఐసీసీ పెద్దలతో భేటీలు జరిపారు. కానీ సీనియర్లు ఎవరూ రేవంత్‌ను కలవలేదు. ఆయన అధిష్టానం పెద్దలను కలసినప్పుడూ వారు దూరంగానే ఉండటం చర్చనీయాంశంగా మారింది.

మా నాయకుడు రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) నాయకుడిగా రేవంత్‌రెడ్డిని ఎన్నుకుంటూ చేసిన తీర్మానాన్ని టీపీసీసీ నేతలు గవర్నర్ కార్యాలయంలో అందజేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో మాజీ ఎంపీ మల్లురవి, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్‌రెడ్డి బుధవారం రాజ్‌భవన్‌కు వెళ్లారు. ఎల్లా హోటల్‌లో ఎమ్మెల్యేల నుంచి సేకరించిన సంతకాలతో కూడిన లేఖను, సీఎల్పీ తీర్మాన ప్రతిని గవర్నర్ కార్యదర్శి సురేంద్రమోహన్‌కు అందజేశారు.

'పుష్ప' మూవీ నటుడు కేశవ అరెస్ట్

పంజగుట్ట(హైదరాబాద్): 'పుష్ప'సినిమాలో హీరో స్నేహితునిగా నటించి ఎంతో క్రేజ్ సంపాదించుకున్న నటుడు జగదీశ్ అలియాస్ కేశవ (మచ్చా) ఓ యువతి ఆత్మహత్యకు కారణమయ్యాడు. హైదరాబాద్‌లోని పంజగుట్ట పోలీసులు బుధవారం అతన్ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కాకినాడకు చెందిన యువతి సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టుగా నటిస్తుండేది. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంగీత్‌నగర్‌లో అపార్ట్‌మెంట్‌లో నివసిస్తుండేది. ఆమెకు భర్తతో విడాకులు అయ్యాయి. కొంతకాలం కిందట ఆమెకు నటుడు జగదీష్ పరిచయమయ్యాడు. అది కాస్తా ప్రేమగా మారి కొద్దిరోజులు లివింగ్ రిలేషన్‌లో ఉన్నారు. జగదీష్ ఆ యువతిని కాదని మరో యువతిని వివాహం చేసుకోవడంతో ఆమె జగదీష్‌ను దూరం పెట్టసాగింది. గత నెల 27వ తేదీన మహిళ నివసించే ఫ్లాట్ వద్దకు వచ్చిన జగదీష్.. సదరు మహిళ మరో యువకునితో సన్నిహితంగా ఉన్న ఫొటోలను తీశాడు. వాటితో ఆమెను బెదిరించాడు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన యువతి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడు జగదీశ్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు.

విజయానికి తొలి మెట్టు కల కనడం.
కల కనడం ఎంత తేలికో ఆ కలను నిజం చేసుకోవడం అంత కష్టం.
అయితే లక్ష్య సాధన వైపు బలంగా అడుగులు వేసే వారికి
కలను నెరవేర్చుకోవడం కష్టం కాదని ఈ ఇద్దరు నిరూపించారు.
మిజోరం నేపథ్యంగా చరిత్ర సృష్టించి వార్తల్లో వ్యక్తులుగా నిలిచారు
వన్నెహోస్సంగీ, మనీషా పధి...

కలల సాధకులు... చరిత్ర సృష్టించారు

ఎమ్మెల్యే బారిల్

మిజోరంలో రాజకీయ సంప్రదాయాన్ని పక్కన పెట్టి అధికారంలోకి రాబోతున్న జోరం పీపుల్స్ మూమెంట్ (జెడ్‌పీఎం) గురించి మాట్లాడుకున్నట్లుగానే ఆ పార్టీ నుంచి శాసనసభకు ఎన్నికైన బారిల్ వన్నెహోస్సంగి గురించి కూడా ఘనంగా మాట్లాడుకుంటున్నారు. రేడియో జాకీగా పని చేసిన 32 ఏళ్ల బారిల్ వన్నెహోస్సంగి 'జెడ్‌పీఎం' నుంచి శాసనసభకు ఎన్నికైన అత్యంత చిన్న వయస్కురాలైన మిజోరం శాసన సభ్యురాలిగా రికార్డ్ సృష్టించింది...


● బారిల్ వన్నెహోస్సంగి

మిజోరం శాసనసభ ఎన్నికల్లో జోరం పీపుల్స్ మూమెంట్ (జెడ్‌పీఎం) ఘన విజయం సాధించడమనేది రాత్రికి రాత్రే జరిగిన అద్భుతం కాదు. అదృష్టం కాదు. మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్ఎఫ్), కాంగ్రెస్‌లను దాటుకొని అధికారం లోకి రావడం అంత తేలిక కాదు. అయితే 'జోరం పీపుల్స్ మూమెంట్' ఎప్పుడూ ధైర్యాన్ని కోల్పోలేదు.

'మనకంటూ ఒకరోజు తప్పకుండా వస్తుంది' అని గట్టిగా అనుకుంది. సరిగ్గా ఇదే స్ఫూర్తి వన్నెహోస్సంగిలో కనిపిస్తుంది. చలాకీగా, నవ్వుతూ, నవ్విస్తూ కనిపించే వన్నెహోస్సంగి రాజకీయ, సామాజిక సంబంధిత విషయాలను మాట్లాడుతున్నప్పుడు మాత్రం 'ఈ అమ్మాయి ఆ అమ్మాయి ఒకరేనా' అన్నట్లుగా ఉంటుంది.

బలమైన రాజకీయ అభిప్రాయాలు ఉన్న వారికి సైద్ధాంతిక పునాది కూడా ముఖ్యం. కాలేజీ రోజుల నుంచే రాజకీయ దిగ్గజాలతో మాట్లాడడం, ఎన్నో పుస్తకాలు చదవడం ద్వారా ఎన్నో విషయాలపై సాధికారత సాధించ గలిగింది వన్నెహోస్సంగి.

హైస్కూల్ రోజుల నుంచి మొదలు మేఘాలయా రాజధాని షిల్లాంగ్ లోని నార్త్ ఈస్ట్ హిల్ యూనివర్శిటీలో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ చేసిన సమయం వరకు వన్నెహోస్సంగి ఎప్పుడూ విన్న మాట, బాధ పెట్టిన మాట ... 'రాజకీయాలు మహిళలకు తగనివి. రాజకీయాల్లోకి వచ్చినా రాణించలేరు'

ఈ భావన తప్పు అని నిరూపించడానికి క్రియాశీల రాజకీయాల్లోకి రావాలనే కోరిక ఆమె మనసులో బలంగా పడింది.

రేడియో జాకీగా, టీవీ ప్రెజెంటర్‌గా పని చేసిన వన్నెహోస్సంగి ఆ తరువాత రాజకీయాల్లోకి అడుగు పెట్టింది.

'రాజకీయాలు అంటే టీవి మైక్ ముందు మాట్లాడినంత తేలిక కాదు' అని ముఖం మీదే అన్నారు చాలామంది. వారి మాటలతో డీలా పడలేదు వన్నెహోస్సంగి. తమ మీద తమకు నమ్మకం ఉన్న వారి దగ్గర ఢీ అంటే ఢీ అనే ధైర్యం ఉంటుంది. ఆ ధైర్యంతోనే తొలిసారిగా మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేసి కార్పొరేటర్‌గా గెలిచింది. విశాల రాజకీయ ప్రపంచంలో కార్పొరేటర్‌గా గెలవడం చిన్న విజయమే కావచ్చుగానీ ఆ విజయం తనకు అపారమైన ధైర్యం ఇచ్చి–

'యస్. నేను సాధించగలను' అని ముందుకు నడిపించింది.

మిజోరంలోని ఐజ్వాల్ సౌత్–3 నియోజక వర్గం నుంచి 1,414 ఓట్ల మెజార్టీతో గెలిచిన బారిల్ వన్నెహోస్సంగి 'సంకల్ప బలం ఉండాలేగానీ మన కలల సాధనకు జెండర్ అనేది ఎప్పుడూ అవరోధం కాదు' అంటుంది.

ఇన్‌స్టాగ్రామ్‌తో ఎంతో మందికి చేరువ అయింది వన్నెహోస్సంగి. ఇన్‌స్టాగ్రామ్ అనేది ఆమె ఇంటి పేరుగా మారింది. ఇన్‌స్టాలో ఆమెకు మూడు లక్షల వరకు ఫాలోవర్‌లు ఉన్నారు.

'భవిష్యత్ లక్ష్యం ఏమిటీ?' అనే ప్రశ్నకు ఆమె ఇచ్చిన సమాధానం...'చదువు ద్వారా అద్భుతాలు సాధించవచ్చు. అభివృద్ధి పథంలో పయనించవచ్చు. అందుకే రాష్ట్రంలో విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడానికి నా వంతుగా ప్రయత్నిస్తాను' అంటుంది వన్నెహోస్సంగి.

యంగ్, ఎనర్జిటిక్ అండ్ డేరింగ్ అని అభిమానులు పిలుచుకునే వన్నెహోస్సంగి మదిలో ఎన్నో కలల ఉన్నాయి. అవి రాష్ట్ర అభివృద్ధితో ముడిపడి ఉన్న కలలు. ఆ కలల సాకారంలో శాసనసభ్యురాలిగా తొలి అడుగు వేసింది.

ఏడీసీ మనీషా


● మిజోరం గవర్నర్ హరిబాబుతో స్క్వాడ్రన్ లీడర్ మనీషా

చిన్నప్పుడు తండ్రి యూనిఫాంను పోలిన డ్రెస్ ధరించి ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌గా తెగ హడావిడి చేసింది మనీషా. అద్దంలో తనను తాను చూసుకుంటూ మురిసిపోయింది. తండ్రి నడకను అనుకరించింది. ఆరోజు తమ ముద్దుల బిడ్డను చూస్తూ తెగ నవ్వుకున్న మనీషా తల్లిదండ్రులు, ఇప్పుడు కుమార్తె ఉన్నతిని చూసి గర్విస్తున్నారు. స్క్వాడ్రన్ లీడర్ మనీషా సాధి మిజోరం గవర్నర్ సహాయకురాలి (ఏడీసీ)గా నియామకం అయింది. మన దేశంలో గవర్నర్‌కు ఎయిడ్–డి–క్యాంప్ (ఏడీసీ)గా నియామకం అయిన ఫస్ట్ ఉమన్ ఇండియన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఆఫీసర్‌గా చరిత్ర సృష్టించింది...

మనీషా పధి స్వస్థలం ఒడిషా రాష్ట్రంలోని బెర్హంపూర్. తల్లి గృహిణి. తండ్రి మనోరంజన్ పధి ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్ అయ్యాడు. చిన్నప్పటి నుంచే చదువులో ముందుండేది మనీషా. చదువుకు తగ్గ ధైర్యం ఉండేది. తండ్రిలాగే 'ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్' కావాలని చిన్నప్పటి నుంచే కలలు కన్నది.

చిన్నప్పుడు తండ్రి యూనిఫామ్‌ను పోలిన డ్రెస్‌ను ధరించి సందడి చేసేది.

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో గ్రాడ్యుయేషన్ చేసిన మనీషా ఆ తరువాత ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో చేరింది. గతంలో ఎయిర్ ఫోర్స్ స్టేషన్–బీదర్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్– పుణె చివరగా భటిండాలోని ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో పనిచేసింది

'ఏడీసీగా మనీషా పధి నియామకం ఒక మైలురాయి మాత్రమే కాదు. లింగ వివక్షతను కాలదన్ని వివిధ రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తున్న మహిళా శక్తికి నిదర్శనం. ఈ అద్భుత విజయాన్ని సెలబ్రేట్ చేసుకుందాం. అన్ని రంగాల్లో మహిళా సాధికారతను కొనసాగిద్దాం' అని వ్యాఖ్యానించారు మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు.

'ఎయిడ్–డి–క్యాంప్' అనేది సాయుధ దళాల్లో ఉన్నత స్థాయి అధికారికి సహాయపడే అధికారి హోదాను సూచిస్తుంది. మన దేశంలో 'ఎయిడ్–డి–క్యాంప్' గౌరవప్రదమైన హోదా. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్... మొదలైన వాటిలో సర్వీస్ చీఫ్‌లకు సాధారణంగా ముగ్గురు 'ఎయిడ్–డి–క్యాంప్'లు ఉంటారు రాష్ట్రపతికి ఆర్మీ నుంచి ముగ్గురు, నేవీ, ఎయిర్ ఫోర్స్ నుంచి ఒక్కొక్కరు చొప్పున మొత్తం అయిదుగురు ఉంటారు. ఇక రాష్ట్ర గవర్నర్‌లకు ఇద్దరిని నియమిస్తారు.

మా కూతురు మా శక్తి

మనిషా పధి తల్లిదండ్రులు ఒడిషాలోని భువనేశ్వర్‌లో నివాసం ఉంటున్నారు. తమ కుమార్తె మిజోరం గవర్నర్ 'ఏడీసీ'గా నియామకం కావడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. '2015లో ఫస్ట్ పోస్టింగ్ నుంచి ఇప్పటి వరకు విధి నిర్వహణకు సంబంధించి ఎంతో అనుభవాన్ని సొంతం చేసుకుంది. ఆ అనుభవమే మనీషాను 'ఏడీసీ'గా నియామకం అయ్యేలా చేసింది. మనిషా తల్లిదండ్రులుగా ఈ నియామకం విషయంలో సంతోషిస్తున్నాం. గర్విస్తున్నాం' అంటున్నాడు మనీషా తండ్రి మనోరంజన్ పధి.

'చదువు విషయంలో, వృత్తి విషయంలో మనీషా మమ్మల్ని సంతోషానికి గురి చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అయితే ఇప్పుడు మాత్రం నా సంతోషాన్ని వ్యక్తీకరించడానికి మాటలు రావడం లేదు. మా అమ్మాయి చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో పెరిగింది' అంటుంది మనీషా తల్లి.

'తన కలను నిజం చేసుకోవడానికి సొంత ఊరు దాటి బయటి ప్రపంచంలోకి అడుగు పెట్టినప్పుడు మాతో పాటు మనీషాకు ఎంతో మంది నిరుత్సాహపరిచే మాటలెన్నో చెప్పారు. మనీషా ఒక్క నిమిషం కూడా అధైర్యపడింది లేదు. అలాంటి మాటలను పట్టించుకోవద్దని మేము గట్టిగా చెప్పేవాళ్లం. అమ్మాయిల కెరీర్ డ్రీమ్స్‌కు తల్లిదండ్రులు అండగా నిలబడితే వారు అద్భుత విజయాలు సాధిస్తారు. తల్లిదండ్రులు గర్వపడేలా చేస్తారు' అంటున్నాడు మనోరంజన్ పధి.


● మనీషా తల్లిదండ్రులు

మనీషా పధి తల్లిదండ్రులకు ఎన్నో ఫోన్ కాల్స్ వస్తున్నాయి. వాటి సారాంశం 'మీ అమ్మాయి బంగారం'

పుస్తకం

పని ప్రదేశంలో ఎలా ఉండాలంటే...

ఆఫీసు అంటేనే అక్కడ ఉన్న అందరితోనూ కలిసి పని చేయాలి.
ఇలాంటప్పుడు ఎవ్వరితోనైనా కలిసి ఎలా పని చేయాలి?
వర్క్‌ప్లేస్ ఎక్స్‌పర్ట్, స్పీకర్, రైటర్, హార్వర్డ్ బిజినెస్ రివ్యూ పాడ్‌కాస్ట్ హోస్ట్ అమీ గలో
కార్యాలయాలలో ఎలా ఉండాలో పుస్తకంగా మన ముందుకు తీసుకువచ్చారు.
'గెటింగ్ ఎలాంగ్' అనే ఈ బుక్
ఇప్పుడు పని ప్రదేశాల్లో ఉండే ఉద్యోగులకు
ఎంతగానో ఉపయోగపడుతుంది.
ప్రపంచవ్యాప్తంగా పని ప్రదేశాలలో ఎదుర్కొనే సమస్యలను అమీ గలో వివిధ రంగాల నుండి స్వయంగా సేకరించింది.
ఈ యేడాది చదివి తెలుసుకోదగిన పుస్తకాలలో
అమీ బుక్ ప్రముఖంగా నిలిచింది.
వర్క్ ప్లేస్‌లో ఎలా ఉండాలో అమీ
సేకరించిన విషయాలు, సూచించిన పరిష్కారాలు
ఉద్యోగులందరికీ ఎంతగానో తోడ్పడుతున్నాయి.



పనిలో సంఘర్షణ ఉంటుంది. పనిచేసే చోట సంబంధాలు కఠినంగా ఉంటాయి. వ్యక్తులతో వ్యవహరించేటప్పుడు ఒత్తిడి ఉంటే మన సృజనాత్మకత, ఉత్పాదకత కూడా తగ్గుతుంది. స్పష్టంగా ఆలోచించి, సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యమూ తగ్గుతుంది. ఈ విషయాల గురించి రాత్రిపూట ఆందోళన చెందుతూ నిద్రలేని రాత్రులు గడపవచ్చు. ఈ ప్రవర్తన చేస్తున్న ఉద్యోగం వదులుకునేలా చేస్తుంది. చేస్తున్న పని నుండి బయటకు వచ్చేసి, ఆ తర్వాత పశ్చాత్తాప పడవచ్చు. మీటింగ్‌లో కళ్లు తిప్పడం, ఎగరేయడం, సహోద్యోగులపై విరుచుకుపడటం లేదా మనం మాట్లాడాల్సినప్పుడు మౌనంగా ఉండటం కూడా మనల్ని ఉద్యోగం నుంచి వేరు చేస్తాయి. చాలావరకు నవ్వుతూ, వేరే మార్గం లేనట్టుగా వ్యక్తులను భరిస్తుంటారు. సరైన పరిష్కారాలు తెలియక హానికరమైన ప్రవర్తనలను భరిస్తుంటారు. ఇక్కడ చూడాల్సింది మనలోని చిత్తశుద్ధి, కెరియర్ మాత్రమే అని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

•••

వర్క్‌ప్లేస్ ఎక్స్‌పర్ట్ అమీ 'గెటింగ్ ఎలాంగ్'లో కష్టతరమైన సహోద్యోగులను గుర్తించి, ఇలా మన ముందుంచింది.

● **సరైన బాస్ లేకపోవడం:** వీరిపై ఉద్యోగుల్లో విశ్వాసం ఉండదు. ఫలితంగా ఏదో విధంగా మేనేజ్ చేస్తుంటారు. ఇలాంటి బాస్ తన గురించి ఇతరులు ఏమనుకుంటున్నారో అనే దాని గురించే ఎక్కువ ఆందోళన చెందుతారు. నిర్ణయాలు తీసుకోవడానికి, కట్టుబడి ఉండటానికి కష్టపడవచ్చు.

● **నిరాశగా ఉండేవారు:** ఇలాంటి వారితో సరైన ప్రోత్సాహం, కెరీర్‌లో పెరుగుదల ఉండదు.

● **దూకుడుతనంగా ఉండటం:** సహోద్యోగులు తమ గురించి ఏం ఆలోచిస్తున్నారు అనే ధోరణి ఉండదు. తాము ఏదైనా తెలియజేయడానికి పరోక్ష పద్ధతులను ఉపయోగిస్తారు. ఎప్పుడూ ఇతరుల అవసరాలను తీర్చడానికి ఉన్నట్టు కనిపిస్తారు.

● **అన్నీ తెలుసు అనే ఆలోచన:** అత్యంత తెలివైన వారిగా చూపించుకోవడానికి తపన పడుతుంటారు. తగినంత సమాచారం లేకపోయినా, చెప్పేది తప్పు అని తెలిసినా తనదే కరెక్ట్ అనే ధోరణిలో ఉంటారు.

● **హింసించే వ్యక్తులతో ఎప్పుడూ ప్రమాదమే:** సాధారణంగా ఒక సీనియర్ వ్యక్తి ఎన్నో ఆటుపోట్లను అధిగమిస్తేనే ఆ స్థాయికి చేరుకుంటారు. కానీ, అది మర్చిపోయి తన కింద ఉన్నవారితో అనుచితంగా ప్రవర్తిస్తుంటారు. తన ప్రవర్తనతో ఇతరులు బాధపడుతున్నారా అనేది కూడా ఆలోచించరు.

● **పక్షపాతంతో పనిచేసే సహోద్యోగి:** పై స్థాయిలో ఉన్నవారికి ఎప్పుడూ ఏదో ఒకటి చెబుతూనే ఉంటాడు. వారిని పొగుడుతుంటాడు. ఏదైనా నీ కోసం చేస్తాను అంటారు.

● **రాజకీయాలు చేసేవాళ్లు:** ఈ వ్యక్తులు తమ కెరీర్‌ను ఏ విధంగానైనా ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటారు. అందుకోసం అధికంగా ఖర్చు పెట్టడానికి కూడా వెనకాడరు. అబద్ధాలు చెబుతుంటారు.

అభద్రత పెంచే భయం

నాయకత్వ పాత్రను పోషించాల్సిన సందర్భంలో అభద్రత పెరుగుతుందని పరిశోధనలో తేలింది. అధికారుల అతిపెద్ద భయం అసమర్థతే అని ఒక సర్వేలో తేలింది. సీనియర్ స్థానానికి ప్రమోట్ అయినప్పుడు పనితీరుపై ఒత్తిడి పెరగడం వల్ల ఇది సంభవించవచ్చు.

టీమ్ వర్క్

బాస్ నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లను గుర్తించాలి. సంవత్సరాంతపు లక్ష్యాలను ఛేధించడం, వర్క్ పాలసీ గురించి నిరంతరం తెలుసుకోవాలి. ఉద్యోగులపై ఉన్న అభద్రతా భావాలను తొలగించగలగాలి. పనిని ఉమ్మడిగా చేయడానికి ప్రయత్నించాలి. పై అధికారి దగ్గర సాధ్యమైనంతవరకు 'మేము' వాక్యాన్నే జోడించాలి. ఉదాహరణకు..'ఈ ప్రాజెక్ట్ విజయవంతం చేయడానికి 'మేమంతా' కష్టపడ్డాం. టీమ్‌గా ఇంకా బాగా కనిపించాలనే మేమంతా కోరుకుంటున్నాం' అని విజయం సాధించినప్పుడు బాస్‌కు తెలియజేయాలి. పనిలో టీమ్ సహకారం ఎంత ఉందో తెలియజేయాలి.

కలిసిపోవడానికి ముఖ్యమైనవి


ఎవరితోనైనా ఇట్టే కలిసిపోవడానికి సహాయపడేది ముందుగా మన దృష్టి కోణం. అందుకు ఎదుటివారికి ప్రపంచమంతా తెలియాల్సిన అవసరం లేదు. ముందుగా మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. ఎదుటివారికి గురించి తప్పుగా అనుకోకూడదు. సహోద్యోగి ఎంత సన్నిహితమైనా మన స్థాయిని మర్చిపోకూడదు. నియంత్రణలపై దృష్టి పెట్టాలి. సహోద్యోగిని మార్చమని పై అధికారులకు చెప్పే బదులు మనం విభిన్నంగా ఏం చేయగలమో వాటిపైన దృష్టి పెట్టాలి. సహోద్యోగులతో నేరుగా పనులు చేసే అవకాశం లేకపోవచ్చు. ఇలాంటప్పుడు ఇ–మెయిల్ వంటి ఇతర మాధ్యమాలను ఉపయోగించుకోవాలి. ఒకరి దృక్పథాన్ని మరొకరు అర్థం చేసుకోవాలి. లేదంటే, సహోద్యోగి ప్రవర్తన ఎందుకు అలా ఉంది? వారు సహకరించకపోతే నేను మాత్రమే ఎలా పరిష్కరించగలను? ప్రతిదీ ప్రయత్నించాను.. కానీ, ఇప్పుడు ఎలా? ... ఇలాంటి ప్రశ్నలు కొన్ని సార్లు భయానికి ఉదాహరణలుగా నిలుస్తాయి. పనిలో కష్టతరమైన సంబంధాలను కొనసాగించడానికి, వ్యక్తుల మధ్య మంచి బంధాలను పెంపొందించడానికి గెటింగ్ ఎలాంగ్ ఒక మంచి గైడ్‌లా ఉపయోగపడుతుంది.




ఆఫీసులో స్నేహాలు

'గెటింగ్ ఎలాంగ్ కోసం నేను న్యూరోసైన్స్, వ్యక్తుల హావభావాలలో చూపించే తెలివి, చర్చలు, మేనేజ్‌మెంట్ సైన్స్.. వంటి వివిధ అంశాల నుండి విషయ సేకరణ చేశాను. స్నేహితుల బృందాలు ఉంటేనే మెరుగైన ఫలితాలు వస్తాయి. సపోర్టివ్‌గా ఉండే సహోద్యోగులతో ఉన్న వ్యక్తులు తక్కువ ఒత్తిడిని ఎదుర్కొంటారు. సహోద్యోగులతో సన్నిహితంగా ఉండటం వల్ల సమాచారం, ఆలోచనలు పంచుకోవడం, ఆత్మవిశ్వాసం, సాధన పెరుగుతాయి. ఇతరులతో సామాజిక సంబంధాలు ఎలా ఉంటున్నాయో కూడా దీని ద్వారా అర్థమవుతుంది. స్నేహాలు కెరీర్‌కు కూడా మంచివి. స్నేహితులుగా భావించే సహోద్యోగుల బృందాలు, వారి పనితీరుపై చేసే పరిశోధనలో ఎక్కువ ఉత్పాదకత వచ్చింది.

- అమీ గలో







ఇంటిప్స్

రెండు టేబుల్ స్పూన్ల కర్బూజా గుజ్జులో టీస్పూను నిమ్మరసం, టేబుల్ స్పూను శనగ పిండి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు అప్లై చేసి మర్దన చేయాలి. ఇరవై నిమిషాలు ఆరాక చల్లటి నీటితో కడిగేయాలి. వారానికి ఒకసారి ఇలా చేస్తే.. చర్మం మీద పేరుకుపోయిన మృతకణాలు, ట్యాన్ తొలగి చర్మం మృదువుగా, కాంతి మంతంగా మారుతుంది.



కెచప్‌లో కొద్దిగా అయోడిన్ వేసి కలపాలి. అయోడిన్ వేసిన తరువాత కెచప్ రంగు మారితే పాడైపోయినట్టు. అంతేగాక ఇతర రసాయనాలు కలిసిన కల్తీ కెచప్ మాత్రమే ఇలా రంగు మారుతుంది.



చీజ్ ముక్కను మంట దగ్గర పెట్టినప్పుడు మండితే చీజ్ నకిలీది. ఇలా కాకుండా నిప్పు సెగకు చీజ్ కరిగితే స్వచ్ఛంగా ఉన్నట్టు.



నిమ్మకాయలను ముప్పైసెకన్లపాటు మైక్రోవేవ్‌లో పెట్టి, ఆ తరువాత పిండితే రసం బాగా వస్తుంది.

కేక్ మిగిలిపోయినప్పుడు అంచులకిరువైపులా బ్రెడ్‌స్లైసులను పెట్టాలి. స్లైసులు పడిపోకుండా టూత్ పిక్ గుచ్చి, రిఫ్రిజిరేటర్‌లో పెడితే కేక్ పాడవకుండా తాజాగా ఉంటుంది.



బ్రెడ్ లేదా బిస్కెట్స్‌ను పాలల్లో ముంచుకుని తినేటప్పుడు...చేతితో కాకుండా... ఫోర్క్‌తో పట్టుకుని ముంచితే పాలల్లో చక్కగా మునిగి మరింత రుచిగా ఉంటాయి.



బాస్కెట్‌లో అడుగున కొన్ని పేపర్ ముక్కలు వేసి బంగాళదుంపలు వేయాలి. దుంపలపైన మరికొన్ని పేపర్ ముక్కలు వేసి నిల్వచేస్తే పాడవకుండా తాజాగా ఉంటాయి.



మిగిలిపోయిన నిమ్మచెక్కలకు ఉప్పు అద్ది ఉంచితే పాడవకుండా తాజాగా ఉంటాయి.

మిగిలిపోయిన బ్రెడ్ ప్యాకెట్‌ను క్లాత్ బ్యాగ్‌లో ఉంచితే బూజు పట్టకుండా తాజాగా ఉంటుంది.



ఉల్లిపాయను ముక్కలు తరిగిన తరువాత చేతులు ఉల్లి వాసన వస్తుంటే... కొద్దిగా టూత్ పేస్టుని తీసుకుని దానితో చేతులను రుద్ది కడగాలి. ఇలాచేస్తే ఉల్లిఘాటు వదిలి పోతుంది.

పేపర్ బ్యాగ్‌కు రంధ్రాలు చేసి లోపల వెల్లుల్లిని పెడితే నెలలపాటు నిల్వ ఉంటుంది.



నడక ఆగే వరకు ఐపీఎల్ ఆడతా: మ్యాక్స్‌వెల్

క్రికెట్ ప్రపంచంలో అత్యుత్తమ లీగ్ అయిన ఐపీఎల్‌పై ఆసీస్ బ్యాటర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ తన అభిమానాన్ని ప్రదర్శించాడు. టోర్నీలో ప్రతీసారి తాను ఆడేందుకు ప్రయత్నిస్తానని చెప్పాడు. 'నా కెరీర్‌లో నేను ఆడే ఆఖరి టోర్నమెంట్ ఐపీఎల్‌ే అవుతుంది. నేను నడవలేని స్థితికి వచ్చేవరకు ఐపీఎల్ ఆడుతూనే ఉంటా. ఈ టోర్నీ నాపై బాగా ప్రభావం చూపించింది. కోహ్లి, డివిలియర్స్‌లాంటి వారితో కలిసి ఆడే అవకాశం వచ్చింది. నా పురోగతిలో ఈ లీగ్ పాత్ర చాలా పెద్దది' అని మ్యాక్స్‌వెల్ అభిప్రాయపడ్డాడు.



ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలో వొజ్నియాకి

ప్రపంచ మాజీ నంబర్‌వన్, డెన్మార్క్ టెన్నిస్ స్టార్ వొజ్నియాకి వచ్చే ఏడాది జరిగే తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బరిలోకి దిగనుంది. ప్రస్తుతం 242వ ర్యాంక్‌లో ఉన్న 33 ఏళ్ల వొజ్నియాకికి నిర్వాహకులు 'వైల్డ్ కార్డు' కేటాయించారు. 2018లో ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్‌గా నిలిచిన వొజ్నియాకి 2020లో టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పింది. గత ఏడాది ఆగస్టులో పునరాగమనం చేసి యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడింది.

తెలుగు టైటాన్స్‌కు నిరాశ



అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు వరుసగా రెండో ఓటమి చవిచూసింది. మాజీ చాంపియన్ పట్నా పైరేట్స్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 28–50 పాయింట్ల తేడాతో ఓడిపోయింది. టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ సెహ్రావత్ 11 పాయింట్లతో రాణించాడు. పట్నా తరఫున సచిన్ 14 పాయింట్లు స్కోరు చేశాడు. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 57–27తో హరియాణా స్టీలర్స్‌పై ఘనవిజయం సాధించింది. యూపీ యోధాస్ తరఫున సురేందర్ 13 పాయింట్లు, ప్రదీప్ నర్వాల్ 12 పాయింట్లు స్కోరు చేశారు.

ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
గుజరాత్ జెయింట్స్	3	3	0	0	15
యూపీ యోధాస్	2	1	1	0	6
యు ముంబా	2	1	1	0	6
పట్నా పైరేట్స్	1	1	0	0	5
తమిళ్ తలైవాస్	1	1	0	0	5
పుణేరి పల్టన్	1	1	0	0	5
బెంగాల్ వారియర్స్	1	1	0	0	5
బెంగళూరు బుల్స్	2	0	2	0	2
జైపూర్ పింక్ పాంథర్స్	1	0	1	0	1
తెలుగు టైటాన్స్	2	0	2	0	1
దబంగ్ ఢిల్లీ	1	0	1	0	0
హరియాణా స్టీలర్స్	1	0	1	0	0

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు

పరాజయంతో ప్రారంభం

తొలి టి20 మ్యాచ్‌లో ఓడిన భారత మహిళల జట్టు

- 38 పరుగులతో నెగ్గిన ఇంగ్లండ్
- మెరిసిన వైట్, నాట్ సివర్
- షఫాలీ అర్ధ సెంచరీ వృథా

ముంబై: సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను భారత మహిళల క్రికెట్ జట్టు పరాజయంతో ప్రారంభించింది. బుధవారం వాంఖెడె మైదానంలో జరిగిన తొలి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం 38 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చేతిలో ఓడిపోయింది. హీతెర్ నైట్ సారథ్యంలోని ఇంగ్లండ్ ఈ గెలుపుతో సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో మ్యాచ్ ఇదే వేదికపై శనివారం జరుగుతుంది. టాస్ గెలిచిన టీమిండియా ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 197 పరుగుల భారీ స్కోరు సాధించింది. రేణుక సింగ్ తొలి ఓవర్లోనే వరుస బంతుల్లో సోఫీ డంక్లీ, అలీస్ క్యాప్సీలను అవుట్ చేసింది. 2 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడ్డ ఇంగ్లండ్‌ను డానియల్ వైట్ (47 బంతుల్లో 75; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నాట్ సివర్ బ్రంట్ (53 బంతుల్లో 77; 13 ఫోర్లు) ఆదుకున్నారు. వీరిద్దరు భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగి అర్ధ సెంచరీలతో అదరగొట్టారు. మూడో వికెట్‌కు 138 పరుగులు జోడించి ఇంగ్లండ్ భారీ స్కోరుకు బాటలు వేశారు. భారత బౌలర్లలో రేణుక సింగ్ 27 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టింది. 198 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లు ఆడి 6 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసి ఓడిపోయింది. షఫాలీ వర్మ (42 బంతుల్లో 52; 9 ఫోర్లు), హర్మన్‌ప్రీత్ కౌర్ (21 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఇంగ్లండ్ స్పిన్నర్ సోఫీ ఎకిల్‌స్టోన్ (3/15) భారత్‌ను కట్టడి చేసింది.



స్మృతిని అవుట్ చేసిన సివర్‌కు సహచరుల అభినందన

స్మృతి మంధాన క్లీన్‌బౌల్డ్

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సోఫియా డంక్లీ (బి) రేణుక సింగ్ 1; డానియల్ వైట్ (స్టంప్డ్) రిచా ఘోష్ (బి) సైకా ఇషాక్ 75; అలీస్ క్యాప్సీ (బి) రేణుక సింగ్ 0; నాట్ సివర్ బ్రంట్ (సి) రిచా ఘోష్ (బి) రేణుక సింగ్ 77; హీతెర్ నైట్ (బి) శ్రేయాంక పాటిల్ 6; అమీ జోన్స్ (సి) జెమీమా (బి) శ్రేయాంక పాటిల్ 23; ఫ్రెయా కెంప్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 197. వికెట్ల పతనం:** 1–2, 2–2, 3–140, 4–165, 5–177, 6–197. **బౌలింగ్:** రేణుక 4–0–27–3, పూజ 4–0–44–0, సైకా ఇషాక్ 4–0–38–1, దీప్తి శర్మ 3–0–28–0, శ్రేయాంక 4–0–44–2, కనిక అహూజా 1–0–12–0.

భారత్ ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (సి) సారా గ్లెన్ (బి) సోఫీ ఎకిల్‌స్టోన్ 52; స్మృతి మంధాన (బి) నాట్ సివర్ బ్రంట్ 6; జెమీమా రోడ్రిగ్స్ (సి) అమీ జోన్స్ (బి) ఫ్రెయా కెంప్ 4; హర్మన్‌ప్రీత్ కౌర్ (బి) సోఫీ ఎకిల్‌స్టోన్ 26; రిచా ఘోష్ (సి) అలీస్ క్యాప్సీ (బి) సారా గ్లెన్ 21; కనిక అహూజా (సి) నాట్ సివర్ బ్రంట్ (బి) సోఫీ ఎకిల్‌స్టోన్ 15; పూజ వస్త్రకర్ (నాటౌట్) 11; దీప్తి శర్మ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 159. వికెట్ల పతనం:** 1–20, 2–41, 3–82, 4–122, 5–134, 6–151. **బౌలింగ్:** మహికా గౌర్ 2–0–18–0, లారెన్ బెల్ 4–0–35–0, నాట్ సివర్ బ్రంట్ 4–0–35–1, ఫ్రెయా కెంప్ 2–0–30–1, సోఫీ ఎకిల్‌స్టోన్ 4–0–15–3, సారా గ్లెన్ 4–0–25–1.

'నంబర్‌వన్' రవి బిష్ణోయ్

ఐసీసీ టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్



దుబాయ్: భారత జట్టు లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ కెరీర్‌లో గొప్ప ఘనత సాధించాడు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టి20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 23 ఏళ్ల రవి బిష్ణోయ్ తొలిసారి నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో రవి నాలుగు స్థానాలు ఎగబాకి ఐదో ర్యాంక్ నుంచి టాప్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఆస్ట్రేలియాతో స్వదేశంలో గతవారం జరిగిన మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో రవి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. ప్రస్తుతం రవి ఖాతాలో 699 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. గతవారం వరకు టాప్ ర్యాంక్‌లో నిలిచిన అఫ్గానిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ 692 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. 679 పాయింట్లతో హసరంగ (శ్రీలంక) మూడో ర్యాంక్‌లో ఉన్నాడు. భారత్‌కే చెందిన మరో స్పిన్నర్ అక్షర్ పటేల్ ఏడు స్థానాలు ఎగబాకి 11వ ర్యాంక్‌లో నిలిచాడు. టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ సూర్యకుమార్ యాదవ్ తన టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు.

ఒకే రోజు 15 వికెట్లు

బంగ్లాదేశ్, న్యూజిలాండ్ రెండో టెస్టు



ముష్ఫికర్

మిర్పూర్: స్పిన్నర్ల జోరుతో బంగ్లాదేశ్, న్యూజిలాండ్ మధ్య బుధవారం మొదలైన రెండో టెస్టులో 15 వికెట్లు నేలకూలాయి. ముందుగా ఆతిథ్య బంగ్లాదేశ్‌ను కట్టడి చేసిన కివీస్ ఆ తర్వాత కుప్పకూలింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 66.2 ఓవర్లలో 172 పరుగులకే ఆలౌటైంది. ముష్ఫికర్ రహీమ్ (35; 3 ఫోర్లు, 1 సిక్స్), షహాదత్ హుస్సేన్ (31; 2 ఫోర్లు) కొద్దిసేపు ప్రతిఘటించగలిగారు. కివీస్ బౌలర్లలో ఫిలిప్స్, సాన్‌ట్నర్ చెరో 3 వికెట్లు పడగొట్టగా, ఎజాజ్ పటేల్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం న్యూజిలాండ్ తొలి రోజు ఆట ముగిసేసరికి 12.4 ఓవర్లలో 55 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. లాథమ్ (4), కాన్వే (11), విలియమ్సన్ (13), నికోల్స్ (1) విఫలమయ్యారు. ప్రస్తుతం ఆ జట్టు మరో 117 పరుగులు వెనుకబడి ఉంది.

ముష్ఫికర్ బంతిని అడ్డుకొని...

బంగ్లాదేశ్ బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ అనూహ్య రీతిలో అవుటయ్యాడు. జేమీసన్ వేసిన ఇన్నింగ్స్ 41వ ఓవర్లో నాలుగో బంతిని డిఫెన్స్ ఆడాడు. అయితే ఆ వెంటనే ఆఫ్‌సైడ్ వెళుతున్న బంతిని తన చేత్తో ఆపే ప్రయత్నం చేశాడు. దాంతో కివీస్ అప్పీల్ చేసింది. రీప్లే చూసిన థర్డ్ అంపైర్ ముష్ఫికర్ ఉద్దేశపూర్వకంగా బంతిని ఆపేందుకు ప్రయత్నించినట్లుగా భావిస్తూ 'అవుట్'గా ప్రకటించారు. నిజానికి బంతి వికెట్ల వైపు కూడా రావడం లేదు. దానిని వదిలేసినా ఎలాంటి ఇబ్బందీ ఉండకపోయేది. కానీ అనూహ్యంగా అతని చేతులు బంతిని ఆపేందుకు ముందుకు వెళ్లిపోయాయి. నిబంధనల ప్రకారం ముష్ఫికర్ అవుట్‌ను 'అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్'గా అంపైర్ నమోదు చేశారు. గతంలో ఇలా చేస్తే దానిని 'హ్యాండిల్డ్ ద బాల్'గా గుర్తించేవారు. అయితే 2017లో మారిన ఐసీసీ నిబంధనల ప్రకారం దీనిని తొలగించి ఇలాంటి అవుట్‌ను 'అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్' లోకి మార్చారు. ముష్ఫికర్ తాను అవుట్ కావడానికి ముందే ఒకసారి (29వ ఓవర్లో) కూడా ఇదే తరహాలో చేశాడు. అయితే అప్పుడు బంతికి చేయి తగలకపోవడంతో సమస్య రాలేదు. ఈ తరహాలో వెనుదిరిగిన తొలి బంగ్లాదేశ్ బ్యాటర్‌గా ముష్ఫికర్ గుర్తింపు పొందగా... గతంలో ఈ తరహాలో 13 మంది పెవిలియన్ చేరారు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి–సుమీత్ జోడీ



గువాహటి: స్వదేశంలో జరుగుతున్న గువాహటి మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి (భారత్) జోడీ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో తెలంగాణకు చెందిన సిక్కి–సుమీత్ ద్వయం 20–22, 21–15, 21–16తో రఫ్లీ రమంద–ఇందా సరి జమీల్ (ఇండోనేసియా) జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో సాయిప్రణీత్ 21–14, 17–21, 7–21తో కువో కువాన్ లిన్ (చైనీస్ తైపీ) చేతిలో... తరుణ్ 11–21, 14–21తో జియా జెంగ్ జేసన్ (సింగపూర్) చేతిలో... ప్రణయ్ 12–21, 17–21తో కార్తికేయ (భారత్) చేతిలో ఓడిపోయారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో హైదరాబాద్ అమ్మాయి సామియా 21–12, 21–11తో తెలంగాణకే చెందిన గద్దె రుత్విక శివానిపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.

నైనా ఖాతాలో ఐదో విజయం

సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్–13 చెస్ చాంపియన్‌షిప్ బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నైనా గొర్లి వరుసగా ఐదో విజయం నమోదు చేసి అజేయంగా నిలిచింది. బుధవారం జరిగిన నాలుగో రౌండ్‌లో వైజాగ్‌కు చెందిన నైనా 60 ఎత్తుల్లో మీరా సింగ్ (ఢిల్లీ)పై, ఐదో రౌండ్‌లో 80 ఎత్తుల్లో ఆముక్త (ఆంధ్రప్రదేశ్)పై గెలిచింది. ఐదో రౌండ్ తర్వాత నైనా ఐదు పాయింట్లతో మరో ముగ్గురితో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉంది. తెలంగాణకు చెందిన సంహిత పుంగవనం, బి.కీర్తిక 4.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు. ఓపెన్ విభాగంలో తెలంగాణ కుర్రాడు చల్లా సహర్ష ఐదో రౌండ్ తర్వాత 4.5 పాయింట్లతో మరో ఎనిమిది మందితో కలిసి రెండో ర్యాంక్‌లో ఉన్నాడు.

సినిమా

ఈ ఏడాది ముగింపులో మా సినిమా ఓ స్వీట్ - నాని



"'హాయ్ నాన్న' చిత్రంలో వినోదం, అన్ని రకాల భావోద్వేగాలున్నాయి. ఈ చిత్రకథపై ఉన్న కాన్ఫిడెన్స్‌తో కచ్చితంగా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది" అని హీరో నాని అన్నారు. శౌర్యువ్ దర్శకత్వంలో నాని, మృణాల్ ఠాకూర్ జంటగా, బేబీ కియారా ఖన్నా కీలక పాత్రలో నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. మోహన్ చెరుకూరి, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నాని విలేకరులతో పంచుకున్న విశేషాలు.

● 'హాయ్ నాన్న' కథని శౌర్యువ్ చెప్పినప్పుడే చాలా హై ఇచ్చింది. యాక్షన్ సినిమాల్లో ఒక రకమైన ఎనర్జీ ఉంటుంది. 'యానిమల్'తో సహా ఈ ఏడాది వచ్చిన చాలా యాక్షన్ సినిమాలు కావాల్సిన దానికంటే ఎక్కువగానే స్పైస్‌ని పంచాయి. అయితే స్పైసీ తర్వాత ఉండే ఆ స్వీట్‌ని మా సినిమా ఇస్తుంది. ఈ ఏడాది అన్ని ఐటమ్స్ పెట్టారు కానీ, ముగించే ఐటమ్ నేను పెడతాను (నవ్వుతూ). 'జెర్సీ' చూసి బయటికి వచ్చినప్పుడు ప్రేక్షకుల్లో ఒక రకమైన భావోద్వేగం ఉంటుంది. కానీ, 'హాయ్ నాన్న' చూసి, ప్రేక్షకులు హ్యాపీగా నవ్వుతూ బయటికి వస్తారు. ఈ ఆనందంలోనే మనసుని హత్తుకునే భావోద్వేగాలు ఉంటాయి. ● నాకు కంఫర్ట్ జోన్ అనేది ఏదీ లేదు. కామెడీ సినిమాలు చేసినప్పుడు అది నా కంఫర్ట్ జోన్ అన్నారు. తర్వాత 'జెర్సీ' చేసినప్పుడు ఎమోషన్ నా కంఫర్ట్ జోన్ అన్నారు. ఆ తర్వాత 'దసరా' లాంటి రా మూవీ చేశాను. నాకు కంఫర్ట్ జోన్ అనేది లేకుండా సినిమా చేయడానికి ప్రయత్నిస్తున్నాను. అలాగే నేను ఇమేజ్ కోణంలో చూడను. కథ నచ్చిందనే 'దసరా' చేశాను.. ఇప్పుడు 'హాయ్ నాన్న' చేశాను. ఇది అందరికీ కనెక్ట్ అయ్యే సినిమాగా నిలుస్తుంది. ● ఇలాంటి ఓ మంచి సినిమాని ప్రేక్షకుల వద్దకు తీసుకెళ్లాలనే ప్రమోషన్స్ ఎక్కువగా చేశాం. అందులో భాగంగానే వెంకటేశ్‌గారిని ఇంటర్వ్యూ చేశా. ప్రమోషన్స్‌లో భాగంగానే హీరో శివరాజ్ కుమార్‌గారిని కలిశా. వెంకటేశ్‌గారు 'నా తర్వాత ఫ్యామిలీ హీరోగా ప్రేక్షకులు నిన్ను చూస్తారు' అన్నారు. మనల్ని ఎవరైనా ఫ్యామిలీ హీరో అన్నప్పుడు హ్యాపీగా ఉంటుంది.

● వైర ఎంటర్‌టైన్‌మెంట్‌కి 'హాయ్ నాన్న' తొలి చిత్రం. మోహన్ చెరుకూరి, విజయేందర్ రెడ్డిగార్లు ప్యాషనేట్ ప్రొడ్యూసర్లు. ఈ చిత్రంలో శ్రుతీహాసన్ ఓ పాటలో మాత్రమే కనిపిస్తారు. ● నా 'దసరా' సినిమా దాదాపు రూ. 120 కోట్లు వసూలు చేసింది. నా తర్వాతి చిత్రాలు కూడా అదే స్థాయిలో కలెక్షన్స్ రాబట్టాలని ఆలోచిస్తూ కూర్చుంటే ఎక్కువ సినిమాలు చేయలేను. ● 'యానిమల్' లాంటి కథ వస్తే చేస్తాను. 'దసరా' చిత్రంలో నేను చేసిన పాత్రని ఎవరైనా ముందుగా ఊహించారా? చేశాక బాగుందన్నారు. సవాల్‌తో కూడుకున్న పాత్రలు, కథలు వచ్చినప్పుడు చేయడానికే ఇష్టపడతాను. నాతో పని చేయాలని 'బలగం' వేణు అనుకుంటున్నారని 'దిల్' రాజుగారు చెప్పారు. వేణు వచ్చి నాకు కథ చెబితే తప్పకుండా చేస్తాను. ప్రస్తుతం 'సరిపోదా శనివారం' సినిమా చేస్తున్నాను. 'హిట్ 3' మూవీ స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. పూర్తయిన వెంటనే షూటింగ్ మొదలుపెట్టేస్తాం.

ఈగోని పక్కన పెడితే ఆడియన్స్‌కి దగ్గరవుతాం - నితిన్

"గ్లోబల్ స్థాయికి వెళ్లాలని 'ఆర్ఆర్ఆర్', 'పుష్ప' సినిమాలను చేయలేదు. కథాబలం ఉండటంతో ఆ సినిమాలను జపాన్ వంటి ఇతర దేశాల ప్రేక్షకులూ ఆదరించారు. గ్లోబల్ అప్పీల్ ఉన్న కథ కోసం ఎదురు చూస్తూ ఉంటే టైమ్ వృథా అవుతుంది. నాకు వచ్చిన కథలు చేసుకుంటూ వెళ్తున్నాను. ఈ క్రమంలో పాన్ ఇండియా కథ ఏదైనా సెట్ అయితే ఓకే. అయినా నాకలాంటి పెద్ద పెద్ద ఆశలు లేవు. తెలుగులోనే సినిమాలు చేయాలని ఉంది" అని హీరో నితిన్ అన్నారు. నితిన్, శ్రీ లీల జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి నిర్మించిన 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మేన్' రేపు రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో నితిన్ చెప్పిన విశేషాలు.



● 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మేన్'లో నా పాత్రలో త్రీ షేడ్స్ ఉన్నాయి. కథ రీత్యా జూనియర్ ఆర్టిస్ట్‌గా కనిపిస్తాను. అలా అని ఈ సినిమాలో జూనియర్ ఆర్టిస్టుల కష్టాల గురించి చెప్పడం లేదు. ఆ పాత్ర నుంచి కామెడీ పండించాం. 'ఎక్స్‌ట్రా' చిత్రంలో ఇంట్రవెల్‌లో వచ్చే ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది. కథ కొత్తది కాకపోవచ్చు కానీ పాయింట్ చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా కథ విన్నప్పుడల్లా హాయిగా నవ్వుకున్నాను. కథ స్క్రీన్ మీదకు వచ్చినప్పుడు కూడా సేమ్ ఫీలింగ్. ● వక్కంతం వంశీగారి కథలతో వచ్చిన 'కిక్', 'రేసు గుర్రం', 'ఊసరవెల్లి', 'టెంపర్' చిత్రాలను గమనిస్తే హీరో క్యారెక్టరైజేషన్ కొత్తగా, విభిన్నంగా ఉంటుంది. 'ఎక్స్‌ట్రా' చిత్రంలోనూ ఇలానే ఉంటుంది. స్క్రీన్ ప్లే కొత్తగా ఉంటుంది. ● సినిమాలో రావు రమేశ్‌గారు నాకు తండ్రిగా నటించారు. ఆయనకు, నాకు మధ్య వచ్చే సీన్స్ వినోదాత్మకంగా ఉంటాయి. కొంత సెంటిమెంట్ కూడా ఉంటుంది. రాజశేఖర్‌గారు సెకండాఫ్‌లో వస్తారు. సందర్భానుసారంగా కామెడీ వస్తుంటుంది. ● సినిమాలో నేను జూనియర్ ఆర్టిస్టును కాబట్టి 'శ్రీమంతుడు', 'బాహుబలి' వంటి సినిమాల ప్రస్తావనతో కాస్త కామెడీ ఉంటుంది. వినోదం కోసమే ఇలా చేశాం. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి సినిమాల్లో వెంకటేశ్‌గారి పాత్రపై ఇతర పాత్రధారులు జోక్స్ వేస్తుంటారు. ఇమేజ్, ఈగోల గురించి ఆలోచించకుండా పాత్ర కోసం నటిస్తే ఆడియన్స్‌కు మరింత దగ్గర కావొచ్చు. ఈ విషయంలో నాకు వెంకటేశ్‌గారు స్ఫూర్తి. ● ప్రస్తుతం వెంకీ కుడుముల దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను. ఈ చిత్రంలో శ్రీ లీల హీరోయిన్. అలాగే వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'తమ్ముడు' సినిమా చేస్తున్నాను. కథ నచ్చితే గ్రే షేడ్ (కాస్త నెగటివ్ టచ్ ఉన్న పాత్రలు) ఉన్న పాత్రలు చేయడానికి రెడీగా ఉన్నాను.

ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే..!



● నాగార్జున

'నా సామి రంగ' ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే' అంటున్నారు నాగార్జున. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'నా సామి రంగ'. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్ ఓ హీరోయిన్‌గా నటిస్తుండగా, కావ్యా థాపర్ మరో హీరోయిన్ అని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. నాగార్జున పాల్గొంటుండగా, సంక్రాంతి నేపథ్యంలో వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌ను ఫైట్ మాస్టర్స్ రామ్–లక్ష్మణ్‌ల నేతృత్వంలో చిత్రీకరిస్తున్నారని తెలిసింది. ఈ సినిమా నుంచి 'ఎత్తుకెళ్లిపోవాలనిపిస్తుందే' పాటను, అతి త్వరలో ప్రోమోను రిలీజ్ చేయనున్నట్లు వెల్లడిస్తూ, కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాకు కీరవాణి సంగీత దర్శకులు. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతికి రిలీజ్ కానుంది.

నిర్మాణం అంటేనే సవాల్ - నిర్మాత శరత్ మరార్



''దూత' వెబ్ సిరీస్‌ని అమేజాన్ సంస్థ వారు 38 భాషల్లో సబ్ టైటిల్స్‌తో 240 దేశాల్లో విడుదల చేశారు. వీక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రావడంతో నాగచైతన్య, విక్రమ్, నేను.. ఇలా 'దూత' టీమ్ అంతా చాలా ఆనందంగా ఉన్నాం'' అన్నారు నిర్మాత శరత్ మరార్. నాగచైతన్య హీరోగా విక్రమ్ కె. కుమార్ దర్శకత్వం వహించిన వెబ్ సిరీస్ 'దూత'. నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై శరత్ మరార్ నిర్మించిన ఈ సిరీస్ ఈ నెల 1 నుంచి అమేజాన్ ప్రైమ్‌లో ప్రసారమవుతోంది. ఈ సందర్భంగా శరత్ మరార్ మాట్లాడుతూ– ''విక్రమ్ చెప్పిన 'దూత' ఆలోచన, కథాంశం చాలా నచ్చింది. ఈ కథకి నాగచైతన్యనే మొదటి ఎంపిక. ఆయనకు ఇది తొలి వెబ్ సిరీస్. కథ వినగానే చేద్దామన్నారు. సినిమా, వెబ్ సిరీస్.. ఏదైనా నిర్మాణం అనేది సవాల్‌తో కూడుకున్న వ్యాపారం. ప్రస్తుతం నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై రెండు చిన్న బడ్జెట్ సినిమాలు నిర్మిస్తున్నాను'' అన్నారు.

జోరుగా వినోదం



● విరాజ్ అశ్విన్, బుచ్చిబాబు, అనుప్రసాద్

విరాజ్ అశ్విన్, పూజిత పొన్నాడ జంటగా నటించిన యూత్‌ఫుల్ అండ్ ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'జోరుగా హుషారుగా...'. అనుప్రసాద్ దర్శకత్వంలో నిరీష్ తిరువిధుల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను దర్శకుడు బుచ్చిబాబు విడుదల చేసి, ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉందని, సినిమాలో మంచి కంటెంట్ ఉందనిపిస్తోందని పేర్కొని, ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ''కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు మా సినిమా నచ్చుతుంది. పూర్తి వినోదాత్మక చిత్రం'' అన్నారు అనుప్రసాద్, నిరీష్.

అప్పుడు ప్యాషన్.. ఇప్పుడు బాధ్యత - మంచు మనోజ్



● వివేక్ కూచిభొట్ల, మంచు మనోజ్

''ఇండస్ట్రీలో నాకు ఏడేళ్ల గ్యాప్ వచ్చింది. ఇందుకు నా అభిమానులు క్షమించాలి. నిజ జీవితంలో ఏడడుగులేసి ఇండస్ట్రీలోకి రీ ఎంట్రీ ఇవ్వడం ఆనందంగా ఉంది. ఇంతకుముందు ప్యాషన్, గోల్‌తో సినిమాలు చేశాను. ఇప్పుడు ప్యాషన్‌తో పాటు బాధ్యతతో మళ్లీ వచ్చాను'' అని హీరో మంచు మనోజ్ అన్నారు. ఆయన హోస్ట్‌గా 'ఉస్తాద్–ర్యాంప్ ఆడిద్దాం' పేరిట సరికొత్త టాక్ షో వస్తోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈ టాక్ షో ఈ నెల 15 నుంచి ఈటీవీ విన్ ఓటీటీలో ప్రసారం కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'ఉస్తాద్–ర్యాంప్ ఆడిద్దాం' ప్రోమో రిలీజ్ వేడుకలో మంచు మనోజ్ మాట్లాడుతూ– ''ఇదొక సెలబ్రిటీ గేమ్ షో. ఎంతగానో అభిమానించే ఫ్యాన్ కోసం ఒక సెలబ్రిటీ ఆడే ఆట. ఈ ఆటలో సెలబ్రిటీ గెలుచుకున్న మొత్తాన్ని ఆ అభిమానికి ఇచ్చేస్తాం. ప్రైజ్ మనీ రూ. 50 లక్షలు, ప్రత్యేక బహుమతులు కూడా ఉంటాయి'' అన్నారు. ''ఫ్యాన్స్‌ని గెలిపించే షో ఇది. చాలా పెద్ద హిట్టవుతుందని ఆశిస్తున్నాం'' అన్నారు వివేక్ కూచిభొట్ల. డైరెక్టర్ వంశీ, రచయిత బీవీఎస్ రవి, సాయి కృష్ణ, నితిన్ చక్రవర్తి, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వధువు



● అలీ రెజా, నందు, పోలూరు కృష్ణ

అవికా గోర్ ప్రధాన పాత్రలో, నందు, అలీ రెజా కీలక పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'వధువు'. శ్రీకాంత్ మొహ్తా, మహేంద్ర సోని నిర్మాణంలో పోలూరు కృష్ణ రూపొందించిన ఈ వెబ్ సిరీస్ ఈ నెల 8 నుంచి హాట్‌స్టార్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా నందు మాట్లాడుతూ– ''ఓ కుటుంబంలోని సభ్యులందరూ ఎందుకు అనుమానాస్పదంగా కనిపిస్తారు? అనే అంశం 'వధువు'లో కొత్తగా ఉంటుంది. అవికా, నేను బెక్కెం వేణుగోపాల్ ప్రొడక్షన్స్‌లో ఓ సినిమా చేస్తున్నాం'' అన్నారు. ''ఈ సిరీస్‌లో నా పాత్ర చాలా సెటిల్డ్‌గా ఉంటుంది'' అన్నారు అలీ రెజా. ''బెంగాలీ సిరీస్ 'ఇందు'ను 'వధువు'గా రీమేక్ చేశాం. అయితే నేను సోల్‌ను మాత్రమే తీసుకున్నాను. మన నేటివిటీకి తగ్గట్లు మార్పులు చేశాం. సెకండ్ ఎపిసోడ్ నుంచి కథ మొదలవుతుంది. ఏడవ ఎపిసోడ్ కిక్ ఇచ్చేలా ఉంటుంది'' అన్నారు పోలూరు కృష్ణ.

నిజాయితీ ప్రేమకథ

కిశోర్ కేఎస్‌డీ, దియా సితెపల్లి జంటగా శివశక్తి రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రేమకథ'. విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజపిల్లి, శింగనమల కల్యాణ్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేసి, సినిమా హిట్టవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విజయ్ మట్టపల్లి మాట్లాడుతూ– ''ఒక నిజాయితీ ప్రేమకథతో మా సినిమా రూపొందింది. దాదాపు అందరూ కొత్తవాళ్లు నటించారు. త్వరలో మా సినిమాని రిలీజ్ చేస్తాం'' అన్నారు. ''తెలుగులో నా తొలి సినిమా 'ప్రేమకథ'. రెగ్యులర్ ప్రేమకథలకు భిన్నంగా మా సినిమా ఉంటుంది'' అన్నారు దియా సితెపల్లి.



● విజయ్ మట్టపల్లి, దియా సితెపల్లి, శివశక్తి రెడ్డి

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	358	69,654
నిఫ్టీ ▲	83	20,938

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	14,246	▲	17
డోజోన్స్	36,164	▲	39
ఎఫ్‌టీఎస్ఈ 100	7,515	▲	26
డాక్స్	16,656	▲	123
షాంఘై	2,969	▼	3
నికాయ్	33,446	▲	670

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 ప్యూరిటీ)	62,144 ▼	143
బంగారం (99.5 ప్యూరిటీ)	61,895 ▼	143
వెండి (కేజీ)	74,268 ▼	115

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.60	84.27
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.73	107.17
€	యూరో	ఒకటి	88.56	91.61
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.79	57.51
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.82	56.18
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.38	63.37
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.29	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.82	23.55
¥	చైనా యువాన్	పదింటికి	10.52	12.49

నేటి నుంచి అజియో బిగ్ బోల్డ్ సేల్



బెంగళూరు: ప్రముఖ ఫ్యాషన్ ఈ–టెయిలర్ అజియో 'బిగ్ బోల్డ్ సేల్' ప్రకటించింది. భారీ ఆఫర్లతో డిసెంబర్ 7 (నేటి)నుంచి ఈ సేల్‌ను ప్రారంభించనుంది. ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులపై పెద్ద ఎత్తున డిస్కౌంట్ అందించనుంది. 5500కు పైగా బ్రాండ్‌లకు చెందిన 16 లక్షలకు పైగా స్టైల్స్‌పై 50–90% రాయితీలు ఇస్తున్నట్లు కంపెనీ తెలిపింది. సేల్స్ సమయంలో ఉత్తమ షాపింగ్ చేసిన వారు ప్రతి 8 గంటలకు ఐఫోన్ 14 ప్రో, యాపిల్ మ్యాక్‌బుక్ ఎయిర్, శాంసంగ్ గెలాక్సీ ఫోల్డ్ 4, శాంసంగ్ ఎస్23 అల్ట్రా స్మార్ట్‌ఫోన్లు గెల్చుకోవచ్చు. ప్రత్యేకమైన డీల్‌లు అందించేందుకు ప్రతి రోజూ సూపర్ అవర్ ఉంటుంది.

1,000కి పైగా చార్జింగ్ స్టేషన్స్: కియా



ముంబై: వాహన తయారీ సంస్థ కియా ఇండియా దేశవ్యాప్తంగా చార్జింగ్ నెట్‌వర్క్ విస్తృతం చేస్తోంది. 1,000కిపైగా కేంద్రాలను ఇప్పటికే ఏర్పాటు చేసింది. ఇవి ఎక్కడ ఉన్నాయో మైకియా యాప్‌లో కె–చార్జ్ ఫీచర్ ద్వారా కస్టమర్లు సులభంగా తెలుసుకోవచ్చని కంపెనీ తెలిపింది. చార్జ్ పాయింట్ ఆపరేటర్స్ అయిన స్టాటిక్, చార్జ్‌జోన్, రీలక్స్ ఎలక్ట్రిక్, లియాన్ చార్జ్, ఈ–ఫిల్‌తో కియా చేతులు కలిపింది. ఇతర బ్రాండ్ల ఈవీలను వినియోగిస్తున్న వారు సైతం ఈ కేంద్రాల్లో చార్జింగ్ సదుపాయాన్ని పొందవచ్చని కంపెనీ బుధవారం ప్రకటించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)	
7-12-2023	
విశాఖ	540–00
చిత్తూరు	543–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	72.00
6-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	525–00
వరంగల్	527–00
రిటైల్ ధర	5.85

వాహనాల చారిత్రక రికార్డు

- నవంబర్‌లో గరిష్ట స్థాయి అమ్మకాలు
- రోడ్డెక్కిన 28,54,242 వాహనాలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా నవంబర్‌లో వాహనాల రిటైల్ అమ్మకాలు సరికొత్త రికార్డులు సృష్టించాయి. ప్యాసింజర్, ద్విచక్ర వాహనాల విక్రయాలు జోరుగా సాగడమే ఇందుకు కారణమని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఎఫ్ఏడీఏ) తెలిపింది. 'దేశంలో గత నెలలో అన్ని వాహన విభాగాల్లో కలిపి రిటైల్‌లో 28,54,242 వాహనాలు రోడ్డెక్కాయి. 2022 నవంబర్‌తో పోలిస్తే ఇది 18% ఎక్కువ. ఒక నెలలో ఈ స్థాయి అమ్మకాలు నమోదు కావడం భారత చరిత్రలో ఇదే తొలిసారి. ఇప్పటి వరకు అత్యధికంగా 2020 మార్చిలో 25.69 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. ప్యాసింజర్ వెహి కిల్స్ 17 % దూసుకెళ్లి 3,60,431 యూనిట్లను తాకా యి. ద్విచక్ర వాహనాలు 21% ఎగసి 22,47,366 యూనిట్లకు చేరుకున్నాయి' అని ఫెడరేషన్ తెలిపింది.

రెండు విభాగాలు మినహా..

2020 మార్చి గరిష్ట అమ్మకాలతో పోలిస్తే టూ వీలర్లు గత నెలలో 1.77 లక్షల యూనిట్లు ఎక్కువగా నమోదయ్యాయి. 'ప్యాసింజర్ వెహికిల్స్ 2022 అక్టోబర్‌లో నమోదైన గరిష్ట విక్రయాలతో పోలిస్తే 4,000 ఎక్కువగా అమ్ముడయ్యాయి. దీపావళి జోష్‌తో ప్యాసింజర్ వెహికిల్స్ అధిక సంఖ్యలో రోడ్డెక్కాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి డిమాండ్, కొత్త మోడళ్ల రాక, ఎంపిక చేసుకోవడానికి విస్తృత శ్రేణి టూ వీలర్ల అమ్మకాలను పెంచింది. త్రిచక్ర వాహనాల విక్రయాలు 23 శాతం ఎగసి 99,890 యూనిట్లకు చేరుకున్నాయి. ట్రాక్టర్లు 21 శాతం క్షీణించి 61,969 యూనిట్లు, వాణిజ్య వాహనాలు 2 శాతం తగ్గి 84,586 యూనిట్లకు వచ్చి చేరాయి' అని ఫెడరేషన్ వివరించింది.

హింద్ జింక్ రెండో డివిడెండ్

షేరుకి రూ. 6 చొప్పున చెల్లింపు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి(2023–24) మెటల్ రంగ దిగ్గజం హిందుస్తాన్ జింక్ రెండో మధ్యంతర డివిడెండును ప్రకటించింది. ఇందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు వేదాంతా గ్రూప్ కంపెనీ వెల్లడించింది. రూ. 2 ముఖ విలువగల ఒక్కో షేరుకి రూ. 6(300%) చొప్పున చెల్లించనుంది. కంపెనీ ఇంతక్రితం ఈ ఏడాది జులైలో తొలిసారి రూ. 7 చొప్పున డివిడెండును ప్రకటించింది. కాగా.. తాజా డివిడెండు చెల్లింపునకు రూ. 2,535 కోట్లకుపైగా వెచ్చించనున్నట్లు కంపెనీ తెలియజేసింది. ప్రపంచంలోనే జింక్ ఉత్పత్తికి అతిపెద్ద సమీకృత కంపెనీగా నిలుస్తున్న హింద్ జింక్ రుణ భార తగ్గింపులో భాగంగా వివిధ బిజినెస్‌ల విడదీతకు ప్రణాళికలు వేసిన విషయం విదితమే. వీటిలో భాగంగా జింక్‌సహా లెడ్, సిల్వర్, రీసైక్లింగ్ బిజినెస్‌లను ప్రత్యేక సంస్థలుగా ఏర్పాటు చేయనుంది.

డివిడెండు నేపథ్యంలో హింద్ జింక్ షేరు నామమాత్ర లాభంతో రూ. 326 వద్ద ముగిసింది.

లిథియంపై శ్రీ సిమెంట్ కన్ను

- లిథియం వేలంలో బిడ్‌పై కసరత్తు
- ఆస్ట్రేలియా కంపెనీతో భాగస్వామ్యం!



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం శ్రీ సిమెంట్ లిమిటెడ్ ఛత్తీస్‌గఢ్‌లో లిథియం మైనింగ్‌పై కన్నేసినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ ప్రణాళికల్లో భాగంగా నిర్వహించనున్న లిథియం వేలంలో మైనింగ్ హక్కుల కోసం బిడ్ వేయాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. లిథియం మైనింగ్ వేలం ద్వారా ప్రభుత్వం 5 బిలియన్ డాలర్లకుపైగా సమకూర్చుకునే వీలున్నట్లు అంచనా. ఈ బాటలో జమ్ము అండ్ కశ్మీర్(జేఅండ్‌కే)లో సైతం కంపెనీ లిథియం మైనింగ్ బ్లాకుల హక్కుల కోసం దరఖాస్తు చేసుకోనున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ 5.9 మిలియన్ టన్నుల లిథియం నిల్వలున్నట్లు ఈ ఏడాది ఫిబ్రవరిలో అంచనాలు వెలువడ్డాయి. వెరసి తొలిసారి ఈ విభాగంలో ప్రవేశిస్తున్న నేపథ్యంలో బిడ్‌లో పేర్కొనవలసిన ధర(ప్రీమియం) తదితరాలపై ఆస్ట్రేలియా మైనింగ్ నిపుణులను కంపెనీ ప్రతినిధులు సంప్రదిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇదేవిధంగా జేఅండ్‌కే లిథియం నాణ్యత, గ్రేడ్లపై సలహాలను సైతం ఆశిస్తున్నట్లు వెల్లడించాయి. ఒకవేళ ఇక్కడ లిథియం బ్లాకులను గెలుపొందితే.. రిఫైనరీ ఏర్పాటుకు వీలుగా సాంకేతిక సహకారం కోసం ఆస్ట్రేలియన్ కంపెనీతో జట్టు కట్టనున్నట్లు తెలియజేశాయి. ఇందుకు 60–70 కోట్ల డాలర్లు(రూ. 5,800 కోట్లవరకూ) వెచ్చించాల్సి ఉంటుంది. గత వారమే కేంద్ర ప్రభుత్వం లిథియం సహా కీలక మినరల్స్ వేలానికి రంగం సిద్ధం చేసింది. వివిధ ప్రాంతాలలోని 100 బ్లాకులకుగాను తొలి దశలో భాగంగా 20 బ్లాకులకు తెరతీయనున్నట్లు తెలుస్తోంది.


2 శాతం కార్లు

గతేడాది (2022–23)లో విక్రయమైన 39 లక్షల కార్లలో 2% ఎలక్ట్రిక్ వాహనాలే. 2030కల్లా మొత్తం కార్ల అమ్మకాల్లో వీటి వాటా 30 శాతానికి పుంజుకోనున్నట్లు అంచనా. కాగా.. ప్రధాని మోదీ సర్కారు ఈ ఏడాది జూన్‌లో 30 కీలక మినరల్స్‌ను గుర్తించింది. శుద్ధ ఇంధనాల కోసం సిద్ధం చేసిన ఈ జాబితాలో లిథియం, నికెల్, టైటానియం, టంగ్‌స్టన్ తదితరాలున్నాయి.

శ్రీ సిమెంట్ షేరు ఎన్ఎస్ఈలో స్వల్ప నష్టంతో రూ. 27,900 వద్ద ముగిసింది.

బుల్ రన్ కొనసాగెన్..

- మూడో రోజు కొత్త రికార్డు నమోదు
- 70,000 దిశగా సెన్సెక్స్
- 21 వేల స్థాయి చేరువలో నిఫ్టీ
- ఇంధన, ఐటీ షేర్లకు డిమాండ్




ముంబై: వరుసగా ఏడో రోజూ లాభాల జోరు కొనసాగించిన స్టాక్ సూచీలు బుధవారమూ సరికొత్త శిఖరాలపై ముగిశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లు కలిసొచ్చాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల తగ్గుదలతో ఇంధన షేర్లు, వచ్చే ఏడాది మార్చిలో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను కోత ఉండొచ్చనే అంచనాలతో ఐటీ షేర్లు రాణించాయి. ఉదయం ఉత్సాహంగా మొదలైన సూచీలు రోజంతా లాభాల్లో కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 449 పాయింట్లు బలపడి 69,745 వద్ద, నిఫ్టీ 107 పాయింట్లు ఎగసి 20,962 వద్ద కొత్త జీవితకాల గరిష్ట స్థాయి నమోదు చేశాయి. మార్కెట్ ముగిసే సరికి సెన్సెక్స్ 358 పాయింట్లు లాభపడి 69,654 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 83 పాయింట్లు పెరిగి 20,938 వద్ద నిలిచింది. ఈ ముగింపు కూడా సూచీలకు వరుసగా మూడో రోజూ సరికొత్త గరిష్ట స్థాయి కావడం విశేషం. రికార్డుల ర్యాలీలోనూ ఫార్మా, టెలికం, ప్రైవేట్ రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.80 కోట్ల షేర్లను విక్రయించారు. దేశీ ఇన్వెస్టర్లు రూ.1,372 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 5 పైసలు పెరిగి 83.32 వద్ద స్థిరపడింది.

''దేశంలో రాజకీయ స్థిరత్వం కొనసాగే సూచనలు కనిపిస్తున్న తరుణంలో స్థూల ఆర్థిక వృద్ధిపై అంచనాలు పెరిగాయి. ఆర్‌బీఐ ఈసారీ కీలక వడ్డీ రేట్లను పెంచకపోవచ్చు. చైనా క్రెడిట్ రేటింగ్ తగ్గింపు, క్రూడాయిల్ ధరలు తగ్గుదల పరిణామాలతో విదేశీ ఇన్వెస్టర్లు భారత ఈక్విటీలను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు'' అని జియోజిత్ ఫైనాన్స్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- సెన్సెక్స్ 358 పాయింట్లు పెరగడంతో బీఎస్ఈలో 2.17 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఆల్‌టైం హై రూ.348.64 లక్షల కోట్ల వద్ద ముగిసింది.
- హిమాద్రి స్పెషాలిటీ కెమికల్స్ 3.58% పెరిగి రూ.301 స్థిరపడింది. రానున్న 5–6 ఏళ్లలో రూ.4,800 కోట్లతో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని కంపెనీ తెలపడంతో షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో ఐదున్నర శాతానికి పైగా లాభపడి రూ.307 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- ఇంధన పరివర్తన ఆవిష్కరణలపై 2030 నాటికి 75 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనుందని చైర్మన్ గౌతమ్ అదానీ తెలపడంతో గ్రూప్‌లోని 8కంపెనీల షేర్లు లాభపడ్డాయి. అదానీ టోటల్ గ్యాస్ 20% పెరిగి అప్పర్ సర్క్యూట్ తాకింది. అదానీ గ్రీన్ ఎనర్జీ 17% పెరిగింది. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ విద్యుత్, అదానీ విల్మార్, ఎన్‌డీటీవీ షేర్లు 4–7% లాభపడ్డాయి. మరోవైపు ఏసీసీ 2.59%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2.50%, అంబుజా సిమెంట్స్ 1.50% నష్టపోయాయి.

హిమాద్రి స్పెషాలిటీ రూ. 4,800 కోట్ల పెట్టుబడులు

లిథియం అయాన్ బ్యాటరీ భాగాల ఫ్యాక్టరీ ఏర్పాటు



న్యూఢిల్లీ: లిథియం అయాన్ బ్యాటరీ (ఎల్ఐబీ) భాగాల తయారీ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు కోల్‌కతా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే హిమాద్రి స్పెషాలిటీ కెమికల్ వెల్లడించింది. ఇందుకోసం వచ్చే 5–6 ఏళ్లలో రూ. 4,800 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపింది. ఈ మొత్తాన్ని అంతర్గత నిధులు, రుణ రూపంలో సమకూర్చుకోనున్నట్లు వివరించింది. ఎల్ఐబీ పరికరాల ప్లాంటు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 2,00,000 టన్నులుగా ఉంటుందని పేర్కొంది. పటిష్టమైన వృద్ధి అవకాశాలున్న వర్తమాన రంగంలో కార్యకలాపాలు విస్తరించడం ద్వారా వాటాదారులకు మరింత ప్రయోజనం చేకూర్చాలనేది తమ లక్ష్యమని హిమాద్రి స్పెషాలిటీ వివరించింది. ఈ ప్లాంటుతో దేశ, విదేశ ఎలక్ట్రిక్ వాహనాలు, శక్తి నిల్వ సిస్టమ్‌లకు (ఈఎస్ఎస్) దేశీయంగా తయారైన ఎల్ఐబీ ముడి వస్తువులను సరఫరా చేయొచ్చని పేర్కొంది. హిమాద్రి స్పెషాలిటీ కెమికల్ ప్రధానంగా పారిశ్రామిక అవసరాల కోసం కార్బన్ బ్లాక్, బ్యాటరీ భాగాలు, స్పెషాలిటీ ఆయిల్స్, రిఫైన్డ్ నాఫ్తలీన్ మొదలైనవి ఉత్పత్తి చేస్తుంది.

మహీంద్రా వాహనాలు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆటో రంగ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా.. అన్ని రకాల ప్యాసింజర్, వాణిజ్య వాహనాల ధరలను పెంచుతోంది. కొత్త ధరలు 2024 జనవరి 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఎస్‌యూవీలు, కమర్షియల్ వెహికిల్ మోడళ్లనుబట్టి ధరల పెంపు ఉంటుందని కంపెనీ బుధవారం ప్రకటించింది. ద్రవ్యోల్బణం, ముడిసరుకు వ్యయాలు అధికం అవుతున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.

టీడీపీకి లక్ష్యంగా మారిన అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి

- ఆయనపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర రీతిలో తప్పుడు ప్రచారం
- ఐటీడీపీ నేతృత్వంలో ఆయన పేరుతో నకిలీ ఖాతాలు
- ఆయన ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలను దూషించినట్లు పోస్టులు
- ఆయనే వాటిని పోస్టు చేసినట్లు చిత్రీకరణ
- చంద్రబాబు స్కాంలపై రాష్ట్ర ప్రభుత్వం తరపున కోర్టుల్లో వాదిస్తున్న సుధాకర్‌రెడ్డి
- ఏసీబీ కోర్టు నుంచి సుప్రీం కోర్టు వరకు సమర్థంగా వాదనలు
- స్కిల్ కుంభకోణంలో చంద్రబాబు జైలుకెళ్లడంలో కీలక పాత్ర
- దీంతో సుధాకర్‌రెడ్డిపై టీడీపీ వర్గాల దుష్ప్రచారం
- టీడీపీ దుష్ప్రచారంపై సీఐడీకి, ఎక్స్‌కు పొన్నవోలు ఫిర్యాదు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినతి
- ఇలాంటి వాటికి భయపడేది లేదన్న పొన్నవోలు



సాక్షి, అమరావతి: గత టీడీపీ ప్రభుత్వం, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్రమాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున న్యాయస్థానాల్లో గట్టిగా వాదనలు వినిపిస్తున్న అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని తెలుగుదేశం పార్టీ లక్ష్యంగా చేసుకుంది. ఆయనపై అనైతిక దాడులకు పాల్పడుతోంది. టీడీపీ పెద్దల ప్రోద్బలంతో సోషల్ మీడియాలో ఆ పార్టీ అనుబంధ సంఘం ఐటీడీపీ అసభ్యకర రీతిలో పొన్నవోలు సుధాకర్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం ప్రారంభించాయి. ఆయన పేరుతో ప్రముఖ సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఖాతాలు తెరిచి అందులో అసభ్య పదజాలం ఉపయోగిస్తూ పోస్ట్ చేస్తోంది. ఆయనే వాటిని పోస్ట్ చేసినట్లుగా కూడా తప్పుడు ప్రచారం చేస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, తెలంగాణ సీఎల్‌పీ నేత రేవంత్‌రెడ్డికి, పలువురు పార్లమెంట్ సభ్యులకు వ్యతిరేకంగా పొన్నవోలు ట్వీట్లు చేసినట్లుగా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఇందుకోసం సుధాకర్‌రెడ్డి పేరుతో ఆయన ఫొటోను ఉపయోగించి నకిలీ ఖాతాలను తెరిచింది. న్యాయవ్యవస్థ మీద కూడా సుధాకర్‌రెడ్డి ఆరోపణలు చేసినట్లు నకిలీ వార్తలను వ్యాప్తి చేస్తోంది. న్యాయస్థానాల్లో పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని ఢీకొట్టలేని తెలుగుదేశం పార్టీ ఇలా తప్పుడు మార్గాలను అనుసరిస్తోంది. తద్వారా సుధాకర్‌రెడ్డి మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోంది.

ముఖ్యమంత్రిగా ఉండగా చంద్రబాబు పాల్పడిన అనేక కుంభకోణాలపై సీఐడీ కేసులు నమోదు చేసింది. ఈ కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ఏసీబీ కోర్టు మొదలు సుప్రీం కోర్టు వరకు గట్టిగా, సమర్థంగా వాదనలు వినిపిస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఆయన వాదనాపటిమతో చంద్రబాబు జైలుకెళ్లక తప్పలేదు. చంద్రబాబుకు ఏసీబీ కోర్టు 14 రోజులు పాటు రిమాండ్ విధించడం, మధ్యంతర బెయిల్ వచ్చే వరకు ఆయన జైలులోనే ఉండటంలో పొన్నవోలు కీలక పాత్ర పోషించారు. చంద్రబాబు మధ్యంతర బెయిల్, రెగ్యులర్ బెయిల్‌ను కూడా సుధాకర్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. హైకోర్టులో గట్టిగా వాదనలు వినిపించారు. హైకోర్టు చంద్రబాబుకు బెయిల్ ఇచ్చిన వెంటనే హైకోర్టు ఉత్తర్వులను సుప్రీం కోర్టులో సవాలు చేయించారు. దగ్గరుండి పిటిషన్ దాఖలు చేయించి అతి తక్కువ సమయంలోనే అది విచారణకు వచ్చేలా చేయడంలో విజయం సాధించారు. ఇలా ప్రతి దశలో సుధాకర్‌రెడ్డి అడ్డు తగులుతుండటంతో తెలుగుదేశం పార్టీ వర్గాలు ఆయన్ని లక్ష్యంగా చేసుకున్నాయి. ఆ పార్టీ సీనియర్ నేతలు గత వారంలో ప్రతి రోజూ సుధాకర్‌రెడ్డికి వ్యతిరేకంగా మీడియా సమావేశాలు పెట్టి మరీ దూషించడం మొదలుపెట్టారు. ఆయనపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సైతం ఫిర్యాదు చేశారు. అంతేకాక హైకోర్టులో సైతం ఆయనపై పిల్ దాఖలు చేయించారు. అయితే, ఇవన్నీ అంతగా ఫలించలేదు. దీంతో టీడీపీ వర్గాలు మరింత బరి తెగించాయి. ఆయన పేరుతో ప్రముఖ సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఖాతాలు తెరిచి, వాటి ద్వారా అసభ్య పదజాలంతో ట్వీట్లు చేస్తూ వాటిని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. సుధాకర్‌రెడ్డే ఆ ట్వీట్లు చేస్తున్నట్లు కూడా ప్రచారం మొదలుపెట్టాయి. ఈ విషయం సుధాకర్‌రెడ్డి దృష్టికి రావడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. టీడీపీ తప్పుడు ప్రచారంపై పొన్నవోలు సుధాకర్‌రెడ్డి బుధవారం సీఐడీకి ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాక ప్రముఖ సామాజిక మాధ్యమైన 'ఎక్స్'కు సైతం మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఆ ట్వీట్లను వెంటనే తొలగించి, బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి వాటికి భయపడేది లేదని, ఇలా వెనుక నుంచి కాకుండా తనతో నేరుగా పోట్లాడాలని ఆయన టీడీపీ నాయకులకు సవాలు విసిరారు. కుంభకోణాల్లో చంద్రబాబుకు శిక్ష పడే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తెలిపారు.

ఇసుక తవ్వకాల టెండర్లపై జోక్యానికి హైకోర్టు నిరాకరణ

ఎన్‌జీటీ విచారిస్తుండగా.. సమాంతర విచారణ సరికాదు

- తవ్వకాలపై అభ్యంతరాలుంటే ఎన్‌జీటీ దృష్టికే తీసుకెళ్లండి
- పిటిషనర్‌కు తేల్చిచెప్పిన హైకోర్టు ధర్మాసనం.. పిల్ మూసివేత
- తవ్వకాలే జరగనప్పుడు అక్రమ తవ్వకాలని ఎలా అంటారు
- ఈ వ్యాజ్యాన్ని తోసిపుచ్చాలని హైకోర్టును కోరిన ఏజీ శ్రీరామ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇసుక తవ్వకాలకు టెండర్లను ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా ఎలాంటి చర్యలు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. అలాగే ఇసుక తవ్వకాలను పరిశీలించి నివేదిక ఇచ్చేందుకు వీలుగా విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయాలన్న పిటిషనర్ అభ్యర్థనను సైతం పట్టించుకోలేదు. ఇసుక తవ్వకాల వ్యవహారంపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) విచారిస్తున్నప్పుడు.. సమాంతరంగా తాము విచారించడం సరికాదని హైకోర్టు తేల్చిచెప్పింది. ఇసుక తవ్వకాలపై అభ్యంతరాలుంటే ఎన్‌జీటీ ముందు లేవనెత్తాలని సూచించింది. తమ ముందు పిల్ దాఖలు చేసిన వ్యక్తే ఎన్‌టీజీ ముందు కూడా ఫిర్యాదు చేశారని, అందువల్ల అన్ని అంశాలను అక్కడే లేవనెత్తాలని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఇసుక తవ్వకాలకు కేంద్ర అటవీ, పర్యావరణశాఖ (ఎంవోఈఎఫ్) అనుమతులు తీసుకోవాల్సి ఉందని, అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరపబోమని రాష్ట్ర ప్రభుత్వమే హైకోర్టుకు నివేదించింది. ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూడబ్ల్యూఏఐ) నుంచి ఇప్పటికే నిరభ్యంతరపత్రం తీసుకున్నామని ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వివరించారు. ఇసుక తవ్వకాలే జరగనప్పుడు, వాటిని అక్రమ తవ్వకాలుగా పేర్కొనడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. ఇసుక తవ్వకాలు, టెండర్ల విషయంలో చట్టనిబంధనలకు అనుగుణంగానే నడుచుకుంటామన్నారు. అనుమతులు రాకముందే పిటిషన్ దాఖలు చేయడం అపరిపక్వమవుతుందని, అందువల్ల ఈ వ్యాజ్యాన్ని ఆదిలోనే తోసిపుచ్చాలని ఆయన కోర్టును కోరారు. ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, ఉల్లంఘనలను ఎన్‌జీటీ ముందే లేవనెత్తాలని పిటిషనర్‌కు స్పష్టం చేస్తూ పిల్‌ను మూసివేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

టెండర్ నోటిఫికేషన్‌ను రద్దుచేయండి..

రాష్ట్రంలో ఇసుక తవ్వకాలకు టెండర్లను ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలంటూ ధరణికోటకు చెందిన దండా నాగేంద్ర హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారించింది. పిటిషనర్ న్యాయవాది వి.వి.లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి నిరభ్యంతరపత్రం పొందకుండా ఇసుక తవ్వకాలకు టెండర్ నోటిఫికేషన్ జారీచేయడం చట్ట విరుద్ధమన్నారు. లీజు గడువు ముగిసినా జయప్రకాశ్, టర్న్‌కీ సంస్థలకు ఇసుక తవ్వకాలకు అనుమతులిచ్చారని చెప్పారు. ఆ సంస్థలు భారీ యంత్రాలతో ఇసుక తవ్వుతున్న ఫొటోలను తాము జత చేశామని, వాటిని పరిశీలించాలని కోరారు.

అవి స్టాక్ యార్డ్ ఫొటోలు

ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరామ్ స్పందిస్తూ.. ఆ ఫొటోలు ఇసుక తవ్వకాలకు సంబంధించినవి కాదని, తవ్వితీసిన ఇసుకను స్టాక్ పాయింట్ నుంచి మరోచోటుకు తరలిస్తున్న సమయంలో తీసినవని వివరించారు. ఇసుక తవ్వకాలకు సంబంధించిన విచారిస్తున్న ఎన్‌జీటీ ముందు వాస్తవాలను ఉంచామని చెప్పారు. ఇసుక తవ్వకాల సమయంలో నదిలో తాత్కాలిక ఆనకట్ట కట్టి, తవ్వకాలు పూర్తయిన తరువాత తొలగించడం జరుగుతుందన్నారు. టెండర్ ప్రక్రియ ముగిసిందని, పనులు అప్పగించడమే మిగిలి ఉందని తెలిపారు. లెటర్ ఆఫ్ ఇండెంట్ (ఎల్‌వోఐ) కూడా జారీచేసినట్లు చెప్పారు. పర్యావరణ అనుమతుల కోసం 5.11.2023నే దరఖాస్తు చేశామన్నారు. పర్యావరణ అనుమతులు రాకుండా ఏమీ చేయబోమన్నారు. ఇసుక తవ్వకాలను ఎన్‌జీటీ సైతం పర్యవేక్షిస్తోందని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం పిల్‌ను మూసివేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

బాబు కూల్చిన 8 ఆలయాల పునర్నిర్మాణం

నేడు ప్రారంభం

- విజయవాడలో నేడు 9 ఆలయాలను ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: చంద్రబాబు సీఎం గా ఉన్నప్పుడు విజయవాడలో కూల్చివేసిన ఆలయాలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పునర్నిర్మించింది. ఆ ఆలయాలను గురువారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. 2016లో కృష్ణా పుష్కరాల ఏర్పాట్లకు అడ్డుగా ఉన్నాయని కనకదుర్గ అమ్మవారి ఆలయానికి చుట్టుప్రక్కల ప్రాంతాల్లో తొలగించిన 1) దక్షిణాముఖ ఆంజనేయస్వామి ఆలయం, 2) సీతమ్మవారి పాదాలు, 3) శ్రీసీతారామలక్ష్మణ సమేత దాసాంజనేయస్వామి ఆలయం, 4) వీరబాబు ఆలయం, 5) విజయవాడ గో సంరక్షణ సంఘం, 6) బొడ్డు బొమ్మ, 7) ఆంజనేయస్వామి, వినాయక స్వామి ఆలయాల తొలిమెట్టు, 8) శ్రీ శనైశ్చర స్వామి ఆలయాలను వైఎస్ జగన్ సర్కారు మళ్లీ నిర్మించింది. ఈ ఆలయాల నిర్మాణానికి 2021 జనవరి 8వ తేదీన శంకుస్థాపన చేసిన సీఎం జగన్.. మూడేళ్లలోపే రూ.3.87 కోట్లతో నిర్మాణాలు పూర్తి చేసి గురువారం ప్రారంభిస్తున్నారు. వీటితోపాటు కనకదుర్గమ్మ ఆలయ సన్నిధిలో పునర్నిర్మించిన మల్లేశ్వరస్వామి ఆలయాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. చరిత్రలోనే తొలిసారిగా ప్రభుత్వ నిధుల నుంచి ఆలయానికి రూ.70 కోట్లు కేటాయించేందుకు సీఎం జగన్ హామీ ఇచ్చి నిలబెట్టుకున్నారు. ఆ రూ.70 కోట్లలో ఇప్పటికే రూ.13.10 కోట్లతో ఇంద్రకీలాద్రి కొండచరియలు విరిగిపడకుండా రక్షణ పనులు, ఎల్‌టీ బోర్డులు, ఎనర్జీ, వాటర్ మేనేజ్‌మెంట్, స్కాడా పనులు చేశారు. వీటిని, కనకదుర్గ ఆలయ నిధులతో నిర్మించిన సోలార్ విద్యుత్ కేంద్రాన్ని సీఎం జగన్ ప్రారంభించనున్నారు.

అన్నప్రసాదం, పోటు భవనాలకు శంకుస్థాపన

దుర్గగుడిలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు రివైజ్డ్ మాస్టర్ ప్లాన్ ప్రకారం రూ.206 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు సీఎం జగన్ శంకుస్థాపన చేయనున్నారు. ఒకేసారి 2,500 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించేలా రూ.30 కోట్లతో నిర్మించనున్న భవనానికి, రూ.27 కోట్లతో నిర్మించే పోటు భవనానికి, రూ.111.05 కోట్లతో చేపడుతున్న క్యూలైన్ల విస్తరణ, కేశఖండనశాల నిర్మాణం తదితర ఎనిమిది అభివృద్ధి పనులకు, మల్టీలెవల్ కారు పార్కింగ్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆలయం వద్ద బుధవారం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పరిశీలించారు.

ఆరోగ్యశ్రీతో ప్రజారోగ్యానికి భరోసా

- రాష్ట్రంలో అందరి ఆరోగ్య వివరాలు ఒకేచోట ఉండేలా సాంకేతిక వ్యవస్థ
- ఉన్నతాధికారులతో సమీక్షలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలకు పూర్తిస్థాయిలో ఆరోగ్య భరోసా కల్పిస్తూ.. రూ.5 లక్షలలోపు ఆదాయం ఉన్న ప్రతి కుటుంబం ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మంగళగిరిలోని వైద్యశాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆమె ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసిన తమ ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించి మరో సంచలనం దిశగా అడుగులు వేస్తోందన్నారు. విస్తరించిన సేవలు, ప్రయోజనాలతో కూడిన ఆరోగ్యశ్రీ కొత్త కార్డులను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. రాష్ట్రంలో 1.43 కోట్ల కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సచివాలయాల వారీగా ప్రతి ఒక్కరికి కొత్త కార్డులు అందుతాయని చెప్పారు. సీఎం ఆదేశాల మేరకు కొత్త కార్డుల్లో అభా ఐడీ నంబర్లు కూడా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్డుల జారీలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు సురక్షితంగా నిక్షిప్తమై ఉండాలని సీఎం జగన్ లక్ష్యం విధించారని చెప్పారు. ఈ క్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్యశ్రీ.. ఇలా ఏ విధంగా వైద్యం పొందినా.. ఆయా రోగులందరి వివరాలు ఒకేచోట ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ మేరకు సాంకేతిక వ్యవస్థను రూపొందించాలని సూచించారు. గత ఐదేళ్లుగా ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందినవారి వివరాలను భద్రపరచాలని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండోదశ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సీఎం ఆదేశించారని తెలిపారు. అందుకు అధికారులు ప్రణాళిక రూపొందించాలన్నారు. రెండోదశ ఆరోగ్య సురక్ష శిబిరాల్లో మరిన్ని స్పెషాలిటీ సేవలు అందేలా చూడాలన్నారు. వైద్యపరీక్షలు కూడా కొత్తవి చేర్చాలని, విధివిధానాలు రూపొందించాలని చెప్పారు.

క్లుప్తంగా...

నేడూ కొనసాగనున్న పింఛన్ల పంపిణీ

మరో రోజు పొడిగింపు



శ్రీకాకుళం రిమ్స్‌లో లోళ్ల రమణకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రమణమ్మ

సాక్షి, అమరావతి: ఈ నెల పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం గురువారం(7వ తేదీ) వరకు పొడిగించింది. సాధారణంగా వలంటీర్ల ఆధ్వర్యంలో ప్రతి నెలా 1–5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ జరుగుతూ ఉంటుంది. 8 జిల్లాల్లో రెండు మూడు రోజులుగా మిచాంగ్ తుఫాన్ తీవ్రంగా ఉండటంతో పాటు ఇతర జిల్లాలోనూ పలు చోట్ల వర్షాలు కురిసిన కారణంగా ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారుల్లో ఎవరైనా ఈ నెల పింఛన్ పొందని పరిస్థితి ఉందేమోనని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని మొదట 6వ తేదీ వరకు పొడిగించింది. తాజాగా అదనంగా మరో రోజు వరకు పొడిగించినట్లు సెర్ప్ అధికారులు తెలిపారు. కాగా, డిసెంబర్‌లో పంపిణీకి గాను ప్రభుత్వం 65,33,781 మంది లబ్ధిదారుల కోసం రూ.1,800.96 కోట్లు విడుదల చేయగా బుధవారం సాయంత్రం నాటికి 64,75,889 మంది (99.11%) లబ్ధిదారులకు రూ.1,784.88 కోట్లు పంపిణీ పూర్తయిందని అధికారులు వివరించారు.

గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్

రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: గిరిజనులకు ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం వల్ల చాలా మంది గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నరని సీఎస్ దృష్టికి తీసుకొచ్చారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చేలా చర్యలు చేపట్టాలని కోరారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థల అప్‌గ్రేడ్

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థలను అప్‌గ్రేడ్ చేసేందుకు రూ.100కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ఉపాధి, శిక్షణ డైరెక్టర్ నవ్య తెలిపారు. రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల వివరాలను బుధవారం ఆమె మీడియాకు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థలను పునర్నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు కియా మోటార్స్, ఎల్ అండ్ టీ, శాంసంగ్, అల్ట్రాటెక్, షిండియర్ ఎలక్ట్రిక్, హ్యుందాయ్ స్టీల్, జాన్సన్ లిఫ్ట్స్ అండ్ ఎస్కలేటర్స్ తదితర సంస్థలతో అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు.

ఎన్‌డీఈఏఆర్‌లో ఉద్యోగాల పేరిట మోసపోవద్దు

సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసేందుకు నేషనల్ డిజిటల్ ఎడ్యుకేషన్ ఆర్కిటెక్చర్ (ఎన్‌డీఈఏఆర్) ఆధ్వర్యంలో వివిధ ఉద్యోగాలు ఇస్తున్నట్లు వస్తున్న మోసపూరిత ప్రకటనలను నమ్మవద్దని సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. దీక్ష, నేషనల్ ఎడ్యుకేషన్ ఆర్కిటెక్చర్, అడల్ట్ ఎడ్యుకేషన్, యోగా ఎడ్యుకేషన్, మోనిటరింగ్ మెకానిజమ్ సంబంధించి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలు వస్తున్నాయని, ఇవి పూర్తిగా మోసపూరితమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేయడానికి ప్రస్తుతం ఎలాంటి ఉద్యోగ ప్రకటనలు ఇవ్వలేదని వెల్లడించారు.

ఎంపీ, ఎమ్మెల్యేలపై కేసు కొట్టివేత

సాక్షి,అమరావతి/తిరుపతి రూరల్: రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిపై ఉన్న ఓ కేసును కొట్టివేస్తూ అమరావతిలోని ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి విమానాశ్రయం అధికారులపై దాడి చేశారంటూ ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి, బియ్యపు మధుసూదన్ రెడ్డితో పాటు మరో 16 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో 2015లో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి 8 ఏళ్ల పాటు ఈ కేసు విషయమై వీరు కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసు అమరావతి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో బుధవారం విచారణకు రాగా కేసుకు సంబంధించి ఆరోపణలు రుజువు చేయకపోవడంతో కోర్టు కేసును కొట్టివేసింది. ప్రజా ప్రతినిధుల తరఫున న్యాయవాదులు మధుకర్ బాబు, సురేష్, కోటిరెడ్డి వాదనలు వినిపించారు.

పేద మహిళలకు మహిళాశక్తి ఆటోలు

తొలివిడతలో నేడు 231 మంది ఎస్సీ, ఎస్టీ పొదుపు మహిళలకు పంపిణీ

- ఈ ఆర్థిక సంవత్సరంలో 660 మందికి పంపిణీ లక్ష్యం
- అంబేడ్కర్ జయంతి నాటికి మిగిలిన లబ్ధిదారుల ఎంపిక
- ఆటో కొనుగోలు ఖర్చులో 90 శాతం వడ్డీ లేని రుణం
- 48 నెలలు సమాన కిస్తీల్లో రుణం చెల్లింపు
- జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో ఆటోల అందజేత



సాక్షి, అమరావతి: కిరాయి ప్రాతిపదికన ఆటోలు నడుపుకొంటున్న పొదుపు సంఘాల సభ్యులైన ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రభుత్వం గురువారం 'మహిళాశక్తి' పేరుతో ఆటోలను పంపిణీ చేయనుంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పరిధిలో 'ఉన్నతి' కార్యక్రమం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మండలానికి ఒకరు చొప్పున 660 మండలాల్లో 660 మందికి ఈ ఆటోలను అందజేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. తొలివిడతగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా 231 మందికి వీటిని అందజేయనున్నారు. జిల్లాల వారీగా ఎంపికైన లబ్ధిదారులకు ఆ జిల్లాల్లోనే కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగనుందని సెర్ప్ అధికారులు వెల్లడించారు. గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, సెర్ప్ సీఈవో ఇంతియాజ్ అహ్మద్ విజయవాడకు సమీపంలోని గొల్లపూడిలోగల టీటీడీసీ కేంద్రంలో పదిమంది లబ్ధిదారులకు ఆటోలను పంపిణీ చేస్తారని తెలిపారు. మహిళాసాధికారత లక్ష్యంగా నాలుగున్నరేళ్లుగా పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకాలను, 45–60 ఏళ్ల మధ్య వయసు ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు వైఎస్సార్ చేయూత సహా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొత్తగా స్వశక్తితో ఎదగాలని ఆశపడే పేదింటి మహిళలకు చేయూతనిచ్చేందుకు 'మహిళాశక్తి' పేరుతో ఈ కార్యక్రమం చేపట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెట్టుకున్న లక్ష్యం మేరకు మిగిలిన లబ్ధిదారుల ఎంపికను ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి నాటికి పూర్తిచేసి వారికి ఆటోలు అందజేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు.

లబ్ధిదారులు భరించాల్సింది 10 శాతమే

ఆటో కొనుగోలుకు అయ్యే ఖర్చులో కేవలం పదిశాతం మేర లబ్ధిదారులు భరిస్తే మిగిలిన 90 శాతం మొత్తాన్ని ప్రభుత్వం సెర్ప్ ద్వారా అందిస్తోంది. ఆ 90 శాతం రుణాన్ని కేవలం అసలు మొత్తం 48 నెలవారీ కిస్తీల రూపంలో చెల్లించే వెసులుబాటు కల్పించింది. సాధారణంగా పేదలు ఆటో కొనుగోలు చేయాలంటే బ్యాంకులు, ఇతర ఆర్థికసంస్థల నుంచి రుణం తీసుకుని, నెలవారీగా కిస్తీలు చెల్లిస్తుంటారు. ప్రభుత్వం ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఆటోల కొనుగోలుకు అయ్యే మొత్తం ఖర్చులో 90 శాతం మొత్తాన్ని వడ్డీలేని రుణంగా ఇవ్వడంతో పాటు రుణం మొత్తాన్ని నెలవారీ కిస్తీల రూపంలో చెల్లించేందుకు వీలు కల్పించడంతో వడ్డీ రూపంలో దాదాపు రూ.లక్షన్నర మేర లబ్ధిదారులకు ఆర్థిక ప్రయోజనం కూడా కలుగుతుందని అధికారులు వివరించారు. ఆటోలను లబ్ధిదారుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి అందజేస్తున్నట్టు చెప్పారు.



పెద్దగా నోరు తెరుచుకుని మీదికొస్తున్న దెయ్యంలా.. చూడగానే వామ్మో అనిపించేలా ఉందికదా! ఇది ఏ గ్రాఫిక్స్ బొమ్మనో, సరదాగా సృష్టించిన చిత్రమో కాదు.. సుదూర అంతరిక్షంలోని ఓ భారీ గెలాక్సీ (నక్షత్రాల గుంపు) ఇది. నాసాకు చెందిన జేమ్స్ వెబ్ టెలిస్కోప్ (జేడబ్ల్యూఎస్టీ) సాయంతో టెక్సాస్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఈ గెలాక్సీని గుర్తించారు. మన విశ్వం పుట్టుక తొలినాళ్లలోనే ఈ గెలాక్సీ ఏర్పడిందని.. అది భారీగా దుమ్ము, ఇతర ఖగోళ పదార్థాలతో నిండి ఉందని వారు తెలిపారు. విసిరివేసినట్టుగా ఉన్న ఆ ఖగోళ పదార్థాల నుంచి వేలాది కొత్త నక్షత్రాలు జన్మిస్తున్నాయని.. ఈ క్రమంలో దెయ్యం ముఖం వంటి ఆకృతి ఏర్పడిందని వివరించారు. అయితే జేమ్స్ వెబ్ టెలిస్కోప్ చిత్రాలు మసకగా ఉండటంతో.. ఓ చిత్రకారుడితో మరింత స్పష్టత వచ్చేలా మార్చామని వివరించారు.

'ఇంగ్లిష్'లో మనమే టాప్!

ఇంగ్లిష్ మీడియం పరీక్షలో సత్తాచాటిన ఏపీ విద్యార్థులు

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే–2023లో వెల్లడి

- సర్వే కోసం 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్ష
- ఎగ్జామ్‌కు దేశవ్యాప్తంగా ఎంపికైన 1.12 కోట్ల మంది
- ఆంధ్రప్రదేశ్ నుంచి 6,42,496 మంది విద్యార్థుల ఎంపిక
- పరీక్ష రాసిన విద్యార్థుల జాతీయ సగటు 37.03 శాతం
- ఆంధ్రప్రదేశ్ నుంచి 84.11 శాతం హాజరు
- ఏపీ కంటే వెనుకబడ్డ ఇతర దక్షిణాది రాష్ట్రాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్ జగన్ సర్కార్ తీసుకువచ్చిన సంస్కరణలతో మన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటుతున్నారు. గతంలో ఏదైనా పరీక్షను ఆంగ్ల మాధ్యమంలో రాయడానికి వెనకంజ వేసే మన రాష్ట్ర విద్యార్థులు ఇప్పుడు ఆ భయం పోగొట్టుకుని ముందంజలో దూసుకెళుతున్నారు. ఇటీవల ఇంగ్లిష్ మీడియం విద్యా బోధన విషయంలో దేశ వ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్)–2023లో మన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిభ చూపించారు. ఈ సర్వేలో దక్షిణాది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ టాప్ ప్లేస్ సాధించడం గమనార్హం. అంతేగాక జాతీయ సగటు కంటే 'డబుల్' రెట్లకు పైగా మన విద్యార్థులు ఈ సర్వేలో పాల్గొన్నారు. దేశంలోని రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లల్లో ఇంగ్లిష్ మీడియం అమలు తీరుపై కేంద్ర ప్రభుత్వం ఆ సర్వే నిర్వహించింది. ఇంగ్లిష్ మీడియం చదువుతున్న 3, 6, 9 తరగతుల విద్యార్థులను ఎంపిక చేసి పరీక్ష నిర్వహించారు. ఇందులో పాల్గొన్న విద్యార్థుల జాతీయ సగటు 37.03 శాతంగా ఉంటే, ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల శాతం 84.11గా ఉండటం విశేషం. ముఖ్యంగా సర్కారు బడుల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతో జాతీయ సగటు కంటే ఎక్కువ ప్రగతి సాధించడం సాధ్యమైంది. బైలింగువల్ (ఇంగ్లిష్–తెలుగు) టెక్స్ట్ బుక్స్ పంపిణీ, ఇంగ్లిష్ ల్యాబ్స్‌తో విద్యార్థులకు నిరంతరం ప్రత్యేక బోధన అందించడంతో విద్యార్థులు ఆంగ్ల పాఠ్యాంశాలను సులభంగా నేర్చుకుంటున్నారు. అలాగే ఫార్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను ఆంగ్ల మాధ్యమంలో రాయడం వల్ల వారు భాషపై పట్టు సాధిస్తున్నారు.

మూడు తరగతుల విద్యార్థులపై అంచనా పరీక్ష

దేశ వ్యాప్తంగా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు, అభ్యసన లోపాలను గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి (ఎఫ్ఎల్ఎన్) సర్వేను ఏటా నిర్వహిస్తుంది. 2021లో కేంద్రం ఎన్ఏఎస్, 2022లో ఎఫ్ఎల్ఎన్ నిర్వహించింది. కరోనా అనంతరం నిర్వహించిన అప్పటి సర్వేలో దేశవ్యాప్తంగా అభ్యసన లోపాలు ఉన్నట్టు గుర్తించింది. వాటిని అధిగమించేందుకు పలు సంస్కరణలు సైతం అమలు చేస్తోంది. ఈ క్రమంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎన్ఏఎస్–2023 సర్వేలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులను ఎంపిక చేసి సర్వే పరీక్ష నిర్వహించింది. ఇందులో దేశవ్యాప్తంగా ఇంగ్లిష్ మీడియంలో పరీక్ష రాయడానికి 1,12,72,836 మందిని ఎంపిక చేయగా 41,74,195 మంది (37.03 శాతం) హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో 6,42,496 మందిని ఎంపిక చేస్తే 5,40,408 మంది (84.11 శాతం) ఇంగ్లిష్ మీడియంలో పరీక్ష రాశారు. ఈ పరీక్షలో దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక, తమిళనాడు మనకంటే వెనుకబడడం గమనార్హం. పేదింటి పిల్లలు అంతర్జాతీయ అవకాశాలను అందుకోవాలంటే ఇంగ్లిష్ మీడియం తప్పనిసరి అని భావించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టడంతో ఏపీ అగ్రస్థానంలో నిలిచింది.

ఇంగ్లిష్ మీడియం సర్వేలో పాల్గొన్న విద్యార్థులు ఇలా..

తరగతి	దేశవ్యాప్తంగా	ఆంధ్రప్రదేశ్	కేరళ	కర్ణాటక	తమిళనాడు
3	14,66,604	1,95,540	73,216	60,482	1,49,764
6	14,12,272	2,02,083	74,667	75,880	1,21,398
9	12,95,319	1,86,722	67,635	78,696	1,25,193

బోధన, పరీక్షా విధానంలో సంస్కరణలు

దేశంలో ఉత్తమ విద్యా సంస్కరణలు అమలు చేస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందింది. నూతన విద్యా విధానానికి అనుగుణంగా బోధన, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సంస్కరణలను, పథకాలను అమలు చేస్తోంది. బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్స్, ఐఎఫ్‌పీ స్క్రీన్లు, ఇంగ్లిష్ ల్యాబ్స్‌తో పాటు, విద్యార్థి సామర్థ్యాల ఆధారంగా బోధన అందిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అంతేగాకుండా ఏపీ ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో 'క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్'ను రూపొందించి అమలు చేస్తున్నారు. దాంతో ఈ విద్యా సంవత్సరంలో నిర్వహించిన రెండు ఫార్మెటివ్ అసెస్‌మెంట్ (యూనిట్ టెస్ట్)లలో 91.03 శాతం మంది విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

ప్యానల్ వైస్ చైర్మన్‌గా నాలుగోసారి విజయసాయిరెడ్డి

రాజ్యసభ



సాక్షి, న్యూఢిల్లీ:వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి రాజ్యసభ ప్యానల్ వైస్ చైర్మన్‌గా మరోసారి నియమితులయ్యారు. శీతాకాల సమావేశాల సందర్భంగా నూతన వైస్ చైర్మన్ ప్యానల్‌ను ఇటీవల చైర్మన్ జగదీప్ దన్‌ఖడ్ ప్రకటించారు. ఫూలోదేవి నేతమ్ (కాంగ్రెస్), ఫంగ్నాన్ కోన్యా (బీజేపీ), దర్శన సింగ్ (బీజేపీ), సోనాల్ మాన్‌సింగ్ (బీజేపీ), సస్మిత్ పాత్రా (బీజేడీ), వి.విజయసాయిరెడ్డి (వైఎస్సార్‌సీపీ), సుఖేందు శేఖర్‌రాయ్ (టీఎంసీ), కార్తికేయ శర్మ (స్వతంత్ర)లను ప్యానల్ వైస్ చైర్మన్లుగా నియమిస్తున్నట్టు తెలిపారు. విజయసాయిరెడ్డి ప్యానల్ వైస్ చైర్మన్‌గా నియమితులు కావడం ఇది నాలుగోసారి. ప్యానల్ వైస్ చైర్మన్‌గా తనను నియమించడం పట్ల రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో రాజ్యసభ టీవీతో మాట్లాడుతూ... నిబంధనల మేరకు తన విధులు అత్యంత శ్రద్ధ, సమగ్రతతో నిర్వర్తిస్తానని ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు.

రేవంత్‌రెడ్డికి అభినందనలు

తెలంగాణ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న కాంగ్రెస్ నేత, పార్లమెంట్ సహచరుడు రేవంత్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి అభినందనలు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడి నుంచి ముఖ్యమంత్రి కావడం చాలా ప్రత్యేకమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేరేలా ఇచ్చిన హామీలు రేవంత్‌రెడ్డి నెరవేర్చుతారని ఎంపీ విజయసాయిరెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు బుధవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

జాతీయ స్థాయిలో మల్టీస్టేట్ సొసైటీలు

విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి అమిత్ షా జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: వ్యవసాయ ఉత్పత్తులు, ఎగుమతులు, ఆర్గానిక్ పంటలు, విత్తనాల అభివృద్ధిని పెద్ద ఎత్తున ప్రోత్సహించే లక్ష్యంతో జాతీయ స్థాయిలో మూడు మల్టీస్టేట్ కో–ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేసినట్టు కేంద్ర హోమ్, సహకార శాఖల మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వకంగా బదులిచ్చారు. జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన నేషనల్ కో–ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్, నేషనల్ కో–ఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్, భారతీయ బీజ్ సహకారి సమితి లిమిటెడ్ సంస్థలను మల్టీ స్టేట్ కో–ఆపరేటివ్ సొసైటీ యాక్ట్ కింద రిజిస్టర్ చేసినట్టు వివరించారు. కాగా.. ఐదు సహకార సంస్థల సహకారంతో ఎన్‌సీఈఎల్ ఏర్పాటు చేశామన్నారు.

ఏపీలో 50 శాతం జీఎస్‌డీపీ

ఆంధ్రప్రదేశ్ గడిచిన నాలుగేళ్లలో స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ) 50 శాతం నమోదు చేసిందని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి తెలిపారు. దేశంలో ఆర్థిక పరిస్థితిపై స్వల్పకాలిక చర్చలో భాగంగా బుధవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ వృద్ధి రేటు పరంగా 2019లో రూ.8.70 లక్షల కోట్లతో 16వ స్థానంలో ఉంటే ప్రస్తుతం రూ.13.17 లక్షల కోట్లతో నాలుగో స్థానానికి చేరిందని తెలిపారు. తలసరి ఆదాయంలోనూ గణనీయంగా పెంపు సాధించిందని, ఆర్‌బీఐ హ్యాండ్‌బుక్ ప్రకారం 2019లో 17 వస్థానంలో ఉండగా ప్రస్తుతం తొమ్మిదో స్థానానికి చేరిందన్నారు. 2019లో తలసరి ఆదాయం రూ.1.50 లక్షలు ఉంటే. 2022–23లో రూ.2.10 లక్షలకు చేరుకుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రుణ వృద్ధి రేటు 169 శాతంగా ఉంటే ప్రస్తుతం 58 శాతానికి చేరుకుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 34,108 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీచేస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక 4.93 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తొలిస్థానంలో ఉందని, పెట్టుబడులకు అనుకూల పాలసీల వల్ల పెద్ద సంఖ్యలో పెట్టుబడులు వచ్చాయన్నారు.

పంచాయతీలకు నిధులివ్వలేదు

ఏపీలోని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం యునైటెడ్ గ్రాంట్, రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ కింద 2023–24లో ఇప్పటివరకూ నిధులు విడుదల చేయలేదని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్‌పాటిల్ తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు బుధవారం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

కొన్ని రాష్ట్రాల్లో అధిక రిజర్వేషన్లు

పంచాయతీరాజ్ సంస్థల్లో మూడింట ఒక వంతు తక్కువ కాకుండా రిజర్వేషన్లు ఉన్నప్పటికీ కొన్ని రాష్ట్రాలు రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టాలు, నిబంధనల మేరకు అంతకంటే ఎక్కువ రిజర్వేషన్లు కల్పిస్తున్నాయని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. పంచాయతీల్లో మహిళా ప్రతినిధుల శాతం రాజ్యాంగ, చట్టబద్ధంగా నిర్ణయించిన నేపథ్యంలో కరోనా తర్వాత పంచాయతీరాజ్ సంస్థల్లో ఎంపికైన మహిళ ప్రతినిధుల సంఖ్య తగ్గింపు ఎక్కడా కనిపించలేదని వైఎస్సార్‌సీపీ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు బుధవారం ప్రశ్నోత్తరాల్లో సమాధానమిచ్చారు.

ఏపీలో 72 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ

లోక్‌సభ

సాక్షి, న్యూఢిల్లీ: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఆధునికీకరణ/అప్‌గ్రేడ్ నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లో 72 స్టేషన్లను గుర్తించినట్టు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు కోటగిరి శ్రీధర్ అడిగిన ప్రశ్నకు బుధవారం లిఖితపూర్వక సమాధానమిచ్చారు. కాగా, దక్షిణ మధ్య రైల్వేలో 2022–23లో ఒకటి, 2018–19లో ఒక రైల్వేలో అగ్నిప్రమాదాలు జరిగినట్టు తెలిపారు. రైళ్లలో అగ్నిప్రమాదాలు నివారించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని వైఎస్సార్‌సీపీ సభ్యుడు బుధవారం ప్రశ్నోత్తరాల్లో కోటగిరి శ్రీధర్ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. మరో ప్రశ్నకు సమాధానమిస్తూ.. తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 5,764 కిలోమీటర్ల మేర రైల్వే లైన్లను విద్యుదీకరించామని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 2014 నుంచి 2023 అక్టోబర్ నాటికి ఏపీలో 3,841 కిలోమీటర్లు, తెలంగాణలో 1,923 కిలోమీటర్లు విద్యుదీకరించామని ఆయన పేర్కొన్నారు.

చేనేతలకు రెండు పథకాలు

ఆంధ్రప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా హ్యాండ్లూమ్స్ ప్రోత్సాహం, చేనేత కార్మికుల సంక్షేమం నిమిత్తం రెండు పథకాలు అమలు చేస్తున్నట్టు కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి దర్శన జర్దోష్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు బాలశౌరి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. నేషనల్ హ్యాండ్లూమ్‌డెవలప్‌మెంట్ ప్రోగ్రామి, రా మెటీరీయల్ సప్‌లై స్కీం అమలు చేస్తున్నామన్నారు.

ఏపీలో ఎలక్ట్రానిక్ పరికరాలు

మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్స్, ట్యాబెట్లు, టీవీ, ఆడియో వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తయారయ్యే మేజర్ రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటని కేంద్ర ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

గ్రామీణ్ డాక్ సేవక్‌లకు న్యాయం చేయండి

గ్రామీణ ప్రాంత పోస్టాఫీసులలో పనిచేస్తున్న గ్రామీణ్ డాక్ సేవక్‌లకు న్యాయం చేయాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కేంద్రాన్ని కోరారు. 'కమలేష్ చంద్ర కమిటీ' ఇచ్చిన సిఫార్సులను అమలు చేయాలని పేర్కొన్నారు. బుధవారం లోక్‌సభలో రూల్ 377 కింద అత్యవసర అంశాలపై మాట్లాడారు. గ్రామీణ్ డాక్ సేవక్‌లకు అనేక సమస్యలు ఉన్నాయని కేంద్రం దృష్టికి తెచ్చారు. సేవక్‌లకు పే కమిషన్‌పై కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. గ్రాట్యుటీపై పరిమితిని సడలించి రూ.5 లక్షలకు పెంచాలని, వైద్య సదుపాయాలతో పాటు గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షలు చేయాలని గ్రామీణ డాక్ సేవక్‌లు దీర్ఘకాలికంగా కోరుతున్నారన్నారు.

జమ్మూ కశ్మీర్ అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ మద్దతు


జమ్మూ కశ్మీర్ సమగ్ర అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని ఎంపీ ఎస్.సంజీవ్‌కుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ జమ్మూకశ్మీర్ సమగ్రతకు సంబంధించి పలు బిల్లులకు మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. బుధవారం లోక్‌సభలో జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై సంజీవ్‌కుమార్ మాట్లాడారు. కశ్మీర్ పండిట్లు, పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి వలస వచ్చిన వారికి శాసన సభలో ప్రాతినిధ్యం కల్పించడం బిల్లు లక్ష్యమైతే, చారిత్రక ఆందోళనలు పరిష్కరించేందుకు ప్రయత్నంగా దీన్ని చూడొచ్చని సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. రాజకీయ స్థిరత్వానికి దోహదపడే సవరణలు సానుకూల అంశంగా చూడొచ్చని తెలిపారు. మొత్తం సీట్లు 90కి పెంచడం, ఎస్సీలకు 7, ఎస్టీలకు 9 సీట్లతోపాటు నామినేటెడ్ సీట్లలో ఒకరు తప్పకుండా మహిళ ఉండాలని పేర్కొనడం సరైనదని ఎంపీ సంజీవ్‌కుమార్ తెలిపారు.

ఏపీలో విద్యా సంస్థల పరిస్థితి ఏమిటి?

విభజన చట్టం మేరకు ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాల్సిన విద్యాసంస్థల అభివృద్ధి పరిస్థితి ఏమిటని వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్రాన్ని ప్రశ్నించారు. లోక్‌సభలో బుధవారం కేంద్రీయ విశ్వవిద్యాలయాల (సవరణ) బిల్లు–2023పై చర్చలో ఆయన మాట్లాడుతూ.. విద్యాలయాల ఏర్పాటు చాలా సులభమని, వాటికి తగిన సమయంలో నిధులు విడుదల అనేది ముఖ్యమని అన్నారు. బిల్లు సందర్భంగా ఏపీ విభజన చట్టం బిల్లును ప్రస్తావించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు గిరిజన యూనివర్సిటీ.. విజయనగరంలో ఏపీకి గిరిజన యూనివర్సిటీ హామీ ఇచ్చారన్నారు. అయితే.. ఏపీకి ఇచ్చిన విద్యా సంస్థల హామీ పూర్తిస్థాయిలో సఫలం కాలేదన్నారు. పదేళ్లలో ఐఐటీ, ఎన్ఐటీ, ఐసెర్, ఐఐఎం, ట్రిపుల్ ఐటీ డీఎం, ఐఈపీఈ ఏర్పాటుకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వాటిని ప్రారంభించినప్పటికీ వేటికీ పూర్తిస్థాయి శాశ్వత క్యాంపస్‌లు ఇంకా ఏర్పాటు కాలేదన్నారు. విజయనగరంలో గిరిజన యూనివర్సిటీ క్యాంపస్ ఇప్పటికీ పూర్తికాలేదన్నారు. ఏపీ ప్రభుత్వం 13 వైద్య కళాశాలలు ప్రతిపాదిస్తే.. మూడు ఇచ్చారని మిగిలిన వాటిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలుసార్లు లేఖలు రాశారని గుర్తు చేశారు. నెల్లూరులో రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి కేంద్ర అధికారులను ఎన్నిసార్లు కలిసినా డీపీఆర్ దశలో ఉందని చెబుతున్నారన్నారు. ఇన్నేళ్లయినా ఇంకా డీపీఆర్ దశ ఏమిటో అర్థం కావడం లేదన్నారు. దేశ వ్యాప్తంగా రూసా నిధులు కూడా సరిగా వాడడం లేదని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కేంద్రం దృష్టికి తీసుకొచ్చారు.

ఏపీలో టీడీపీ-కాంగ్రెస్ కలుస్తాయేమో!

- టీడీపీ తెలంగాణలో కాంగ్రెస్ గెలుపునకు పనిచేసింది
- మీడియాతో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం, కాంగ్రెస్ కలిసి పోటీచేసే అవకాశమే ఎక్కువగా ఉందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు బుధవారం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో సంచలనం కలిగించాయి. అనంతపురం జిల్లాలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన్ని మీడియా ప్రతినిధులు రాష్ట్రంలో బీజేపీ–టీడీపీ–జనసేన కలిసి పోటీచేస్తాయా అని ప్రశ్నించినప్పుడు ఆయన ఈ విధంగా స్పందించారు. 'రాష్ట్రంలో జనసేన–బీజేపీ కలిసి పోటీచేస్తాయని మా జాతీయ పార్టీ చెప్పింది. ఆ రకంగా మేం ముందుకు సాగుతాం. తెలంగాణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కాంగ్రెస్‌తో కలిసి పనిచేసింది. కాంగ్రెస్ గెలుపుకోసం తెలుగుదేశం పనిచేసింది. తెలుగుదేశం జెండాలను ఆ పార్టీ కార్యకర్తలు బహిరంగంగా పట్టుకుని రేవంత్‌రెడ్డి ఇంటి దగ్గరకు వెళ్లి నిలబడ్డారు. అనేకమంది ఆ పార్టీ కార్యకర్తలు టీడీపీ జెండాలు పట్టుకుని గాంధీభవన్‌లో తిరిగారు. కాబట్టి తెలుగుదేశం ఆంధ్రప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ పార్టీతోనే పొత్తుపెట్టుకుందేమో. తెలంగాణలో బీజేపీకి వ్యతిరేకంగా టీడీపీ పనిచేసింది. బీజేపీ–జనసేన కూటమికి వ్యతిరేకంగా పనిచేసింది. రేవంత్‌రెడ్డి గెలవడానికి పనిచేసింది కాబట్టి.. ఏపీలో కూడా వాళ్లు కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకొని పనిచేస్తారేమో..' అని ఆయన వ్యాఖ్యానించారు. పక్క తెలుగు రాష్ట్రంలోనే తెలుగుదేశం పార్టీ ఇంత బహిరంగంగా కాంగ్రెస్‌కు అనుకూలంగా, బీజేపీకి వ్యతిరేకంగా పనిచేస్తే ఇంకా తెలుగుదేశం బీజేపీతో కలుస్తుందని మాట్లాడానికి అర్థమే లేదన్నారు. కేవలం పదిరోజుల కిందట జరిగిన ఆ ఎన్నికలో టీడీపీ శ్రేణులు, వాళ్ల అనుకూల సామాజిక మాధ్యమాలన్నీ తెలంగాణలో కాంగ్రెస్ గెలవాలని కోరుకుని పనిచేశాయని చెప్పారు. 2018లో కాంగ్రెస్ కూటమిలో ఉన్న చంద్రబాబు 2024లో కూడా వాళ్ల ఇండియా కూటమిలో చేరే అవకాశం లేకపోలేదని విష్ణువర్ధన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తప్పిన తుపాను ముప్పు.. వరికోతలకు ఊపు

- ఆయకట్టులో సగం మేరకు వరికోతలు పూర్తి
- పంట దిగుబడితో పాటు ధర కూడా ఆశాజనకం
- ధర గిట్టుబాటుగా ఉన్నా ఇంకా పెరుగుతుందని రైతుల్లో ఆశ


యంత్రంతో వరికోత కోస్తున్న దృశ్యం


వరి ధాన్యాన్ని రాశులుగా పోసిన దృశ్యం

సాక్షి, బళ్లారి: ఈసారి తుంగభద్ర ఆయకట్టు కింద సాగు చేసిన పంటల్లో రైతులకు వరి పంట మినహా మిగిలిన పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలు దాదాపు నష్టాలనే తెచ్చిపెడుతుండగా గత నాలుగు రోజుల నుంచి మిచాంగ్ తుపాను రైతన్నలను భయ భ్రాంతులకు గురి చేసింది. వరి కోతలు జరుగుతుండగా వర్షాలు పడితే గింజలు పూర్తిగా నేలపాలు అవుతాయని రైతులు ఆందోళన చెందారు. తుపాను ప్రభావంతో మబ్బులు కమ్ముకుని చిరుజల్లులు కురవడం మినహా ఎలాంటి ప్రభావం చూపకపోవడంతో ఆయకట్టు కింద వరి సాగు చేసిన రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మరో వైపు రైతులకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక ఎకరాకు 50 బస్తాల దిగుబడి లభించడంతో పాటు మార్కెట్‌లో ధర కూడా ఆశాజనంగా ఉంది. ఈనేపథ్యంలో తుంగభద్ర ఆయకట్టు కింద విజయనగర, బళ్లారి, రాయచూరు, కొప్పళ నాలుగు జిల్లాల్లో ఎక్కడ చూసినా లక్షలాది ఎకరాల్లో సాగు చేసిన వరి కోతలు ఊపందుకుంటున్నాయి. మిచాంగ్ తుపాను ప్రభావం ప్రస్తుతం కోత దశలో ఉన్న వరిపైరుపై చూపి ఉంటే పెద్ద ఎత్తున ఈసారి కూడా నష్టపోయే ప్రమాదం ఉండేదని, అయితే ఆ ముప్పు తప్పిందని రైతన్నలు పేర్కొన్నారు.

కోతమిషన్లకు పెరిగిన డిమాండ్

గత నాలుగు రోజుల నుంచి నిలిపివేసిన వరికోతలను బుధవారం నుంచి ఒక్కసారిగా ముమ్మరం చేశారు. దీంతో వరికోత మిషన్లకు భారీ డిమాండ్ ఏర్పడుతోంది. వరికోతలు ముమ్మరంగా సాగుతుండటంతో కరువు సమయంలో చిన్న, సన్నకారు రైతులతో పాటు వ్యవసాయ కూలీల కుటుంబాలకు కూడా చేతినిండా పని దొరుకుతోంది. ఒక్క వరి పంట సాగు చేసిన రైతులకు పంటతో పాటు గిట్టుబాటు ధర కూడా ఆశాజనకంగా ఉంది. రెండు రోజుల నుంచి వరి ధాన్యం ధర మరింత పెరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఆర్‌ఎన్‌ఆర్ రకం వరికి క్వింటాల్‌కు ఏకంగా రూ.3000 ధర పలుకుతుండగా, సోనామసూరికి రూ.2600 వరకు మార్కెట్‌లో ధర ఉన్నా ఎక్కువ మంది రైతులు వరిధాన్యాన్ని అమ్ముకోవడానికి సిద్ధంగా లేరని వ్యాపారస్తులు అంటున్నారు. ఒక ఎకరం సాగు చేసిన రైతులకు 50 బస్తాలకు పైగా దిగుబడి రావడంతో దాదాపు 30 నుంచి 30 క్వింటాళ్లు వస్తుండటంతో ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం అయితే ఒక ఎకరాకు రూ.75 వేల నుంచి రూ.80 వేలు వరకు రాబడి వస్తోందని, పెట్టుబడి పోను ఒక ఎకరాకు దాదాపు రూ.50 వేల వరకు ఆదాయం వస్తోందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గోదాముల్లో ధాన్యం నిల్వకు ఏర్పాట్లు

వరితో పాటు ఇతర పంటలు కూడా సాగు చేయడం వల్ల వరిలో ఆదాయం వస్తున్నా మిగిలిన పంటల్లో నష్టాలు రావడంతో వరికి భవిష్యత్తులో ఇంకా ధర పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. తుంగభద్ర డ్యాం ఆయకట్టుతో పాటు దేశంలో పలు డ్యాంల్లో కూడా ఈసారి ఖరీఫ్ తప్ప రబీలో పంటలు సాగు చేసేందుకు సాగునీరు లేకపోవడంతో పాటు రబీ సీజన్‌కు క్రాప్‌హాలిడే ప్రకటించిన నేపథ్యంలో వరిధాన్యాన్ని నిల్వ చేసుకుంటే ఖచ్చితంగా క్వింటాల్‌కు మరో రూ.500 నుంచి రూ.1000ల వరకు ధర పెరిగే అవకాశం ఉంటుందని రైతుల ఆశలు పెంచుకుంటున్నారు. దీంతో గోదాముల్లో వడ్లను నిల్వ ఉంచుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బియ్యం ధరలు కూడా రోజురోజుకు పెరుగుతుండటంతో ఖచ్చితంగా వరి ధాన్యానికి మరింత ధర పెరుగుతుందనే ఉద్దేశంతోనే ఆర్థికంగా ఇబ్బందులు లేని రైతులు, గోదాముల్లో నిల్వ ఉంచుకునే సదుపాయం ఉన్న రైతులతో పాటు పలువురు చిన్న, సన్నకారు రైతులు ధాన్యాన్ని నిల్వ ఉంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇది శుభపరిణామమేనని తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తం గౌడ పేర్కొన్నారు.

క్లుప్తంగా

గణితం పుస్తకాల పంపిణీ


పుస్తకాలను అందించిన చంద్రశేఖర్

రాయచూరు రూరల్: విద్యార్థులు గణితంపై భయాందోళన చెందాల్సిన అవసరం లేదని తాలూకా విద్యా శాఖ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఆదర్శ పాఠశాలలో గణిత శాస్త్ర పుస్తకాలను అందించి మాట్లాడారు. ఆర్యభట్ కనుగొన్న గణితంపై విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించినప్పుడు క్రమశిక్షణతో వింటే దాని కన్నా సులభమైన విషయం మరొకటి ఉండదన్నారు.

27న నగరసభ 12వ వార్డుకు ఉప ఎన్నిక

రాయచూరు రూరల్: నగరసభ 12వ వార్డుకు ఈనెల 27న ఉప ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ వెల్లడించారు. ఆయన ఈమేరకు సోమవారం సాయంత్రం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. 8న నోటిఫికేషన్ విడుదల అవుతుంది. నామినేషన్లు వేయడానికి 15ను చివరి తేదీగా నిర్ధారించారు. 16న నామినేషన్ల పరిశీలన, 18 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు, 27న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

న్యాయవాదులకు భద్రత ఏదీ?


ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

హొసపేటె/కంప్లి: చిక్కమగళూరులో న్యాయవాది ప్రీతమ్‌పై జరిగిన అమానుష దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లికార్జునయ్య తెలిపారు. మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఈ ఘటనలో దోషులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. లాయర్ల రక్షణకు చట్టాన్ని అమలు చేయాలని, 15 మంది న్యాయవాదులపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం న్యాయవాదులు కోర్టు వద్ద నుంచి పట్టణంలోని ప్రధాన రోడ్ల గుండా నిరసన ర్యాలీని చేపట్టి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ తర్వాత తహసీల్దార్ రేణుకమ్మకు వినతిపత్రాన్ని అందించారు. సీనియర్, యువ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సంగీత కళను ఆదరించాలి

రాయచూరు రూరల్: నేటి ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ సంగీతాన్ని ఆదరించాలని దేవదుర్గ తాలూకా విద్యాశాఖాధికారి సుఖదేవ్ వెల్లడించారు. మంగళవారం రాత్రి క్రిష్ణ మోడోస్ కాలనీలో ఆశాపూర్ స్నేహ సాంస్కృతిక కళా సంస్థ ఏర్పాటు చేసిన సంగీత కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. నేడు టీవీలు, కంప్యూటర్ల యుగంలో యువత సంగీతం వైపు మరలడం అభినందనీయమన్నారు. సంగీతం వింటే అన్ని బాధలను మరచి పోవచ్చన్నారు. కార్యక్రమంలో మహానంద రెడ్డి, జోసెఫ్, విరుపాక్షప్ప, లింగనగౌడ, రాచప్ప, సిద్దలింగప్పలున్నారు.

రక్తదానంతో వ్యాధులు దూరం


రక్తదాతను అభినందిస్తున్న దృశ్యం

హొసపేటె: రక్తదానం చేస్తే గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుందని, రక్తపోటు, మధుమేహం, పక్షవాతం, ఊబకాయం వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ప్రభుత్వ వందపడకల ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ సోమశేఖర్ కబ్బేర్ తెలిపారు. బుధవారం ప్రౌఢదేవరాయ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యూఎం రోహిత్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. నేషనల్ సర్వీస్ ప్రాజెక్ట్ యూనిట్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.బసవరాజు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు చేపట్టాలని ధర్నా


ఆందోళనలో పాల్గొన్న రైతులు

రాయచూరు రూరల్: జిల్లాలోని పత్తి రైతులను ఏపీఎంసీలో అధికారులు, వర్తకులు, మధ్యవర్తులు నిండా మోసం చేస్తున్నారని రాష్ట్ర రైతు సంఘం జిల్లాధ్యక్షుడు లక్ష్మణగౌడ ఆరోపించారు. బుధవారం ఏపీఎంసీ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. వర్తకులు మార్కెట్‌లో ధర నిర్ణయించిన అనంతరం మిల్లుకు వెళ్లి అన్‌లోడ్ చేసిన తర్వాత రూ.300 తగ్గించి ఇస్తున్నారన్నారు. కందులు, పొద్దు తిరుగుడు విత్తనాల విషయంలో కూడా ఇదే బాటలో వ్యవహరిస్తున్న వర్తకులు, అధికారులపై చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి


హొసపేటెలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి దృశ్యం


రాయచూరులో అంబేడ్కర్ ప్రతిమకు పుష్పాంజలి

హొసపేటె: నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద బుధవారం రాజ్యాంగశిల్పి, భారతరత్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లాధికారి ఎంఎస్ దివాకర్, జెడ్పీ సీఈఓ బి.సదాశివ ప్రభు, జిల్లా ఎస్పీ బీఎల్ శ్రీహరిబాబు, డిప్యూటీ కలెక్టర్ అనురాధ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు హెచ్‌వీ మంజునాథ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఎస్సీ, ఎస్టీ, ఇతర సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రాయచూరులో..

రాయచూరు రూరల్: నగరంలోని అంబేడ్కర్ ప్రతిమ వద్ద వివిధ పార్టీలకు చెందిన నేతలు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, జెడ్పీ సీఈఓ రాహుల్ పాండే తుకారాం, ఎస్పీ నిఖిల్, డీఎస్ఎస్ నేతలు రవీంద్రనాథ పట్టి, తిమ్మారెడ్డి, గురురాజ్, వెంకటేష్, జేడీఎస్ నేతలు విరుపాక్షి, మహంతేష్ పాటిల్, విశ్వనాథ్ పట్టి పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలు అదుర్స్


నాటకంలోని ఓ సన్నివేశం


బాలికల సమూహ నృత్యం

సాక్షి,బళ్లారి: క్రీడలు, నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుతాయని విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ రుద్రేష్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం రాత్రి తాలూకాలోని శ్రీధరగడ్డ గ్రామంలో మహాదేవతాత కళా సంఘం ఆధ్వర్యంలో మారెమ్మ ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. మన సంస్కృతి వారసత్వాలకు అద్దం పట్టేలా పల్లెలు, పట్టణాలు, నగరాల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రముఖులు మంజునాథ్, హంద్యాళ పురుషోత్తం, లింగప్ప, నిరంజన్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయండి


మాట్లాడుతున్న నారాయణరెడ్డి

రాయచూరు రూరల్: కన్న కొడుకును హత్య చేసిన నిందితులను పోలీసులు సత్వరం అరెస్ట్ చేయాలని హతుడి తండ్రి నారాయణరెడ్డి పోలీసులను డిమాండ్ చేశారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నెల రోజుల క్రితం వెంకటేశ్వరరెడ్డిని పొలం విక్రయ వివాదంలో బంధువులే హత్య చేశారని ఆరోపించారు. ఎకరాను రూ.5లక్షలకు విక్రయానికి సిద్ధం కాగా అక్కా, బావలు పొలం కొనేవారితో గొడవ పడి ఎకరాకు రూ.7 లక్షల ధర చెల్లించాలని ఒత్తిడి తేవడంతో బేరం రద్దయింది. చివరికి పొలం అమ్మడం లేదన్నందుకు కక్ష గట్టి వెంకటేశ్వరరెడ్డిని హత్య చేశారని ఆయన వాపోయారు. ఈనెల 4వ తేదీన పొలం నుంచి తిరిగి వస్తుండగా వాహనంతో ఢీకొట్టించి హత్య చేశారన్నారు. హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు.

షట్టర్ పగులగొట్టి రూ.10 వేలు, బైక్ చోరీ

రాయచూరు రూరల్: తాలూకాలో గద్వాల రోడ్డులోని మండలగేర వద్ద దుండగులు మంగళవారం రాత్రి ఓ దుకాణం షట్టర్ తాళాలు పగులగొట్టి రూ.10 వేల నగదుతో పాటు ద్విచక్ర వాహనం చోరీ చేసిన ఘటన జరిగింది. సిద్దప్ప, వెంకటేష్‌ల కిరాణ దుకాణం, నారాయణ బార్‌లో కొందరు దుండగులు చోరీకి పాల్పడినట్లు యాపలదిన్ని పోలీసులు తెలిపారు. ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దురలవాట్లు వీడండి

కంప్లి: దురలవాట్లకు విద్యార్థులు స్వస్తి పలకాలని అఖిల కర్ణాటక జనజాగృతి వేదిక జిల్లా సభ్యులు జీఆర్.సిద్దేష్ తెలిపారు. కూడ్లిగి పట్టణంలోని శ్రీరాఘవేంద్ర పారా మెడికల్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా అడుగులు వేస్తూ ఉత్తమ భవిష్యత్తు రూపొందించుకోవాలన్నారు.

గూళిహట్టి శేఖర్ ఆరోపణలు అవాస్తవం

దొడ్డబళ్లాపురం: కుల వివక్షతో తనను ఆర్‌ఎస్ఎస్ కార్యాలయంలోకి రానివ్వలేదని హొసదుర్గ మాజీ ఎమ్మెల్యే గూళిహట్టి శేఖర్ చేసిన ఆరోపణలపై ఆర్‌ఎస్‌ఎస్ వివరణ ఇచ్చింది. నాగపూర్‌లోని డాక్టర్ హెడగేవార్ స్మారక భవనంలోకి తనను లోపలకు అనుమతించలేదని గూళిహట్టి శేఖర్ ఆరోపించారు. దీనిపై స్పందించిన ఆర్‌ఎస్‌ఎస్ ఒక ప్రకటన విడుదల చేసింది.ఆర్ఎస్ఎస్‌కు చెందిన ఏ కార్యాలయం, స్మారక కట్టడాల్లోకి కులం ఆధారంగా అనుమతులు ఉండవని, ఇప్పటి వరకూ అలాంటి సంఘటన ఎక్కడా జరగలేదని పేర్కొంది.

శాస్త్ర సాంకేతికతపై ఆసక్తి అవసరం


కార్యక్రమాన్ని ప్రారంభించిన జడ్జి సునీల్ హొసమని

కోలారు: విద్యార్థులు శాస్త్ర సాంకేతికతపై ఎక్కువ ఆసక్తిని కనబర్చాలని జిల్లా న్యాయ సేవా ప్రాధికార అధ్యక్షుడు, సివిల్ న్యాయమూర్తి సునీల్ ఎస్.హొసమని తెలిపారు. బుధవారం నగరంలోని మదర్ థెరెసా పాఠశాలలో నిర్వహించిన జిల్లా బాలల విజ్ఞాన సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విజ్ఞాన సాంకేతిక పరిజ్ఞానంతో దేశాభివృద్ధి సాధ్యమైందన్నారు. విజ్ఞానాన్ని దేశ అభివృద్ధి కోసం ఉపయోగించాలి తప్ప చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు కాదన్నారు. సాంకేతిక పరిజ్ఞానం గురించి అవగాహన పెంచుకుని సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. భ్రూణ హత్యలు శిక్షార్హ అపరాధమని, వాటిని అరికట్టాలన్నారు. జిల్లా కాలుష్య నియంత్రణ అధికారి డాక్టర్ కె.మంజు, విషయ పరివీక్షకురాలు గాయత్రి, డీఈఓ కృష్ణమూర్తి, విజ్ఞాన పరిషత్ మంజుల భీమరావ్ తదితరులు పాల్గొన్నారు.

13న జిల్లా స్థాయి వంటల పోటీలు

హొసపేటె: నగరంలోని హరిహర రోడ్డులోని జాతీయ కళాశాలలో విజయనగర జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుల కార్యాలయం ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిరుధాన్యాలు, సేంద్రియ మేళా–2024లో భాగంగా ఈనెల 13న జిల్లా స్థాయి చిరుధాన్యాల వంటల పోటీలు నిర్వహించనున్నారు. బెంగళూరులో జరిగే రాష్ట్ర స్థాయి చిరు ధాన్యాల వంటల పోటీల్లో విజయనగర జిల్లా నుంచి పోటీదారులు ఎంపిక కావాలి. ఈనేపథ్యంలో త్వరలో జరిగే జిల్లా స్థాయి చిరుధాన్యాల వంట పోటీల్లో ఆసక్తిగలవారు పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి పోటీదారుడు ఒక తీపి లేదా రుచికరమైన తృణధాన్యాలు, శాకాహార వంటకం తయారు చేయవచ్చు. ఇంట్లో తయారు చేసిన తృణ ధాన్యాల వంటకాలను పోటీల్లో ప్రదర్శించవచ్చు. జ్యూరీ నిర్ణయమే అంతిమం. తయారు చేసిన వంటకాల ప్రదర్శన, ఉపయోగించిన పదార్థాలు, ఆకృతి, రుచి, వాసన, పోషణపై తుది తీర్పు ఉంటుంది. జిల్లా స్థాయిలో ఉత్తమమైన తీపి(స్వీట్), రుచికరమైన వంటకాన్ని ఎంపిక చేసి జిల్లా స్థాయి మొదటి బహుమతిగా రూ.5000 నగదును అందజేస్తున్నట్లు సంయుక్త వ్యవసాయ సంచాలకులు శరణప్ప ముద్గల్ ఒక ప్రకటనలో తెలిపారు.

మహనీయుడు శివకుమారస్వామీజీ

- ఆయన పేరుతో అధ్యయన పీఠం ఏర్పాటు చేయాలి


ప్రారంభిస్తున్న మాజీ మంత్రి సోమణ్ణ, సిద్దలింగ మహాస్వామి, హోం మంత్రి పరమేశ్వర్

తుమకూరు: బెంగళూరు విశ్వవిద్యాలయంలో సిద్ధగంగా మఠాధ్యక్షుడు, త్రివిధ దాసోహి దివంగత డాక్టర్ శ్రీ శివకుమార్ స్వామీజీ అధ్యయన పీఠాన్ని స్థాపించాలని మాజీ మంత్రి వి.సోమణ్ణ డిమాండ్ చేశారు. నగరంలోని శ్రీ సిద్ధగంగా మఠంలో వి.సోమణ్ణ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన గురుభవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వామీజీ చదివిన బెంగళూరు సెంట్రల్ కాలేజీ ఇప్పుడు విశ్వవిద్యాలయంగా మారిందని గుర్తు చేశారు. ఈ వర్సిటీలో స్వామీజీ అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లక్షలాది మంది పేదలకు భోజనం, విద్య, ఆశ్రయం కల్పించిన మహనీయుడు శివకుమార స్వామీజీకి భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హోం మంత్రి పరమేశ్వర్, సిద్దలింగ మహా స్వామి తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

సౌకర్యాలు దివ్యాంగుల దరిచేర్చాలి


మాట్లాడుతున్న జిల్లాధికారి అక్రంపాషా

కోలారు: దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి అందిస్తున్న వివిధ సౌకర్యాలను పక్కాగా అందించాలని జిల్లాధికారి అక్రంపాషా అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో దివ్యాంగులకు అందించాల్సిన ప్రభుత్వ సౌకర్యాలపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి అందుతున్న సౌకర్యాల గురించి ముమ్మరంగా ప్రచారం చేయాలన్నారు. తీవ్రమైన శారీరక వైకల్యం కలిగిన వారికి అందిస్తోన్న త్రిచక్రవాహనాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని దివ్యాంగుల సమస్యలు, వారి అవసరాలను జీపీ స్థాయిలో తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగులకు సౌకర్యాలను అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప, డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ శంకర్ వణిక్యాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

16న జాతీయ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కోలారు: నగరంలోని పోలీసు కవాతు మైదానంలో ఈనెల 16న అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ ఆధ్వర్యంలో జనవరి 24 నుంచి గుజరాత్‌లో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర అండర్–14, 16 క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపికను నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ రాజేష్ తెలిపారు. బుధవారం కన్నడ సంస్కృతి శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరోజున ఎంపిక చేసిన క్రీడాకారులను నేరుగా జాతీయ క్రీడా పోటీలకు పంపుతారన్నారు. అండర్–14 బాలబాలికలకు 80 మీటర్లు, 600 మీటర్లు, 1000 మీటర్లు, 80 మీటర్ల హర్డిల్స్, హై జంప్, లాంగ్ జంప్, జావలిన్ త్రో పోటీలను నిర్వహిస్తారన్నారు. అండర్–16 బాలబాలికలకు 60 మీటర్లు, 600 మీటర్లు, స్టాండింగ్ బ్రాండ్ జంప్, హై జంప్, త్రోబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఎంపిక ప్రక్రియలో పాల్గొనవచ్చని, పూర్తి వివరాలకు 9448132640 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఈసందర్భంగా మునియప్ప, నాగేష్ తదితరులున్నారు.

దివ్యాంగులపై చిన్నచూపు తగదు


విద్యార్థులకు శ్రవణ పరికరాలు అందిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: దివ్యాంగులపై సమాజంలో చులకన భావన తగదని బీఈఓ ఉమా తెలిపారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన ప్రపంచ దివ్యాంగ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులపై జాలి, దయ ఉంటే చాలదని, వారికి అవసరమైన సౌకర్యాలు, సహకారం అందించాలన్నారు. శీగేహళ్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మేశ్ మాట్లాడుతూ ప్రతి నెలా తన వేతనంలో నుంచి రూ.10 వేలను విద్యార్థుల కోసం ఖర్చు చేస్తున్నానన్నారు. శ్రవణ దోషం కలిగిన వారికి తన స్వంత ఖర్చుతో శ్రవణ పరికరాలను అందిస్తున్నానన్నారు. ప్రతి ఒక్కరూ పిల్లల్లో భగవంతుడిని చూడాలన్నారు. పేదలకు దాన ధర్మాలు చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. బీఆర్‌సీ కేంద్రం అధికారులు ప్రవీణ్, శంకరప్ప, చంద్రయ్య, గంగాధర్, నాగరాజ్ పాల్గొన్నారు.

ఆశయ సాధనలో విఫలం


పాల్గొన్న దళిత సంరక్షణ సమితి కార్యకర్తలు

మాలూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను సాఫల్యం చేయడంలో మనం పూర్తిగా విఫలమయ్యామని దళిత సంరక్షణ సమితి సంస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌కుమార్ విచారం వ్యక్తం చేశారు. బుధవారం అంబేడ్కర్ ఉద్యానవనంలో అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్ ప్రతిమకు మాలార్పణ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ అన్ని సముదాయాల వారికి కల్పించిన రిజర్వేషన్ సౌకర్యం కొంతమందికి మాత్రమే ఉపయోగపడుతోందని ఆరోపించారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవాలన్నారు. అంబేడ్కర్ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకుని ఆయన చూపిన బాటలో నడవాలన్నారు. జయమంగల నారాయణస్వామి, చిక్కఇగ్గలూరు హరీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపపోలీస్ స్టేషన్ ప్రారంభించరూ


వినతిపత్రం అందిస్తున్న రామణ్ణ తదితరులు

కంప్లి: కొట్టూరు కోట ప్రాంతంలో ఉపపోలీస్ స్టేషన్‌ను ప్రారంభించాలని పంచాయతీ సభ్యులు తోటద రామణ్ణ తహసీల్దార్ అమరేష్ జాలహళ్లికి వినతిపత్రం అందించారు. కొట్టూరేశ్వర దేవస్థానానికి అమావాస్య రథోత్సవం, కార్తీకోత్సవాలకు భారీ ఎత్తున భక్తులు వస్తుంటారు. వారి భద్రత దృష్ట్యా ఉపపోలీసు స్టేషన్‌ను ప్రారంభించాలని కోరారు.

పంటల ధ్వంసంపై ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రైతు ప్రముఖులు

కంప్లి: సండూరు తాలూకా రంజిత్‌పుర భూముల్లో పంటలు, వ్యవసాయ పరికరాలను ధ్వంసం చేశారని ఆర్‌బీపీసీ కర్మాగార యాజమాన్యంపై సండూరు పోలీసు స్టేషన్‌లో రైతు ప్రముఖులు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గౌడ సోమణ్ణ, తిమ్మప్ప, జీ.పరమేశ్వరప్ప సణ్ణ హులిగమ్మల భూముల్లో ఉల్లి, జామ, సీతాఫలం, బొప్పాయి పంటలను ధ్వంసం చేసిన కర్మాగారం ప్రాజెక్ట్ మేనేజర్ ప్రభుగౌడ, ఉదయ్‌కుమార్, దినేష్ కుమార్‌లపై చట్టపరంగా చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని ఒత్తిడి చేశారు.

అలసత్వంపై చర్యకు డిమాండ్


మాట్లాడుతున్న రాఘవేంద్ర బోరెడ్డి

రాయచూరు రూరల్: తాలూకాలో నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందిపై చర్యలు చేపట్టాలని ఆరోగ్య ఉళిసి ఆందోళన సమితి జిల్లాధ్యక్షుడు రాఘవేంద్ర బోరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాడ్లూరు ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఎండీ జావిద్‌ను విధుల నుంచి తొలగించాలని ఒత్తిడి చేశారు. బాధ్యతాయుతంగా విధులు చేపట్టకుండా నగరంలోని రాజకీయ నాయకుల పేర్లు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నాడని ఆరోపించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఎలాంటి పరీక్షలు చేయకుండా అధికారులు జావిద్‌కు మద్దతు పలకడాన్ని తప్పుబట్టారు. అరిషిణిగి, గుర్జాపూర్, కాడ్లూరుల్లో ఆయుష్మాన్ భారత్ 12 పథకాల గురించి ప్రచారం చేపట్టని ఉద్యోగులను సస్పెండ్ చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో రాము, సత్యరాజ్, శివరాజ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

15న మాయానగరి విడుదల


సినిమా పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

కోలారు: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15న విడుదలయ్యే మాయానగరి చలన చిత్రాన్ని ప్రేక్షకులు థియేటర్లలోనే చూసి ఆదరించాలని చిత్ర హీరో భరత్ మనవి చేశారు. బుధవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ద్వారకీష్, సుచీంద్ర ప్రసాద్, శరత్ చిక్కణ్ణతో పాటు పలువురు ప్రముఖ నటులు ఈ చిత్రంలో నటించారన్నారు. ఇంటిల్లిపాది కలిసి చూసే చిత్రమని, అన్ని వర్గాల ప్రేక్షకులకు ఈ సినిమా నచ్చుతుందన్నారు. సినిమా షూటింగ్‌ను సాగర, జోగ్ ఫాల్స్, చిక్కమగళూరు, దేవరాయనదుర్గ తదితర చోట్ల చిత్రీకరించామన్నారు. దర్శకుడు శంకర్ ఆరాధ్య దర్శకత్వంలో, సంగీత దర్శకుడు అర్జున్ జన్య సంగీత మార్గదర్శనంలో ఈ సినిమా రూపుదిద్దుకుందన్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందం మంజు, విశ్వ తదితరులు ఉన్నారు.

ఏడో రోజుకు కాంట్రాక్టు లెక్చరర్ల ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

కోలారు: తమ వివిధ డిమాండ్ల సాధన కోసం కాంట్రాక్టు లెక్చరర్లు చేపట్టిన ధర్నా బుధవారం ఏడో రోజుకు చేరుకుంది. కాంట్రాక్టు లెక్చరర్లను పర్మనెంట్ చేయడంతో పాటు తమ న్యాయసమ్మతమైన డిమాండ్లను నెరవేర్చాలని యేళ్ల తరబడి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు అన్నీ కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలపై తీవ్ర నిర్లక్ష్య ధోరణిని చూపుతున్నాయని ఆరోపించారు. కాంట్రాక్టు లెక్చరర్లు అందరితో సమానంగా విధులు నిర్వహిస్తున్నా వారికి అందాల్సిన సౌకర్యాలు అందడం లేదన్నారు. తమ న్యాయసమ్మతమైన డిమాండ్లను నెరవేర్చే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని హెచ్చరించారు.